The Quran out lined -Theme and Text

من فاعل الخير للدعوة والارشاد




**TRUTH PUBLICATIONS**

**Opp. Noor High School, Near Masjid Ujaleshah,**


**Sayeedabad, Hyderabad-500 059. Ph: 24557976, 24551559**

The Quran out lined

దివ్య ఖుర్ఆన్ సారాంశం

TRUTH PUBLICATIONS

# దివ్య ఖుర్ఆన్ సారాంశం



మూలం
డా॥ హుస్సేన్ అబ్దుర్రవూఫ్

అనువాదం
అబ్దుల్ వాహెద్

ట్రూత్ పబ్లికేషన్స్ - హైదరాబాద్

بسم الله الرحمن الرحيم

అనంత కరుణామయుడు

అపార కృపాశీలుడు

అయిన అల్లాహ్ పేరుతో...

# దివ్యఖుర్ఆన్

## సారాంశం


మూలం :

డా॥ హుస్సేన్ అబ్దుర్రవూఫ్

అనువాదం :

అబ్దుల్ వాహెద్



ట్రూత్ పబ్లికేషన్స్

హైదరాబాద్

**Quran Saramsam**
The Quran out lined - theme and Text (Telugu)

Written by : Dr. Hussain Abdur Rawoof

Translated by : Abdul Wahed

All Rights Reserved with Publishers

First Edition : December 2005

Copies : 2000

**Price : Free (Fee sabeelillah)**

Published by : **Truth Publications**
Opp. Noor High School,
Near Masjid Ujaleshah, Sayeedabad,
Hyderabad-500 002. India.
Phone: 24557976, 24551559

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.



# పరిచయం

దివ్యఖుర్‌ఆన్‌లో 114 సూరాలు (విభాగాలు) ఉన్నాయి. ఆ 114 సూరాల లోని వివిధ కోణాలను వివరణాత్మకంగా విశ్లేషించిన పుస్తకమిది. దివ్యఖుర్‌ఆన్ సందేశాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి, ముఖ్యంగా ప్రతిసూరాలోని బోధనలను అవగతం చేసుకోవడానికి, దివ్యఖుర్‌ఆన్ మనిషికి చెప్పే పాఠాలను గ్రహించడానికి ఈ విశ్లేషణ ఎంతయినా అవసరం. ప్రతి సూరాలోని సందేశం, ఆ సూరాలోని బోధనలు అర్థం చేసుకోవడానికి ఇలాంటి వివరణాత్మక పుస్తకం ఎంతయినా ఉపయోగపడుతుంది. ఇలాంటి వివరణల వల్ల దివ్యఖుర్‌ఆన్‌లోని వివిధ కోణాలు సాధారణ పాఠకునికి అర్థం అవుతాయి. వివిధ సూరాలలోని సందేశం, ఆ సూరా బోధించే ప్రధానమైన విషయం బోధపడుతుంది. ఆ విధంగా దివ్యఖుర్‌ఆన్ సందేశం సాధారణ పాఠకులకు సరళంగా, సూటిగా, మనసుకు హత్తుకునే రీతిలో చేరుతుంది.

దివ్యఖుర్‌ఆన్‌లోని ప్రతిసూరాలోని ముఖ్యమైన విషయాన్ని వివరంగా, క్లుప్తంగా ఇవ్వడం జరిగింది. ప్రముఖ ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అత్ తబ్రీ, ఇబ్నె కసీర్‌ల వ్యాఖ్యానాల ఆధారంగా ఈ పుస్తకంలోని వివరణలు, విశ్లేషణలు ఇవ్వబడ్డాయి. ప్రతి సూరాకు సంబంధించి దాని పేరు, ఆ సూరాలో ప్రస్తావనకు వచ్చిన చారిత్రక సంఘటనల గురించి క్లుప్తమైన వివరణ ఇవ్వడం జరిగింది. అంటే ఎలాంటి కారణాల వల్ల ఆ సూరా అవతరించిందో చెప్పడం జరిగింది.

ప్రతి సూరాలోని ముఖ్యమైన విషయం గురించి పాఠకునికి అవగాహన కలిగితే, దివ్యఖుర్‌ఆన్ సందేశాన్ని చక్కగా అర్థం చేసుకోగలడు. దివ్యఖుర్‌ఆన్‌లో పాఠకులకు మూడు ముఖ్యమైన విషయాల గురించి గట్టిగా చెప్పడం కనబడుతుంది. అవి :

తౌహీద్ (ఏక దైవారాధన), దేవుని ప్రవక్తలు, మరణానంతర జీవితం. ఈ మూడు ముఖ్యమైన విషయాలే దివ్యఖుర్‌ఆన్ బోధనలలోని సారం.

దివ్యఖుర్ఆన్‌ను పూర్తి శ్రద్ధతో చదవాలి. అందులోని వివిధ బోధనల భావాలను లోతుగా అర్థం చేసుకోవాలి. అయితే, కొన్ని సూరాలు చాలా పెద్దవిగా ఉండడం, దివ్యఖుర్ఆన్ భాష అర్థం కాకపోవడం, దివ్యఖుర్ఆన్ వ్యాఖ్యాతల రచనలు చదివి గ్రహించే శక్తి లేకపోవడం, అందుబాటులో ఉన్న దివ్యఖుర్ఆన్ అనువాదాలు సరళంగా లేకపోవడం తదితర కారణాల వల్ల పాఠకులు దివ్యఖుర్ఆన్ బోధనల గురించి తెలుసుకోలేక పోతున్నారు. ముస్లిములు ముఖ్యంగా రమజాను మాసంలో ప్రతిరోజు దివ్యఖుర్ఆన్ చదువుతారు. మిగిలిన రోజుల్లోను వారానికోసారి లేదా నెలకోసారి ఖుర్ఆన్ చదువుతుంటారు. కాని ఏదో చదవడం వల్ల (అంటే అర్థం చేసుకోకుండా చదవడం వల్ల) దివ్యఖుర్ఆన్‌లోని సందేశాన్ని, వివిధ సూరాలలోని బోధనలను అర్థం చేసుకునే అవకాశం లేదు.

దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు, మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ (దేవుని కరుణ ఆయనపై వర్షించుగాక)పై అవతరించిన చిట్టచివరి దైవగ్రంథం. క్రీ.శ. ఏడవ శతాబ్దం ప్రారంభంలో ఈ దైవగ్రంథం అవతరించింది. భాషాపరంగా ఈ దివ్యగ్రంథం పరిపూర్ణమైన భాషాపాటవానికి అద్భుతమైన నిదర్శనం. ఇంతకు ముందు అవతరించిన రెండు దివ్యగ్రంథాలు తౌరాత్, ఇంజీల్ (బైబిల్)లు అనేక మార్పులు చేర్పులకు గురయ్యాయి. గ్రీకు, సిరియా, హిబ్రూ, లాటిన్ భాషల నుంచి అనువాదాల సందర్భంగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. కొందరు రబ్బీలు, మతపెద్దలు కూడా ఈ మార్పులు చేసారు. కాని దివ్యఖుర్ఆన్ ఎలాంటి మార్పులు లేకుండా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) గారిపై ఏ విధంగా అవతరించిందో అదేరూపంలోనే నేటికీ కూడా భద్రంగా ఉంది.

ఖుర్ఆన్ అన్న పదానికి అర్థం "చదవడం". దివ్యఖుర్ఆన్‌లో మొట్టమొదట అవతరించిన వాక్యం "చదువు" అన్న పదంతో ప్రారంభమవుతుంది. దాదాపు ప్రతి సూరా "అపార కృపాశీలుడు, పరమ దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో" అన్న వాక్యంతో ప్రారంభమవుతుంది. తొమ్మిదవ సూరా "తౌబా" (పశ్చాత్తాపం) తప్ప మిగిలిన సూరాలన్నీ ఈ వాక్యంతోనే ప్రారంభమవుతాయి.



ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్‌కు ఈ దివ్యవాక్యాలు దేవుని వద్ద నుంచి పంపబడ్డాయి. ఆయన కేవలం ఒక సాధనంగా మాత్రమే, ఒక మధ్యవర్తిగా మాత్రమే ఉండి ఈ వాక్యాలను మానవులకు అందజేసారు. 23 సంవత్సరాల కాలం వరకు ఈ దివ్య వాక్యాలు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ పై అవతరించడం జరిగింది. ఈ వాక్యాలు నెమ్మదిగా క్రమబద్ధంగా, వివిధ దశల్లో అవతరించాయి. ఒకేసారి మొత్తం దివ్యఖుర్ఆన్ అవతరించలేదు. దేవుని మార్గదర్శకత్వాన్ని క్రమబద్ధంగా అందించడానికి, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ప్రవక్త పదవి పట్ల ప్రజల్లో విశ్వాసం నాటుకునేలా చేయడానికి, దివ్యఖుర్ఆన్ సందేశం ప్రజల మనస్సుల్లో స్థిరపడేలా చేయడానికి, కొత్త జీవనవిధానానికి ప్రజలు మారేలా చేయడానికి, ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం), ఆయన సహచరులు దివ్యఖుర్ఆన్‌ను తేలిగ్గా కంఠస్థం చేయడానికి దేవుడు దివ్యఖుర్ఆన్‌ను దశలవారిగా ఒక క్రమం ప్రకారం అవతరింపజేసాడు.

ప్రవక్త ముహమ్మద్ (స) నలభై ఏళ్ళ వయస్సులో ఉన్నప్పుడు మక్కా నగరంలో ప్రథమంగా దివ్యఖుర్ఆన్ వాక్యాలు అవతరించడం ప్రారంభమయ్యింది. ఈ విధంగా మక్కా నగరంలో అవతరించిన దివ్యఖుర్ఆన్ వాక్యాలను మక్కీ వాక్యాలుగా చెబుతారు. మక్కా దశ 13 సంవత్సరాలు కొనసాగింది. అప్పట్లో మక్కాలోని ప్రజలు దేవుని ఏకత్వాన్ని విశ్వసించని అవిశ్వాసులు. దివ్యఖుర్ఆన్‌లోని మిగిలిన సూరాలు మదీనా నగరంలో అవతరించాయి. అందువల్ల వీటిని మదనీ సూరాలని అంటారు. మదీనాలో అరబ్బు తెగలు, యూద తెగలు ఉండేవి. ప్రవక్త ముహమ్మద్ (స) క్రీ.శ.622లో మక్కా వదలి మదీనా నగరానికి తరలి వెళ్ళారు. మక్కా నగరంలో ముస్లిములపై దౌర్జన్యాలు, పీడనలు ఎక్కువ కావడం వల్ల ఆయన దైవాదేశం ప్రకారం మక్కా నుంచి మదీనా నగరానికి తరలి వెళ్ళారు.

దివ్యఖుర్ఆన్‌లో మొత్తం 114 సూరాలున్నాయి. ప్రతి సూరా వివిధ బోధనలను, హెచ్చరికలను పాఠకులకు ఇస్తుంది. ప్రతి సూరా అనేక వాక్యాలను కలిగి ఉంది. ఒక్కో వాక్యాన్ని "ఆయత్" అంటారు. దివ్య ఖుర్ఆన్‌లోని 2వ సూరా

అతిపెద్ద సూరా. 108వ సూరా అతి చిన్న సూరా. రెండవ సూరాలోని 282వ ఆయత్ దివ్యఖుర్ఆన్‌లోని అతిపెద్ద ఆయత్. 93వ సూరాలోని మొదటి ఆయత్ అతి చిన్న ఆయత్. దివ్యఖుర్ఆన్‌లో 6218 ఆయతులున్నాయి. 77,437 పదాలున్నాయి. 3,21,000 అక్షరాలున్నాయి. 96వ సూరా మొట్టమొదట అవతరించింది. 110వ సూరా చిట్టచివరన అవతరించింది. 86 మక్కీ సూరాలున్నాయి. 28 మదనీ సూరాలున్నాయి. అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్(స)కు దైవదూత జిబ్రయీల్(అస) ద్వారా జారీచేసిన ఆదేశాల ప్రకారం, ప్రవక్త సహచరులు ఈ సూరాలను ఒక క్రమంలో ఉంచారు. ప్రవక్త సహచరుడు హజ్రత్ ఉస్మాన్ ఇబ్నె అఫ్ఫాన్, రజిఅల్లాహు అన్హ్ (దైవం ఆయన పట్ల ప్రసన్నుడవుగాక) ఖలీఫాగా ఉన్నప్పుడు, ఆయన ఆదేశం ప్రకారం ప్రవక్త సహచరుడు హజ్రత్ జైద్ ఇబ్నె సాబిత్ (రజి) సూరాలను ఒక క్రమంలో సంకలనం చేసారు. ప్రస్తుతం మన వద్ద ఉన్న దివ్యఖుర్ఆన్ సంకలనం ఈ క్రమంలోనే ఉంది. ప్రవక్త ముహమ్మద్(స) చనిపోయినప్పుడు (క్రీ.శ.632లో) దివ్యఖుర్ఆన్‌లోని సూరాలు ఏ క్రమంలో ఉండేవో అదే క్రమంలో నేడు మన వద్ద ఉన్న దివ్యఖుర్ఆన్‌లో సంకలనం చేయబడ్డాయి. అంటే, దివ్యఖుర్ఆన్‌లోని వాక్యాలు అవి అవతరించిన క్రమంలో గాని, అవతరించిన ప్రదేశం ప్రకారం గాని లేవు. ఈ అమరిక విశిష్టమైనది. ప్రతి సూరాలోని ముఖ్యమైన విషయానికి అనుగుణంగా ఈ అమరిక చేయబడింది.

అరబ్బీ భాషలోని పెద్ద పెద్ద సూరాలను చదవడం, ఆ సూరాల అనువాదం, సుదీర్ఘ వివరణలను చదవడం చాలా మంది పాఠకులకు కష్టం కావచ్చు. చాలా మందికి ఈ విధంగా ఖుర్ఆన్ బోధనలను అర్థం చేసుకునే శక్తి లేకపోవచ్చు. "దివ్యఖుర్ఆన్ బోధనల సారాంశం" పుస్తకం అలాంటి పాఠకుల కోసం ఉద్దేశించినది. ఈ పుస్తకం దివ్య ఖుర్ఆన్ బోధనలను సరళంగా పాఠకులకు అందిస్తుంది. దివ్యఖుర్ఆన్ వ్యాఖ్యాతల వ్యాఖ్యాన గ్రంధాలు చదవలేని వారికోసం, అనువాదాలు చదివే శక్తి లేని వారిని దృష్టిలో ఉంచుకుని రాసిన పుస్తకం ఇది. దివ్యఖుర్ఆన్‌లోని ప్రతి సూరా సారాంశం, ముఖ్య విషయాలను ఈ పుస్తకం ద్వారా పాఠకులు తేలిగ్గా



అర్థం చేసుకోవచ్చు. దివ్యఖుర్ఆన్‌లోని విశ్వజనీనమైన, సమస్త మానవులను ఉద్దేశించిన దివ్య సందేశాన్ని పాఠకులు అర్థం చేసుకోవడానికి చక్కని సాధనం ఈ పుస్తకం.

**డా. హుస్సేన్ అబ్దుర్రవూఫ్**
సీనియర్ లెక్చరర్ ఇన్ అరబిక్ అండ్ ఖురానిక్ స్టడీస్
యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ అరబిక్ అండ్ మిడిల్ ఈస్టర్న్ స్టడీస్.

وَلَقَدْ يَسَّرْنَا الْقُرْآنَ لِلذِّكْرِ فَهَلْ مِن مُّدَّكِرٍ

"వ లఖద్ యస్సర్‌నల్ ఖుర్‌ఆన
లిజ్జిక్‌రి ఫ హల్ మిమ్ ముద్దకిర్"

మేము (మానవుల) హితబోధ కొరకు ఈ ఖుర్‌ఆన్‌ను సులభంగా అర్థం చేసుకొనగలిగేదిగా చేశాము. మరి దీని హిత బోధను స్వీకరించే వారెవరైనా ఉన్నారా?

*(దివ్యఖుర్‌ఆన్- 54:40)*



# విషయసూచిక


| క్రమ సంఖ్య | సూరా పేరు | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | అల్ ఫాతిహా | 36 |
| 2. | బఖర | 40 |
| 3. | ఆలి ఇమ్రాన్ | 52 |
| 4. | అన్ నిసా | 62 |
| 5. | అల్ మాయిద | 68 |
| 6. | అల్ అన్ ఆమ్ | 73 |
| 7. | అల్ ఆరాఫ్ | 77 |
| 8. | అల్ అన్‌ఫాల్ | 82 |
| 9. | అత్ తౌబా | 85 |
| 10. | యూనుస్ | 89 |
| 11. | హూద్ | 93 |
| 12. | యూసుఫ్ | 97 |
| 13. | అర్రాద్ | 101 |
| 14. | ఇబ్రాహీమ్ | 105 |
| 15. | అల్ హిజ్ర్ | 107 |
| 16. | అన్ నహ్ల్ | 110 |
| 17. | అల్ ఇస్రా (బనీ ఇస్రాయీల్) | 113 |

| | | |
|---|---|---|
| 18. | అల్ కహఫ్ | 117 |
| 19. | మర్యం | 120 |
| 20. | తాహా | 124 |
| 21. | అల్ అంబియా | 128 |
| 22. | అల్ హజ్ | 131 |
| 23. | అల్ మూ‘మినూన్ | 134 |
| 24. | అన్ నూర్ | 138 |
| 25. | అల్ ఫుర్ఖాన్ | 142 |
| 26. | అష్ షుఅరా | 145 |
| 27. | అన్ నమ్ల్ | 149 |
| 28. | అల్ ఖసస్ | 151 |
| 29. | అల్ అన్ కబూత్ | 155 |
| 30. | అర్ రూమ్ | 159 |
| 31. | లుఖ్మాన్ | 162 |
| 32. | అస్ సజ్దహ్ | 165 |
| 33. | అల్ అహ్జాబ్ | 168 |
| 34. | సబా | 170 |
| 35. | ఫాతిర్ | 173 |
| 36. | యాసీన్ | 176 |
| 37. | అస్ సాఫ్ఫాత్ | 178 |





| | | |
|---|---|---|
| 38. | సాద్ | 181 |
| 39. | అజ్ జుమర్ | 183 |
| 40. | అల్ మూ‘మిన్ | 187 |
| 41. | హా మీమ్ అస్ సజ్దహ్ | 190 |
| 42. | అష్ షూరా | 193 |
| 43. | అజ్ జుఖ్రుఫ్ | 195 |
| 44. | అద్ దుఖాన్ | 198 |
| 45. | అల్ జాసియహ్ | 200 |
| 46. | అల్ అహ్ఖాఫ్ | 203 |
| 47. | ముహమ్మద్ | 205 |
| 48. | అల్ ఫత్హ్ | 207 |
| 49. | అల్ హుజురాత్ | 209 |
| 50. | ఖాఫ్ | 210 |
| 51. | అజ్ జారియాత్ | 212 |
| 52. | అత్ తూర్ | 215 |
| 53. | అన్ నజ్మ్ | 216 |
| 54. | అల్ ఖమర్ | 218 |
| 55. | అర్ రహ్మాన్ | 220 |
| 56. | అల్ వాఖిఅహ్ | 222 |
| 57. | అల్ హదీద్ | 223 |

58. అల్ ముజాదలహ్ 225

59. అల్ హష్ర్ 227

60. అల్ ముమ్తహినహ్ 229

61. అస్ సఫ్ 231

62. అల్ జుముఅహ్ 232

63. అల్ మునాఫిఖూన్ 234

64. అత్ తగాబున్ 235

65. అత్ తలాఖ్ 237

66. అత్ తహ్రీమ్ 239

67. అల్ ముల్క్ 240

68. అల్ ఖలమ్ 242

69. అల్ హాఖ్ఖహ్ 244

70. అల్ మఆరిజ్ 245

71. నూహ్ 247

72. అల్ జిన్న్ 249

73. అల్ ముజ్జమ్మిల్ 250

74. అల్ ముద్దస్సిర్ 251

75. అల్ ఖియామహ్ 253

76. అల్ ఇన్సాన్ (అద్ దహ్ర్) 254

77. అల్ ముర్సలాత్ 258





78. అన్ నబా 257

79. అన్ నాజిఆత్ 258

80. అబస 259

81. అత్ తక్వీర్ 261

82. అల్ ఇన్ఫితార్ 262

83. అల్ ముతఫ్ఫిఫీన్ 263

84. అల్ ఇన్షిఖాఖ్ 263

85. అల్ బురూజ్ 264

86. అత్ తారిఖ్ 265

87. అల్ ఆలా 266

88. అల్ గాషియహ్ 267

89. అల్ ఫజ్ర్ 268

90. అల్ బలద్ 270

91. అష్ షమ్స్ 271

92. అల్ లైల్ 272

93. అజ్ జుహా 273

94. అలమ్ నష్రహ్ 274

95. అత్ తీన్ 275

96. అల్ అలఖ్ 276

97. అల్ ఖద్ర్ 277

| | | |
|---|---|---|
| 98. | అల్ బయ్యినహ్ | 278 |
| 99. | అజ్ జిల్‌జాల్ | 279 |
| 100. | అల్ ఆదియాత్ | 280 |
| 101. | అల్ ఖారిఅహ్ | 281 |
| 102. | అత్ తకాసుర్ | 281 |
| 103. | అల్ అస్ర్ | 282 |
| 104. | అల్ హుమజహ్ | 283 |
| 105. | అల్ ఫీల్ | 284 |
| 106. | ఖురైష్ | 285 |
| 107. | అల్ మాఊన్ | 285 |
| 108. | అల్ కౌసర్ | 286 |
| 109. | అల్ కాఫిరూన్ | 287 |
| 110. | అన్ నస్ర్ | 288 |
| 111. | అల్ లహబ్ | 288 |
| 112. | అల్ ఇఖ్లాస్ | 289 |
| 113. | అల్ ఫలఖ్ | 290 |
| 114. | అన్ నాస్ | 290 |




# దివ్యఖుర్ఆన్ అధ్యాయాలు - వాటి ప్రాముఖ్యం

| విభాగం | తరగతి | ప్రాముఖ్యం |
|---|---|---|
| 1 | మక్కీ | తౌహీద్ |
| 2 | మదనీ | తౌహీద్, ఇస్లామీయ చట్టాలు |
| 3 | మదనీ | తౌహీద్, ఇస్లామీయ చట్టాలు |
| 4 | మదనీ | ఇస్లామీయ చట్టాలు, స్త్రీల హక్కులు |
| 5 | మదనీ | ఇస్లామీయ చట్టాలు, తౌహీద్, గ్రంథప్రజలు (తౌరాత్, ఇంజీల్ గ్రంథాలు అవతరింపజేయబడిన ప్రజలు, యూదులు, క్రయిస్తవులు) |
| 6 | మక్కీ | తౌహీద్, ఇస్లామీయ నియమనిబంధనలు |
| 7 | మక్కీ | తౌహీద్, మరణానంతరం మళ్ళీ లేపబడడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 8 | మదనీ | అల్లాహ్‌ను నమ్ముకోవడం, యుద్ధవ్యవహారాలు |
| 9 | మదనీ | తౌహీద్ |
| 10 | మక్కీ | దైవవాక్కుల అవతరణ, ప్రవక్తల పరంపర |
| 11 | మక్కీ | దివ్యఖుర్ఆన్ ఖచ్చితమైనది, వివరణాత్మకమైది |
| 12 | మక్కీ | దివ్యఖుర్ఆన్ స్పష్టమైనది, నైతిక హితబోధ ప్రసాదించే గ్రంథం |

| | | |
|---|---|---|
| 13 | మదనీ | దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు |
| 14 | మక్కీ | తౌహీద్ |
| 15 | మక్కీ | దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 16 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 17 | మక్కీ | తౌహీద్ ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 18 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపరం, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 19. | మక్కీ | తౌహీద్ |
| 20 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 21 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 22 | మదనీ | తౌహీద్, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం, ఇస్లామీయ చట్టాలు |
| 23 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 24 | మదనీ | ఇస్లామీయ చట్టాలు, మంచి నడవడిక |
| 25 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం. |



| | | |
|---|---|---|
| 26 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, పరలోకం |
| 27 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 28 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 29 | మక్కీ | తౌహీద్, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, ప్రవక్తలందరినీ విశ్వసించడం, పరలోకం |
| 30 | మక్కీ | తౌహీద్, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, ప్రవక్తలందరినీ, వారు తెచ్చిన దివ్యగ్రంధాలన్నింటిని విశ్వసించడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు |
| 31 | మక్కీ | తౌహీద్ |
| 32 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ బ్రతకడం, మరణానంతర జీవితం |
| 33 | మదనీ | కుటుంబానికి సంబంధించిన ఇస్లామీయ చట్టాలు |
| 34 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, తీర్పు దినం |
| 35 | మక్కీ | తౌహీద్, దైవదూతలను, అందరు ప్రవక్తలను, వారిపై అవతరించిన అన్ని దైవగ్రంధాలను, తీర్పుదినాన్ని విశ్వసించడం |
| 36 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |

| | | |
|---|---|---|
| 37 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 38 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు |
| 39 | మక్కీ | తౌహీద్ |
| 40 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 41 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 42 | మక్కీ | తౌహీద్, దైవదూతలను, అందరు ప్రవక్తలను విశ్వసించడం, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు |
| 43 | మక్కీ | తౌహీద్, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 44 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం |
| 45 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 46 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |



| | | |
|---|---|---|
| 47 | మదనీ | నీతినియమాలు, మంచి సామాజిక అలవాట్లు |
| 48 | మదనీ | అల్లాహ్ కొరకు పోరాడడం, ప్రవక్త ముహమ్మద్(స)కు సహాయపడడం, కపటవిశ్వాసులు |
| 49 | మదనీ | సమాజంలో సాంఘిక సంబంధాలు |
| 50 | మక్కీ | తౌహీద్, మరణానంతరం మళ్ళీ బ్రతకడం, కర్మలకు శిక్ష లేక బహుమానాలు పొందడం |
| 51 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, శిక్షా లేక బహుమానాలు పొందడం |
| 52 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా లేక బహుమానాలు పొందడం |
| 53 | మక్కీ | తౌహీద్, దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, శిక్షా లేక బహుమానాలు పొందడం |
| 54 | మక్కీ | ప్రళయం సమీపించడం |
| 55 | మదనీ | దైవవాణి అవతరణ, అల్లాహ్ అనుగ్రహాలు, సృష్టించే అల్లాహ్ శక్తిసామర్థ్యాలు, తీర్పుదినం |
| 56 | మక్కీ | తీర్పుదినం, ఆరోజు లభించే ప్రతిఫలం |
| 57 | మదనీ | తౌహీద్ |
| 58 | మదనీ | ఇస్లామీయ చట్టాలు, మంచి నడవడిక |
| 59 | మదనీ | తౌహీద్ |
| 60 | మదనీ | అవిశ్వాసులతో సాంఘిక సంబంధాలు |
| 61 | మదనీ | అల్లాహ్ మార్గంలో ఆత్మత్యాగం, యుద్ధరంగంలో క్రమశిక్షణ, |

| | | |
|---|---|---|
| 62 | మదనీ | శుక్రవారం నమాజుకు సంబంధించిన ఆధ్యాత్మిక, సామాజిక విలువలు |
| 63 | మదనీ | కపట విశ్వాసులు |
| 64 | మదనీ | తౌహీద్, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం |
| 65 | మదనీ | విడాకులు |
| 66 | మదనీ | ప్రవక్త(సఅసం) కుటుంబ వ్యవహారాలు |
| 67 | మక్కీ | తౌహీద్, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం |
| 68 | మక్కీ | ప్రవక్తల పరంపర |
| 69 | మక్కీ | దివ్యఖుర్ఆన్ అవతరణ, తీర్పుదినం |
| 70 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం |
| 71 | మక్కీ | సత్యతిరస్కారులను నాశనం చేసే దేవుని శక్తి సామర్ధ్యాలు |
| 72 | మక్కీ | తౌహీద్, ప్రవక్తల పరంపర |
| 73 | మక్కీ | ప్రవక్త (సఅసం) ఆధ్యాత్మిక జీవితం |
| 74 | మక్కీ | ప్రవక్త (సఅసం) ఆధ్యాత్మిక ఉద్యమం, తీర్పుదినం, అవిశ్వాసులకు ప్రతిఫలం |
| 75 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షాబహుమానాలు |
| 76 | మదనీ | సన్మార్గగాములకు స్వర్గంలో లభించే శాశ్వతసౌఖ్యాలు |
| 77 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం |



| | | |
|---|---|---|
| 78 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షాబహుమానాలు |
| 79 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షాబహుమానాలు |
| 80 | మక్కీ | మంచిపేర్లు, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం |
| 81 | మక్కీ | దివ్యఖుర్ఆన్ అవతరణ, ప్రవక్తల పరంపర, తీర్పుదినం నాటి భయానక పరిస్థితులు |
| 82 | మక్కీ | మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం |
| 83 | మక్కీ | మోసాలు |
| 84 | మక్కీ | తీర్పుదినం |
| 85 | మక్కీ | విశ్వాసం కోసం త్యాగం |
| 86 | మక్కీ | దివ్యఖుర్ఆన్ అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం |
| 87 | మక్కీ | తౌహీద్ |
| 88 | మక్కీ | తౌహీద్, తీర్పుదినం |
| 89 | మక్కీ | తీర్పుదినం |
| 90 | మక్కీ | తీర్పుదినం, శిక్షాబహుమానాలు |
| 91 | మక్కీ | ఆధ్యాతికత & అనైతికత |
| 92 | మక్కీ | అల్లాహ్ కోసం కృషి చేయడం, ఇహలోకంలో మన సంఘర్షణ |
| 93 | మక్కి | ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అల్లాహ్ అనుగ్రహాలు |
| 94 | మక్కి | ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అల్లాహ్ అనుగ్రహాలు |

| | | |
|---|---|---|
| 95 | మక్కీ | మానవులకు లభించిన అత్యున్నత స్థానం |
| 96 | మక్కీ | దివ్యఖుర్ఆన్ అవతరణ |
| 97 | మక్కీ | దివ్యఖుర్ఆన్ అవతరణ |
| 98 | మదనీ | తౌహీద్, ప్రవక్తలపరంపర |
| 99 | మదనీ | తీర్పుదినం |
| 100 | మక్కీ | అల్లాహ్ పట్ల మన కృతఘ్నుత, ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహం |
| 101 | మక్కీ | తీర్పుదినం |
| 102 | మక్కీ | ప్రేమ, సంపద |
| 103 | మక్కీ | సన్మార్గం |
| 104 | మక్కీ | అపనిందలు వేయడం, సంపద పట్ల వ్యామోహం |
| 105 | మక్కీ | సత్యతిరస్కారం |
| 106 | మక్కీ | ఖురైషులపై అల్లాహ్ అనుగ్రహాలు |
| 107 | మక్కీ | అవిశ్వాసులు, కపటవిశ్వాసులు |
| 108 | మక్కీ | ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అల్లాహ్ అనుగ్రహాలు |
| 109 | మక్కీ | తౌహీద్ |
| 110 | మదనీ | సన్మార్గగాములకు అల్లాహ్ సహాయం చేస్తాడన్న వాగ్దానం |
| 111 | మక్కీ | ప్రవక్త(సఅసం) పట్ల తీవ్ర విద్వేషం |
| 112 | మక్కీ | తౌహీద్ |
| 113 | మక్కీ | దుష్ట ప్రాణుల నుంచి అల్లాహ్ శరణు కోరడం |
| 114 | మక్కీ | షైతాన్ దుర్మార్గం నుంచి అల్లాహ్ శరణు కోరడం |



# దివ్యఖుర్ఆన్ విభాగాలు - వాటిలోని ముఖ్యాంశాలు

| విభాగం | తరగతి | ప్రాముఖ్యం |
|---|---|---|
| 1 | మక్కీ | తౌహీద్, దైవస్తుతి, తీర్పుదినం, అల్లాహ్‌పై ఆధారపడడం, మార్గదర్శకత్వం |
| 2 | మదనీ | తౌహీద్, మార్గదర్శకత్వం, కపటవిశ్వాసం, అల్లాహ్ వైపునకు మరలడం, మానవుని హోదా, మనిషి అజ్ఞానం, దేవుని క్షమాగుణం, నైతికత, సహనం, భవిష్యత్తు, దానధర్మాలు, దేవునిపై కృతజ్ఞత, హత్యానేరాల్లో సమానత్వం, దేవుని వేడుకోవడం |
| 3 | మదనీ | నైతికత, ప్రసన్నత, అసత్యమాడడం, సహనం, అల్లాహ్ వైపునకు మరలిపోవడం, అల్లాహ్ ఎలాంటి అవసరమూ లేనివాడు, కపటవిశ్వాసం, దయాగుణం, మృత్యువు, సాఫల్యం, ప్రజలతో వ్యవహరించడం, |
| 4 | మదనీ | భార్యలు, అక్రమ సంబంధాలు, దయాగుణం, వివాదాలు, పోరాటాలు, మృత్యువు, నైతికత |
| 5 | మదనీ | మంచి చెడుల మధ్య ఘర్షణ, సహాయసహకారాలు, న్యాయమైన నిజాయితీ కలిగిన సాక్షిగా ఉండడం, తన పట్ల శ్రద్ధ వహించడం |

| | | |
|---|---|---|
| 6 | మక్కీ | దేవుని శక్తి సామర్థ్యాలు, దేవుని ఏకత్వం, ప్రాపంచిక జీవితం, చెడులు, స్థిరచిత్తం, కుటుంబం, మంచిపనులు, భూమి. |
| 7 | మక్కీ | అహంకారం, మంచి చెడుల మధ్య సంఘర్షణ, సత్యం విజయం సాధించడం, మనిషి బలహీనతలు, ప్రాచీన జాతుల నుంచి పాఠాలు గ్రహించడం |
| 8 | మదనీ | అల్లాహ్‌ను నమ్ముకోవడం, సహనం, సమైక్యత, దైవానుగ్రహాలు, కృతఘ్నత యుద్ధవ్యవహారాలు |
| 9 | మదనీ | కపటవిశ్వాసం, ఒప్పందాలు, అల్లాహ్ మార్గంలో ముందుకుసాగడం |
| 10 | మక్కీ | అవకాశవాదం, నిరంకుశ అణచివేత, సాఫల్యం పొందిన వారు, వైఫల్యం పొందిన వారు, ఊహలు. |
| 11 | మక్కీ | దైవాగ్రహం, మోసం, దగా, పశ్చాత్తాపం, అల్లహ్‌యే రక్షకుడు, దేవుని మందలింపు |
| 12 | మక్కీ | పరీక్షలు, దురదృష్టాలు, ప్రజలతో వ్యవహరించడం, సహనం వల్ల ప్రయోజనాలు, లైంగిక వ్యామోహాలు, నీతిసూత్రాలు, హోదా పెంపు, నిందించడం, కుట్రలు |
| 13 | మదనీ | మార్పు, మంచి చెడు, ప్రశాంతత, ప్రాపంచిక జీవితం |



| | | |
|---|---|---|
| 14 | మక్కీ | మంచిమాట, చెడుమాట, తల్లిదండ్రులు, సహనం, అల్లాహ్‌ను వేడుకోవడం. |
| 15 | మక్కీ | అధికారం, సత్యం, నిరాశ, క్షమాగుణం |
| 16 | మక్కీ | గర్వం, స్త్రీలు, పిల్లలు, న్యాయం, ప్రతిజ్ఞ, సంబంధీకులు, లైంగికసంబంధం, కృతజ్ఞత |
| 17 | మక్కీ | దయతో వ్యవహరించడం, సానుభూతితో మాట్లాడడం, మార్గదర్శకత్వం, తొందరపాటు, సౌకర్యాలు, మనిషి హోదా, అసత్యాలు, కృతజ్ఞత, నైతికనియమావళి |
| 18 | మక్కీ | మంచిపనులు, అహంభావం, సంతుష్టి, సంపద, అధికారాలు, ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టడం, స్వేచ్ఛ, జ్ఞానం |
| 19. | మక్కీ | పరిమితులు, ప్రార్థనలు, స్తోత్రం, శిలువ, అల్లాహ్‌కు మొరపెట్టుకోవడం |
| 20 | మక్కీ | సందేశం, స్థిరచిత్తం, షైతాన్, ప్రాధాన్యతలు |
| 21 | మక్కీ | తొందరపాటు, పరీక్ష, దుర్మార్గాలు, ఆత్మశుద్ధత, స్వలింగసంపర్కం, ఒకే కుటుంబం, విజయం పొందినవారు |
| 22 | మదనీ | అల్లాహ్‌తో వివాదం, ఆరాధన మన ప్రయోజనాలకే, విశ్వాసం లేనివారు, సాఫల్యం, బలహీనత, అల్లాహ్‌వైపునకు మరలడం, మంచిపనులు చేయడం |
| 23 | మక్కీ | సహనం, లక్ష్యం, సదాచరణలు, అల్లాహ్ కారుణ్యం, కొనియాడడం |
| 24 | మదనీ | అక్రమలైంగిక సంబంధం, అపనింద, వివాహం, భార్య, లజ్జ, సచ్ఛీలం, కుటుంబ మర్యాదలు |

| | | |
|---|---|---|
| 25 | మక్కీ | కోరికలు, గర్వం, నమాజులు, వ్యయం, షైతాన్, అల్లాహ్ ఆగ్రహం, మంచి వైఖరులు |
| 26 | మక్కీ | హితబోధ, దయాగుణం, దేవుని నమ్ముకోవడం, న్యాయం, స్వలింగ సంపర్కం |
| 27 | మక్కీ | సంపద అధికారాలు, కృతజ్ఞత, దేవునిపై నమ్మకం, మంచిపనులకు ప్రతిఫలం, అవిశ్వాసుల విషయమై ఆందోళన |
| 28 | మక్కీ | దౌర్జన్యాలు, అణచివేతలు, సంపద అధికారాలు, అవినీతికి మద్దతు ఇవ్వడం, తల్లిప్రేమ, సహాయం, వ్యర్థప్రసంగాలు, కామం, ఆనందాన్ని ప్రకటించడం, కృతజ్ఞతలు, దేవునివైపు మరలిపోవడం, పరలోకం |
| 29 | మక్కీ | పరీక్ష, అంకితం కావడం, విశ్వాసం, సంపద, అధికారాలు, అబద్ధపు సాక్ష్యం, పెట్టుబడి, కృతజ్ఞత, వినాశం, వాదనలు, మృత్యువు, పోషణ |
| 30 | మక్కీ | అగ్రరాజ్యాలు, విజయం, పాఠాలు, కృతజ్ఞతలు, నిరాశ, వడ్డీ, పోషణ, విశ్వాసం అవిశ్వాసం |
| 31 | మక్కీ | భ్రమ, కష్టాలు, విధేయత, అల్లాహ్ గురించి వివాదం |
| 32 | మక్కీ | అల్లాహ్ పట్ల భయభీతులు, సహనం, దేవుని చిహ్నాలు |
| 33 | మదనీ | దైవభీతి, అల్లాహ్‌పై విశ్వసం, కృతజ్ఞత, సహనం, కపటవిశ్వాసం, ప్రవక్త(సఅసం), లజ్జ, అపనిందలు. |



| | | |
|---|---|---|
| 34 | మక్కీ | కృతజ్ఞతలు, అధికారం ఔన్నత్యాలు, వివేకం అధికారాలు, సిఫారసు, సత్యం అసత్యాలు, కోరికలు |
| 35 | మక్కీ | అల్లాహ్ అనుగ్రహాలు, అవసరాలు, అహంభావం, అల్లాహ్ కారుణ్యం, నష్టం, వారసుడు. |
| 36 | మక్కీ | అహంభావం, సన్మార్గం, షైతాన్, సహాయం, దేవుని వైపు మరలడం |
| 37 | మక్కీ | తిరస్కారం, సహాయం, కుట్రలు, సహనం, తల్లిదండ్రుల పట్ల విధేయత |
| 38 | మక్కీ | స్థిరచిత్తం, సహనం, న్యాయం, లక్ష్యం, ఔన్నత్యం, ధ్యానం |
| 39 | మక్కీ | భక్తి, ప్రకృతి, కృతఘ్నుత, నష్టపోయేవారు, అవిశ్వాసం, మరలడం, సిఫారసు, పోషణ, నిరాశ, ఏర్పాట్లు |
| 40 | మక్కీ | దేవుని న్యాయం, వేడుకోలు, ప్రాపంచిక జీవితం, నైతికపాఠాలు |
| 41 | మక్కీ | ముఖ్యనియమం, సలహాలివ్వడం, సాక్షులు, శరణు, దేవుని న్యాయం, కారుణ్యం, విరోధులు, బలహీనతలు |
| 42 | మక్కీ | ధర్మభ్రష్టత్వం, సలహాసంప్రదింపులు, ప్రతీకారం, సంబంధీకులు, దురదృష్టం, ప్రాపంచికజీవితం, న్యాయం, సహనం, క్షమాగుణం |
| 43 | మక్కీ | ప్రాపంచిక జీవితం, భాగస్వామ్యం కల్పించడం, శిక్ష, అల్లాహ్ స్మరణ |

| | | |
|---|---|---|
| 44 | మక్కీ | సృష్టి, నిర్లక్ష్య పరచడం, అణగారిన వారు |
| 45 | మక్కీ | దైవిక న్యాయం, విజయాలు, సృష్టి, కూటమి |
| 46 | మక్కీ | వినాశం, దేవుని ఔన్నత్యం, తల్లిదండ్రులు, సహనం |
| 47 | మదనీ | ప్రాపంచిక జీవితం, సహాయం, రక్షణ |
| 48 | మదనీ | ప్రాపంచిక ప్రయోజనాలు, ప్రవక్త ముహమ్మద్(సఅసం), కపటవిశ్వాసం |
| 49 | మదనీ | నైతికనియమావళి, మంచినడవడి |
| 50 | మక్కీ | న్యాయం, సహనం, నిర్లక్ష్యం |
| 51 | మక్కీ | శిక్ష, దేవుని చిహ్నాలు, నష్టం, అవసరం, సృష్టి, |
| 52 | మక్కీ | సహనం, ప్రతిఫలం, వేడుకోలు |
| 53 | మక్కీ | స్తుతించడం, బాధ్యతాభావం, కాలాన్ని వ్యర్థం చేయడం, మరలడం |
| 54 | మక్కీ | హితబోధ, దివ్యఖుర్ఆన్, సృష్టి, కర్మల చిట్టా |
| 55 | మదనీ | చావు, కృతజ్ఞత, న్యాయం |
| 56 | మక్కీ | కృతజ్ఞత, స్తోత్రం |
| 57 | మదనీ | ప్రాపంచిక జీవితాన్ని గడుపడం, దేవుని కారుణ్యం, నిజాయితీ |
| 58 | మదనీ | మహిళల హక్కులు, రహస్య సమాలోచనలు, కూటమి, సమావేశాలు, వినమ్రత, ప్రమాణం, గెలిచేవారు, ఓడేవారు |
| 59 | మదనీ | విజయం, కపటవిశ్వాసం, సన్మార్గం, ప్రాధాన్యతలు, ద్రోహం |
| 60 | మదనీ | స్నేహం, సామాజిక సంబంధాలు, న్యాయం, సహాయం |



| | | |
|---|---|---|
| 61 | మదనీ | సమైక్యత, అసత్యాలు, అంకితభావం, మాటలు కాదు చేతలు ముఖ్యం |
| 62 | మదనీ | ప్రాపంచిక ప్రయోజనాలు, మృత్యువు, సందేశం |
| 63 | మదనీ | కపటవిశ్వాసం, దానధర్మాలు, అంకితభావం |
| 64 | మదనీ | విశ్వాసం, దారితప్పడం, రుణం, దేవునివైపు మరలడం |
| 65 | మదనీ | వివాహం, ధర్మపరాయణత్వం, పరస్పర గౌరవాదరాలు |
| 66 | మదనీ | రహస్యం, పశ్చాత్తాపం, ఏర్పాట్లు, అవగాహన |
| 67 | మక్కీ | ఉత్తమమైన పనులు, పాఠాలు, విశ్వాసం |
| 68 | మక్కీ | మంచిఅలవాట్లు, సహనం, స్మరణ, సందేశం |
| 69 | మక్కీ | అన్యాయం, కృతఘ్నత, అహంభావం, సంపద, దివ్యఖుర్ఆన్ |
| 70 | మక్కీ | సహనం, వ్యర్థప్రసంగాలు, సచ్ఛీలం, వాగ్దానం |
| 71 | మక్కీ | తల్లిదండ్రులు, విశ్వాసం |
| 72 | మక్కీ | విశ్వాసం, విధేయత, శరణు, నైతికప్రమాణాలు |
| 73 | మక్కీ | భక్తి, దివ్యఖుర్ఆన్ |
| 74 | మక్కీ | సాక్ష్యమీయడం, దైవానుగ్రహాలు, సిఫారసు |
| 75 | మక్కీ | స్వేచ్ఛ, మృత్యువు, ప్రాపంచిక జీవితం |
| 76 | మదనీ | సహాయం, ప్రతిఫలం, ప్రాపంచిక జీవితం, భక్తి |
| 77 | మక్కీ | విశ్వాసం, మంచిపనులు |
| 78 | మక్కీ | ప్రతిఫలం, మంచిచెడులు వేరుచేయడం, ధర్మపరాయణత్వం |

| | | |
|---|---|---|
| 79 | మక్కీ | నిష్ప్రయోజనాలు, అహంభావం |
| 80 | మక్కీ | దివ్యఖుర్‌ఆన్, బీదధనిక వ్యత్యాసాలు |
| 81 | మక్కీ | ఇష్టాయిష్టాలు, రోదసీ మార్పులు |
| 82 | మక్కీ | ప్రతిఫలం, బాధ్యతలు |
| 83 | మక్కీ | మోసాలు |
| 84 | మక్కీ | తీర్పుదినం |
| 85 | మక్కీ | వేధింపులు, క్షమాగుణం |
| 86 | మక్కీ | రాజీపడడం, కుట్రలుపన్నడం |
| 87 | మక్కీ | హితబోధ, ప్రాపంచిక జీవితం |
| 88 | మక్కీ | హితబోధ, దేవునివైపునకు మరలడం |
| 89 | మక్కీ | అవినీతి, పరీక్ష, అనాధలు, సంపద |
| 90 | మక్కీ | పరీక్ష, సంఘర్షణ, సహాయం, స్వేచ్ఛ |
| 91 | మక్కీ | సమతుల్యం, విజయం |
| 92 | మక్కీ | సంపద, ఆనందం |
| 93 | మక్కీ | పరలోకం, నైతికప్రమాణాలు |
| 94 | మక్కీ | కష్టాలు |
| 95 | మక్కీ | సృష్టి, ప్రతిఫలం |
| 96 | మక్కీ | వ్యర్థమైన విషయాలు, హితబోధ, అతిక్రమణలు |
| 97 | మక్కీ | ఆరాధన |
| 98 | మదనీ | సత్యధర్మం |
| 99 | మదనీ | కర్మలు |



| | | |
|---|---|---|
| 100 | మక్కీ | సంపద |
| 101 | మక్కీ | కర్మలు |
| 102 | మక్కీ | సంపద |
| 103 | మక్కీ | జీవితం |
| 104 | మక్కీ | చెడులు, సంపద |
| 105 | మక్కీ | పథకాలు |
| 106 | మక్కీ | ఆహారం, భద్రత |
| 107 | మక్కీ | సహాయం |
| 108 | మక్కీ | కృతజ్ఞత |
| 109 | మక్కీ | రాజీ |
| 110 | మదనీ | విజయం |
| 111 | మక్కీ | సంపద |
| 112 | మక్కీ | దేవుని ఏకత్వం |
| 113 | మక్కీ | శరణు, నమ్మకం, ఈర్ష్యా |
| 114 | మక్కీ | శరణు, నమ్మకం, కుశంకలు |

# తెలుసుకుందాం

## అల్లాహ్ :

అల్లాహ్ అంటే ఒకే ఒక్క దేవుడని అర్థం. ఇది అరబీ భాషా పదం. అరబీ భాషలో దేవుడిని 'ఇలాహ్' అంటారు. 'అల్' అన్న పదం ఇంగ్లీషు భాషలోని 'ది' అన్న ఆర్టికల్‌కు సమానమైనది. అల్+ఇలాహ్= అల్లాహ్, అంటే ఒకే ఒక్కడైన దేవుడు. ఇంగ్లీషులో 'ది గాడ్' (The God) అన్న అనువాదానికి సమానార్థకమైనది. కాబట్టి అల్లాహ్ అంటే ముస్లిముల దేవుడని భావించడం పొరబాటు. అలాగే అల్లాహ్ అంటే అనేక మంది దేవుళ్ళలో ఒక దేవుడని భావించడం కూడా చాలా పెద్ద తప్పు. అల్లాహ్ అంటే కేవలం ఒకే ఒక్కడైన దేవుడు. ఆయనే సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, ప్రభువు.... ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆ ఒకే ఒక్క దైవాన్ని అరబీ భాషలో అల్లాహ్ అంటారు.

## ఇస్లాం :

ఇస్లాం అంటే అర్థం మనిషి తన్ను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకోవడం. స్వయం సమర్పణ, దైవవిధేయత, దైవదాస్యం. ఇస్లాం అంటే మరొక అర్థం 'శాంతి.' ఇస్లాం అన్నది చాలా విస్తృతమైన పదం. ఇస్లాం సూచించే రెండు అర్థాలు, (1) దైవవిధేయత, దైవదాస్యం (2) శాంతి. ఈ రెండూ విభిన్నమైన అర్థాలు కావు. నిజానికి సృష్టిలో ప్రకృతి సహజమైన ధర్మం ఇస్లాం. దేవుని ఆమోదం పొందిన ధర్మం. ఇస్లాం అంటే దైవదాస్యం. ఇస్లాం స్వీకరించడం ద్వారా, అంటే దైవదాస్యాన్ని పాటించడం ద్వారా మనిషి దేవునితో శాంతియుత సంబంధం ఏర్పరచుకుంటాడు. తోటివారితో శాంతియుత సంబంధాలు, ఇతర ప్రాణులతో శాంతియుత సంబంధాలు, యావత్తు ప్రకృతితో, విశ్వవ్యవస్థతో శాంతియుత సంబంధం ఏర్పరచుకుంటాడు. అంటే మనిషి ఈ జీవనవ్యవస్థ ద్వారా అన్ని విధాలా శాంతియుత జీవనాన్ని పొందుతాడు.

## ముస్లిములు :

ముస్లిం అంటే అర్థం దైవదాస్యాన్ని స్వీకరించినవాడు, దైవాదేశాలను పాటించేవాడు, దైవవిధేయతకు కట్టుబడిన వాడు, దైవంతో, ప్రకృతితో, యావత్తు



విశ్వవ్యవస్థతో సహజ సిద్ధమైన, ప్రకృతి సిద్ధమైన శాంతియుత సంబంధాన్ని ఏర్పరచుకున్నవాడు. క్లుప్తంగా చెప్పాలంటే ఇస్లాంను స్వీకరించినవాడు అని అర్థం. ముస్లిం అన్న పదానికి విస్తృతమైన భావం ఉంది. అంతేకాని కేవలం రషీద్, ఫాజిల్ వగైరా పేర్లు పెట్టుకున్నంత మాత్రాన మనిషి ముస్లింగా మారిపోడు. దేవుని పట్ల విధేయతను, దేవుడొక్కడే అన్న సత్యాన్ని విశ్వసించి, దైవప్రవక్తలను విశ్వసించి, అంతిమ దైవప్రవక్త (స) తీసుకువచ్చిన అంతిమ దైవగ్రంథాన్ని విశ్వసించి, ఆ గ్రంథంలోని దైవాదేశాలను పాటించడం ద్వారా తన దాస్యాన్ని ఆచరణలో చూపిస్తూ ఆ విధంగా దేవుని ప్రసన్నత పొందడం ద్వారా శాంతిని పొందేవారే ముస్లిములు.

## జకాత్:

ముస్లిములు ప్రతి ఏటా తమ సంపదపై తప్పనిసరిగా రెండున్నర శాతం బీదల వాటా చెల్లించాలి. దీనిని జకాత్ అంటారు. జకాత్ నిజానికి సంపదను పరిశుద్ధం చేస్తుంది. బీదల వాటా చెల్లించడం ద్వారా ముస్లిం తన సంపదను పరిశుద్ధపరచుకుంటాడు. జకాత్ ఒక ఆర్థిక ఆరాధన. ఇస్లాం దానధర్మాలను ప్రోత్సహించడం మాత్రమే కాదు, కొన్ని సందర్భాలలో బీదలకు సహాయసహకారాలు అందించడాన్ని తప్పనిసరిగా చేసింది. ఆ విధంగా సమాజంలో సంపద పంపిణీకి మార్గాలు ఏర్పరచి సామాజిక అలజడులను నివారించింది. పైగా ఈ జకాత్‌ను ఒక బాధ్యతగా ప్రతి ముస్లిం చెల్లించవలసి ఉంటుంది. దీనిని బీదల హక్కుగా భావించి వారికి ఇవ్వవలసి ఉంటుంది.

**జబూర్** : దావూద్ ప్రవక్తపై అవతరించిన దివ్యగ్రంథం.

**తౌరాత్** : మూసా ప్రవక్తపై అవతరించిన దివ్యగ్రంథం.

**ఇంజీల్** : ఈసా ప్రవక్తపై అవతరించిన దివ్యగ్రంథం.

**ఖుర్ఆన్** : అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన దివ్యగ్రంథం.

**1 వ అధ్యాయం**

# ఫాతిహా

# ప్రారంభం

## పరిచయం

దివ్యఖుర్ఆన్ సంకలనంలో ఇది మొదటి సూరా. కాని దివ్యఖుర్ఆన్ అవతరణలో మాత్రం ఇది మొదటి సూరా కాదు. మరో విధంగా చెప్పాలంటే, ఫాతిహా అంటే 'ప్రారంభం'. కాని ఈ సూరా మొట్టమొదట అవతరించిన సూరా కాదు. ఇది మక్కీ సూరా, అంటే మక్కా దశలో అవతరించిన సూరా. ఈ సూరాలో తౌహీద్ అంటే ఏకదైవారాధన ప్రధానంగా కనబడుతుంది. దేవుని పట్ల విశ్వాసం, దైవారాధన, దేవుని సహాయం కోసం వేడుకోవడం, దేవుని ప్రార్థించడం గురించి ఇందులో ముఖ్యంగా నొక్కి చెప్పడం జరిగింది. ఈ సూరాలో ఏడు ఆయతులున్నాయి. అల్లాహ్ మాత్రమే ఆరాధనలకు, స్తోత్రాలకు, అభ్యర్థనలకు యోగ్యుడని, అల్లాహ్ మాత్రమే పరిపూర్ణుడని, ఇహలోకానికి, పరలోకానికి అల్లాహ్ మాత్రమే ప్రభువని, ఆయనే సృష్టికర్త అని ఈ ఏడు ఆయతులలో నిర్దిష్టంగా చెప్పడం జరిగింది. (అల్లాహ్ అనే అరబీ పదానికి అర్థం ఒకే ఒక్క దేవుడు. ఇలాహ్ అంటే అర్థం దేవుడు. అల్ చేర్చి అల్లాహ్ అంటే ఒకే ఒక్క దేవుడని అర్థం వస్తుంది. అల్లాహ్ కేవలం ముస్లిములకు మాత్రమే దేవుడని భావించడం పొరబాటు. అల్లాహ్ అంటే పూర్తి మానవాళిని సృష్టించిన ఒకే ఒక్క దేవుడని భావం.)

ఈ సూరాకు ప్రారంభం అని పేరు పెట్టడం జరిగింది. ఎందుకంటే, ఇది దివ్యఖుర్ఆన్‌కు ప్రారంభ అధ్యాయం. ఈ సూరాను దివ్యఖుర్ఆన్‌కు తల్లివంటిదని, దివ్యఖుర్ఆన్ సారం ఇందులో ఉందని కూడా చెప్పడం జరిగింది. ముస్లిములు చేసే నమాజుల్లో తప్పనిసరిగా చదువవలసిన సూరా ఇది మాత్రమే. రోజూ చేసే అయిదు పూటల నమాజు కాని, లేక స్వచ్ఛందంగా చదివే ఐచ్ఛికమైన ప్రార్థనల్లో



కాని ప్రతి ప్రార్థనలో ఈ సూరాను చదవడం తప్పనిసరి. ప్రారంభ సూరా చదువకపోతే ముస్లిములు చదివే ఏ నమాజు కూడా స్వీకరించబడదని ముస్లిం ధర్మవేత్తలు ఖచ్చితంగా చెప్పారు.

ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం, ఈ ప్రారంభ సూరా, అల్ ఫాతిహా, పూర్తి ఖుర్ఆన్‌కు సారాంశం వంటిది. ఇది నిజానికి ఒక ప్రార్థన వంటిది. విశ్వప్రభువు అల్లాహ్‌ను స్తుతించడంతో ఇది ప్రారంభమవుతుంది. "అన్ని విధాల స్తోత్రాలు అల్లాహ్‌కే చెందుతాయి" - అనడం ద్వారా మనిషి పూర్తిగా అల్లాహ్ ముందు విధేయుడు కావడం, తన్ను తాను అల్లాహ్‌కు సమర్పించుకోవడం జరుగుతుంది. కేవలం అల్లాహ్ మాత్రమే అన్ని విధాల స్తోత్రాలకు అర్హుడని హృదయపూర్వకంగా అంగీకరించడం జరుగుతుంది. (అల్లాహ్ అనే అరబీ పదానికి ఒకే ఒక్క దేవుడని అర్థం. ఇలాహ్ అంటే దేవుడు, అల్ అన్న ప్రత్యయం ఇంగ్లీషులోని 'ది' అన్న ఆర్టికల్ మాదిరి అర్థాన్ని ఇస్తుంది. అల్ + ఇలాహ్ = అల్లాహ్, అంటే ఒకే ఒక్క దేవుడని అర్థం. కాబట్టి అల్లాహ్ అంటే కేవలం ముస్లిముల దేవుడని భావించడం పొరబాటు. అల్లాహ్ అంటే అందరికీ దేవుడు. సర్వమానవాళికి సృష్టికర్త. ఆయన్ను అరబీ భాషలో అల్లాహ్ అంటారు. ఇంగ్లీషులో గాడ్ అంటాము. ఫార్సీలో ఖుదా అంటారు. తెలుగులో దేవుడని అంటాము. ఈ పదాలన్నీ సూచించేది ఏకైక దేవుడిని మాత్రమే. ఆయన అందరికీ దేవుడు.)

ఈ సూరా పూర్తి ఖుర్ఆన్‌కు సారాంశం అని ఎందుకు చెప్పడం జరిగిందంటే, ఇస్లాంకు సంబంధించిన ప్రధానమైన భావనలను, నియమాలను అన్నింటిని ఈ సూరా క్లుప్తంగా తెలియజేస్తుంది. మౌలికమైన ఇస్లామీయ భావనలు, ప్రధానమైన ఇస్లామీయ విశ్వాసాలు, అంటే, దేవుని ఏకత్వం (దేవుడు ఒక్కడే అని విశ్వసించడం, దేవునికి భాగస్వాములు ఎవరూ లేరని విశ్వసించడం, దేవునికి సాటి ఎవరూ లేరని విశ్వసించడం), దేవుని గుణగణాలను గురించి ఈ సూరా సరళంగా, సూటిగా, సంక్షిప్తంగా మనిషికి తెలియజేస్తుంది. ముస్లిములు అల్లాహ్‌ను, అంటే ఒకే ఒక్క ఆరాధ్యుడిని తప్ప మరెవ్వరినీ అర్థించరాదని, ఎవరి ముందూ చేతులు చాపరాదని, మనిషి సాటి మనిషికి దాస్యం చేయరాదని, కేవలం దేవునికి మాత్రమే అంకితమై,

దేవుని ముందు మాత్రమే తల వంచాలని బోధిస్తుంది. దేవునికి మానవ గుణగణాలు ఆపాదించడాన్ని ఖండిస్తుంది. అల్లాహ్‌కు ఎవరూ సమానులు కారు. అల్లాహ్ వంటి వారు మరెవ్వరూ లేరు. మనిషి ఆయన్ను విశ్వసించాలి. విశ్వాసంతో ఆయన్నే ఆరాధించాలి.

ఈ సూరా రెండు సమాన భాగాలుగా ఉన్నట్లు కనబడుతుంది. మొదటి భాగంలో అల్లాహ్, ఆయన గుణగణాల గురించి వుంది. రెండవ భాగంలో మనిషి గురించి, మనిషికి దేవునితో ఉన్న అవసరం గురించి ఉంది.

## ముఖ్యాంశాలు

ఈ సూరా చాలా క్లుప్తంగా ఉన్నప్పటికీ ఇందులో అనేక ప్రధానమైన విషయాలు ఉన్నాయి. అవి :

**1. దైవస్తుతి :**

అంటే అల్లాహ్ మనిషికి అనుగ్రహించిన అనేక వరాలకు కృతజ్ఞతగా దేవుని స్తుతించడం. మనిషికి లభించిన ప్రతి అనుగ్రహానికి గాను కేవలం అల్లాహ్‌ను మాత్రమే స్తుతించాలి, ఆయనకు మాత్రమే కృతజ్ఞత చూపాలి. ఇది ముస్లింలోని సంపూర్ణ దైవవిధేయతకు నిదర్శనం.

**2. తౌహీద్ అంటే దేవుని ఏకత్వం :**

సమస్త విశ్వానికి ప్రభువైన అల్లాహ్‌ను మాత్రమే విశ్వసించాలి.

**3. ఈమాన్ అంటే ధార్మిక విశ్వాసం :**

విశ్వప్రభువైన అల్లాహ్‌ను విశ్వసించడం, దైవదూతలను విశ్వసించడం, దైవగ్రంథాలను విశ్వసించడం, దైవప్రవక్తలను విశ్వసించడం, విధిరాతను విశ్వసించడం, అల్లాహ్ తీర్పు చెప్పే తుదిదినాన్ని విశ్వసించడం. దేవుడు ఒక్కడే అన్న వాస్తవం ఇక్కడ కూడా స్పష్టంగా తెలియజేయడం జరిగింది.

**4. దేవుని కారుణ్యం :**

అపారకృపాశీలుడు, పరమ దయామయుడు అన్న గుణగణాలు దేవుని



కారుణ్యాన్ని సూచిస్తున్నాయి. అల్లాహ్ కారుణ్యం సమగ్రమైనదనీ, సంపూర్ణమైనదనీ ఈ గుణగణాలు మనకు తెలుపుతున్నాయి. అన్ని కాలాల్లోను, అన్ని ప్రదేశాల్లోను ఈ కారుణ్యం ఆవరించుకుని ఉంది. అల్లాహ్ అనంత కరుణామయుడు, ప్రతీకార స్వభావం కలవాడు కాదు. ఆయనలోని కారుణ్యం, ప్రతీకారాన్ని మించినది.

**5. తీర్పుదినం :**

ముస్లిముల ధార్మిక విశ్వాసంలో ఇది ఒక ప్రధానమైన విశ్వాసం. ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్ సర్వాధికారాలు కలిగిన వాడని, తీర్పు దినాన సమస్తం ఆయన చేతుల్లో ఉంటుందని విశ్వసించడం.

**6. ప్రార్థన, విధేయతలు :**

అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించరాదు. అందరూ అల్లాహ్‌పై ఆధారపడి ఉన్నవారే. ఆయన తప్ప అందరూ నిస్సహాయులే. ఆయననే శరణు కోరాలి. ఈ మౌలిక విషయాలను బోధించడమే కాదు, దేవునికి మనిషికి మధ్య ఉన్న సంబంధాన్ని కూడా ఇక్కడ తెలుపడం జరిగింది. మనిషి ముందుగా దేవుని ప్రార్థించాలని, ఆ తర్వాతే దేవుని సహాయం లభిస్తుందని అర్థమవుతుంది.

**7. మార్గం చూపడం :**

దేవుడు ఎవరినైతే అనుగ్రహించాడో వారి మార్గాన్ని, ఆ రుజుమార్గాన్ని చూపించమని దేవుని మొరపెట్టుకోవడం. ఈ మార్గం ఈ ప్రపంచంలోను, పరలోకంలోను మనిషికి సాఫల్యాన్ని ప్రసాదిస్తుంది. దైవాగ్రహానికి గురయిన వారి మార్గానికి వ్యతిరేకమైనది ఈ రుజుమార్గం.

## 2 వ అధ్యాయం

# అల్ బఖర

# ఆవు

### పరిచయం

అల్ బఖర అంటే అర్థం ఆవు. ఈ అధ్యాయం దివ్యఖుర్‌ఆన్‌లో రెండవ అధ్యాయం అయినప్పటికీ, దివ్యఖుర్‌ఆన్ అవతరణ క్రమంలో ఇది రెండవ సూరా కాదు. ఈ సూరా నిజానికి మదనీ సూరా అంటే మదీనాలో అవతరించిన సూరా. ఇందులో మొత్తం 286 ఆయతులు (దైవవాక్యాలు, దేవుని చిహ్నాలు) ఉన్నాయి. దివ్యఖుర్‌ఆన్ అవతరణ క్రమంలోని చిట్టచివరి ఆయతు కూడా ఇందులో ఉంది. అది 281వ ఆయత్. దివ్యఖుర్‌ఆన్‌లోని అతి పొడవైన ఆయతు కూడా ఇందులో ఉంది. అది 282వ ఆయత్. ఈ అధ్యాయం ప్రధానంగా తౌహీద్ అంటే ఏకదైవారాధనను విశదీకరించిన అధ్యాయం. దివ్యఖుర్‌ఆన్ మనిషికి మార్గదర్శక గ్రంథమనీ, అందువల్ల దివ్యఖుర్‌ఆన్‌లోని బోధనలను మనిషి అనుసరించాలని ప్రబోధించే అధ్యాయం ఇది. ఇందులో ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు కూడా ఉన్నాయి.

ఆవు అన్న పేరు కలిగిన ఈ అధ్యాయాన్ని స్థూలంగా రెండు విభాగాలుగా విభజించవచ్చు. మొదటి విభాగంలో ఇస్రాయీల్ సంతతికి సంబంధించిన వివరాలున్నాయి. ఇస్రాయీల్ సంతతి మూసా ప్రవక్త (అస)తో వ్యవహరించిన తీరు, ఇతర ప్రవక్తలతో వారి వ్యవహారశైలి ఇందులో ప్రస్తావనకు వచ్చాయి. చిట్టచివరి దైవగ్రంథంగా అవతరించిన దివ్యఖుర్‌ఆన్‌ను విశ్వసించాలని ఇందులో వారికి ప్రత్యేక అప్పీలు చేయడం జరిగింది. రెండవ విభాగంలో మదీనాలో ఒక కొత్త ఇస్లామీయ వ్యవస్థను స్థాపించడానికి అవసరమైన న్యాయపరమైన, చట్టపరమైన



అంశాలు ఉన్నాయి. ఈ సూరాలోని 67, 68 ఆయతులలో ప్రస్తావనకు వచ్చే ఆవు కథ కారణంగా ఈ సూరాకు ఆవు అన్న పేరు పెట్టబడింది.

ప్రజలలో మూడు భిన్న వర్గాల గురించిన వివరణతో ఈ సూరా ప్రారంభ మవుతుంది. ఆ మూడు వర్గాలు వరుసగా – అల్లాహ్‌కు భయపడేవారు, దైవాన్ని ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారు, దైవం పట్ల కపటవిశ్వాసం ప్రదర్శించేవారు. మొదటి వర్గానికి చెందిన వారు తఖ్వా (దైవభీతి) కలిగిన ప్రజలు. వారి గురించిన వర్ణన క్రింది విధంగా ఉంది:

1. వారు తమ కంటికి కనబడని అగోచర విషయాలను (దేవుని ఉనికి, దైవ దూతలు, విధివ్రాత మొదలైన వాటిని) విశ్వసిస్తారు.
2. నమాజును స్థాపిస్తారు.
3. అల్లాహ్ ప్రసన్నత పొందడానికి గాను ఇతరుల కొరకు ఖర్చుపెడతారు.
4. దేవుని తరఫున ప్రస్తుతం అవతరిస్తున్న దైవవాణిని (దివ్యఖుర్‌ఆన్‌ను), గతంలో అవతరించిన దివ్యగ్రంథాలను (తౌరాత్ ఇంజీల్ గ్రంథాలను) విశ్వసిస్తారు.
5. పరలోకాన్ని దృఢంగా విశ్వసిస్తారు.
6. సాఫల్యం పొందుతారు.

అవిశ్వాసులు, కపటవిశ్వాసుల గురించిన ప్రస్తావన ఈ విధంగా ఉంది:

1. వారిని హెచ్చరించినా, హెచ్చరించకపోయినా, ప్రస్తుతం అవతరిస్తున్న దైవవాణిని (దివ్యఖుర్‌ఆన్‌ను) వారు తిరస్కరిస్తారు.
2. తమకు తామే ద్రోహం చేసుకుంటారు.
3. హృదయాలలో వ్యాధి కలిగిన వారు.
4. ప్రపంచంలో కల్లోలాన్ని రేకెత్తిస్తుంటారు.
5. గుడ్డిగా, మూర్ఖంగా, గర్వంగా వ్యవహరిస్తారు.

6. మార్గదర్శకత్వానికి బదులుగా మార్గభ్రష్టత్వాన్ని ఎంచుకున్న వారు.

7. కళ్ళూ,చెవులు, నోరు ఉన్నప్పటికీ చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు.

ఈ మూడు వర్గాలకు చెందిన ప్రజల ప్రస్తావన తర్వాత మానవులు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, ఆయనకు సహవర్తులుగా, ఆయనకు సమానులుగా ఎవరినీ నిలబెట్టరాదని నొక్కి చెప్పడం జరిగింది. దివ్యఖుర్ఆన్ ఆయతులు దేవుని తరపున అవతరించినవన్న విషయంలో ఎవరికైనా సందేహం ఉంటే, దివ్యఖుర్ఆన్‌లో మాదిరి ఒక్క సూరా అయినా సరే రచించి తీసుకు రమ్మన్న సవాలు కూడా ఇందులో ఉంది. బాధాకరమైన అగ్నిశిక్ష గురించి ఈ సూరా అవిశ్వాసులను గట్టిగా హెచ్చరిస్తోంది. ఆ అగ్నికి రాళ్ళు, మనుష్యులు ఇంధనాలవు తారని హెచ్చరించింది. అయితే విశ్వాసులకు ఈ సూరా శుభవార్తలు అందించింది. విశ్వాసులు స్వర్గవనాలు పొందుతారని, అక్కడ సెలయేరులు, పండ్ల చెట్లు, సదాచార సంపన్నులైన సహచరులు ఉంటారని తెలిపింది. అల్లాహ్ ఒక్కడే అని ఆయన భూమిని ఒక తివాచీ మాదిరిగా ప్రజల కోసం రూపొందించాడని, పైన ఆకాశాన్ని నిర్మించాడనీ, ఆకాశం నుంచి నీటిని కురిపిస్తున్నాడనీ, వారి పోషణ కోసం రకరకాల ఫలాలు పండించే వర్షాన్ని కురిపిస్తున్నాడనీ, భూమిపై ఉన్న సమస్తాన్ని మానవుల ప్రయోజనం కోసం సృష్టించాడనీ, ఆ పిదప ఆకాశాల వైపు దృష్టి సారించి, ఏడు ఆకాశాలను సమగ్రంగా సృష్టించాడనీ ఈ సూరా తెలియజేసింది.

మనిషి సృష్టికి సంబంధించిన కథను ఈ సూరా ప్రస్తావించింది. ఆదమ్ (అస)ను సృష్టించడం గురించి తెలిపింది. ఆదమ్(అస)ను సృష్టించిన దేవుడు దైవదూతలను ఆదమ్(అస) ముందు గౌరవసూచకంగా సాష్టాంగపడమని ఆదేశించాడు. దైవదూతలందరూ దేవుని ఆదేశాన్ని పాటించారు. కాని ఇబ్లీస్ పాటించలేదు. ఇబ్లీస్ ఒక షైతాన్. ఇబ్లీస్ దైవాదేశాన్ని తిరస్కరించి తలబిరుసుగా వ్యవహరించాడు. ఈ విధంగా మనిషికి షైతానులకు మధ్య ఘర్షణ ప్రారంభ మయ్యింది. ఆదమ్(అస) ఆయన భార్య హవ్వా ఇద్దరిని అల్లాహ్ స్వర్గవనంలో నివసించమన్నాడు. అక్కడ లభించే పండ్లు ఫలాలు తమ ఇష్టమొచ్చినవి తినవచ్చని



చెప్పాడు. కాని నిషిద్ధ వృక్షం దరిదాపులకు వెళ్ళవద్దని ఆదేశించాడు. కాని చెడుకు, అహంకారానికి ప్రతిరూపమైన ఇబ్లీస్ ఆదమ్(అస)ను మోసగించాడు. ఆదమ్(అస) తన బలహీనత వల్ల ఇబ్లీస్ పన్నిన మాయోపాయంలో పడిపోయారు. నిషిద్ధ వృక్షం ఫలాన్ని తిన్నారు. ఈ తీవ్రమైన తప్పు ఒక పెద్ద అపరాధానికి చిహ్నంగా మారింది. ఆదమ్(అస)ను ఆయన భార్య హవ్వాను అల్లాహ్ స్వర్గవనం నుంచి బహిష్కరించాడు. భూమిపై నివసించవలసిందిగా పంపించివేసాడు. ఆదమ్ చేసిన తప్పు అల్లాహ్‌కు ఆదమ్(అస) హవ్వాలకు మధ్య కుదిరిన ఒప్పందాన్ని భంగపరిచింది. ఆదమ్(అస), హవ్వాలు అల్లాహ్ ఆదేశాలను పాటిస్తామని, అల్లాహ్‌కు విధేయత చూపుతామని అంగీ కరించారు.

ఈ సూరా మదీనా కాలానికి సంబంధించిన సూరా. అందువల్ల ఇందులో ఇస్రాయిల్ సంతతి (యూద జాతి) కి సంబంధించిన ప్రస్తావనలు వివరంగా ఉన్నాయి. వాళ్ళు మదీనాలో నివసించేవారు. ఇస్రాయిల్ సంతతి ప్రజలు (యూదజాతి ప్రజలు) తాము చేసుకున్న ఒప్పందాన్ని పాటించాలని ఈ సూరా చెప్పింది. అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికి భయపడరాదని, దివ్యఖుర్ఆన్‌ను విశ్వసించాలని, సత్యాన్ని, అల్లాహ్ పంపించిన దైవవచనాలను దాచిపెట్టరాదని, నమాజును స్థాపించాలని, జకాత్ చెల్లించాలని (దానధర్మాలు చేయాలని), వారికి అల్లాహ్ చేసిన మేళ్ళను గుర్తుంచు కోవాలని, ఎలాగంటే, వారికి ఇతరులపై అల్లాహ్ ప్రాధాన్యత ఇచ్చాడనీ, వారి వద్దకు ప్రవక్తలను పంపాడనీ, తీర్పు దినాన్ని వాళ్ళు జ్ఞాపకం ఉంచుకోవాలనీ, నిరంకుశ ఫిర్ఔన్ నుంచి వారిని అల్లాహ్ ఎలా కాపాడాడో గుర్తుచేసుకోవాలని ఈ సూరా నొక్కి చెప్పింది.

ఈ సూరాలోని ఆవు కథ మూసా(అస) ఇచ్చిన ఆజ్ఞతో ప్రారంభమవుతుంది. మూసా(అస) ఒక ఆవు దూడను బలి ఇవ్వవలసిందిగా ఇస్రాయిల్ సంతతి ప్రజలకు చెప్పారు. మూసా(అస) ఇచ్చిన సూచనలను వినేబదులు ఇస్రాయిల్ సంతతి ప్రజలు వివిధ సాకులు చెప్పసాగారు. చివరకు వాళ్ళు అయిష్టంగానే బలి ఇచ్చారు. ఇస్రాయిల్ సంతతి ప్రజలు అల్లాహ్‌పై తిరుగుబాటు ప్రారంభించారు. ధార్మిక విశ్వాసాన్ని తరచూ భంగపరిచారు. హద్దులు అతిక్రమించారు, ప్రవక్తలను హతమార్చారు.

అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌ను అవతరింపచేశాడని ఈ సూరా నొక్కిచెప్పింది. చిట్టచివరి దైవగ్రంథంగా, గత కాలాల్లోని దివ్యవచనాలను, అంటే తౌరాత్ (మూసా(అస)కు ప్రసాదించబడిన గ్రంథం), ఇంజీల్(ఈసా (అస)కు ప్రసాదించబడిన గ్రంథం) గ్రంథాలను ధృవీకరించే గ్రంథంగా దీనిని అవతరింపచేసినట్లు తెలియజేసింది. ఇస్రాయీల్ సంతతి ప్రజలను ఉద్దేశించి ఈ చిట్టచివరి గ్రంథాన్ని విశ్వసించాలని, దీని భావార్థాలను వివేచనతో అవగాహన చేసుకోవాలని, ఆ విధంగా దీనిలోని సందేశాన్ని అర్థం చేసుకోవాలని, దీనిని పరిహాసంగా తీసుకోరాదని హెచ్చరించింది.

ఈ సూరా సామాజిక నడవడికకు సంబంధించిన ఆదేశాలను ఇస్తూ, తల్లిదండ్రులను గౌరవించాలని, బంధువులను, అనాధలను, అవసరార్థులను ఆదరించాలని, ప్రజలతో సద్భావంతో వ్యవహరించాలని, వారి మనోభావాలను గౌరవించాలని ఆదేశించింది. యుద్ధాల్లో స్వంత ప్రజల రక్తపాతం జరిగే ప్రమాదం గురించి కూడా హెచ్చరించింది. ప్రజలు యుద్ధాల వల్ల ఇల్లువాకిలి విడిచి పోవలసి వస్తుందని చెప్పింది.

ఈ సూరాలో ఈసా ప్రవక్త(అస) గురించి ప్రస్తావిస్తూ ఆయన ఒక ప్రవక్త అనీ, ఆయన మర్యం కుమారునిగా పిలువబడ్డారని, పవిత్ర ఆత్మ (దైవదూత జిబ్రయీలు(అస) ద్వారా ఆయనకు సహాయం అందిందని, అయినప్పటికీ ఇస్రాయీల్ సంతతి ప్రజలు ఆయన్ను తిరస్కరించారని పేర్కొంది.

తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలో ఉన్న సందేశం వంటిదే దివ్యఖుర్ఆన్‌లో ఉన్న సందేశం కూడా. దివ్యఖుర్ఆన్ గత కాలాలలో అవతరించిన దివ్యగ్రంథాలను ధృవీకరించే గ్రంథం అని మరోసారి గుర్తు చేసింది. అయితే గ్రంథప్రజలు (యూదులు, క్రయిస్తవులు) అల్లాహ్ పంపిన స్పష్టమైన సూచనలను విశ్వసించడానికి నిరాకరించారు. ఇస్లాం అందించే దివ్య సందేశాన్ని తిరస్కరించారు. దివ్యఖుర్ఆన్‌లోని సందేశాన్ని ఇస్రాయీల్ సంతతి ప్రజలు సమగ్రంగా పరిశీలించి ఉన్నట్లయితే, వారి గ్రంథాలలో ఉన్న సందేశాన్ని ఇది ధృవీకరిస్తుందన్న వాస్తవాన్ని గ్రహించి ఉండేవారు. కాని వారు దీనిని తిరస్కరించారు. మంత్రతంత్రాలలో, నానావిధ ఆచారాల్లో మునిగి



పోయారు. ఇది చాలా చెడ్డ విషయం. వారి గ్రంథంలో ఏముందో వారు నేర్చుకుని ఉన్నట్లయితే, తమ ధార్మిక విశ్వాసానికి కట్టుబడి ఉన్నట్లయితే, తమ విధిబాధ్యతలను నిర్వర్తించి ఉన్నట్లయితే వారికి చాలా ప్రయోజనకరంగా ఉండేది. ఈ సందర్భంగా ఈ సూరా అవిశ్వాసులకు విధించబడే కఠినమైన శిక్షలను గురించి తెలియజేసింది. అపారమైన అల్లాహ్ అనుగ్రహాలను గురించి కూడా తెలియజేసింది. ఆయన అన్నీ చేయగల సమర్థుడనీ, భూమ్యాకాశాలు ఆయన అదుపులో ఉన్నాయని తెలిపింది.

యూదులు కానట్లయితే ఎవరూ స్వర్గంలోకి ప్రవేశించలేరని యూదులు వాదించడాన్ని, క్రయిస్తవులు కాని వారు స్వర్గంలోకి ప్రవేశించలేరని క్రయిస్తవులు అనడాన్ని ఈ సూరా ప్రస్తావించింది. ఇలా అనడానికి వారి వద్ద ఎలాంటి ఆధారమూ, ఎలాంటి నిరూపణ లేదని, నిజమైన విశ్వాసిగా దేవునికి తనను తాను సమర్పించుకున్న వ్యక్తి, సదాచరణలకు కట్టుబడిన వ్యక్తి ఎవరైనా గాని స్వర్గంలోకి ప్రవేశించగలడని సూరా వివరించింది. తౌరాత్, ఇంజీల్‌లలోని దైవసందేశాన్ని మార్పులు చేర్పులకు గురిచేసి, అమాయకులను దారితప్పించిన పండితుల గురించి కూడా ఈ సూరాలో ప్రస్తావన ఉంది. కొద్దిపాటి ప్రాపంచిక లాభం కొరకు ఆ మతపండితులు తమ వద్ద ఉన్న దైవగ్రంథాలలో మార్పులు చేర్పులు చేసారు. యూదులు, క్రయిస్తవులు వారి మతవిధానాలను ముస్లిములు అనుసరించనంత వరకు సంతృప్తి చెందరని చెబుతూ, యూద క్రయిస్తవులు ఒకరికి వ్యతిరేకంగా ఒకరు చేసే వాదనలను కూడా ప్రస్తావించింది.

క్రయిస్తవ వాదనలను కూడా ఈ సూరా తిప్పికొట్టింది. అల్లాహ్ ఒక కుమారుడిని దత్తత చేసుకున్నాడన్న వాదనను ఖండిస్తూ అల్లాహ్ ఔన్నత్యాన్ని చాటి చెప్పింది.

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం అల్లాహ్‌కు చెందినదేనని ఖచ్చితంగా చెప్పింది. అల్లాహ్ అన్ని విధాల లోపాలకు అతీతుడనీ, సృష్టిలో ఎవ్వరితోను ఆయనను పోల్చడం సాధ్యం కాదని, ఆయన అన్ని విధాల పోలికలకు అతీతుడనీ, ఆయనకు కుమారుడున్నాడని చెప్పడం ఆయన ఔన్నత్యాన్ని తగ్గించడమే అవుతుందని

ఈ సూరా గట్టిగా ప్రబోధిస్తుంది. మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ (ఆయనపై శాంతి కురియుగాక) సత్య ధర్మాన్ని తీసుకు వచ్చిన దేవుని సందేశహరుడనీ, ఆయన మానవాళికి శుభవార్త వినిపించే వాడని, దేవుని గురించి మానవాళిని హెచ్చరించేవాడని ఈ సూరాలో ధృవీకరించడం జరిగింది. ఇబ్రాహీమ్ ప్రవక్త(అస), ఆయన కుమారులు ఇస్మాయీల్, ఇషాక్, యాకూబ్ ప్రవక్తలు (వారిపై శాంతి కురియుగాక) వారి సంతతి గురించి ప్రస్తావిస్తూ, వారందరూ విశ్వాసులనీ, యూదులు గాని, క్రయిస్తవులు గాని కారని నొక్కి చెప్పడం జరిగింది. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస)కు నిజమైన అనుయాయులు ముస్లిములనీ, ఆయన మార్గం అనుసరించడం మానవుల సహజప్రవృతికి నిదర్శనమవుతుందని పేర్కొనడం జరిగింది. ఈ సూరా ఏకదైవారాధన (తౌహీద్)ను ప్రధానంగా నొక్కి చెప్పింది. ఇందులోని ఆయతులు బుద్ధివివేకాలు ఉపయోగించాలని మనిషిని ప్రోత్సహిస్తాయి. సృష్టిలోని వివిధ అద్భుతాలను, వైవిధ్యాలను వివేచనతో పరిశీలించాలని, అల్లాహ్ ఒక్కడే అనడానికి, అల్లాహ్ అభీష్టానికి, ఆయన శక్తిసామర్థ్యాలకు నిదర్శనాలుగా వీటిని అర్థం చేసుకోవాలని వివరిస్తాయి. ప్రతిరోజు కనబడే అనేక ప్రకృతిసిద్ధమైన విషయాలను వివరిస్తూ ఏకదైవారాధనను, దేవుడు ఒక్కడే అన్న విషయాన్ని విశదీకరించడం జరిగింది. ఉదాహరణకు భూమ్యాకాశాలను సృష్టించడం, రాత్రింబవలు పరిభ్రమించడం, భారీ ఓడలు సముద్రాన్ని చీల్చుతూ ప్రయాణించడం ఇవన్నీ మానవుని ప్రయోజనం కొరకే, ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించడం, బీడువారిన భూములు చిగురించేలా చేయడం ఇవన్నీ మానవుని ప్రయోజనం కొరకే అని తెలుపడం జరిగింది. భూమిపై ఉన్న వివిధ జంతువులు, గాలులు, మేఘాలు, భూమ్యాకాశాల మధ్య తేలియాడే మబ్బులు వీటన్నింటిని పరిశీలించాలని ప్రోత్సహించడం జరిగింది. వర్షం గురించిన ప్రస్తావన పరిశీలించదగ్గది. ఆకాశం నుంచి కురిసే వర్షం మృతప్రాయంగా ఉన్న నేలలో మళ్ళీ ప్రాణం పోసి జీవించేలా, ఆకుపచ్చగా కళకళలాడేలా చేస్తుంది. అదే విధంగా మరణించిన వారిని మళ్ళీ జీవింపచేసే శక్తిసామర్థ్యాలు దేవునికి ఉన్నాయని పోల్చిచెప్పడం జరిగింది. ఈ సూరాలో గతించిన జాతుల ప్రస్తావనలు ఉన్నాయి. ప్లేగు వ్యాధి కారణంగా చావుకు



భయపడి తమ ఇళ్ళు వాకిళ్ళు వదిలి పారిపోయిన జాతి గురించిన కథనం ఉంది. వారు వేలాదిమంది. తమ ప్రదేశాన్ని వదిలి పారిపోతే చావును తప్పించుకోవచ్చని భావించారు. తమ విధిని తామే నిర్ణయించుకోగలమని అనుకున్నారు. మనిషి తన చావు బతుకుల నిర్ణయాన్ని తాను చేయలేడన్న విషయాన్ని ఈ కథనం స్పష్టం చేస్తుంది.

ఈ సూరాలో "ఖిబ్లా" గురించిన పరిచయం కూడా ఉంది. ఖిబ్లా అంటే నమాజు సందర్భంగా అభిముఖంగా నిలబడే స్థలం. అంటే మక్కా నగరంలోని కాబాగృహం. నమాజు సమయంలో మక్కాలోని కాబా గృహానికి అభిముఖంగా నిలబడి నమాజు చేయాలి.

ప్రజలు రహస్యంగాను, బహిరంగంగాను, రాత్రింబవలు దానధర్మాలు చేయాలనీ, ఆపై దేవుని ప్రార్థించాలని ఈ సూరా ప్రబోధిస్తుంది. "ఓ ప్రభూ! మేము మరపు వల్ల కాని పొరబాటు వల్ల కాని చేసిన పనులకు లెక్క తీసుకోకు, మా కన్నా ముందు గతించిన జాతులపై వేసిన మాదిరి భారం మామీద వేయకు, ఓ ప్రభూ! మేము మోయలేని భారం మా మీద వేయవద్దు, మమ్మల్ని మన్నించు, మమ్మల్ని క్షమించు, మా మీద దయచూపు. నీవే మాకు రక్షకుడవు. అవిశ్వాసులకు (సత్యాన్ని కప్పి పుచ్చేవారికి) వ్యతిరేకంగా మాకు సహాయం చేయి" అని ప్రార్థిస్తూ ఉండాలని బోధిస్తుంది.

ఆ కాలంలో మదీనాలో కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ రాజ్యానికి అత్యవసరమైన ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు ఈ సూరాలో ఉన్నాయి. ఇవి నేటికి కూడా ముస్లిమ్ సముదాయానికి ఎంతయినా ముఖ్యమైనవి. ప్రజల సామాజిక జీవనానికి సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాల గురించి ఆదేశాలు, వివరణలు ఈ సూరాలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ సూరా కుటుంబ వ్యవహారాలను విశదీకరించింది. కుటుంబం అన్నది ఒక సత్సమాజానికి పునాది రాయిగా ఈ సూరా పరిగణించింది. సామాజిక నియమనిబంధనలు, హజ్‌యాత్రకు సంబంధించిన వివరాలు, హజ్‌యాత్రలో పాటించవలసిన విధులు, ఆచరణలు, హజ్ మాసంలో కాక ఇతర

మాసాల్లో చేసే ఉమ్రాయాత్ర, అందులో పాటించవలసిన విధులు, ఆచరణలు, హత్యానేరాలకు సంబంధించి ప్రతీకారన్యాయం గురించిన విషయాలు, మరణ సమయం ఆసన్నమైన వ్యక్తి వీలునామా రాయడానికి సంబంధించిన వివరణలు, ఉపవాసవ్రతం (రమజాన్ రోజాలు), దేవుని మార్గంలో పోరాడడం, దేవునికి భాగస్వాములను, సహవర్తులను నిలబెట్టే స్త్రీలతో వివాహం చేసుకోవడానికి సంబంధించిన నిషేధం, వడ్డీ నిషేధం, రుణానికి సంబంధించిన ఒప్పందాలను సాక్షుల ముందు రాసుకోవడం గురించిన బోధనలు, కుటుంబానికి సంబంధించిన విషయాలు ఇవన్నీ ఇందులో ఉన్నాయి. వ్యాపార వాణిజ్యాలను ప్రోత్సహించడం జరిగింది. అయితే ఇతరుల నుంచి వడ్డీ తీసుకోవడం, లేదా ఇతరులకు వడ్డీకి రుణం ఇవ్వడంతో పాటు వడ్డీకి సంబంధించిన సమస్త రూపాలను నిషేధించడం జరిగింది. వడ్డీని తక్షణం మానుకోవాలని నొక్కిచెప్పడం జరిగింది.

కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన అనేక అంశాలు ఈ సూరాలో ఉన్నాయి. భార్యకు ఆర్థికంగాను, మానసికంగాను భర్త తోడుగా ఉండాలని పేర్కొంది. భార్యాభర్తల మధ్య లైంగిక సంబంధాన్ని గురించి బోధనలు ఉన్నాయి. భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు భర్త ఆమెకు దూరంగా ఉండాలని, విడాకులకు సంబంధించి – విడాకుల తర్వాత భార్యాభర్తలు మంచితనంతో, పరస్పర గౌరవాదరాలను పాటిస్తూ విడి పోవాలని, విడాకులు పొందిన స్త్రీ మూడు రుతుస్రావాల కాలం పాటు పునర్వివాహం చేసుకోకుండా ఆగాలని బోధించడం జరిగింది. పిల్లలకు పాలు పట్టడానికి సంబంధించి విడాకుల తర్వాత తల్లికి ఇష్టమైతే గరిష్ఠంగా రెండు సంవత్సరాల వరకు పాలుపట్టాలని చెప్పడం జరిగింది. భర్త మరణిస్తే వితంతువైన స్త్రీ భర్త మరణం తర్వాత, గతించిన భర్త వల్ల గర్భం లేదన్న విషయం నిర్ధారణ కావడానికి నాలుగుమాసాల పదిరోజుల పాటు వేచి ఉండాలని బోధించడం జరిగింది.

## ముఖ్యాంశాలు

### 1. తౌహీద్ (ఏకదైవారాధన) :

అల్లాహ్ ఒక్కడే అని, ఆయన అపార కృపాశీలుడు, పరమ దయామయుడని విశ్వసించడం.



### 2. మార్గదర్శకత్వం :

అల్లాహ్ మార్గదర్శకత్వమే నిజమైన మార్గదర్శకత్వం. దానికే మనం కట్టుబడి ఉండాలి. అల్లాహ్ ఆదేశించిన సుగుణాలను మనలో పెంపొందించుకోవాలి. అవిశ్వాసుల, దేవునికి భాగస్వాములను కల్పించే బహుదైవారాధకుల మనోకాంక్షలకు దూరంగా ఉండాలి. వాటిని అనుసరించకూడదు.

### 3. కపట విశ్వాసం :

కపటవిశ్వాసం అవినీతికి, అన్యాయానికి, సాంఘిక పతనానికి దారితీస్తుంది. కపట విశ్వాసం ఒక చెడు. ఈ చెడు సమాజాన్ని తీవ్రంగా నష్టపరిచే రుగ్మత.

### 4. అల్లాహ్ వైపునకు మరలడం :

అంటే మనిషి మరణించిన తర్వాత మళ్ళీ బ్రతకడం. అల్లాహ్ భూమ్యాకాశాల సృష్టికర్త, భూమ్యాకాశాల మధ్య ఉన్న సమస్తాన్ని సృష్టించినది అల్లాహ్. మానవాళి మరణం తర్వాత మళ్ళీ లేపబడి అల్లాహ్ వైపునకు మరలిపోవలసి ఉంటుంది.

### 5. మనిషి హోదా:

అల్లాహ్ దూతలను ఆదం(అస) ముందు సాష్టాంగపడమని ఆదేశించాడు. దీనిని బట్టి అల్లాహ్ దృష్టిలో మనిషికి ఎంత ఉన్నత స్థానం ఉందో అర్థం అవుతుంది. అల్లాహ్ మనిషికి ప్రత్యేకమైన హోదా గౌరవాలు ప్రసాదించాడు. భూమిపై మనిషి దేవునికి ప్రతినిధి.

### 6. మరపునకు గురయిన మనిషి :

నిషేధించిన చెట్టు దరిదాపులకు వెళ్ళ వద్దని అల్లాహ్ ఆదం (అస)ను హెచ్చరించాడు. శత్రువైన షైతాన్ మాట వినవద్దని చెప్పాడు. కాని, ఆదం(అస) దురదృష్టవశాత్తు షైతాన్ ప్రలోభాలకు గురయి నిషేధించబడిన చెట్టు ఫలాన్ని తిన్నారు. ఫలితంగా ఆయన స్వర్గ వనాల నుంచి తొలగించబడ్డారు. ఈ బహిష్కారం అన్నది ఆదం(అస) చేసిన పని వల్ల వాటిల్లినదని అర్థం అవుతుంది. మనిషి మరపునకు గురయి షైతాన్ మాటల మాయలో పడిపోతాడు. ఫలితంగా సమస్యల ఊబిలో చిక్కుకుంటాడు.

**7. క్షమాగుణం :**

ఆదం (అస) అల్లాహ్ ఆదేశాలను అతిక్రమించి, షైతాన్ మాట విన్నందుకు స్వర్గ వనం నుంచి తొలగించబడినప్పటికీ ఆయన్ను అల్లాహ్ క్షమించాడు.

**8. నైతిక ప్రమాణాలు :**

తల్లిదండ్రులను, సమీప బంధువులను, అనాథలను, అవసరార్థులను దయతో చూడాలి. ప్రజలతో మృదువుగా మాట్లాడాలి. దయతో వ్యవహరించాలి. క్షమాగుణాన్ని కలిగి ఉండాలి. ఇతరుల లోపాలను ఉపేక్షించాలి. జకాత్ (విధి దానం) చెల్లించాలి. (ప్రతి సంవత్సరం ముస్లిములు తప్పనిసరిగా తమ సంపదలో నిర్దిష్టభాగాన్ని బీదలకు చెల్లించి తన సంపదను పరిశుద్ధపరచుకోవాలి. దీనినే జకాత్ అంటారు. నిర్దిష్ట సంపద ఉన్న ప్రతి ముస్లిం ఈ జకాత్ చెల్లించడం తప్పనిసరి. జకాత్ వ్యక్తిగతంగా చెల్లించడం జరగవచ్చు లేదా సామూహికంగా ఒక జకాత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుని జకాత్ మొత్తాలను సేకరించి బీదలకు పంపిణీ చేయడం, నిర్దిష్ట పద్దులలో ఖర్చు పెట్టడం చేయవచ్చు.) తల్లిదండ్రులు, సమీప బంధువులు, అనాథలు, అవసరార్థులు, బాటసారుల కొరకు ఖర్చుచేయాలి. నమాజును స్థాపించాలి. అల్లాహ్ కోసం ధారాళంగా ఖర్చుచేయాలి. సత్యాన్ని ఎన్నటికి దాచి ఉంచరాదు. సహనాన్ని కలిగి ఉండాలి. అల్లాహ్ పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలి. ఆయన పట్ల విశ్వాసం కలిగి ఉండాలి. అల్లాహ్ పట్ల విశ్వాసాన్ని కోల్పోవడం కాని, దేవునికి సహవర్తులను, లేదా భాగస్వాములను నిలబెట్టడం కాని చేయరాదు. ఒకరు మరొకరి ఆస్తులను కబళించరాదు. అధికారులకు లంచాలు ఇవ్వరాదు. అన్యాయంగా ఇతరుల ఆస్తులు కాజేయడానికి అవినీతిని వ్యాపింపచేయరాదు. శతృత్వాలను ప్రారంభించరాదు. సొంత వినాశానికి కారణమయ్యే పనులు చేయరాదు. సంపూర్ణంగా, పూర్తిగా శాంతిమార్గంలోకి (ఇస్లాం) ప్రవేశించాలి. మద్యపానాన్ని, జూదాన్ని పూర్తిగా విడిచిపెట్టాలి. స్త్రీలు రుతుకాలంలో ఉన్నప్పుడు వారితో లైంగిక సంబంధానికి దూరంగా ఉండాలి. విడాకులైతే, ఆ తర్వాత ఒకరి పట్ల ఒకరు మంచితనంతో వ్యవహరించాలి. మనిషి షైతాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. షైతాన్ చెడులను, లజ్జలేని, సిగ్గులేని పనులను ప్రోత్సహిస్తాడు. ప్రజలు అల్లాహ్ గురించి తమకు తెలియని విషయాలు చెప్పేటట్లు చేస్తాడు.



**9. మంత్రతంత్రాలు :**

మంత్రతంత్రాల విద్యలు చెడులు. ఈ చెడులు భార్యాభర్తలను విడదీస్తాయి.

**10. సహనం :**

సహనం మనిషిలో దీక్ష, పట్టుదలను పెంపొందిస్తుంది. సాఫల్యానికి తోడ్పడుతుంది.

**11. విధి :**

తగిన జాగ్రత్తలు తీసుకోవడం, అప్రమత్తంగా ఉండడం అవసరమే, అయితే, జాగ్రత్తలు తీసుకున్నంత మాత్రాన విధిని తప్పించలేము. తగిన ముందు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. దానితోపాటు, అల్లాహ్ పట్ల దృఢవిశ్వాసం కలిగి ఉండాలి. కాని, అల్లాహ్ ముందుగానే నిర్ణయించిన చెడును జాగ్రత్తలు తీసుకుని ఆపడం సాధ్యం కాదు.

**12. దానధర్మాలు :**

సంపదను అల్లాహ్ ప్రసన్నత పొందడానికి, అల్లాహ్ కోసం ఖర్చు చేయాలి. ఇతరులను సంతోషపెట్టడానికి కాదు.

**13. కృతజ్ఞతా భావం :**

మనిషి ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికి అల్లాహ్ ప్రసాదించిన అసంఖ్యాక అనుగ్రహాల పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలి.

**14. హత్యకు రక్తపరిహారం :**

హతుని కుటుంబ సభ్యులు నేరస్తునికి మరణశిక్ష విధించాలని కోరవచ్చు. అయితే హతుని కుటుంబ సభ్యులు నేరస్తుని క్షమించి, రక్తపరిహారాన్ని పుచ్చుకోవడానికి అంగీకరిస్తే మరణశిక్షను రద్దు చేసే అవకాశం ఉంది. దయాభావాన్ని ప్రోత్సహించ డానికి, సమాజంలో శాంతిసామరస్యాలు పెంపొందించడానికి ఇది తోడ్పడుతుంది.

**15. పశ్చాత్తాపం, ప్రార్థనలు :**

నిజమైన విశ్వాసి ఎల్లప్పుడు తౌబా (పశ్చాత్తాపం) చేస్తూ ఉండాలి. దేవుని మాత్రమే అర్థిస్తూ ఉండాలి. ఆయనకే మొరపెట్టుకోవాలి. దైవసాన్నిహిత్యాన్ని పొందడానికి ఇదే మార్గం.

## 3 వ అధ్యాయం

# ఆలి ఇమ్రాన్

# ఇమ్రాన్ కుటుంబం

### పరిచయం

దివ్యఖుర్ఆన్‌లో ఇది మూడవ సూరా. అయితే దివ్యఖుర్ఆన్ అవతరణ క్రమంలో మూడవ సూరాగా భావించరాదు. ఇది మదనీ సూరా, అంటే మదీనాలో అవతరించింది. ఇందులో మొత్తం 200 ఆయతులు ఉన్నాయి. ఈ సూరాలో తౌహీద్ (ఏక దైవారాధన), దివ్యఖుర్ఆన్ అవతరణల ధృవీకరణ, ప్రవక్తల పరంపర, కొన్ని ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు ప్రధానంగా ఉన్నాయి. ఈ సూరాకు, దీనికన్నా ముందున్న సూరా "ఆవు"తో సంబంధం ఉంది. అత్యంత ధర్మపరాయణత్వం కలిగిన ఇమ్రాన్ కుటుంబం, ప్రవక్త మూసా(అస), ప్రవక్త ఈసా(అస)లకు పూర్వీకుడైన ఇమ్రాన్ కుటుంబం పేరు ఈ సూరాకు పెట్టడం జరిగింది.

ఈ సూరా తౌహీద్(ఏక దైవారాధన)ను నొక్కి చెబుతూ ప్రారంభం అవుతుంది. దివ్య ఖుర్ఆన్ దేవుని తరఫున అవతరిస్తున్న దైవవాణి అని నొక్కి చెబుతూ, ఇంతకు ముందు అవతరించిన దివ్యగ్రంథాలు – తౌరాత్, ఇంజీల్‌లను ధృవీకరిస్తుంది. మనిషికి కావలసిన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. దేవుని చిహ్నాలను విశ్వసించక తిరస్కరించిన వారికి తీవ్రమైన శిక్ష తప్పదని హెచ్చరిస్తుంది. మునుపటి దివ్యగ్రంథాలు – తౌరాత్, ఇంజీల్‌ల మాదిరిగా కాకుండా దివ్యఖుర్ఆన్ ఒక సంపూర్ణమైన దివ్యవాణి అని ఈ సూరా తెలుపుతుంది. దివ్యఖుర్ఆన్‌లోని రెండవ సూరా ముఖ్యంగా యూదుల గురించి, ప్రవక్త మూసా(అస) గురించి ప్రస్తావించింది. కాగా, ఈ సూరా ముఖ్యంగా క్రయిస్తవుల గురించి, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించి ప్రస్తావించింది. మదీనాలోని క్రయిస్తవులు నజ్రాన్ తెగకు చెందిన వారు. ఈ క్రయిస్తవులు ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను కలుసుకుని ధర్మవిషయాల గురించి చర్చ జరిపారు. వారు దివ్యఖుర్ఆన్‌ను తిరస్కరించారు. మెస్సయ్య దేవుని కుమారుడని వాదించారు.



ఈ సూరాను రెండు ముఖ్యమైన భాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగంలో గ్రంథప్రజల గురించి (యూదులు, క్రయిస్తవులు) ముఖ్యంగా క్రయిస్తవుల గురించి ప్రస్తావన ఉంది. వారిని ప్రత్యేకంగా ఉద్దేశించి చెప్పడం జరిగింది, కొత్తగా అవతరిస్తున్న ఈ దైవవచనాలను స్వీకరించాలని, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఎవరినీ చేర్చరాదని చెప్పడం జరిగింది. రెండవ భాగంలో ఇస్లామీయ ధర్మసూత్రాలు, దైవాదేశాల ప్రస్తావన ఉంది. అల్లాహ్ మార్గంలో పోరాడడాన్ని ప్రోత్సహించడం జరిగింది. రెండు భాగాల్లోను నడవడిక గురించి సందర్భాన్ని బట్టి ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

దేవుడు ఒక్కడే అన్న ప్రస్తావన తరచూ వచ్చింది. తౌహీద్ (ఏకదైవారాధన)ను పరిచయం చేస్తూ, అనేక విధాలుగా నిరూపించడం జరిగింది. అల్లాహ్ ఏకత్వాన్ని నిరూపించడం ద్వారా, అల్లాహ్ విశ్వ సామ్రాజ్యానికి ప్రభువనీ, సమస్తాన్ని, ఈసా ప్రవక్త(అస)తో సహా అందరిని సృష్టించింది ఆయనేనని నొక్కి చెప్పడం జరిగింది. యావత్తు మానవాళిని సృష్టించింది ఆయనే. మనిషికి మాతృగర్భంలో ఆయన రూపురేఖలు ఇస్తాడు. ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయమేమంటే, మాతృగర్భంలో జీవితం ఎలాంటిదో మనకు తెలియనట్లే, పుట్టుక వెనుక ఉన్న రహస్యాలు మనకు తెలియనట్లే, ఈసా ప్రవక్త(అస) పుట్టుక కూడా మనిషి మేధకు అందని విషయం.

అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరూ లేరని సూరా నొక్కి చెప్పింది. ఆయన మనిషికి ఎన్నిక చేసిన సత్యధర్మం ఇస్లాం మాత్రమేనని ఉద్బోధించింది. (ఇస్లాం అంటే దైవానికి స్వయం సమర్పణ, దైవవిధేయత, శాంతి అన్న అర్థాలు ఉన్నాయి.) ఈ సత్యాన్ని నిరాకరిస్తున్న గ్రంథప్రజలకు, విగ్రహారాధకులకు అల్లాహ్‌కు

విధేయులు అవ్వమని, అల్లాహ్‌కు అంకితమై, ఇస్లాం స్వీకరించమని సలహా ఇవ్వాలి. దానికి వారు అభ్యంతరం చెబితే అది వారి నిర్ణయం. సందేశం వారికి చేరవేయడం జరిగిపోయింది. అల్లాహ్ తన దాసులను గమనిస్తున్నాడు.

ఇస్రాయిల్ సంతతి గురించి ప్రస్తావిస్తూ, అల్లాహ్ చిహ్నాలను విశ్వసించడానికి నిరాకరించే వారిగా వర్ణించడం జరిగింది. గత కాలానికి చెందిన 43 మంది ప్రవక్తలను హతమార్చిన జాతిగా, 170 మంది సదాచార సంపన్నులను చంపిన వారిగా పేర్కొంది. యూదులను, క్రయిస్తవులను ఉద్దేశించి, వారికి దివ్యగ్రంథాలను ప్రసాదించడం జరిగిందని, కాని వారు ఆ గ్రంథాలకు కట్టుబడలేదని విమర్శించడం జరిగింది. వారి గ్రంథాలలో ప్రవక్త ముహమ్మద్ (సఅస) గురించిన ప్రస్తావన ఉందని, కాబట్టి గ్రంథప్రజలు ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను విశ్వసించాలని చెప్పడం జరిగింది. ఈ సూరాలో అనేక ఆయతులు అల్లాహ్ ఒక్కడే అని నొక్కి చెప్పాయి. అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి, ఇస్లామీయ విశ్వాసాల గురించి గట్టిగా అనేక సార్లు చెప్పడం జరిగింది. ఆయన తాను తలచిన వారికి అధికారం ఇస్తాడని, తాను కోరిన వారి నుంచి అధికారం లాక్కుంటాడని వివరించడం జరిగింది. ఆయన తాను తలచిన వారికి గౌరవమర్యాదలు కట్టబెడతాడని, తాను తలచిన వారిని పరాభవం పాలు చేస్తాడని, ఆయన రాత్రిని చిన్నదిగా, పగలును పెద్దదిగా చేయగల శక్తిసంపన్నుడని, నిర్జీవి నుంచి జీవిని, జీవి నుంచి నిర్జీవిని తీయగల సమర్థుడని, తాను తలచిన వారికి లెక్కలేనంత ఉపాధిని అందించే సామర్థ్యం కలిగిన వాడని వివరించడం జరిగింది.

ఆదమ్, నూహ్, ఇబ్రాహీమ్ కుటుంబం, ఇమ్రాన్ కుటుంబాలకు (వారందరిపై శాంతి కురియుగాక) మిగిలిన వారందరిపై అల్లాహ్ ప్రాధాన్యత ఇచ్చాడని తెలియ జేయడం జరిగింది. అంటే మెస్సయ్య స్వయంగా అల్లాహ్ కాదని, అల్లాహ్ కుమారుడు కూడా కాదని, కేవలం మామూలు మనిషి మాత్రమేననీ, ఒక ప్రవక్త మాత్రమేనని పరోక్షంగా చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా అనేక చారిత్రక సంఘటనలను ప్రస్తావించడం జరిగింది. ఇవి వివాదాస్పద విషయాలకు సంబంధించిన



సంఘటనలు. ఇమ్రాన్ భార్య గర్భం ధరించింది.. ఎంపిక కాబడిన మహిళ మర్యం (మేరీ మాత)కు జన్మనిచ్చింది. మర్యం అద్భుతమైన శిశువు ఈసాకు జన్మనిచ్చింది. జకరియాకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆ కుమారుడి పేరు యహ్యా. (యహ్యా తల్లి మర్యంకు వరుసకు సోదరి అవుతుంది). యహ్యా కూడా అద్భుతమైన శిశువు. జకరియా తానూ, తన భార్య చాలా ముసలివారమై పోయామనీ, తమకు ఇక పిల్లలు పుట్టరని భావించాడు. కాని జకరియా భార్య గర్భం దాల్చేలా అల్లాహ్ అనుగ్రహించాడు. ఆమెకు యహ్యా జన్మించేలా చేసాడు. అల్లాహ్ ఏదైనా చేయగలడని నిరూపించే ప్రస్తావన ఇది. అదేవిధంగా, దేవుని వాక్కు వల్ల మర్యం ఒక అద్భుత సంఘటనగా ఈసా(అస) ప్రవక్తకు జన్మనిచ్చారు. పురుష స్పర్శ ఎరుగకుండానే ఆమె ఈసాకు జన్మనిచ్చారు.

ఈసా ప్రవక్త(అస) పసితనంలోను, యుక్తవయస్సులోను మంచిని బోధించే బోధకుడని, ఆయన ఇస్రాయిల్ సంతతికి సందేశాన్ని అందజేసే సందేశహరునిగా అవతరించారని ఈ సూరా వివరించింది. ఆయన అనేక నిదర్శనాలను చూపించారు. అంటే అల్లాహ్ ఆయనకు అనేక నిదర్శనాలను ఇచ్చి పంపాడు. ఆయన మట్టి నుంచి పక్షిని తయారు చేస్తే అది సజీవమైన పక్షిగా మారింది. గుడ్డివారిని, కుష్టువారిని ఆయన బాగు చేసారు. అల్లాహ్ అనుమతితో మృతులను బతికించారు. ఆయనకు అల్లాహ్ రాతను నేర్పాడు. ప్రవక్త పదవికి అవసరమైన బుద్ధివివేకాలు, తౌరాత్ ఇంజీల్ గ్రంధాలు ప్రసాదించాడు.

ఇస్రాయిల్ సంతతికి ఈసాప్రవక్త (అస) అందించిన సందేశం స్పష్టమైనది. అల్లాహ్ తనకు, ప్రజలందరికీ ప్రభువని ఆయన చెప్పారు. ఈసాప్రవక్త (అస) శిష్యులు ఆయన బోధనలను విశ్వసించారు. ఆయన సందేశానికి మద్దతు ఇచ్చారు. తాము ముస్లిములుగా (విధేయత చూపినవారిగా) ప్రకటించారు. కాని ఇస్రాయిల్ సంతతి ప్రజలు ఈసాప్రవక్త (అస)ను తిరస్కరించారు. ఆయన్ను హత్యచేయడానికి కుట్రలు పన్నారు. యూదుల కుట్రల గురించి తెలిసిన అల్లాహ్ ఆయన్ను పైకి పిలిపించుకున్నాడు. మరోసారి ఈ సందర్భంగా మనకు ఈ సూరాలో ఆదమ్ (అస), ఈసా(అస)ల సృష్టి గురించి గుర్తు చేయడం జరిగింది. ఈసాప్రవక్త (అస) సృష్టి ఆదమ్ (అస) సృష్టితో పోలదగినది. ఆదమ్ (అస)ను దేవుడు తల్లితండ్రి

ఇద్దరూ లేకుండా సృష్టించాడు. ఈసా(అస)ను దేవుడు తండ్రి లేకుండా పుట్టించాడు. ఈసా (అస) ప్రవక్త అల్లాహ్ సృష్టించిన మానవ మాత్రుడు తప్ప అంతకు మించి కాదని ఈ ఆయతులు స్పష్టం చేస్తున్నాయి. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరూ లేరని ఈ విధంగా స్పష్టం చేయడం జరిగింది.

ఈ సూరా గ్రంధప్రజలను ఉద్దేశించి ఉమ్మడి విషయాల ఆధారంగా మూడు వర్గాలు (యూద, క్రయిస్తవ, ముస్లిం) కలిసి ఉండాలని చెప్పింది. ఒకే దేవుడు అల్లాహ్‌ని ఆరాధించడం, అల్లాహ్‌కు భాగస్వాములను చేర్చకుండా ఉండడం, అల్లాహ్‌కు బదులుగా తోటి మానవులను ప్రభువులుగా, సంరక్షకులుగా భావించకుండా ఉండడం ఈ ఉమ్మడి విషయాలు. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) యూదుడు కాదని, క్రయిస్తవుడు కూడా కాదని, అల్లాహ్‌కు తనను తాను అర్పించుకున్న ముస్లిం అని ఈ సూరా తెలియజేసింది. ఆయన అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికి, మరి దేనికి దైవత్వాన్ని ఆపాదించలేదని తెలిపింది. గ్రంధప్రజలను ఉద్దేశించి ఈ సూరాలో చెప్పబడిన మరికొన్ని ముఖ్య విషయాలేమంటే :

1. అల్లాహ్ సందేశంలోని సత్యాన్ని తిరస్కరించరాదు. తాము సాక్ష్యంగా ఉన్న అల్లాహ్ చిహ్నాలను నిరాకరించరాదు.
2. తమకు బాగా తెలిసిన సత్యాలను దాచి ఉంచరాదు.
3. సత్యాన్ని అసత్యాలతో నాశనం చేయరాదు.
4. అల్లాహ్ గురించి అబద్ధాలు చెప్పరాదు.
5. అల్లాహ్ ఒక్కడే అని విశ్వసించాలి.
6. దేవుడు అవతరింపజేసిన గత దైవగ్రంధాలను, ఇప్పటి దైవగ్రంధాన్ని (దివ్య ఖుర్ఆన్‌ను) విశ్వసించాలి.
7. ప్రవక్తల మధ్య వివక్ష, విభేదాలు చూపరాదు.
8. మనిషి అల్లాహ్‌కు తన్ను తాను సమర్పించుకోవాలి (ముస్లింగా).
9. ప్రస్తుత దివ్యవాణిని (దివ్యఖుర్ఆన్‌ను) విశ్వసిస్తున్న వారి మార్గంలో అడ్డంకిగా నిలబడరాదు.



ఈ అప్పీలు తర్వాత గ్రంధప్రజలను (తౌరాత్, ఇంజీల్ గ్రంధాలను విశ్వసించే ప్రజలను) హెచ్చరిస్తూ, సత్యాన్ని తిరస్కరిస్తే తీర్పు దినాన వారు భయంకరమైన శిక్ష రుచి చూడవలసి ఉంటుందని, నరకంలో శాశ్వతంగా పడి ఉండవలసి ఉంటుందని చెప్పడం జరిగింది. విశ్వాసులకు మంచి ప్రతిఫలం లభిస్తుందని, వారు దేవుని కృపాఛాయలో శాశ్వతంగా ఉంటారని చెప్పడం జరిగింది.

మానవాళి కోసం ఉనికిలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజంగా ముస్లిములను ఈ సూరాలో అభివర్ణించడం జరిగింది. మంచి వైపునకు పిలిచే, చెడు నుంచి నిరోధించే సమాజంగా ఏర్పడాలని ముస్లిములను ప్రోత్సహించింది. ఈ సూరాలో ముస్లిములు నైతిక స్థైర్యాన్ని పెంపొందించే వాక్యాలు ఉన్నాయి. అవిశ్వాసులు ఎన్నటికీ ముస్లిములకు నష్టం కలిగించలేరని, పరాభవం, అవమానం, దైన్యం, దైవాగ్రహం, పతనాలు వారికి తప్పవని తెలియజేసింది. ముస్లిములు కష్టకాలంలో సహనం వహిస్తే, అల్లాహ్‌ను నమ్ముకుంటే అవిశ్వాసుల కుట్రలు వమ్మవుతాయని భరోసా ఇచ్చింది. ఆ సూరా ముస్లిములకు క్రింది బోధనలు చేసింది:

1. యూదులు, క్రయిస్తవులు, కపట విశ్వాసులకు బదులు ముస్లిములు ముస్లిములనే సన్నిహితులుగా చేసుకోవాలి. ఎందుకంటే వాళ్ళు నిరంతరం ముస్లిములను చెడగొట్టాలని, వారిని నాశనం చేయాలని చూస్తూ ఉంటారు.
2. దేవునికి భయపడాలి.
3. షైతాన్ బెదిరింపులకు లొంగిపోరాదు
4. వడ్డీని మానుకోవాలి.
5. పిసినారితనం వదులుకోవాలి.
6. అల్లాహ్ కోసం ఖర్చు చేయాలి.
7. అల్లాహ్‌పై మాత్రమే ఆధారపడాలి.
8. సహనం వహించాలి. సదాచరణలకు కట్టుబడాలి.
9. నిరాశ నిస్పృహలకు గురికారాదు.

ముస్లిములను మానసికంగా యుద్ధానికి సిద్ధం చేయడానికి ఈ సూరా రెండు విషయాలను ప్రధానంగా ప్రస్తావించింది. అవి – మృత్యువు, విజయం. ఈ రెండు ముస్లిముల విశ్వాసంలో చాలా ముఖ్యమైనవి. మృత్యువు తప్పదు. ప్రతి జీవి మరణించడం తథ్యం. చివరకు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా ఇహలోకాన్ని వదలిపోవలసిందే. కాని ఆయన మరణం ముస్లిములను నిరాశకు గురిచేయరాదు, వారిని యుద్ధరంగం నుంచి వెనుదిరిగేలా చేయరాదు. వారిని తిరిగి పాత విశ్వాసం వైపునకు మరలిపోయేలా చేయరాదు. ఎవరు ఎప్పుడు మరణిస్తారో ఎవరూ చెప్పలేరు. మృత్యువు గురించి తెలిసినది ఒక్క అల్లాహ్‌కు మాత్రమే. అల్లాహ్ అనుమతి లేనిదే ఎవరూ మరణించలేరు. అందువల్ల చావు భయం వల్ల వెనుకడుగు వేయనవసరం లేదు. మనిషి యుద్ధాల్లో పాల్గొని కూడా సజీవంగా ఉండగలడు. ఎందుకంటే మనిషి జీవితకాలాన్ని అల్లాహ్ ముందుగానే నిర్ణయించాడు. మనిషి ఇంటిలో ఉన్నప్పటికీ సమయం ఆసన్నమైతే మరణిస్తాడు. అందువల్ల ఇంటిపట్టున ఉంటే మనిషి చావకుండా ఉండేవాడని, చంపబడేవాడు కాదని చెప్పడం ఎంతమాత్రం సరయినది కాదు అని ఈ సూరా వివరిస్తూ మనిషికి చావు బతుకులను ప్రసాదించేది దేవుడు ఒక్కడే అని నొక్కి చెబుతుంది.

ఈ సూరా విజయాన్ని అల్లాహ్ తరఫున కానుకగా వర్ణించింది. సదాచరణ లకు, సహనానికి, స్థిరచిత్తానికి, చావుకు భయపడని తత్వానికి కానుకగా విజయం ప్రసాదించబడింది. యుద్ధరంగంలో సంఖ్యాబలం వల్ల విజయాలు లభించవు. సహనం, దేవుని పట్ల భయభక్తులు విజయాన్ని సాధిస్తాయి. యుద్ధసామగ్రి లేదా అంగబలం వల్ల లేదా అవిశ్వాసులపై ఆధారపడడం వల్ల కాదు, అల్లాహ్ వల్ల విజయం ప్రాప్తిస్తుంది. ఆయనే గొప్పగా సహాయపడేవాడు. ఈ సూరాలో బద్ర్ యుద్ధాన్ని అందుకు ఉదాహరణగా చూపించడం జరిగింది. ఈ యుద్ధంలో ముస్లిములకు విజయం లభించింది. ముస్లిములు అల్లాహ్ పట్ల చూపించిన భయభక్తులకు, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆదేశాలు పాటించినందుకు, ప్రాపంచిక సుఖభోగాలను త్యజించినందుకు లభించిన విజయంగా చెప్పడం జరిగింది. వారు పరలోకంలో సాఫల్యాన్ని పొందడానికి గాను అల్లాహ్ ప్రసన్నతను, దైవప్రవక్త



ముహమ్మద్ (సఅసం) ప్రసన్నతను సాధించడానికి పోరాడారు. అయితే ఉహుద్ యుద్ధంలో (హి.శ.3లో అంటే క్రీ.శ 625) ముస్లిములు అనేక కారణాల వల్ల ఓడిపోయారని తెలియజేసింది.

1. యుద్ధరంగంలో తమ తమ స్థానాలను విడిచిపెట్టడం వల్ల. వారు తమకు ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇచ్చిన ఆదేశాలను పాటించలేదు.
2. కొందరు కపటవిశ్వాసంతో వ్యవహరించారు.
3. కొందరి విశ్వాసం ... అవిశ్వాసానికి దగ్గరయ్యే స్థాయిలో ఉండింది. (అంటే చాలా బలహీనపడిపోయింది)
4. కొందరు చావుకు భయపడి పిరికిగా వ్యవహరించారు.

సదాచారులకు ఉండవలసిన గుణగణాలను కూడా ఈ సూరా పేర్కొంది.

1. వారు అవసరార్థులకు, లేమిలో ఉన్నవారికి సహాయం చేస్తారు.
2. తమ కోపాన్ని అణచుకుంటారు.
3. ఇతరులను క్షమిస్తారు.
4. దేవుని స్మరిస్తారు. తమ పొరబాట్లకు, సిగ్గుపడే చేష్టలకు గాను అల్లాహ్‌ను క్షమాభిక్ష అర్థిస్తారు.
5. చేసిన తప్పులకు పాశ్చాత్తాపపడతారు. తెలిసి తప్పులు చేయరు.

ఈ సూరా చివరన ప్రవక్త ముహమ్మద్ (స)కు ఊరట ఇస్తూ, గ్రంధప్రజలు దైవ సందేశాన్ని తిరస్కరించినప్పటికీ నిరాశ చెందనవసరం లేదని చెప్పడం జరిగింది. ఆయన కన్నా ముందు వచ్చిన అనేక మంది ప్రవక్తలు, తమతో పాటు బలమైన సాక్ష్యాధారాలను, మహత్యాలను, దైవవాక్యాలను, తౌరాత్, జబూర్, ఇంజీల్ గ్రంథా లను తీసుకుని వచ్చినప్పటికీ, వారిని కూడా తిరస్కరించడం జరిగిందని గుర్తుచేసింది. (తౌరాత్ గ్రంథం ప్రవక్త మూసా(అస)పై అవతరించింది. ఇంజీల్ గ్రంథం ప్రవక్త ఈసా(అస)పై అవతరించింది.)

ఈ సూరా రెండు ముఖ్యమైన విషయాలను నొక్కి చెబుతూ ముగుస్తుంది. అవి:

1. దేవుడు ఒక్కడే అన్న విషయం. భూమ్యాకాశాల సృష్టి, రాత్రింబవలు

ఒకదాని తర్వాత ఒకటి రావడం వంటి దృష్టాంతాలు దేవుడు ఒక్కడే అన్న వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నాయి.

2. సహనమే సాఫల్యానికి సాధనమని విశదీకరిస్తుంది.

**ముఖ్యాంశాలు :**

**నైతిక ప్రమాణాలు, నీతినియమాలు :**

ప్రాపంచిక జీవితానికి సంబంధించిన ఆకర్షణల గురించి సూరా హెచ్చరించింది. స్త్రీలు, సంతానం, బంగారం, పాడిపశువులు తదితర ఆకర్షణలలో పడిపోరాదని బోధించింది. కాగా, సదాచరణలకు కట్టుబడిన వారికి పరలోకంలో స్వర్గవనాలు లభిస్తాయని, సన్మార్గుల, సదాచార సంపన్నుల తోడు లభిస్తుందని శుభవార్త ఇచ్చింది. సదాచరణలకు కట్టుబడిన వారంటే – సహనం వహించిన వారు, జకాత్ చెల్లించేవారు, దానధర్మాలు చేసేవారు, నిష్ఠతో ఆరాధనలు చేసేవారు, క్షమాభిక్ష కొరకు ప్రార్థించేవారు, నరకశిక్ష నుంచి రక్షించమని మొరపెట్టుకునేవారు.

**సంతృప్తి :**

మనిషి తనకు లభించిన దానితో సంతృప్తి చెందాలి. మనం కోరినది మనకు ఎందుకు లభించలేదన్న విషయం కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఇమ్రాన్ భార్య తనకు కుమారుడు జన్మించాలని కోరుకుంది. కాని ఆమెకు మర్యం జన్మించింది. ఒక బాలిక బాలునితో సమానమైన విలువ కలిగి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే బాలుని కన్నా ఎక్కువ విలువ కలిగి ఉంటుంది. (ఉహుద్ యుద్ధ పరాజయం తదితర సంఘటనలు పరిశీలించగలరు.)

**అబద్ధాలు :**

అల్లాహ్ గురించి అబద్ధాలు చెప్పడం, ప్రజలతో అబద్ధాలు చెప్పడం మానుకోవాలి.

**సహనం :**

సాఫల్యానికి సాధనం సహనం.



**అల్లాహ్ వైపునకు మరలిపోవడం :**

మరణం తర్వాత మరలా బ్రతికించబడడం. ఈ సూరాలో తరచూ ఈ వాక్యం వచ్చింది. అందరూ అల్లాహ్ వైపునకే చివరకు వెళ్ళవలసి ఉంటుంది. వారి ధార్మిక విశ్వాసంలోని సత్యాసత్యాలను అల్లాహ్ అప్పుడు వారికి తెలియజేస్తాడు.

**అల్లాహ్‌కు ఎవరి అక్కరలేదు :**

అల్లాహ్‌ను విశ్వసించడం, సదాచరణలు చేయడమన్నది ప్రజల అవసరమని, అది వారికే ప్రయోజనకరమనీ గుర్తుచేయడం జరిగింది.

**కపట విశ్వాసం :**

కపటవిశ్వాసం కలిగి ఉండడం అన్నది స్వయం వినాశనానికి కారణమవుతుంది. ఉహుద్ యుద్ధంలో ఇదే జరిగింది.

**మృత్యువు :**

మృత్యువు అనివార్యం. ప్రతి ఒక్కరికి చావు తప్పదు. చావు బ్రతుకులనేవి అల్లాహ్ ముందే నిర్ణయించినవి. అందువల్ల మనిషి పిరికిగా వ్యవహరించరాదు.

**దయ చూపడం :**

అవసరార్థులకు సహాయం చేయాలి. పిసినారితనం చూపరాదు.

**విజయం :**

విజయం పొందాలంటే లేదా దేవుని సహాయ సహకారాలు ప్రాప్తం కావాలంటే ముందుగా కావలసినది అల్లాహ్ పట్ల భయభీతులు.

**ప్రజలతో వ్యవహారశైలి :**

ప్రజలతో కఠినంగా వ్యవహరించరాదు. మృదువుగా వ్యవహరించాలి. క్షమాభావం కలిగి ఉండాలి. వారి కోసం దేవుని క్షమాభిక్ష కోరాలి. అన్నింటి కన్నా ముఖ్యమైన విషయం వారిని సంప్రదిస్తూ ఉండాలి.

**4 వ అధ్యాయం**

# అన్ నిసా

# స్త్రీలు

**పరిచయం**

ఇది మదీనాలో అవతరించిన సూరా. అంటే మదనీ సూరా. దీనిలో 176 ఆయతులు ఉన్నాయి. ఈ ఆయతులు ముఖ్యంగా ఇస్లామీయ చట్టాలకు, మహిళల హక్కులకు, ఇతర సాంఘిక సమస్యలకు సంబంధించినవి. ఈ సూరాలో అనేక నైతికసూత్రాలు కూడా ప్రస్తావించబడ్డాయి. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి, ఉత్తమమైన మానవ సంబంధాలకు ఇవి ఎంతయినా అవసరమైనవి. ఈ సూరా ముఖ్యంగా స్త్రీల సమస్యలను ప్రస్తావించింది. స్త్రీల హక్కులు, వివాహానికి సంబంధించి వారి హక్కులు, కుటుంబంలో, వారసత్వపు ఆస్తిలో వారి హక్కులను ప్రస్తావించింది. అందువల్లనే ఈ సూరాకు "స్త్రీలు" అని పేరు పెట్టబడింది. ఈ సూరా ప్రారంభ వచనం అల్లాహ్ పట్ల భయభక్తులను ప్రస్తావించింది. ఈ ప్రస్తావన ద్వారా ఈ సూరాకు సంబంధించిన అసలు విషయాలకు కావలసిన నేపథ్యాన్ని ఇవ్వడం జరిగింది. అంటే ఇస్లామీయ చట్టాలకు సంబంధించిన సమాచారాన్ని అల్లాహ్ పట్ల భయం కలిగి ఉండాలన్న హెచ్చరికతో అందించడం జరిగింది. అల్లాహ్ పట్ల భయభక్తులు లేనిదే చట్టాన్ని పాటించడం అన్నది జరగదు. ప్రజలు దానికి కట్టుబడడం జరగదు. ధార్మిక విశ్వాసం, సాంఘిక వ్యవహారాలు పరస్పర సంబంధం కలిగి ఉన్నవన్న విషయాన్ని ఈ విధంగా స్పష్టం చేసింది. ప్రారంభ వచనంలో మానవాళి యావత్తు ఒకే తండ్రి ఆదం(అస) సంతానమని తెలియజేసింది. ఈ సూరాను రెండు విభాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగం ఇస్లామీయ శాసనాలకు సంబంధించినది. రెండవ విభాగం ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినది. ఈ రెండు విభాగాల్లోను మనిషి నడవడి గురించిన ఆదేశాలున్నాయి.



ఈ సూరా మనకు అనేక ఇస్లామీయ చట్టాల గురించి తెలిపింది. అవి :

1. అనాథలు : అనాథలను న్యాయంగా చూడాలి. వారి ఆస్తిపాస్తులను జాగ్రత్తగా సంరక్షించాలి. వారి సంరక్షకుడు తన ఆస్తిలో అనాథల ఆస్తిని కలుపుకోరాదు. వారి వస్తువులలోని మంచి వాటిని చెడ్డవాటితో మార్చివేయరాదు. వారు యుక్తవయస్సుకు చేరుకోగానే సాక్షుల సమక్షంలో వారి ఆస్తిని వారికి అప్పగించాలి. అనాథల ఆస్తిని దుర్వినియోగం చేయడం చాలా పెద్ద నేరమని ఈ సూరా హెచ్చరించింది.

2. బలహీన మనస్కులు : బలహీన మనస్కులకు (బుద్ధివివేకాల రీత్యా తగిన యోగ్యత లేని వారికి) వారి సంపదపై నియంత్రణ ఉండదు. కాబట్టి వారి సంపదను సంరక్షకుడు కాపాడాలి.

3. వైవాహిక చట్టాలు : ఈ చట్టాలు బహుభార్యత్వానికి సంబంధించినవి. పురుషుడు గరిష్టంగా నలుగురు స్త్రీలను పెళ్ళాడవచ్చు. అయితే వారి మధ్య న్యాయంగా వ్యవహరించడం కష్టమని భావిస్తే అప్పుడు ఒక్క స్త్రీనే వివాహం చేసుకోవాలి. స్త్రీకి పెళ్ళి సమయంలో స్త్రీ ధనాన్ని (మహర్‌ను) కానుకగా ఇచ్చివేయాలి. ఎవరైనా స్త్రీ పెళ్ళి సమయంలో అధిక మొత్తాన్ని స్త్రీధనంగా, కానుకగా పొందితే, ఆ తర్వాత విడాకులైతే, ఆమెకు ఇచ్చిన ధనాన్ని పురుషుడు వాపసు తీసుకోవడం న్యాయసమ్మతం కాదు. ఇస్లామీయ చట్టం ప్రకారం పురుషుడు తన తండ్రి వివాహం చేసుకున్న స్త్రీని వివాహమాడడం న్యాయసమ్మతం కాదు. వివాహానికి నిషిద్ధమైన స్త్రీలు – తల్లులు, కుమార్తెలు, సోదరీమణులు, మేనత్తలు, తల్లి సోదరీమణులు (పినతల్లులు), సోదరుల కుమార్తెలు, మేనకోడళ్ళు, పాలిచ్చిన తల్లులు, తనతో పాటు పాలు తాగిన సోదరీ మణులు, భార్యల తల్లులు, తన సంరక్షణలో పెరిగిన భార్యల కుమార్తెలు, కుమారుల భార్యలు, ఇంకా ఏక కాలంలో అక్కాచెల్లెళ్ళను ఇద్దరినీ భార్యలుగా చేసుకోవడం కూడా నిషిద్ధమే. వివాహమైన దంపతుల మధ్య సంబంధం చెడిపోతున్నదని భయం కలిగితే, భర్త తరఫు బంధువుల నుంచి ఒక మధ్యవర్తిని, భార్య తరఫు బంధువుల

నుంచి ఒక మధ్యవర్తిని నియమించాలి. వారిద్దరూ సంస్కరణ కోరితే అల్లాహ్ వారి మధ్య సమాధానం కుదరడానికి మార్గం చూపుతాడు.

4. వారసత్వ చట్టాలు : తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో పురుషులకు, స్త్రీలకు, కుమారులకు, కుమార్తెలకు వాటా ఉంది. అయితే, ఒక దగ్గరి బంధువు మరణించినప్పుడు – ఉదా: సోదరుడు సంతానం లేకుండా మరణిస్తే సోదరికి ఆస్తిలో వారసత్వం లభిస్తుంది. అలాగే సోదరి సంతానం లేకుండా మరణిస్తే సోదరుడు వారసుడవుతాడు.

5. పురుషుని పాత్ర : పురుషుడు తన భార్యల సంరక్షణ, పోషణ చూడాలి. స్త్రీలు తమ భర్తల ద్వారా సంరక్షణ, పోషణ పొందాలి.

ఈ సూరా గ్రంథ ప్రజలను ఉద్దేశించి కొన్ని ముఖ్యమైన విషయాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ధార్మిక విశ్వాసానికి సంబంధించి దేవునికి భాగ స్వాములను, సహవర్తులను నిలబెట్టడం గురించి, అల్లాహ్‌కు సంబంధించి అబద్ధాలు కల్పించడం గురించి ప్రస్తావిస్తూ, ఈ చేష్టలు దుర్మార్గమైన నేరాలని, క్షమించరాని పాపాలని హెచ్చరించింది. ఇందులో చెప్పబడిన మరొక ముఖ్యమైన విషయం – యూదులు దైవవచనాలను వాటి సందర్భం నుంచి తొలగించి, వాటికి ఇష్టం వచ్చిన తాత్పర్యం చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, మూసా ప్రవక్త (అస) పట్ల యూదుల వ్యవహారశైలిని, ఆయనకు వారు పెట్టిన ఇబ్బందులను వివరించడం జరిగింది. యూదులు మూసా ప్రవక్త (అస)ను తమకు దేవుడిని ప్రత్యక్షంగా చూపించమని అడిగారు. వారు ఆవుదూడను పూజించేవారు. నిషిద్ధమైన వడ్డీ తినేవారు. వాగ్దాన భంగానికి పాల్పడే వారు. అల్లాహ్ చిహ్నాలను విశ్వసించడానికి నిరాకరించేవారు. ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారు. కొందరు ప్రవక్తలను హతమార్చారు. మర్యంకు సంబంధించి భయంకరమైన అపవాదు సృష్టించారు. మర్యం కుమారుడు ఈసా ప్రవక్త (అస)ను తాము హతమార్చామని భావించారు. ఈ సూరా ప్రకారం తౌరాత్ గ్రంథంలో రాబోయే ప్రవక్త గురించిన వర్ణన పూర్తిగా ముహమ్మద్ (స)కు అన్వయించేదిగా స్పష్టంగా ఉంది. కాని యూదులు దానిని వక్రీకరించి తాత్పర్యం చెప్పుకున్నారు. ఈ కొత్త దివ్యవాణి ఖుర్ఆన్‌ను విశ్వసించాలని ఈ సూరా గ్రంథప్రజలకు అప్పీలు



చేసింది. తౌరాత్‌లోను, ఇంజీల్‌లోను ఉన్న వాటిని ఖుర్ఆన్ ధృవీకరిస్తోందనీ, దివ్యఖుర్ఆన్ దైవవాణి కానట్లయితే, వీటిలో అనేక వైరుధ్యాలు తప్పక కనబడేవని వారికి హితవు గరిపింది. ఈ సూరా దేవుడు ఒక్కడే అని గట్టిగా నొక్కి చెప్పింది. ఈసా ప్రవక్త (అస), దేవుని ప్రవక్త మాత్రమే అని, ఆయన మర్యం కుమారుడని, ఆయనను హత్య చేయడం కాని, ఆయనను శిలువ వేయడం కాని జరగలేదని, అల్లాహ్ అయన్ను తనవైపునకు పిలుచుకున్నాడని తెలిపింది. విశ్వాసులు ఒకే ఒక్క దేవుడు, అల్లాహ్‌ను, దైవదూతలను, గతకాలంలో అవతరించిన గ్రంథాలను, దైవప్రవక్తలను, తీర్పుదినాన్ని విశ్వసించాలని ప్రబోధించింది.

విశ్వాసులకు, అవిశ్వాసులకు ఎలాంటి ప్రతిఫలాలు లభిస్తాయన్న తేడాను స్పష్టంగా చూపించింది. విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి, వాటిలో కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అవిశ్వాసులు నరకాగ్నిలోకి విసిరివేయబడతారు. అవిశ్వాసులకు శిక్షించడం ద్వారా అల్లాహ్‌కు ఎలాంటి ప్రయోజనం లేదని, అల్లాహ్‌ను మాత్రమే విశ్వసించడం స్వయంగా మనిషికే ప్రయోజనకరమనీ, ఆయన్నే నిజాయితిగా ఆరాధించడం మనిషికే మంచిదని స్పష్టం చేసింది. అవిశ్వాసుల మధ్య పేరుప్రతిష్టలు పొందాలన్న కోరికతో విశ్వాసులు తోటి విశ్వాసులకు బదులు అవిశ్వాసులను మిత్రులుగా చేసుకోరాదని ఈ సూరా బోధించింది.

ఈ సూరా కపట విశ్వాసుల గురించి కూడా ప్రస్తావించింది. కపట విశ్వాసులు పైకి మాత్రం తాము ఇస్లాంను విశ్వసించామని అంటారు. కాని ఆచరణలో వారు ప్రవక్త ముహమ్మద్ (స) ఆదేశాలను ఏమాత్రం పాటించరు, పైగా అవిశ్వాసులు, బహు దైవారాధకులయిన ఎడారి అరబ్బు తెగలకు తమ సహాయసహకారాలు కొనసాగిస్తూ వచ్చారు. ముస్లిములను నిరాశ నిస్పృహలకు గురిచేసే పుకార్లు వ్యాపించేలా చేసేవారు. ఆ విధంగా ముస్లిములు అల్లాహ్ కోసం పోరాడడాన్ని మానుకునేలా చేయాలని తలచేవారు. ఈ కపట విశ్వాసులను మార్గం తప్పిన ప్రజలుగా, అల్లాహ్‌ను మోసగించడానికి ప్రయత్నిస్తున్న వారిగా, ఎవరికీ చెందని వారిగా, నమాజుకు నిలబడితే సోమరితనం ప్రదర్శించే వారిగా, ఇతరులకు చూపడానికి నమాజు చేసే వారిగా వర్ణించడం జరిగింది. ఇలాంటి వారికి పరలోకంలో బాధాకరమైన కఠినమైన శిక్ష తప్పదని హెచ్చరించింది.

ఈ సూరా ప్రస్తావించిన మరొక ముఖ్యమైన విషయం అల్లాహ్ మార్గంలో వలస పోవడం గురించినది. ప్రజలు అణచివేతలను, దౌర్జన్యాలను భరించరాని స్థాయిలో ఎదుర్కుంటున్నప్పుడు, వారు తమ ఇళ్ళు వదిలి వలస పోవాలని చెప్పడం జరిగింది. అల్లాహ్ కోసం కాందిశీకులుగా ఇతర ప్రాంతాలకు తరలి పోవాలని బోధించింది. అల్లాహ్ భూమి చాలా విశాలమైనదనీ, వారికి భద్రత లభించే ప్రశాంత ప్రదేశాలు చాలా ఉన్నాయని ప్రోత్సహించింది.

## ముఖ్యాంశాలు

**భార్య :**
భర్త తన భార్యను ప్రేమగా, దయగా, ఆదరాభిమానాలతో చూడాలి.

**వ్యభిచారం :**
ఎవరయినా స్త్రీ నడవడి గురించి, నైతిక ప్రవర్తన గురించి – ఆమె వివాహిత లేక అవివాహిత అయినా సరే – ఆరోపణలు వస్తే, అంటే ఆమె అక్రమ సంబంధాలు వగైరాల గురించి ఆరోపణలు వస్తే, ఆమె నేరాన్ని నిరూపించడానికి, శిక్ష విధించడానికి నలుగురు సాక్షులు అవసరం. (పురుషునికి సంబంధించి కూడా ఇలాంటి ఆదేశమే ఉంది.)

**స్త్రీ పురుష సమానత్వం :**
సదాచార సంపన్నులైన స్త్రీ పురుషులు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.

**దయాగుణం :**
మనిషి తన తల్లిదండ్రులు, సమీప బంధువులు, అనాధలు, పొరుగువారు, బాటసారులు, తన అధీనంలో ఉన్న వారి పట్ల దయాభావం కలిగి వ్యవహరించాలి.

**వివాదాలు :**
ఏవైనా వివాదాలు, అభిప్రాయ భేదాలు తలెత్తితే, వాటిని దివ్యఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) బోధనల వెలుగులో పరిష్కరించుకోవాలి.

**అల్లాహ్ కోసం పోరాడటం :**
మనిషి దేవుని కోసం పోరాడాలి. ప్రాపంచిక సుఖభోగాల మాయలో పడిపో



రాదు. అల్లాహ్ మార్గంలో తమ సంపదను, తమ ప్రాణాలను పణంగా పెట్టి కృషి చేసేవారికి దేవుడు గొప్ప కానుకలు ప్రసాదిస్తానన్నాడు. అలాంటి వారికి ఇతరుల కన్నా ఉన్నతమైన స్థానం లభిస్తుంది.

**వలసపోవడం :**
ముస్లిములు తమ ప్రాంతంలో అణచివేతలు, దౌర్జన్యాలు భరించరాని స్థాయిలో ఎదుర్కుంటున్నప్పుడు, వారు తమ ఇల్లువాకిళ్ళు వదిలి ఇతర ప్రాంతాల్లో శరణు పొందడానికి ప్రయత్నించాలి.

**మృత్యువు :**
మృత్యువుకు సంబంధించిన వాస్తవాన్ని నొక్కి చెప్పడం జరిగింది. ప్రతి ఒక్కరు చావుకు గురికాక తప్పదు. బలిష్టంగా నిర్మించిన కోటబురుజుల్లో దాగి ఉన్నప్పటికి చావు రాక మానదు.

**నైతిక విలువలు :**
మనిషి అతిశయాన్ని, అహాన్ని ప్రదర్శించరాదు. ప్రజలతో అబద్ధాలు చెప్పరాదు. అల్లాహ్ గురించి అసత్యాలు పలుకరాదు, అల్లాహ్‌కు భాగస్వాములు ఉన్నారని అసత్యాలు ప్రచారం చేయరాదు. ఈర్ష్యాసూయలకు దూరంగా ఉండాలి. ఆత్మహత్యకు పాల్పడరాదు. ఇతరులకు ఆర్థికంగా సహాయపడాలి. పిసినారితనం చూపరాదు. మితిమీరి ఖర్చు చేయరాదు. పొదుపుగా ఉండాలి. మూర్ఖంగా సంపదను వ్యర్థం చేయరాదు. ఇతరులకు చూపించాలన్న ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలు చేయరాదు. ఇతరులు అప్పగించిన వాటిని (అమానతులను) నిజాయితీగా వారికి తిరిగి వాపసు చేయాలి. న్యాయంగా తీర్పులు చెప్పాలి. మర్యాదగా, మృదువుగా వ్యవహరించాలి. ప్రజలకు సలాము చేయాలి. సలాముకు మరింత చక్కగా బదులు చెప్పాలి. పక్షపాతాలకు దూరంగా ఉండాలి. పుకార్లు వ్యాపింపచేయరాదు. అమాయకులపై అపవాదులు, అభాండాలు వేయరాదు. సాక్ష్యం చెబుతున్నప్పుడు నిజాయితీగా ఉండాలి. తనకు వ్యతిరేకమైనా, తన తల్లిదండ్రులు, తన సమీప బంధువులు, ధనవంతులు, నిరుపేదలు ఎవరికి వ్యతిరేకంగా అయినా సరే నిజాయితీగా సాక్ష్యం చెప్పాలి. బహిరంగంగా చెడు పలకడాన్ని మానుకోవాలి.

వడ్డీని వదులుకోవాలి. షైతాన్‌ను మిత్రునిగా చేసుకోరాదు. మంచి పనులకు సిఫారసు చేయాలి, సహాయ పడాలి. కపట విశ్వాసులకు దూరంగా ఉండాలి. అయితే వారికి హితబోధ చేయాలి, వారితో వివేకవిచక్షణలతో మాట్లాడాలి. అనాధలతో మృదువుగా, ప్రేమగా సానుభూతితో మాట్లాడాలి.

**5 వ అధ్యాయం**

# అల్ మాయిద

# భోజన బల్ల

## పరిచయం

ఇది మదీనాలో అవతరించిన సూరా. అంటే మదనీ సూరా. ఇందులో 120 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా మూడు విషయాలను నొక్కి చెబుతుంది. అవి : తౌహీద్ అంటే ఏకదైవారాధన, ఇస్లామీయ చట్టాలు, గ్రంధప్రజలు (అంటే తౌరాత్, ఇంజీల్ గ్రంధాలు పంపబడిన ప్రజలు – యూదులు, క్రయిస్తవులు). ముఖ్యంగా ఈ సూరా క్రయిస్తవులను ఉద్దేశించింది. ఈ సూరా పేరు, ఇందులోని 112వ ఆయతు వల్ల వచ్చింది. ఆ ఆయతులో ఈసా ప్రవక్త(అస) శిష్యులు ఆయన్ను ఆకాశం నుంచి ఆహారపదార్ధాలు వడ్డించిన భోజనబల్లను దించమని కోరతారు. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఆదం(అస) ఇద్దరు కూమారుల కధను కూడా ఈ సూరా ప్రస్తావిస్తుంది. వారి పేర్లు ఖాబీల్, హాబీల్. ఈ సూరా విశ్వాసులకు పందొమ్మిది ఇస్లామీయ నియమాలను పాటించాలని నొక్కి చెబుతుంది. అవి నైతిక బాధ్యతలకు, సాంఘిక కర్తవ్యాలకు సంబంధించిన ముఖ్యమైన నియమాలు. అవి :



1. ఒప్పందాలను నిర్వర్తించాలి (చేసిన వాగ్దానాలను నెరవేర్చాలి.)
2. పశుమాంసాన్ని, నిషిద్ధమైనవి తప్ప మిగిలిన వాటిని భుజించడం ధర్మ సమ్మతం.
3. సముద్ర ఆహారాన్ని భుజించడం ధర్మసమ్మతం.
4. హజ్‌యాత్ర కాలంలో ఉన్నప్పుడు వేటాడటం ధర్మసమ్మతం కాదు.
5. హజ్‌యాత్ర ముగిసిన తర్వాత వేటాడటం ధర్మసమ్మతం.
6. అల్లాహ్‌కు సంబంధించిన పవిత్రమైన చిహ్నాలను, హక్కులను అగౌరవ పరచడం,నిషిద్ధమాసాలను (హజ్‌మాసాలను) ధర్మసమ్మతం చేసుకోవడం, ఖుర్బానీ తీసుకువచ్చిన జంతువులను బాధించడం, దేవునికి అర్పించడానికి సూచనగా మెడలో పట్టీలు వేసిన జంతువుల్ని బాధించడం ధర్మసమ్మతం కాదు.
7. పవిత్ర గృహాన్ని (కాబాను) దర్శించడానికి వచ్చిన వారిని బాధించడం ధర్మసమ్మతం కాదు.
8. పవిత్ర మస్జిదులో ప్రవేశించే అనుమతి లభించకపోతే, ఆగ్రహంతో మితిమీరివ్యవహరించడం ధర్మసమ్మతం కాదు.
9. మరణించిన పశువుల మాంసం, రక్తం, పందిమాంసం, అల్లాహ్ పేరుతో కాక ఇతరుల పేరుతో కోయబడిన పశుమాంసం, ఊపిరాడక, దెబ్బలవల్ల మరణించిన పశువుల మాంసం, క్రూరజంతువుల దాడి వల్ల మరణించిన పశువుల మాంసం, క్రూరజంతువులు తిని వదిలేసిన జంతువుల మాంసం (అవి బతికి ఉండి జిబహ్ చేయడం జరిగితే తప్ప) విగ్రహాల ముందు బలివ్వబడిన పశువుల మాంసం నిషేధించబడ్డాయి.
10. పాచికల ద్వారా జాతకాన్ని, భవిష్యత్తును తెలుసుకోవడం, నిర్ణయాలు చేయడం కూడా నిషేధించబడింది.

11. వేటకు శిక్షణ ఇచ్చిన జంతువులు, పక్షుల ద్వారా పట్టుకున్న పశువుల మాంసం ధర్మసమ్మతమే.

12. గ్రంథప్రజల ఆహారం ధర్మసమ్మతం

13. పవిత్రులైన ముస్లిం, క్రయిస్తవ, యూదు స్త్రీలను వివాహమాడడం ధర్మ సమ్మతం.

14. మద్యం, జూదం, బాణాలు వేసి భవిష్యత్తు తెలుసుకోవడం లేదా నిర్ణయాలు తీసుకోవడం, విగ్రహారాధన నిషేధించబడ్డాయి.

ఈ సూరాలో చెప్పబడిన ఇతర ఇస్లామీయ నియమాలు పరిశుభ్రతకు సంబంధించినవి. ముఖ్యంగా నమాజు సందర్భంలో పాటించవలసిన పరిశుభ్రతకు సంబంధించినవి.

1. ముఖాన్ని, మోచేతుల వరకు చేతులను, మడమల వరకు కాళ్ళను కడగాలి. తలపై తడిచేతితో తుడవాలి.

2. (సంభోగం తర్వాత) స్నానం చేయవలసిన అపరిశుభ్రత ఉన్నప్పుడు స్నానం చేయాలి.

3. వ్యాధిగ్రస్థులై ఉంటే, ప్రయాణంలో ఉంటే, కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత లేదా సంభోగం తర్వాత నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన ఇసుకతో లేదా మట్టితో ముఖాన్ని, కాళ్ళు చేతులను రుద్దాలి (తయమ్ముమ్).

ఈ సూరా వీలునామాకు సంబంధించి, దొంగతనాలకు సంబంధించిన మరో రెండు ముఖ్యమైన శాసనాలను కూడా తెలిపింది.

1. మృత్యుముఖంలో ఉన్నప్పుడు సాక్షుల సమక్షంలో వీలునామా రాయించాలి.

2. దొంగతనానికి పాల్పడిన పురుషుడైనా, స్త్రీ అయినా చేతులు ఖండించాలి.

ఈ సూరా మూడు ముఖ్యమైన చారిత్రక కథనాలను తెలియజేస్తోంది.

1. ఇస్రాయీల్ సంతతి గురించి, మూసా ప్రవక్త (అస) గురించిన కథనం : ఆరాధనల్లో స్థిరంగా ఉండాలనీ, దానధర్మాలు చేయండని, అల్లాహ్ ప్రవక్తలను



విశ్వసించాలని, వారిని గౌరవించాలని, వారికి సహాయసహకారాలు అందించాలని అల్లాహ్ ఇస్రాయీల్ సంతతిని ఆదేశించాడు. కాని వారు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని భంగపరిచారు, దేవుని తరఫున అవతరించిన దివ్యవచనాలలో మార్పులు చేర్పులు చేసారు, అసత్యాలను నమ్మారు... ఫలితంగా శపించబడ్డారు. అల్లాహ్ వారికి చేసిన మేళ్ళను మూసా ప్రవక్త(అస) వారికి గుర్తుచేసారు. అల్లాహ్ వారికి వాగ్దానం చేసిన పవిత్ర నేలలోకి వారిని ప్రవేశించమని ఆయన వారిని కోరినప్పుడు వారు ఆయనతో పాటు అక్కడకు వెళ్ళడానికి తిరస్కరించారు. ఆ ప్రాంతంలో బలవంతులైన ప్రజలు ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉందని చెప్పారు. వాళ్ళు మూసా ప్రవక్త(అస)ను అపహాస్యం చేస్తూ, "నీవు, నీ ప్రభువు అక్కడికి వెళ్ళి వారితో పోరాడండి" అన్నారు. అల్లాహ్ బీదవాడని చెప్పేవారు.

2. రెండవ కథనం ఈసాప్రవక్త(అస) శిష్యులకు సంబంధించినది. మెస్సయ్య అల్లాహ్ కాదని ఈ సూరా నొక్కి చెప్పింది. ఒకేఒక్క దేవుడు అల్లాహ్‌ను, ఆయన పంపిన ప్రవక్త ఈసా(అస)ను విశ్వసించినవారే ఏసుశిష్యులని, వారు అల్లాహ్ అభీష్టానికి తమను తాము సమర్పించుకున్న ముస్లిములుగా తమను తాము ప్రకటించు కున్నారు. అల్లాహ్‌ను అందుకు సాక్షిగా భావించారు. వారు ఈసాప్రవక్త(అస)తో ప్రభువును అడిగి ఒక మహత్యం చూపించమని కోరారు. ఆకాశం నుంచి భోజన పదార్థాలు ఉన్న ఒక బల్ల తమకోసం పంపేలా చేయమని, తమ విశ్వాసానికి అది ఒక హామీగా ఉంటుందని, ఈసా ప్రవక్త (అస) చెప్పిన మాటలు అక్షరసత్యాలని చెప్పడానికి బలమైన సాక్ష్యం అవుతుందని, తామంతా ఆ మహత్యానికి సాక్షులుగా ఉంటామని అన్నారు. ఈసా ప్రవక్త (అస) దేవుని ప్రార్థిస్తూ, ఆకాశం నుంచి భోజనపదార్థాలు ఉన్న ఒక బల్ల పంపవలసిందిగా వేడుకున్నారు. అల్లాహ్ ఈ ప్రార్థనను ఆలకించాడు. అయితే వారందరినీ హెచ్చరిస్తూ, ఆ తర్వాత ఎవరైనా అవిశ్వాసానికి ఒడిగడితే తీవ్రమైన శిక్షకు గురవుతారని చెప్పాడు.

3. మూడవ కథనం హాబీల్, ఖాబీల్ గురించినది. ఒక అమాయకుడైన, సన్మార్గుడైన వ్యక్తి ఒక స్వార్థపరుడైన, దుష్టుని చేతిలో ఎలా హత్యగావించబడ్డాడో ఈ కథనం తెలుపుతుంది. ఖాబీల్ ఈర్ష్యాసూయలకు ప్రతీకగా ఈ సూరా చూపించింది.

హాబీల్ మంచితనానికి, దైవభక్తికి మారుపేరు. వీరిద్దరూ దేవునికి బలి సమర్పించినప్పుడు కేవలం హాబీల్ బలి మాత్రమే స్వీకరించబడింది. ఖాబీల్ ఈర్ష్యతో తన సోదరుడు హాబీల్‌ను హత్యచేసాడు.

ఈ సూరాలో అనేక చోట్ల గ్రంధప్రజల ప్రస్తావన వచ్చింది. కొత్త సందేశ హరుడిని (ప్రవక్త ముహమ్మద్ (స)ను) విశ్వసించాలని అల్లాహ్ వారికి పిలుపునిచ్చాడు. ప్రవక్త ముహమ్మద్ (స)కు ఆయన తీసుకు వచ్చిన దైవసందేశానికి మద్దతుగా ఉండాలని అన్నాడు. యూదులు, క్రయిస్తవులు దేవుని సంతానం అని చెప్పడాన్ని, దేవునికి ప్రీతిపాత్రులని వాదించడాన్ని ఈ సూరా సవాలు చేస్తూ, వారు కూడా సాధారణ మానవులే అని స్పష్టం చేసింది. అవిశ్వాసులు ఇస్లాంను పరిహాసంగా తీసుకోవడాన్ని ప్రస్తావిస్తూ, విశ్వాసులు తోటి విశ్వాసులకు బదులు అవిశ్వాసులను తమకు సహాయకులుగా తీసుకోరాదని బోధించింది. అవిశ్వాసుల మనోకాంక్షలను అనుసరించరాదని బోధించింది. సాఫల్యం పొందడానికి గాను దైవభీతి కలిగి ఉండాలని, అల్లాహ్ మార్గంలో తీవ్రంగా కృషిచేయాలని నొక్కి చెప్పింది.

ఈ సూరా చివరిగా తీర్పుదినం దృశ్యాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఆ నాడు ప్రజలు తమ ప్రభువు ఎదుట హాజరవుతారు. ఆనాడు ఈసాప్రవక్త (అస)ను ఆరాధించిన వారి అసత్యం బట్టబయలవుతుంది. ఆనాడు అల్లాహ్ ఈసాప్రవక్త (అస)ను "నన్ను కాదని నిన్ను, నీ తల్లిని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?" అని ప్రశ్నిస్తాడు. ఈసా ప్రవక్త (అస) బదులిస్తూ తాను అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని బోధించినట్లు తెలుపుతారు.

## ముఖ్యాంశాలు

**మంచి నడవడిక, ఈర్ష్యాసూయల మధ్య ఘర్షణ :**

స్వార్థం భయానక ఫలితాలకు దారితీస్తుంది. ఖాబీల్, హాబీల్‌ల కథ ద్వారా మంచి నడవడికకు గుర్తింపు లభిస్తుందని తెలుస్తోంది. ప్రతీకారం కోసం పూనుకోక పోవడం అత్యుత్తమ సుగుణంగా ఈ కథ తెలుపుతోంది.

**సహకారం :**

మనం ఒకరికి వ్యతిరేకంగా మరొకరు చెడులకు, దౌర్జన్యాలకు గాను పరస్పరం సహాయపడే బదులు, పరస్పరం దైవభీతికి, మంచిపనులకు సంబంధించి సహాయసహకారాలు అందించుకోవాలి. ఈ వైఖరి యావత్తు మానవాళికి ఉపయోగపడుతుంది.



**న్యాయంగా వ్యవహరించాలి. సాక్ష్యంలో న్యాయంగా ఉండాలి :**

సాక్షులు నిజాలనే చెప్పాలి. వైరం, విద్వేషాల కారణంగా న్యాయాన్ని అతిక్ర మించరాదు. లేదా బాధితుని పట్ల సానుభూతి కారణంగా న్యాయాన్ని భంగ పరచ రాదు. మతం, జాతి, వర్ణం ఏవయినా గాని ప్రజల మధ్య తీర్పు చెప్పేటప్పుడు పూర్తి న్యాయంగా తీర్పు చెప్పాలి.

**మితంగా వ్యవహరించాలి :**

దైవభీతితో తనకు నష్టం కలిగే విధంగా అతిగా వ్యవహరించరాదు. ఇస్లామీయ చట్టపరిధిలో అనుమతించబడిన వాటన్నింటిని అనుభవించవచ్చు. కాని హద్దులు దాటరాదు.

## 6 వ అధ్యాయం

# అల్ అన్ఆమ్

# పశువులు

## పరిచయం

ఇది మక్కాలో అవతరించిన సూరా. దీనిలో 165 ఆయతులు ఉన్నాయి. ఈ సూరాలో పశువుల గురించి వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ముఖ్యంగా రెండు విషయాలను నొక్కి చెబుతుంది. అవి : ధార్మిక విశ్వాసం (ఈమాన్), ఇస్లామీయ మౌలిక సూత్రాలు.

ఈ మౌలిక సూత్రాలు ఇస్లామీయ విశ్వాసాలకు పునాదుల వంటివి. దేవుని విశ్వసామ్రాజ్యాధిపత్యం, దైవవచనాల అవతరణ, మరణానంతరం మళ్ళీ జీవించ

బడడం, తీర్పుదినాన శిక్షా బహుమానాలు మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఈ విషయాలు ప్రస్తావించడానికి కారణమేమంటే, మక్కా ప్రజలు అవిశ్వాసులు. అంటే వారు విశ్వప్రభువైన అల్లాహ్‌ను విశ్వసించేవారు కాదు. దైవవచనాల అవతరణను (అంటే దివ్యఖుర్‌ఆన్ అవతరణను) నిరాకరించేవారు. తీర్పుదినాన శిక్షా బహుమానాలు లభిస్తాయన్న విషయాన్ని తిరస్కరించేవారు. ఈ సూరా అల్లాహ్‌కు ఉన్న శక్తిసామర్థ్యా లను, ఆయనకు మాత్రమే ప్రత్యేకమైన సృష్టించే శక్తిని విశదీకరిస్తూ, దేవుని విశ్వసామ్రాజ్యాధిపత్యానికి రుజువులు చూపించింది. అల్లాహ్ భూమ్యాకాశాల సృష్టికర్తగా ఈ సూరా స్పష్టం చేసింది. మానవాళిని మట్టి నుంచి సృష్టించాడని, ఒకే ఒక్క ప్రాణి నుంచి మానవాళిని పుట్టించాడని, ఆయన అన్నీ తెలిసిన వాడని, అన్నీ గ్రహించేవాడని, మనం రహస్యంగా ఉంచిన వాటిని, బహిర్గతం చేసిన వాటిని, మనం చేసే ప్రతి పనిని అన్నింటిని ఎరిగిన వాడని, మనకు కనబడని అగోచర విషయాల తాళాలు ఆయన వద్దనే ఉన్నాయని (అంటే మన గ్రహణశక్తి, ఇంద్రియ జ్ఞానానికి అతీతమైన విషయాలన్నీ తెలిసివాడని), ఆయన మనలను రాత్రులలో మృతుల మాదిరి చేస్తాడని, విత్తనాన్ని, టెంకను చీల్చి మొలకెత్తేలా చేసేది ఆయనేనని, నిర్జీవ పదార్ధం నుంచి జీవిని, జీవి నుంచి నిర్జీవ పదార్ధాన్ని తీసేది ఆయనేనని, రాత్రిని విశ్రాంతి సమయంగా చేసింది ఆయనేనని, మానవాళి ప్రయోజనం కొరకు సూర్యుని, చంద్రుని, నక్షత్రాలను సృష్టించింది ఆయనేనని, మన ప్రయోజనం కొరకు ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించేది ఆయనేనని, పందిళ్ళ మీద ప్రాకే, ప్రాకని చెట్లతో సహా రకరకాల తోటలను, మన ప్రయోజనం కొరకు పశువులను సృష్టించింది ఆయనేనని ఈ సూరా అల్లాహ్ గురించి విశదీకరిస్తుంది.

దేవుడు ఒక్కడే అన్న విషయాన్ని స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈ సందర్భం గానే యూదుల, క్రయిస్తవుల ప్రస్తావన కూడా చేయడం జరిగింది. అల్లాహ్ ఒక్కడే అని, యూదులు, క్రయిస్తవులు ఆపాదించిన విషయాలకు అతీతుడని సూరా స్పష్టం చేసింది. అల్లాహ్ విషయంలో అబద్దాలు కల్పించవద్దని ఇరువర్గాలను హెచ్చరించడం జరిగింది. వాళ్ళు తమ సంతానాన్ని గుర్తించినంత తేలిగ్గా దివ్యఖుర్‌ఆన్ అల్లాహ్ వచనంగా గుర్తిస్తున్నారని, కాని ఆత్మవినాశనానికి పాల్పడిన వాళ్ళు ఈ నిజాన్ని నమ్మలేకపోతున్నారని సూరా వ్యాఖ్యానించింది. క్రయిస్తవులకు సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, విశ్వాన్ని సృష్టించిన అల్లాహ్‌కు అసలు భార్యే లేనప్పుడు కొడుకు ఎలా ఉంటారని ప్రశ్నించింది. యూదులకు సంబంధించి కూడా ప్రత్యేక ప్రస్తావన చేస్తూ,



అల్లాహ్ మూసా ప్రవక్త(అస)కు (తౌరాత్) గ్రంధాన్ని వెలుగుగా, మానవాళికి మార్గదర్శకత్వంగా ప్రసాదించాడు, కాని యూదులు దాన్ని అనేక విడిభాగాలుగా విడదీసి పెట్టారు. లేనిపోని విషయాలు అదనంగా చేర్చారు. వాటిలో కొన్నింటిని మాత్రమే వెల్లడిస్తూ మిగిలిన వాటిని దాచిపెట్టారని ఈ సూరా తెలియజేసింది.

దైవవచనాల అవతరణను పరిహసిస్తూ, సత్యాన్ని తిరస్కరిస్తూ, ముఖం తిప్పు కుంటున్న అవిశ్వాసుల అహంకారాన్ని, అయోమయావస్థను కూడా ఈ సూరా ప్రస్తావించింది. ఈ వైఖరి పర్యవసానం గురించి వారిని హెచ్చరించింది. గత జాతులు, ఈ విధంగా బహుదైవారాధక చెడులో కూరుకుపోయిన జాతులు, అల్లాహ్ పట్ల తమ కర్తవ్యాన్ని విస్మరించిన జాతులు ఏ విధంగా అంతమయ్యింది తెలియ జేసింది. అవిశ్వాసులు చెవిటి, మూగ, గుడ్డివారని, అల్లాహ్ ఉనికిని కాదని నిరూపించే ఎలాంటి గట్టి ఆధారాలు లేని వాళ్ళని, కేవలం ఊహలు, అంచనాలపై నడిచేవారని ఈ సూరా అభివర్ణించింది.

ఈ సూరాలో ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) గురించిన కధను ప్రస్తావించడం జరిగింది. ఆయన కాలంలో ఆచరణలో ఉన్న బహుదైవారాధక ఆచారాలు, అజ్ఞాన విశ్వాసాల గురించి తెలియజేసింది. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) తన జాతి ప్రజలను విగ్రహాలకు బదులుగా అల్లాహ్‌ను ఆరాధించాలని బోధించారు. సహనానికి, స్థిరచిత్తానికి ప్రతిరూపంగా నిలిచిన ఇబ్రాహీమ్ (అస)ను ఈ సూరా ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు సూచనగా అభివర్ణించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) కూడా ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) మాదిరి కష్టాలనే ఎదుర్కొన్నారు. మక్కాకు చెందిన విగ్రహారాధకుల విషయంలో సహనంతోను, స్థిరచిత్తంతోను వ్యవహరించాలని ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు చెప్పడం జరిగింది. గతంలోను అనేక మంది ప్రవక్తలను వారి జాతి ప్రజలే పరిహసించారని, అపహసించారనీ కాని చివరకు ఆ ప్రవక్తలే విజయం సాధించారని ఈ సూరా ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు ధైర్యాన్నిచ్చింది.

ఈ సూరాలో ముఖ్యంగా పది ఆదేశాలు ఉన్నాయి. అవి :

1. అల్లాహ్‌కు సమానంగా ఎవరిని నిలబెట్టరాదు.
2. తల్లిదండ్రుల పట్ల దయతో వ్యవహరించాలి.
3. బీదరికానికి భయపడి పిల్లలను చంపుకోరాదు.

4. ఎవరినీ హత్య చేయరాదు
5. బహిరంగంగా గాని, రహస్యంగా గాని సిగ్గులేని పనులు చేయరాదు.
6. అనాధకు చెందిన ఆస్తిని తాకరాదు.
7. కొలతలు, తూకాల్లో పూర్తి న్యాయం పాటించాలి.
8. దగ్గరి బంధువుకు సంబంధించిన వ్యవహారమైనా న్యాయాన్నే మాట్లాడాలి.
9. అల్లాహ్‌తో చేసుకున్న ఒప్పందాన్ని నెరవేర్చాలి.
10. అల్లాహ్ వద్దకు చేర్చే రుజుమార్గం ఇదే. కాబట్టి దీన్ని అనుసరించాలి.

ఈ సూరా క్లుప్తంగా రెండు ఇస్లామీయ చట్టాలను ప్రస్తావించింది.

1. అల్లాహ్‌పేరు ఉచ్చరించబడని వస్తువును దేన్నీ భుజించరాదు.
2. సహజంగా మరణించినది కాని లేక హలాల్ పద్ధతిలో కోయడం జరగని జంతువును కాని తినరాదు, రక్తం, పందిమాంసం తినరాదు.

సృష్టి వెనుక ఉద్దేశ్యాలు, లక్ష్యాలను, భూమిపై మన ఉనికి ఉద్దేశ్యలక్ష్యాలను ఈ సూరా చివరన ప్రస్తావించింది. అల్లాహ్ దృష్టిలో మానవాళికి ప్రత్యేకమైన హోదా ఉందని ఈ సూరా తెలిపింది. భూమిపై అల్లాహ్ ప్రతినిధిగా, వారసునిగా మనిషికి వ్యక్తిగత బాధ్యత ఉంటుందని, ఉత్తమమైన విధంగా భూమిపై వ్యవహరించాలని ఉద్బోధిస్తుంది.

### ముఖ్యాంశాలు

**1. అల్లాహ్ శక్తిసామర్థ్యాలు, అల్లాహ్ ఏకత్వం :**

సృష్టిలోని సమస్తం ఉనికిలోకి రావడానికి కారణం అల్లాహ్.

**2. ప్రాపంచిక జీవితం :**

ఈ జీవితం ఒక మజిలీ వంటిది. దీని భ్రమలో మనిషి మునిగిపోరాదు. క్షణభంగురమైన ప్రాపంచిక సుఖాలకు మోసపోకూడదు. ఈ స్వల్పమైన జీవితం కన్నా పరలోకంలోని శాశ్వత జీవితం చాలా ఉత్తమమైనది.



**3. చెడులు :**

చెడులను, దుష్టకార్యాలను మానుకోవాలి.

**4. స్థిరచిత్తం :**

అల్లాహ్ సహాయం వచ్చే వరకు సహనాన్ని స్థిరచిత్తాన్ని కలిగి ఉండాలి.

**5. కుటుంబం :**

కుటుంబాన్ని సంరక్షించాలి. సొంత సంతానాన్ని చంపుకోరాదు.

**6. మంచిపనులు :**

మంచి పనులు చేయాలి. ప్రతి మంచి పనికి పదిరెట్లు ప్రతిఫలాన్ని పొందాలి.

**7. భూమి :**

అల్లాహ్ ప్రతినిధులుగా, వారసులుగా భూమిపై ఉత్తమంగా వ్యవహరించాలి.

**7 వ అధ్యాయం**

# అల్ ఆరాఫ్

# శిఖరాలు

### పరిచయం

ఇది మక్కాలో అవతరించిన సూరా. ఇందులో 206 ఆయతులు ఉన్నాయి. ఈమాన్ (ధార్మిక విశ్వాసం), తౌహీద్ (ఏక దైవారాధన), మరణానంతర జీవితం, శిక్షా బహుమానాలు, దైవవచనాల అవతరణ, ప్రవక్తల పరంపరలను ఈ సూరాలో నొక్కి చెప్పడం జరిగింది. ఈ సూరాలోని 46వ ఆయతులో వచ్చిన ప్రస్తావనల వల్ల శిఖరాలు అని పేరుపెట్టబడింది. స్వర్గాన్ని, నరకాన్ని విభజించే గోడను ఇది ప్రస్తావిస్తుంది. ఈ గోడపై ఒక ప్రత్యేక వర్గానికి చెందిన ప్రజలు ఉంటారు. వారి

గమ్యం ఏదో నిర్ణయం జరిగే వరకు వాళ్ళు అక్కడ ఉంటారు. ఎవరి మంచిపనులు, చెడ్డపనులు సమానంగా ఉంటాయో వాళ్ళు అక్కడికి చేరుకుంటారు.

ఈ సూరా ప్రారంభ వచనాలు దివ్యఖుర్ఆన్ ఒక దివ్యవాణి అని, అల్లాహ్ తరపున మానవాళికి ఒక అనుగ్రహంగా ప్రసాదించబడిందనీ, మానవాళి ఇహ లోకంలో సంతోషం, పరలోకంలో సాఫల్యం పొందడానికి మానవాళి దీనికి కట్టుబడా లనీ, ఇందులోని ఆదేశాలను పాటించాలని, హెచ్చరికలను గుర్తుంచు కోవాలని ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలో అల్లాహ్ ప్రసాదించిన మరొక అనుగ్రహం గురించి కూడా ప్రస్తావించడం జరిగింది. యావత్తు మానవాళిని ఒకే తండ్రి ఆదమ్(అస) నుంచి సృష్టించడం జరిగిందని, ఆ విధంగా మానవాళి సమస్తం ఒకే కుటుంబం అని గుర్తుచేయడం జరిగింది.

మనిషికి ప్రసాదించబడిన ఉన్నత స్థానాన్ని కూడా ప్రముఖంగా ప్రస్తా వించింది. అల్లాహ్ మనిషిని సృష్టించాడని, చక్కని రూపురేఖలు ఇచ్చాడని, మనిషికి ప్రసాదించిన ఉన్నత స్థానానికి గౌరవసూచకంగా మనిషి ముందు దైవదూతలను సాష్టాంగ పడమన్నాడని, కాని ఈ ఆదేశాన్ని జిన్నులలోని షైతాన్ తిరస్కరించాడని సూరా తెలిపింది. ఆదమ్(అస) కేవలం మట్టితో సృష్టించబడిన సాధారణ మానవుడనీ, తాను అగ్నితో సృష్టించబడిన జిన్నునని షైతాన్ (ఇబ్లీస్) అహంకారాన్ని ప్రదర్శించి ఆదమ్(అస) ముందు సాష్టాంగపడడానికి తిరస్కరించాడు. అప్పటి నుంచి మానవు లకు–షైతానులకు, దైవ మార్గదర్శకత్వానికి–మార్గభ్రష్టత్వానికి మధ్య ఘర్షణ ప్రారంభమయ్యింది. మానవాళిని తప్పుదారి పట్టించడానికి, మన జీవిత విధానాన్ని మార్గభ్రష్టం చేసేలా ప్రభావితం చేయడానికి, ఆ విధంగా మనలను అల్లాహ్‌కు, అల్లాహ్ ధర్మానికి దూరం చేయడానికి షైతాన్ అలుపెరుగక, నిరంతరాయంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆదమ్ (అస), ఆయన జీవితభాగస్వామి హవ్వా(అస)లను అల్లాహ్ స్వర్గవనంలో నివసించమన్నాడు. వారికి ఇష్టమొచ్చిన చెట్ల ఫలాలు తినే అనుమతి ఇచ్చాడు. అయితే ఒక నిషిద్ధ వృక్షం ఫలాలను తినరాదని ఆదేశించాడు. కాని ఇబ్లీస్ (షైతాన్) వారిద్దరికి శాశ్వత జీవితం లభిస్తుందన్న ప్రలోభం చూపించి నిషిద్ధ వృక్షం ఫలాలు భుజించేలా చేసాడు. నిషిద్ధవృక్షం ఫలాలు భుజించడం పెద్ద అపరాధం, అల్లాహ్ ఆదేశాల పట్ల అవిధేయత, ఈ పొరబాటు కారణంగా వారిద్దరు



స్వర్గవనం నుంచి బహిష్కరించబడ్డారు. స్వర్గవనానికి బదులు భూమిపై నివసించాలని వారిని ఆదేశించడం జరిగింది.

ఈ సూరా మానవాళిని ఉద్దేశించి, షైతాన్‌కు విధేయత చూపవద్దని, షైతాన్ చూపించే పైపై ఆకర్షణకు దాసోహం అయిపోవద్దని హెచ్చరించింది.

ఈ సూరా పరలోకానికి సంబంధించిన ఒక దృశ్యాన్ని మన ముందు ఆవిష్కరిస్తూ, మూడు వర్గాలకు చెందిన ప్రజల గురించి ప్రస్తావించింది.

1. స్వర్గవనానికి చెందిన ప్రజలు
2. నరకవాసులైన ప్రజలు
3. శిఖరాలపై ఉన్న ప్రజలు, వారు తాత్కాలికంగా అటు స్వర్గంలోను, ఇటు నరకంలోను కాకుండా ఉంటారు. వారి నివాసం విషయంలో తుది నిర్ణయం జరిగే వరకు అలాగే ఉంటారు.

ఈ సూరా గత జాతుల గురించి వారి ప్రవక్తల గురించి ప్రస్తావించింది. ఇందులో ఆదమ్, నూహ్, హూద్, సాలిహ్, లూత్, షుఐబ్, మూసా (వారిపై శాంతి వర్షించుగాక) గురించిన వివరాలు ప్రస్తావించింది. ఈ ప్రవక్తలకు సంబం ధించిన చారిత్రక కథలను ప్రస్తావించడం ద్వారా ఈ సూరా మానవాళిని సన్మార్గంపై నడవాలని ఉద్బోధించింది. మానవాళికి పితామహుడు అదమ్ (అస) మాత్రమే కాదు, మిగిలిన ప్రవక్తలు అందరూ కూడా ఒకే విధమైన సందేశాన్ని, ఏకదైవారాధన సందేశాన్ని మానవాళికి అందించారని ఈ సూరా తెలియజేసింది. ప్రవక్తలందరూ తమ జాతుల ప్రజలను విగ్రహారాధన మానుకోమని, కేవలం అల్లాహ్ ఒక్కడిని మాత్రమే ఆరాధించాలని, ఎవరినీ అల్లాహ్‌కు సమానంగా నిలబెట్టరాదని బోధిం చారు. కాని ప్రవక్తలను ఆయా జాతుల ప్రజలు అసత్యమాడుతున్నారని ఆరోపించడం జరిగింది, ప్రవక్తలందరిని ఆయా జాతుల ప్రజలు తిరస్కరించడం జరిగింది. ఆయా జాతుల ప్రజలు విశ్వప్రభువు పంపిన సందేశాన్ని తిరస్కరించారు. కాని స్వచ్ఛమైన విశ్వాసంతో, నిజాయితీగా, సదాచరణలతో అల్లాహ్ ఆదేశాలను శిరసా వహించిన ప్రవక్తలు, వారి అనుయాయులు చివరకు విజయాన్ని పొందారు. వారిని వ్యతిరేకించిన వారు, అవిశ్వాసులు చివరకు వినాశాన్ని పొందారు. నూహ్(అస) జాతి ప్రజలు భయంకరమైన వరదలో చిక్కుకున్నారు. వారిని నీట ముంచి అంతం

**8 వ అధ్యాయం**

# అల్ అన్ఫాల్

# యుద్ధసొత్తు

## పరిచయం

ఇది మదీనాలో అవతరించిన సూరా. ఇందులో 75 ఆయతులు ఉన్నాయి. ఈ సూరాలో ముఖ్యంగా బద్ర్ యుద్ధాన్ని ప్రస్తావించడం జరిగింది. క్రీ.శ. 624లో అంటే హిజ్రీ శకం 2లో బద్ర్ యుద్ధం జరిగింది. అప్పుడప్పుడే రూపురేఖలు దిద్దుకుంటున్న మదీనాలోని ముస్లిం సమాజానికి ఈ యుద్ధం ఒక కీలకమైన మలుపు అయ్యింది. పూర్తిగా అల్లాహ్‌పై ఆధారపడడాన్ని ఈ సూరా ప్రముఖంగా ప్రస్తావించింది. విజయానికి కావలసినవి సహనం, దైవభక్తి, దైవభీతి మాత్రమే అని నొక్కి చెప్పింది. యుద్ధసమయంలో, యుద్ధరంగంలో పాటించవలసిన యుద్ధ నియమాలను ఈ సూరాలో చెప్పడం జరిగింది. యుద్ధనియమాలు, యుద్ధఖైదీలతో వ్యవహరించవలసిన తీరు, యుద్ధసొత్తు, యుద్ధవిరమణ, శాంతి ఒప్పందాలకు సంబంధించిన నియమనిబంధనలను ఈ సూరా తెలియజేసింది. ఈ సూరాలో యుద్ధ ప్రణాళికలు, సైనికుల సంఖ్య గురించిన ప్రస్తావనలతో పాటు, యుద్ధసామాగ్రికి సంబంధించిన బలహీనతల విషయంలో తగిన శ్రద్ధ చూపాలని బోధించింది. ముస్లిం సైనికులను ఉద్దేశిస్తూ ధైర్యంగా, మడమతిప్పని దృఢచిత్తంతో శత్రువులను ఎదుర్కోవాలని ప్రోత్సహించింది. అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్త ముహమ్మద్(సఅస) ఆదేశాలను అమలు చేయాలని, ధైర్య సాహసాలతో స్థిరంగా యుద్ధం చేయాలని, యుద్ధరంగం నుంచి వెన్నుచూపి పారిపోరాదని, సైనిక రహస్యా లను శత్రువుకు చెప్పరాదని, అభిప్రాయభేదాలను పరిష్కరించుకోవాలని, యుద్ధ సొత్తుపై దృష్టి పెట్టరాదని, యుద్ధానికి ముఖ్య లక్ష్యం ప్రాపంచిక సంపద కారాదని ఉద్బోధించింది.

ఈ సూరాలో యుద్ధం పట్ల భయపడే, తటపటాయించే, వెనుకడుగు వేసే కొందరు ముస్లిముల గురించి కూడా ప్రస్తావించడం జరిగింది. ఇలాంటి వారిపై ఒక కన్ను వేసి ఉంచాలని, ఇలాంటి వారు ఇతర ముస్లిం యోధుల స్థయిర్యాన్ని



కూడా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించడం జరిగింది. ఇక అవిశ్వాసుల గురించి ప్రస్తావిస్తూ వాళ్ళు చెవిటి, మూగ వారని, వాళ్ళు బుద్ధివివేకాలను ఉపయోగించడం లేదని వ్యాఖ్యానించింది.

ఇక యుద్ధసొత్తు గురించి ప్రస్తావిస్తూ, అది అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు చెందినదని నిర్దేశిస్తూ, యుద్ధసొత్తును పంచడం ప్రవక్తపై ఉన్న బాధ్యతగా తెలియజేసింది. యుద్ధసొత్తులో అయిదవ భాగం ప్రవక్తకు చెందినది. ఇందులో కొంత భాగాన్ని ముస్లిం రాజ్యానికి ఇవ్వడం జరిగింది. ప్రజాహిత కార్యక్రమాలకు ఈ భాగం వెచ్చించడం జరుగుతుంది. మిగిలినది అనాథలకు, అవసరార్థులకు, బాటసారులకు ఖర్చు చేయడం జరుగుతుంది. (యుద్ధసొత్తులో మిగిలిన నాలుగు భాగాలను సైనికులకు పంచడం జరుగుతుంది) యుద్ధఖైదీలను బంధించాలని నిర్ణయిస్తే వారి పట్ల ఉత్తమంగా, మర్యాదగా వ్యవహరించాలి. వారిని ఇస్లాం స్వీకరించాలని బలవంతం చేయరాదు. అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడవలసిందిగా వారికి గుర్తు చేయాలి.

యుద్ధ సమయంలోను, యుద్ధవిరమణ, శాంతి సంప్రదింపుల సమయాల్లో కూడా శత్రువుతో చర్చలు సాధ్యమే అని ఈ సూరా చెప్పింది. యుద్ధ ప్రయత్నాల గురించి కూడా ఇందులో ప్రస్తావన ఉంది. సైనిక బలం పెంపొందడానికి, శత్రువు గుండెల్లో గుబులు పుట్టించడానికి యుద్ధప్రయత్నాల్లో ముస్లిములు సహాయ సహకారాలు అందించాలని, సైనికులకు మద్దతు ఇవ్వాలని ఈ సూరా ప్రోత్సహించింది.

ఈ సూరాలో దైవభీతి కలవారి గుణగణాలను ప్రస్తావించడం జరిగింది. అవి :

1. అల్లాహ్ పేరు ప్రస్తావించినపుడు, ఆయనను జ్ఞాపకం చేసుకున్నప్పుడు వారి హృదయాలు కంపిస్తాయి.
2. స్థిరంగా నమాజులు చేస్తారు.
3. దానధర్మాల్లో ధనం వెచ్చిస్తారు.
4. అల్లాహ్ చిహ్నాల పట్ల స్పృహతో వ్యవహరిస్తారు.

5. వారు అల్లాహ్‌పైననే ఆధారపడతారు.

ఇస్లామ్ సందేశాన్ని ఈ సూరా ప్రస్తావిస్తూ, ఇహపరలోకాల్లో సంతోష సాఫల్యాలను సాధించే సందేశంగా నొక్కి చెప్పింది. వర్ణం, జాతి, హోదాలు ఏవయినా గాని ముస్లిములందరూ ఒక్కటే అని ఈ సూరా ఉద్ఘోషిస్తుంది. ధార్మిక విశ్వాసం, దైవభీతి, దేవుని ఏకత్వం పునాదులపై ఏకమైన ఒకే జాతిగా ముస్లిములను అభివర్ణించింది. ముస్లిములు పరస్పరం సహాయసహకారాలు అందించుకోవాలని, శత్రువును ఒకే పంక్తిగా ఎదుర్కోవాలని ప్రోత్సహించింది.

## ముఖ్యాంశాలు

**అల్లాహ్‌పై ఆధారపడడం:**
విజయం కోరుకుంటే అల్లాహ్‌పై పూర్తిగా ఆధారపడాలి. ఎందుకంటే విజయం అన్నది అల్లాహ్ చేతిలో మాత్రమే ఉంది. దైవభీతి, దృఢమైన ధార్మిక విశ్వాసం, అల్లాహ్ శక్తిసామర్థ్యాల పట్ల పూర్తి నమ్మకం విజయం పొందడానికి కావలసిన ముఖ్యమైన విషయాలు.

**రాసి, వాసి :**

యుద్ధరంగంలో సైనికుల సంఖ్య, సైనికసామాగ్రి కన్నా సైనికుల నాణ్యత చాలా ముఖ్యమైనది.

**సహనం :**

యుద్ధవీరులకు ఉండవలసిన ముఖ్యమైన లక్షణం. ఇది లేనిదే విజయం సాధ్యం కాదు.

**ఐక్యత :**

అభిప్రాయభేదాలను తొలగించుకోవాలి. భేదాభిప్రాయాలలో, వివాదాల్లో చిక్కు కోకూడదు. వీటి వల్ల బలహీనత, విభజన తలెత్తుతాయి.

**దేవుని అనుగ్రహాలు :**

అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడడం ద్వారా ఆయన అనుగ్రహాలను పొందవచ్చు. అల్లాహ్ నుంచి ముఖం తిప్పుకుంటే, ఆయన ఆదేశాల పట్ల అవిధేయత చూపితే,



ఫిర్‌ఔన్ జాతి మాదిరిగా ప్రతి జాతి అల్లాహ్ అనుగ్రహాలను కోల్పోతుంది,.

**ప్రమాణాలు :**

చేసిన ప్రమాణాలను భంగపరచరాదు. చేసుకున్న ఒప్పందాన్ని అతిక్రమించరాదు.

**నమ్మకద్రోహం :**

నమ్మకద్రోహానికి, విశ్వాసఘాతుకానికి పాల్పడరాదు.

## 9 వ అధ్యాయం

# అత్ తౌబా

# పశ్చాత్తాపం

## పరిచయం

ఇది మదీనాలో అవతరించిన సూరా. ఇందులో 129 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా దైవతిరస్కారులకు, అల్లాహ్ ఏకత్వాన్ని కాదన్నవారికి దూరంగా ఉండాలని బోధిస్తుంది. అంటే విగ్రహారాధకుల విషయంలో ఈ ప్రస్తావన వచ్చింది. అల్లాహ్ ఒకేఒక్క దేవుడన్న విశ్వాసం కలిగి ఉన్న వ్యక్తిని, తౌహీద్ (ఏకదైవారాధన)కు కట్టుబడిన వ్యక్తిని స్నేహితునిగా చేసుకోవాలని బోధించడం జరిగింది. అల్లాహ్‌కు సమానంగా ఎవరినీ నిలబెట్టరాదని, ఎవరినీ అల్లాహ్‌కు భాగ స్వాములు చేయరాదని ఈ సూరా హెచ్చరించింది. మన ప్రార్థనలు, ఆరాధనలు పూర్తిగా అల్లాహ్‌కే పరిమితం కావాలని బోధిస్తుంది. ప్రజలు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అంటే మతగురువులు, వలీలు, మధ్యవర్తుల వంటి వారి ప్రమేయం లేకుండా స్వయంగా అల్లాహ్‌ను వేడుకోవచ్చని ఈ సూరా స్పష్టం చేసింది. ఇస్లామీయ సామాజిక నడవడిని ఈ సూరా నిర్దేశించింది. అలాగే సంస్కరణా సూత్రాలను కూడా ప్రతిపాదించింది.

ఈ సూరా హిజ్రీ శకం 9లో అవతరించింది. అంటే క్రీ.శ.630లో. ఈ సంవత్సరం వేసవిలోనే ప్రవక్త ముహమ్మద్ (సఅస) తబూక్ దండయాత్రకు ఏర్పాట్లు చేసారు. సిరియా రాజధాని డమస్కస్ వెళ్ళే దారిలో తబూక్ ఉంది. ఇది బైజాంటైన్ సామ్రాజ్యం ఎల్లలకు దగ్గరగా ఉంది. మండువేసవిలో తబూక్ వరకు పోవడం ఒక సుదీర్ఘ ప్రయాణం. నిజమైన విశ్వాసులకు, వారి విశ్వాస బలానికి ఇది కఠిన పరీక్ష. ఈ పరీక్ష ఇస్లామీయ సమాజంలోని కపట విశ్వాసులను, వారి ద్వంద్వప్రవృత్తిని బయటపెట్టే పరీక్ష. తబూక్ యుద్ధం ప్రాముఖ్యత దృష్ట్యా ముస్లిం రాజ్య సరిహద్దుల భద్రత కోసం యూద, క్రయిస్తవ తెగలతో శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కాని ఆ తెగలు ఏకపక్షంగా ఒప్పందాలను రద్దుచేసుకున్నాయి. అందువల్ల శాంతి ఒప్పందాలను రద్దు చేసుకున్న తెగలతో యుద్ధస్థితిలో ఉన్నట్లు ఈ సూరా ప్రకటించింది. అయితే ఈ ఒప్పందాలపై సంతకాలు చేయని ఇతర యూద, క్రయిస్తవ తెగలకు ఈ యుద్ధ స్థితి వర్తించదని తెలిపింది.

ఈ సూరా మూడు వర్గాలకు చెందిన ప్రజల గురించి తెలిపినది. ఆ వర్గాలు:

1. అవిశ్వాసులు : అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించడానికి నిరాకరించిన ప్రజలు. అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్(సఅస) నిషేధించిన వాటిని విడిచిపెట్టని వారు. వారి హృదయాల్లో వ్యతిరేకత ఉన్నా, దాన్ని దాచుకుని విశ్వాసులను తీయని మాటలతో సంతృప్తి పరచడానికి ప్రయత్నించేవారు. విశ్వాసులపై వారిది ఒకసారి పైచేయి అయితే ఇక వాళ్ళు ఎలాంటి ఒప్పందాలను, అంగీకారాలను లక్ష్యపెట్టరు. వీరిలో చాలా మంది అనైతికతకు, అణచివేతలకు పాల్పడేవారు. చెడ్డపనులు చేస్తారు. అల్లాహ్ చిహ్నాలను పరిహసిస్తారు. అల్లాహ్ మార్గం నుంచి ముఖం తిప్పుకుంటారు. వీళ్ళు నరకవాసులు.

2. కపట విశ్వాసులు : అల్లాహ్‌ను విశ్వసించడానికి నిరాకరించేవారు. పరలోకాన్ని నిరాకరించేవారు. అల్లాహ్‌ను, ప్రవక్త ముహమ్మద్(సఅస)ను వ్యతిరేకించేవారు. అబద్ధాలు పలికేవారు, అనైతిక నడవడి కలిగిన వారు, అర్థం చేసుకునే శక్తి లేనివారు, యుద్ధం వస్తే వెనకడుగు వేసేవారు, ఇస్లాం కోసం పోరాడటమంటే



గిట్టని వారు. విశ్వాసుల మధ్య అనైక్యతను, అసమ్మతిని రెచ్చగొట్టేవారు. ఇస్లామీయ యోధుల స్థయిర్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించేవారు. వారి హృదయాల్లో సందేహాలు గూడుకట్టుకుని ఉంటాయి. వారు అసమ్మతిలో పడ్డారు. నమాజులకు వస్తే ఉదాసీనంగా వస్తారు. అయిష్టంగా దానధర్మాలు చేస్తారు. విశ్వాసులను హేళన చేస్తారు. ప్రవక్తకు చికాకు కలుగజేస్తారు. చెడును ప్రోత్సహిస్తారు, మంచిని నిరోధిస్తారు. క్షమార్హం కాని చెడులకు పాల్పడుతున్న ప్రజలు. నరకం నివాసంగా చేసుకున్న వాళ్ళు.

కపట విశ్వాసులను హెచ్చరిస్తూ పశ్చాత్తాపం చేసుకోమ్మని చెప్పడం జరిగింది. గత జాతులు – నూహ్ జాతి, ఆద్ జాతి, సమూద్, ఇబ్రాహీమ్ జాతి ప్రజల గురించి, లూత్(అస) జాతి ప్రజల గురించి తెలుపడం జరిగింది. అల్లాహ్ ఆదేశాలను తిరస్కరించిన వారిని ఏ విధంగా నాశనం చేయడం జరిగిందో చెబుతూ హెచ్చరించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు ఆదేశమిస్తూ ఈ ప్రజల క్షమాభిక్ష కోసం ప్రార్థించవద్దని చెప్పడం కూడా జరిగింది. వారిలో మరణించిన వారి కొరకు శవప్రార్థన చేయరాదని, వారి సమాధి ప్రక్కన నిలబడరాదని ప్రవక్త (సఅస)ను ఆదేశించడం జరిగింది. వారిని ఏ యుద్ధంలోను సైన్యంలో చేర్చుకో రాదని, వారిని వదిలివేయాలని, వారితో పూర్తిగా దూరం కావాలని ప్రవక్త(సఅస)కు చెప్పడం జరిగింది.

తమ తప్పులు తెలుసుకుని, పశ్చాత్తాప పడిన కపట విశ్వాసులకు సంబంధించి వారిని స్వాగతించాలని, వారిని ముస్లిం సముదాయంలో చేర్చుకోవాలని, వారితో ఉత్తమంగా వ్యవహరించాలని బోధించడం జరిగింది.

3. విశ్వాసులు : ఒకరికి ఒకరు నిజమైన స్నేహితులు. మంచి చేయమని ఆదేశిస్తారు. చెడును నిరోధిస్తారు. నమాజుల పట్ల స్థిరంగా ఉంటారు. దానధర్మాలకు ఖర్చు చేస్తారు. అల్లాహ్ పట్ల, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅస) పట్ల విధేయత చూపుతారు. తమ సంపదతో, తమ ప్రాణాలతో దేవుని మార్గంలో పోరాడుతారు. పశ్చాత్తాపపడతారు. దేవుని స్తుతిస్తారు. అల్లాహ్ నిర్దేశించిన పరిధులకు కట్టుబడుతారు. వారు స్వర్గవనాలను పొందుతారు.

విశ్వాసులు కపట విశ్వాసులతో కలగలిసి పోరాడరాదని, కపట విశ్వాసులతో మాట్లాడ రాదని హెచ్చరించడం జరిగింది.

ఈ సూరా కొన్ని ఇస్లామీయ చట్టపరమైన అంశాలను ప్రస్తావించింది.

1. జకాత్ (సదఖా) మొత్తాన్ని నిరుపేదలకు (చేయిచాచి అర్థించేవారికి), అవసరార్థులకు(అవసరమున్నా చేయిచాచి అర్థించని వారికి), బాటసారులకు, ఈ మొత్తాలను సేకరించి పంపిణీ చేసేవారికి, ఖైదీల విముక్తికి, రుణగ్రస్తుల భారం తగ్గించడానికి, హృదయాలను గెలుచుకోవడానికి (ఇస్లాం స్వీకరించినవారికి, ఇస్లాం స్వీకరించడానికి దగ్గరిలో ఉన్నవారికి), దైవమార్గంలో ఖర్చు చేయాలి.

2. నిస్సహాయులు, వ్యాధిగ్రస్తులు, అల్లాహ్ కోసం ఖర్చు చేయడానికి ఏదీ లేని వారు అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త (సఅస) పట్ల తమ విధుల విషయంలో నిజాయితీగా ఉన్న వారు పోరాట సైన్యంలో చేరడానికి మినహాయింపు ఇవ్వడం జరిగింది.

## ముఖ్యాంశాలు

**కపట విశ్వాసం :**

కపట విశ్వాసాన్ని తొలగించాలి. ఇది అసమ్మతిని, అనైక్యతను పుట్టిస్తుంది.

**ఒప్పందాలు :**

ఒప్పందాలు, అంగీకారాలకు కట్టుబడాలి. స్వార్థంతో వాటిని అతిక్రమించరాదు.

**అల్లాహ్ కోసం పోరాడ్డం :**

పరలోక జీవితానికి బదులు ప్రాపంచిక జీవితంలోని సుఖభోగాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు.



**10 వ అధ్యాయం**

# యూనుస్

## పరిచయం

యూనుస్ (అస) ప్రాచీన కాలంలో పుట్టిన ప్రవక్త. ఆయన ఇరాక్‌కు ఉత్తరాన ఉన్న నినెవహ్ పట్టణానికి పంపించబడ్డారు. ఈ సూరా మక్కా కాలంలో అవతరించింది. ఇందులో మొత్తం 109 ఆయతులు ఉన్నాయి. దివ్యఖుర్‌ఆన్ అల్లాహ్ తరఫున అవతరించిన గ్రంథమనీ, ప్రవక్త ముహమ్మద్ (సఅస)పై దేవుడు ఈ గ్రంథాన్ని అవతరింపచేసాడని ఈ సూరా ముఖ్యంగా నొక్కి చెప్పింది. ఒకవేళ దివ్యఖుర్‌ఆన్‌ను ముహమ్మద్ ప్రవక్త (సఅస) స్వయంగా రచించి, అల్లాహ్ పంపిన దివ్యగ్రంథమని చెబుతున్నట్లయితే, ఇలాంటి ఒక్క సూరానయినా ఎవరూ ఎందుకు రాయలేక పోతున్నారని ప్రశ్నించింది.

దివ్యఖుర్‌ఆన్ ఒక హెచ్చరిక, మనసుకు ఊరట, ఒక మార్గదర్శకత్వం, ఒక కారుణ్యం, వివేకంతో నిండిన గ్రంథంగా ఇక్కడ అభివర్ణించడం జరిగింది. ఈ సూరాలో ఇస్లాంకు సంబంధించిన ఇతర ముఖ్యమైన విషయాల ప్రస్తావన కూడా ఉంది. అల్లాహ్‌పై విశ్వాసం, తీర్పుదినం, దివ్యగ్రంథాలు, ప్రవక్తలు, మరణించిన వారు తిరిగి లేపబడడం, శిక్షా బహుమానాలు పొందడం తదితర ఇస్లామీయ విశ్వాసాల గురించి నొక్కి చెప్పడం జరిగింది. దైవత్వం, దాస్యం, ఈ రెండింటి మధ్య సంబంధం గురించి కూడా ఈ సూరా వివరించింది. అంటే సృష్టికర్తకు-సృష్టించబడిన వారికి మధ్య ఉండవలసిన సంబంధం. మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు అల్లాహ్‌కు మొర పెట్టుకుంటాడు. కష్టం తొలగిపోయిన వెంటనే, అల్లాహ్ సహాయాన్ని ఎన్నడూ కోరనట్లు ముఖం తిప్పుకుంటాడు. మనిషి దేవుని కారుణ్యాన్ని చవి చూస్తున్నాడు. అల్లాహ్ ఎవరినయినా కష్టాలకు గురిచేస్తే ఆ కష్టాన్ని తొలగించే శక్తి అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ లేదని, అలాగే అల్లాహ్ ప్రయోజనం చేకూర్చ దలిస్తే, దానిని అడ్డుకునే శక్తి కూడా ఆయనకు తప్ప మరెవ్వరికీ లేదని ఈ సూరా స్పష్టం చేసింది.

దేవుని ఏకత్వం (తౌహీద్) ప్రాముఖ్యాన్ని గుర్తించాలని ఈ సూరా ప్రజలకు గట్టిగా చెప్పింది. విశ్వప్రభువు గురించి మరింతగా తెలుసుకోవాలని, ఆయన్ను మాత్రమే ఆరాధించాలని, ఆయన చట్టాలకు కట్టుబడాలని, కష్టాల్లో ఉన్నప్పుడు తమకు నష్టం కాని లాభం కాని కలుగచేసే శక్తిలేని ఇతరులను (దేవీ దేవతలను, స్వాములను, వలీలు పీరులు, బాబాలు, చెట్లు పుట్టలు, రాళ్ళు వగైరాలను) వేడుకునే బదులు కేవలం అల్లాహ్‌కే మొరపెట్టుకోవాలని ఈ సూరా ఉద్బోధించింది. మరో విధంగా చెప్పాలంటే, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను చేర్చరాదు. అల్లాహ్‌ను మాత్రమే వేడుకోవాలి. ఈ సందర్భంగా అల్లాహ్‌కు కుమారుడు ఎవరూ లేరని గట్టిగా చెప్పడం జరిగింది. దేనినీ ఆయనకు సంబంధించినదిగా చేర్చడానికి వీలు లేదు.

దైవవచనాల అవతరణను, ముహమ్మద్ (సఅస) ప్రవక్త పదవిని సందేహిస్తున్న అవిశ్వాసుల వైఖరిని ఈ సూరా ప్రస్తావించింది. తమ కోసం ఒక మహిమను చూపించమని ఈ అవిశ్వాసులు ప్రవక్త (సఅస)ను సవాలు చేసారు. అల్లాహ్ దీనికి జవాబు చెబుతూ దివ్యఖుర్‌ఆన్ స్వయంగా ఒక మహిమ అని పేర్కొన్నాడు. ఎవ్వరూ అనుకరించలేని దివ్యఖుర్‌ఆన్ రచనా శైలిని ఒక మహిమగా తెలుపుతూ, ప్రజలను హెచ్చరించడానికి, వారిని దేవుని ఆగ్రహం గురించి భయపెట్టడానికి గత కాలాలకు చెందిన ముగ్గురు ప్రవక్తల గురించి తెలుపడం జరిగింది. ఈ ప్రవక్తల జాతికి చెందిన ప్రజలు అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను చేర్చేవారు. ప్రవక్తలు తీసుకు వచ్చిన సందేశాన్ని వాళ్ళు తిరస్కరించారు. దేవుడు తమ వద్దకు పంపిన ప్రవక్తల బోధనలు వినడానికి నిరాకరించారు. నూహ్ ప్రవక్త జాతి ప్రజలు మొండిగా ఆయన బోధనలను అవహేళన చేసారు. చివరకు నీటముంచి చంపబడ్డారు. మూసా, ఫిర్‌ఔన్‌ల కథను కూడా ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. ఫిర్‌ఔన్, అతని అనుయాయులు మూసా(అస)ను విశ్వసించడానికి నిరాకరించారు. ఆయన సందేశాన్ని అహంకారంతో తిరస్కరించారు. వారి ముగింపు కూడా వినాశమే అయ్యింది. మూసా(అస), ఆయన జాతి ప్రజలు సముద్రం మధ్య నుంచి ఆవలికి చేరుకున్నారు. వారిని వెంటాడిన ఫిర్‌ఔన్, అతని సైన్యాలు సముద్రంలో మునిగి పోయాయి. నీట మునిగిపోతున్నానని గ్రహించిన ఫిర్‌ఔన్ పశ్చాత్తాపం ప్రకటిస్తూ,



అల్లాహ్ పట్ల, మూసా(అస) తీసుకు వచ్చిన సందేశం పట్ల విశ్వాసాన్ని ప్రకటించాడు. అల్లాహ్ అతడి శవాన్ని మాత్రమే మిగిల్చాడని, చాలా ఆలస్యంగా ప్రకటించిన ఫిర్‌ఔన్ పశ్చాత్తాపాన్ని అల్లాహ్ స్వీకరించలేదని ఈ సూరా తెలిపింది. యూనుస్ ప్రవక్త(అస) గురించిన క్లుప్తమైన ప్రస్తావన ఉంది. ఆయన జాతి ప్రజలు ఆయన్ను తిరస్కరించారు. అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టేవారు. వినాశానికి చేరువయ్యారు. కాని వినాశం సూచనలు కనబడగానే, ఆలస్యం చేయకుండా వాళ్ళు పశ్చాత్తాపం ప్రకటించారు. అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. వారిపై విధించిన శిక్షను ఉపసంహరించాడు.

భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్ శక్తిసామర్థ్యాలను ఈ సూరా క్లుప్తంగా విశదీకరించింది. ఆయన రాత్రింబవళ్ళను ఒకదాని తర్వాత ఒకటి వచ్చేలా చేసాడు. ఆయన సూర్యుడిని ప్రకాశవంతంగాను, చంద్రుణ్ణి అందమైన కాంతిగా, వెలుగుగా చేసాడు. ఆయన ఆకాశం నుంచి వర్షాలు కురిసేలా చేసి మానవులకు, జంతువులకు భూమిపై ఆహారం పండేలా చేసాడు. ఆయన మన వినికిడి శక్తిని, చూపును అదుపు చేస్తున్నాడు. ఆయనే జీవన్మరణాలు ఇస్తున్నాడు. ఆయన ప్రాణం లేని వాటి నుంచి ప్రాణం ఉన్న వాటిని తీస్తాడు, ప్రాణం ఉన్న వాటి నుంచి ప్రాణం లేని వాటిని వెలికి తీస్తాడు. ఆయనే విశ్వంలోని సమస్తాన్ని క్రమబద్ధంగా అదుపు చేస్తున్నాడు.

దివ్యఖుర్‌ఆన్‌ను సందేహిస్తున్న అవిశ్వాసుల వైఖరిని, ముహమ్మద్ ప్రవక్త (సఅస)ను మాంత్రికుడిగా భావించే అవిశ్వాసుల ధోరణిని ఈ సూరాలో ప్రశ్నించడం జరిగింది. అవిశ్వాసుల లక్షణాలను ఈ సూరా వివరించింది. వారు సర్వవ్యాపితమైన అల్లాహ్ చిహ్నాలను లక్ష్య పెట్టరు. తమకు లాభం కాని, నష్టం కాని కలిగించలేని వాటిని పూజిస్తారు. అవి తమకోసం దేవునికి సిఫారసు చేస్తాయని భావిస్తారు. తమకు ఒక మహత్యాన్ని చూపించమని వాళ్ళు ప్రవక్తను అడుగుతారు. ఒకవేళ వారికి ఒక మహత్యం చేసి చూపించినా వారు విశ్వసించేది ఉండదు. పరలోకంలో నరకాగ్నితో ముఖాముఖి అయినప్పుడే వాళ్ళు అల్లాహ్‌ను విశ్వసిస్తారు. వాళ్ళు దేన్నీ అనుసరించరు, తమ మనోకాంక్షలనే అనుసరిస్తారు. వాళ్ళు ప్రాపంచిక జీవితంలో మునిగిపోయిన వారు, అల్లాహ్‌ను కలవడాన్ని ఇష్టపడరు. వాళ్ళు తమకు తామే

నష్టం చేసుకుంటున్నారు. చివరకు అపజయం పొందిన వారవుతారు.వారు అధర్మానికి కట్టుబడిన వారు, చెవిటివారు, మూగవారు, అల్లాహ్ గురించి అబద్ధాలు కల్పిస్తుంటారు.

**ముఖ్యాంశాలు**

**అవకాశవాదం :**

మనిషి తనకు కష్టం ఎదురైనప్పుడు అల్లాహ్‌కు మొరపెట్టుకుంటాడు. సహాయం కోసం అల్లాహ్‌ను అర్థిస్తాడు. కాని, అల్లాహ్ కారుణ్యాన్ని పొందిన తర్వాత కష్టం నుంచి గట్టెక్కి అల్లాహ్‌ను మరిచిపోతాడు. అల్లాహ్ ఆదేశాలను లక్ష్యపెట్టడు.

**నిరంకుశ అణచివేత :**

నిరంకుశ అణచివేతలకు పాల్పడిన నియంతలకు వినాశం తప్పదు. అల్లాహ్ ఆగ్రహం దుష్టులపై పడడం తప్పదు. ఫిర్ఔన్ కథ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ.

**గెలుపొందిన వారు, ఓడినవారు :**

అల్లాహ్ సందేశాన్ని తిరస్కరించిన వారు, పరలోక శిక్ష విషయంలో భయపడని వారు ఓటమి పాలవుతారు. అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని స్వీకరించినవారు ప్రయోజనాలు పొందుతారు. సత్యాన్ని తిరస్కరించిన వారు నష్టాన్ని చవిచూస్తారు. చివరకు ఓటమి పాలవుతారు.

**ఊహలు :**

ఊహలు, అంచనాలు సత్యానికి సాటి కావు. అవిశ్వాసులు కేవలం ఊహలపై ఆధారపడుతున్నారు. స్పష్టమైన సాక్ష్యాధారాలను చూడలేకపోతున్నారు.



**11 వ అధ్యాయం**

# హూద్

**పరిచయం**

ఇది మక్కా కాలంలో అవతరించిన సూరా. దీనిలో మొత్తం 123 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా దివ్యఖుర్ఆన్‌లోని రెండు ముఖ్యమైన విషయాలను నొక్కి చెప్పింది. దివ్యఖుర్ఆన్ నిర్దిష్టమైనదని, నిర్ణయాత్మకమైనదని, వివరణాత్మకమైనదనీ స్పష్టం చేసింది. దివ్యఖుర్ఆన్ బోధనల వివరణ స్వయంగా దివ్యఖుర్ఆన్ అందిస్తుందని కూడా ఈ సూరా విస్పష్టం చేసింది. ప్రాచీన కాలానికి చెందిన ప్రవక్త హూద్(అస) పేరును ఈ సూరాకు పెట్టడం జరిగింది. ఈ సూరాలో ఆయనకు సంబంధించిన కథను తెలుపడం జరిగింది. దక్షిణ అరేబియాలో ఆ కాలంలో నివసించిన ఆద్ జాతి వద్దకు ఆయన ప్రవక్తగా పంపబడ్డారు. ఈ సూరా ఏకదైవారాధన (తౌహీద్) గురించి నొక్కిచెబుతూ, ప్రవక్త ముహమ్మద్ (సఅస) గురించి వర్ణిస్తూ ప్రారంభమయ్యింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) హెచ్చరిక చేసే వారని, శుభవార్త అందించే వారని ఈ సూరా వర్ణించింది.

ఈ సూరాలో అనేక మంది ప్రాచీన కాలానికి చెందిన ప్రవక్తల ప్రస్తావనలు వచ్చాయి. ఈ ప్రవక్తలు అందరూ ఏకదైవారాధనను, మరణించినవారు మళ్ళీ లేపబడతారని బోధించారు. ఈ బోధనలు ప్రవక్త ముహమ్మద్ (సఅస) బోధనల వంటివే. నూహ్, హూద్, సాలిహ్, లూత్, షుఐబ్, మూసా ప్రవక్తలు (వారిపై శాంతి కురియుగాక) చూపించిన సహనం, వారి దృఢచిత్తం, వారి సంఘర్షణ చివరకు ఫలితాలు సాధించాయి. వారందరూ విజయం సాధించారు. నూహ్(అస) 950 సంవత్సరాల పాటు తన జాతి ప్రజలకు హితబోధ చేసారు. కాని ఆయన బోధనలను ఆ జాతి ప్రజలు పెడచెవిన పెట్టారు. కేవలం కొద్ది మంది మాత్రమే ఆయనను విశ్వసించారు. మిగిలిన వారందరూ ఆయనను పరిహసించారు. ఆయన

సందేశాన్ని విశ్వసించడానికి నిరాకరించారు. అల్లాహ్ ఆదేశం ప్రకారం నూహ్ (అస) ఒక ఓడను తయారు చేయడం ప్రారంభించారు. ఆయన ఓడను తయారు చేయడాన్ని చూసిన ప్రజలు మరింతగా ఎగతాళి చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత భారీ వరదలు ముంచెత్తాయి. ఆకాశం నుంచి కుంభవృష్టి కురిసింది. నీటి ఊటలు పెల్లుబికాయి.

అదేవిధంగా హూద్(అస)ను కూడా ఆయన జాతి ప్రజలు అహంకారంతో, గర్వంతో తిరస్కరించారు. హూద్(అస) జాతి ప్రజలకు తమ బలసామర్థ్యాలపై చాలాగర్వం ఉండేది. కాని వారిని బలమైన, తీవ్రమైన గాలులు సర్వనాశనం చేసాయి. ఈ సూరాలో ప్రస్తావించిన ఇతర ప్రవక్తలకు చెందిన జాతుల ప్రజల్లో అవిశ్వాసులు ఇదేవిధంగా నాశనాన్ని చవిచూసారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅస) జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఈ సూరా అవతరించింది. అందువల్లనే ఈ సూరాలో గత కాలాలకు చెందిన ప్రవక్తల కథలను వివరించడం జరిగింది. ఈ సూరా అవతరించిన కాలంలో ముహమ్మద్ (సఅస) సతీమణి హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) పరమపదించారు. ప్రవక్త పినతండ్రి అబూతాలిబ్ కూడా మరణించారు. అబూతాలిబ్ చివరి వరకు అవిశ్వాసిగానే ఉన్నప్పటికీ ప్రవక్త ముహమ్మద్(సఅస)కు జీవితాంతం వెన్నుదన్నుగా నిలిచారు. ఈ క్లిష్టసమయంలో అవిశ్వాసుల అణచివేతలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అపహాస్యాలు అధికమయ్యాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను, ప్రవక్త అనుచరులను అవిశ్వాసులు బాధించడం తీవ్రమయ్యింది. ఈ నేపథ్యంలో ప్రవక్త (సఅస)కు ఊరట ఇవ్వడానికి, ఆయన స్థయిర్యాన్ని పెంచడానికి, విశ్వాసాన్ని దృఢతరం చేయడానికి ఆయా ప్రవక్తల గురించి తెలుపడం జరిగింది. స్థిరచిత్తంతో తమ ఉద్యమాన్ని కొనసాగించాలన్న పాఠాన్ని ఈ కథలు ప్రవక్త (సఅస)కు ఆయన అనుచరులకు అందించాయి. సహనంగా ఉండాలని, అల్లాహ్ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగాలని, స్థయిర్యాన్ని కోల్పోరాదని, అవిశ్వాసులు ఆరాధిస్తున్న వాటిని చూసి నిరుత్సాహానికి గురికారాదని, రుజుమార్గాన స్థిరంగా కొనసాగాలని, కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, కేవలం అల్లాహ్‌ను



మాత్రమే నమ్ముకోవాలని ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను సూచించడం జరిగింది.

ఈ సూరాలో అవిశ్వాసుల లక్షణాలను గురించి కూడా తెలుపడం జరిగింది : వారు అల్లాహ్ గురించి అసత్యాలు సృష్టిస్తారు. ప్రజలు అల్లాహ్ మార్గం నుంచి వైదొలిగేలా చేస్తారు. మార్గం తప్పించడానికి కృషి చేస్తారు. వారికి కేవలం ప్రాపంచిక జీవితం పట్ల, ప్రాపంచిక జీవితంలోని ఆకర్షణల పట్ల మాత్రమే ఆసక్తి ఉంది. వారు పరలోకాన్ని విశ్వసించడంలేదు. వాళ్ళు అపజయం పాలయ్యేజనం. వారు చెవిటి వారు, మూగవారు, గ్రుడ్డివారు. వారికి రెట్టింపు శిక్ష విధించడం జరుగుతుంది. ఈ సూరా విశ్వాసుల లక్షణాలను వివరించింది. విశ్వాసులు పశ్చాత్తాపపడుతూ, దేవుని క్షమాభిక్ష అర్థిస్తూ ఉండాలనీ, అల్లాహ్ ఆదేశాలను నిరాకరించి సర్వనాశనమైన గతజాతుల చరిత్ర నుంచి పాఠాలు గ్రహించాలని బోధించడం జరిగింది.

మనిషి గురించి, అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి ఈ సూరాలో ప్రస్తావనలు ఉన్నాయి. మనిషిపై దేవుని కారుణ్యం దూరమైతే నిరాశపడిపోతాడు, అల్లాహ్ తనకు గతంలో చేసిన మేళ్ళకు కృతజ్ఞతలు తెలుపడం మరిచిపోతాడు. కాని, తనకు ఏ కష్టం లేనప్పుడు గర్వంతో విర్రవీగుతాడు. ఈ సందర్భంగా అల్లాహ్ అన్ని విధాల శక్తిసామర్థ్యాలు కలిగిన వాడన్న విషయాన్ని స్పష్టంగా వివరించడం జరిగింది. ప్రతి ప్రాణికి పూర్తి పోషణను ఇస్తుంది అల్లాహ్ మాత్రమేనని, ఆయనే భూమ్యాకాశాలను సృష్టించాడని, వృద్ధమహిళకు కూడా గర్భం దాల్చే వరం ఆయన ప్రసాదించగలడని ఈ సూరా వివరించింది.

## ముఖ్యాంశాలు

### అల్లాహ్ ఆగ్రహం :

అల్లాహ్ కారుణ్యాన్ని, ఆయన కృపాకటాక్షాలను దుర్వినియోగం చేయరాదు. మనిషి ఉద్దేశ్యపూర్వకంగా చేసిన తప్పులకు, కృతఘ్నతకు శిక్ష అనివార్యంగా వస్తుంది. సత్యాన్ని తిరస్కరించిన వారికి బాధాకరమైన శిక్ష తప్పదు.

**తిరస్కారం :**

దైవతిరస్కారానికి, అధర్మానికి పాల్పడిన జాతి, నియంతలు, అవినీతిపరులు నాయకులుగా ఉన్న జాతి నాశనానికి గురవుతుంది. షుఐబ్ ప్రవక్త (అస) జాతి ప్రజల కథ, ఫిర్ఔన్ కథ, ఇందుకు చక్కని ఉదాహరణ.

**పశ్చాత్తాపం :**

అల్లాహ్ ప్రసన్నత పొందడానికి, ఆయన అనుగ్రహాన్ని, కారుణ్యాన్ని పొందడానికి పశ్చాత్తాపపడుతూ అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరుతూ ఉండాలి. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడునూ.

**అల్లాహ్‌యే రక్షకుడు :**

అల్లాహ్ తన కారుణ్యంతో తనను నమ్ముకున్న వారిని రక్షిస్తాడు. అన్ని వ్యవహారాలు చివరకు తుది నిర్ణయం కొరకు ఆయన వద్దకే మరలి పోతాయి.

**అల్లాహ్ హెచ్చరికలు :**

అల్లాహ్ ఏ జాతినీ అన్యాయంగా శిక్షకు గురి చేయడు. ప్రజలే తప్పులు చేస్తారు. ఆ విధంగా అల్లాహ్ ఆగ్రహానికి గురి అవుతారు. ప్రజలు నిరంకుశంగా వ్యవహరించి, ఒకరికొకరు నష్టం కలిగించుకుంటారు. చెడు చేష్టలకు పాల్పడుతారు, స్వలింగ సంపర్కం, అణచివేతలు, నిరంకుశత్వం వంటి చెడులకు పాల్పడుతారు. దేవుని ఆగ్రహం వారిపై విరుచుకుపడే వరకు ఇలాంటి చెడులు కొనసాగిస్తారు.



**12 వ అధ్యాయం**

# యూసుఫ్

**పరిచయం**

యూసుఫ్ సూరా మక్కా కాలంలో అవతరించిన సూరా. ఈ సూరాలో మొత్తం 111 ఆయతులు ఉన్నాయి. దివ్యఖుర్ఆన్ స్పష్టమైన గ్రంథమనీ, సత్ప్రవర్తనను, నైతిక నడవడికను బోధించే గ్రంథమని ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్యఖుర్ఆన్‌లో సవివరంగా తెలుపబడిన కథ యూసుఫ్ ప్రవక్త(అస)కు సంబంధించిన కథ. ఆధ్యాత్మిక, నైతిక బోధనలు నిండుగా ఉన్న కథ ఇది. యూసుఫ్(అస) ఎదుర్కొన్న కష్టాలు, ఇబ్బందులు, సవాళ్ళతో గడిచిన ఆయన జీవితం ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు తెలుపడం జరిగింది. ఆయనకు ఊరట నివ్వడానికి, ఈ కథ ద్వారా పాఠాలు గ్రహించడానికి ఈ కథను వివరించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) ఈ సూరా అవతరించిన కాలంలో యూసుఫ్(అస) మాదిరి కష్టాలను, సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. ప్రవక్త(సఅస) సతీమణి హజ్రత్ ఖదీజా(రజి), ఆయన పినతండ్రి అబూతాలిబ్‌లు మరణించిన నేపథ్యం అది.

యూసుఫ్(అస) కథ విషయానికి వస్తే, ప్రవక్త యాకూబ్ (అస) పన్నెండు మంది కుమారుల్లో అందరికన్నా చిన్నవాడు యూసుఫ్ (అస). ఆయన తండ్రి యాకూబ్ (అస)కు నలుగురు భార్యలు. యూసుఫ్(అస) తల్లికి జన్మించిన సోదరుడు బెంజామిన్. మిగిలిన పదిమంది సవతి సోదరులు. యాకుబ్ (అస)కు చిన్న కుమారుడు యూసుఫ్ (అస) అంటే అమిత ప్రేమాభిమానాలు ఉండేవి.

ఒకసారి యూసుఫ్(అస) కలలో పదకొండు నక్షత్రాలు, సూర్యచంద్రులు తన ముందు సాష్టాంగపడినట్లు చూసారు. ఈ కల గురించి ఆయన తన తండ్రికి చెప్పారు. ఈ కల గురించి నీ సోదరులకు చెప్పవద్దు, ఈ కల ఒక గొప్ప భవిష్యత్తును సూచిస్తోందని తండ్రి ఆయనకు చెప్పారు. ఆయనకు చిన్న కుమారుడంటే అమితమైన

ప్రేమ. మిగిలిన కుమారులు ఈ విషయాన్ని గుర్తించారు. వారు యూసుఫ్(అస) పట్ల ఈర్ష్యాసూయలు పెంచుకున్నారు. ఆయన్ను ద్వేషించేవారు. తండ్రి ప్రేమాభిమానాలు తాము మాత్రమే పొందాలన్న ఉద్దేశ్యంతో వారు యూసుఫ్(అస)ను హత్య చేయాలని పథకం వేసారు. వారు యూసుఫ్(అస)ను తీసుకుని ఆడుకోవడానికి బయటకు వెళతామని తండ్రికి చెప్పారు. తండ్రి అభ్యంతరం చెప్పారు. తోడేలు దాడి చేస్తే, పసివాడయిన యూసుఫ్‌ను తినేస్తే ఎలా అని భయం వెలిబుచ్చారు. అయితే మిగిలిన కుమారులు ఆయనకు ధైర్యం చెప్పి తాము యూసుఫ్(అస)ను జాగ్రత్తగా చూసుకుంటామని అన్నారు. పదిమంది సవతి సోదరులకు యూసుఫ్(అస) అంటే అస్సలు గిట్టదు. యూసుఫ్(అస)ను బావిలో తోసి చంపేయాలని పథకం వేసారు. అతని చొక్కాకు నకిలీ రక్తం అంటించి తండ్రి వద్దకు వచ్చి తాము పరుగెత్తుతున్నప్పుడు యూసుఫ్ వెనకబడిపోయాడని, ఒక తోడేలు వచ్చి తినేసిందని చెప్పారు.

ఈజిప్టు వెళుతున్న యాత్రికుల బృందం బావిలో ఉన్న యూసుఫ్(అస)ను చూసింది. ఆయన్ను రక్షించి ఈజిప్టు తీసుకు వెళ్ళి స్వల్ప ధరకు బానిసగా అమ్మేసింది. ఈజిప్టు రాజదర్బారులో పనిచేసే ఒక ఉన్నతాధికారి ఆయన్ను కొనుక్కున్నాడు. తన ఇంటికి తీసుకెళ్ళి, ఆయన్ను కుటుంబసభ్యుని మాదిరిగా గౌరవంగా చూడాలని తన భార్యకు చెప్పాడు. కాని ఆమె యూసుఫ్(అస)ను చూడగానే ఆయనపై మరులు కొన్నది. కాని యూసుఫ్(అస) సత్ప్రవర్తన కలిగిన యువకుడు. ఆమె కోరికను కాదన్నారు. ఆమె ఆయన గదిలోకి వచ్చి తలుపులే వేసేసింది. ఆయన బయటకు పోవడానికి తలుపు వైపునకు పరుగెత్తారు. ఆమె యూసుఫ్(అస) చొక్కాను వెనకనుంచి పట్టుకుంది. చొక్కా చిరిగిపోయింది. అప్పటికి ఎలాగో తప్పించుకున్న యూసుఫ్(అస) ఆ తర్వాత విచారణను ఎదుర్కొన్నారు. ఆమె చేసిన అసత్య ఆరోపణ కారణంగా ఆయన జైలు పాలయ్యారు.

జైలులో తోటి ఖైదీలకు ఆయన ఆదర్శం అయ్యారు. దయ, సద్భావనలకు నమూనాగా నిలిచారు. ఆయన వారికి అల్లాహ్‌కు భయపడాలని బోధించారు. సత్యాన్ని ఎరుకపరిచారు. యూసుఫ్ (అస) వివేకానికి, బుద్ధిజ్ఞానాలకు, కలల



అర్థం చెప్పే విద్యకు పెట్టింది పేరుగా పరిగణించబడ్డారు. రాజుగారి కలకు ఖచ్చితమైన అర్థం చెప్పడం ద్వారా ఆయన జైలు నుంచి విడుదల అయ్యారు. ఆయన్ను జైలుకు పంపిన దర్బారు ఉద్యోగి భార్య కూడా ఆయన అమాయకుడనీ, తానే ఆయనపై మనసుపడ్డానని ఒప్పుకుంది. యూసుఫ్(అస) రాజుగారి కలకు అర్థం చెబుతూ, ఈజిప్టుకు ఏడు సంవత్సరాల కరువు పట్టుకోనుందని, ఆ కరువును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం ఎంతయినా అవసరమని చెప్పారు. ఆహారధాన్యాలను నిలువ ఉంచడం ద్వారా ఆ కరువును ఎదుర్కోవాలని చెప్పారు. రాజుగారు ఆయన వివేకానికి మెచ్చుకుని, ఆహారధాన్యాల గిడ్డంగులను పర్యవేక్షించే ఉన్నతాధికారిగా నియమించారు. ఆయనకు కావలసిన అధికారాలన్నీ ఇచ్చారు.

కానన్‌లో (ఖుద్స్ (జెరుసలేం)కు ఉత్తరాన ముప్పయి మైళ్ళ దూరాన ఉన్న నెబ్లుస్‌కు దగ్గరగా ఉంది)ఉన్న ఆయన కుటుంబం కూడా కరువుకు గురయ్యింది. యూసుఫ్(అస) సవతి సోదరులు కూడా ఆహారధాన్యాలు పొందడానికి ఈజిప్టు వచ్చారు. కాని వాళ్ళు ఆయన్ను గుర్తించలేదు. అయితే యూసుఫ్(అస) వారిని గుర్తించారు. వారి పట్ల మంచిగా వ్యవహరించారు. వారి సోదరుడు బెంజామిన్‌ను కూడా తీసుకు రావలసిందిగా చెప్పారు. ఆ సవతి సోదరులు రెండవసారి ఈజిప్టు వచ్చినపుడు బెంజామిన్‌ను కూడా వెంటబెట్టుకుని వచ్చారు. యూసుఫ్(అస) ఒక ఎత్తుగడగా బెంజామిన్‌ను దొంగతనం నేరానికి బంధిస్తున్నట్లు చెప్పి తన వద్దనే ఉంచుకున్నారు. ఈ విషయం తెలిసి తండ్రి యాకూబ్ (అస) క్రుంగిపోయారు. ఆయన తన కుమారులను మళ్ళీ ఈజిప్టు వెళ్ళి బెంజామిన్‌ను విడిపించుకు రావలసినదిగా కోరారు. వాళ్ళు మళ్ళీ వచ్చి యూసుఫ్(అస)ను కలిసినపుడు ఆయన వారికి తానెవరో తెలిపారు. ఇంటికి వెళ్ళి తండ్రిని ఇతర కుటుంబ సభ్యులను తీసుకురావలసినదిగా చెప్పారు. యూసుఫ్(అస) కుటుంబ సభ్యులు ఈజిప్టుకు ఆయన వద్దకు వచ్చి సంతోషంగా జీవించారని ఈ సూరా వివరించింది. యూసుఫ్(అస) చూసిన కల నిజమయ్యింది. యూసుఫ్(అస) ఒక ఉన్నతాధికారిగా ప్రాపంచిక జీవితంలో విజయం సాధించారు. దివ్యఖుర్ఆన్ కథల్లో వివేకం కలిగినవారు గ్రహించడానికి గుణపాఠాలు ఉన్నాయని ఈ సూరా చివరన తెలిపింది. నిజంగా జరిగిన ఈ కథ విశ్వాసులకు మార్గ దర్శకత్వాన్ని, హితబోధను అందిస్తోంది.

## ముఖ్యాంశాలు

**కష్టాలు, దురదృష్టం :**

ఎలాంటి కష్టం ఎదురైనా మనిషి అల్లాహ్‌ను నమ్ముకోవాలి.

**ప్రజలతో వ్యవహరించడం :**

విద్వేషానికి, వైరానికి జవాబుగా దయ, క్షమాగుణాలను ప్రదర్శించడం అత్యున్నత నడవడికలోని భాగం.

**సహనం సద్గుణం :**

కష్టాల తర్వాత మంచిరోజులు ఉంటాయని విశ్వసించాలి. సహనం విజయానికి మూలకారణమవుతుంది. చివరకు సత్యమే జయిస్తుంది.

**లైంగిక ప్రలోభాలు :**

వ్యభిచారం పెద్ద చెడు. లైంగిక వాంఛలు కాంక్షల కన్నా దైవభీతికి ప్రాధాన్యం ఇవ్వాలి. లైంగిక వాంఛలు స్వయం వినాశానికి దారితీస్తాయి. అక్రమసంబంధాలను అల్లాహ్ అసహ్యించుకుంటాడు.

**నీతి సూత్రాలు :**

ధార్మిక విశ్వాసానికి సంబంధించి ఎలాంటి రాజీకి చోటు లేదు. యూసుఫ్ (అస) జైలుకు వెళ్ళడానికి ఇష్టపడ్డారు కాని, అక్రమ సంబంధానికి ఇష్టపడలేదు.

**హోదా ఔన్నత్యం :**

సదాచరణకు కట్టుబడిన వారికి, సన్మార్గ సూత్రాలను పాటించిన వారికి అల్లాహ్ హోదాస్థానాలు ఉన్నతం చేస్తాడు.

**ఫిర్యాదులు :**

కష్టాల్లో ఉన్నప్పుడు కేవలం అల్లాహ్‌కు మాత్రమే మన దుఃఖం గురించి, మన కష్టం గురించి మొరపెట్టుకోవాలి.



**కుట్రలు :**

అమాయకులపై కుట్రలు పన్నేవారు సఫలం కాలేరు. కుట్రలు, ద్వేషాలు చెడ్డవి. ఇవి ఇతరుల సుఖసంతోషాలను నాశనం చేస్తాయి. స్వయంగా కుట్రలకు పాల్పడేవారి సుఖసంతోషాలు కూడా నాశనం అవుతాయి. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా చివరకు అల్లాహ్ తలచినదే జరుగుతుంది.

## 13 వ అధ్యాయం

# అర్రాద్

# ఉరుము

## పరిచయం

ఈ సూరా మదీనా కాలంలో అవతరించిన సూరా. ఇందులో 43 ఆయతులు ఉన్నాయి. దివ్యఖుర్ఆన్ దేవుని తరఫున అవతరించిన దైవవచనమనీ ఈ సూరా నొక్కిచెబుతుంది. ఈ సూరాలోని 13వ ఆయత్‌లో ప్రస్తావించబడిన ఉరుము పేరు ఈ సూరాకు పెట్టడం జరిగింది. ఈ సూరా ఇతర ఇస్లామీయ విశ్వాసాలను కూడా తెలియజేసింది. తౌహీద్ (ఏకదైవారాధన), మరణించిన వారు మళ్ళీ లేపబడడం మొదలైన ఇస్లామీయ విశ్వాసాల గురించి ఉద్బోధించింది. దైవవచనాల అవతరణకు, ముహమ్మద్ (సఅస) ప్రవక్త పదవికి సంబంధించి అవిశ్వాసుల మనస్సులో ఉన్న సందేహాలను నివారించడానికి కూడా ఈ సూరా ప్రయత్నించింది. ప్రకృతిలో, విశ్వంలో మనిషికి స్పష్టంగా అల్లాహ్ శక్తిసామర్ధ్యాలు కనబడుతున్నాయి. మనిషి ఆలోచించి అర్థం చేసుకోవడానికి ఇవి చాలు. ఈ ఆధారాల ద్వారా దివ్యఖుర్ఆన్ దేవుని తరఫున అవతరించిన దైవవచనమని ఈ సూరా నిరూపించింది. అల్లాహ్ శక్తిసామర్ధ్యాలను, ఆయన ఒక్కడే అన్న నిజాన్ని, సృష్టించే ఆయన సామర్ధ్యాన్ని నిరూపించే వివరాలను ఈ సూరా తెలియజేసింది. ఈ సాక్ష్యాధారాలు ప్రకృతి శక్తుల్లోనూ, మన చుట్టూ ఉన్న విశ్వంలోనూ అసంఖ్యాకంగా ఉన్నాయి. భూమ్యా

కాశాల భారాన్ని భరిస్తున్నది అల్లాహ్ మాత్రమే అని ఈ సూరా నొక్కి చెప్పింది.

దైవవచనం గురించి, ఇది అల్లాహ్ తరఫున అవతరించిన వచనమని ఖచ్చితంగా చెబుతూ ఈ సూరా ప్రారంభమయ్యింది. ఆ పిదప అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ప్రకృతిలో ఉన్న అపార శక్తులను గురించి వివరంగా చెప్పింది. దైవవచనాలు సత్యమని నమ్మడానికి, ముహమ్మద్ (సఅస) దైవప్రవక్త అని విశ్వసించడానికి గాను తమకు మహత్యాలు చూపించమని అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను ప్రశ్నించినపుడు, ఈ సూరా అల్లాహ్‌కు చెందిన సృష్టించే శక్తిసామర్థ్యాలను నిరూపించే సూచనలను తెలియజేసింది. అల్లాహ్ శక్తిసామర్థ్యాలను అర్థం చేసుకోవడానికి ఆధారాలుగా, దివ్యఖుర్‌ఆన్ దైవవచనమని తెలుసుకోవడానికి సాక్ష్యాలుగా వీటిని ప్రస్తావించింది. ప్రకృతి శక్తులలో నిత్యం మనం అల్లాహ్ చిహ్నాలను చూడగలం. విశ్వంలో ఈ చిహ్నాలను వీక్షించగలం. ఎలాంటి ఆధారం లేకుండా అల్లాహ్ ఆకాశాలను పైకెత్తాడనీ, సూర్యచంద్రుల గమనాన్ని అదుపు చేస్తున్నాడని, వాటిని నిర్దిష్ట కక్ష్యలలో నడిచేలా చేస్తున్నాడని, భూమిని విశాలంగా చేసాడనీ, భూమిపై పర్వతాలను సృష్టించాడనీ, దానిపై సెలయేర్లు, నదులు ప్రవహించేలా చేసాడనీ, అన్ని రకాల పండ్ల జతలను పండిస్తున్నది ఆయనేననీ, ద్రాక్షతోటలు, పంటపొలాలు, ఖర్జూరపు చెట్లు అన్నింటిని సృష్టించింది ఆయనేననీ, రాత్రింబవళ్ళను నియంత్రిస్తుంది ఆయనేననీ, ప్రతి గర్భిణీ గర్భంలో ఏమున్నదో (గర్భంలోని శిశువు విధివ్రాత, ఆయుష్షు మొదలైనవి) ఆయనకు తెలుసనీ, అందులో తయారయ్యేది ఏదో, అందులో జరిగే హెచ్చుతగ్గులు ఏవో ఆయనకే తెలుసుననీ, అగోచరాలను, కళ్ళకు కనిపించే వాటిని అన్నింటిని తెలిసిన వాడని, మనం బయట పెట్టని ఆలోచనల గురించి, మనం బయటకు చెప్పే విషయాల గురించి కూడా తెలిసిన వాడని, రాత్రి సమయంలో గాని, పగటిపూట గాని జరిగే మంచి చెడు పనులన్నింటి గురించి తెలిసిన వాడనీ ఈ సూరా తెలియజేసింది.

ఈ సూరా ఉరుములు దేవుని శక్తిసామర్థ్యాలకు చిహ్నాలుగా పేర్కొంది. ఉరుములు అద్భుతమైన చిహ్నాలు. సృష్టి, పునఃసృష్టి, ప్రతీకారం, ఔన్నత్యాలకు సంబంధించి ఇవి అద్భుతమైన చిహ్నాలు. ప్రాణాధారంగా అల్లాహ్ నీటిని సృష్టించాడు. ఈ సూరా మనకు ఉరుములకు సంబంధించి రెండు తీవ్రతలను తెలియజేసింది. అవి వర్షానికి చిహ్నాలు కావచ్చు. అంటే దేవుని కారుణ్యానికి చిహ్నాలు. అలాగే ఇవి



వినాశానికి చిహ్నం కావచ్చు. ప్రజలు పిడుగుపాటుకు బలి కావచ్చు. ఆకాశంలో మేఘాలు కారుణ్యానికి సూచనలు కావచ్చు, ప్రతీకారానికి సూచనలు కావచ్చు. మబ్బులు వర్షం కురిపించి నీటిని ఇవ్వవచ్చు, లేదా ఉరుములను కురిపించవచ్చు. అంటే మబ్బుల్లో రెండు విభిన్నాంశాలు ఉన్నాయి. నీరు, అగ్ని. అల్లాహ్ శక్తి సామర్థ్యాలకు ఇది ఒక విశిష్టమైన చిహ్నం. సృష్టిలోని సమస్తం, ఒక్క మనిషి తప్ప మిగిలినవన్నీ దేవుని పట్ల కృతజ్ఞత కలిగి ఉన్నాయని ఈ సూరా తెలియజేస్తోంది. ఉరుములు మెరుపులు దేవుని ఔన్నత్యాన్ని చాటిచెబుతున్నాయి. భూమిపై ఉన్న సమస్త సృష్టి రాసులు, విశ్వంలోని సమస్తం అల్లాహ్‌ను స్తుతిస్తున్నాయి. ఆయన ఔన్నత్యాన్ని కొనియాడుతున్నాయి. కాని మానవుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. సత్యధర్మాన్ని తిరస్కరిస్తున్నాడు. ప్రవక్తలను పరిహసిస్తున్నాడు. మహత్యాలు చూపించమని అడుగుతున్నాడు. తన ముందు ఉన్న, తనలో ఉన్న అసంఖ్యాక చిహ్నాలను, దేవుని శక్తిసామర్థ్యాలు చాటిచెప్పే చిహ్నాల గురించి ఆలోచించడం లేదు. కేవలం మహత్యాలు మాత్రమే అల్లాహ్ ఉనికిని నిరూపించే మార్గాలుగా భావించరాదని ఈ సూరా నొక్కి చెప్పింది. అద్భుతంగా సృష్టించబడిన ప్రకృతి, విశాలమైన ఈ విశ్వం, లోపంలేని విశ్వవ్యవస్థ ఇవన్నీ అల్లాహ్ శక్తి సామర్థ్యాలకు బలమైన సాక్ష్యాధారాలు. ప్రకృతిని, ఈ విశ్వాన్ని సృష్టించడం, దిశా నిర్దేశనం చేయడం అల్లాహ్ శక్తిసామర్థ్యాలకు ప్రత్యక్ష నిదర్శనాలు. వీటన్నింటిని సృష్టించిన అల్లాహ్ ప్రజలను మరణించిన తర్వాత లేపి నిలబెట్టగలడు.

విశ్వాసులు అవిశ్వాసులకు మధ్య తేడాలను ఈ సూరా వివరించింది. విశ్వాసులు బుద్ధివివేకాలతో వ్యవహరిస్తారు. అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తారు. అల్లాహ్ పట్ల తమ ధార్మిక బాధ్యతలను నిర్వర్తిస్తారు. అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి ఉంటారు. అల్లాహ్‌కు భయపడతారు. తీర్పుదినానికి భయపడతారు. సహనాన్ని పాటిస్తారు. నమాజులు స్థిరంగా పాటిస్తారు. రహస్యంగాను, బహిరంగంగాను దానధర్మాలు చేస్తారు. అల్లాహ్‌తో క్షమాభిక్షను వేడుకుంటారు. అల్లాహ్ నామ స్మరణ వినగానే వారి హృదయాలకు ప్రశాంతత చేకూరుతుంది. అల్లాహ్ అనుగ్రహాలను, స్వర్గవనాలను పొందేవారు వీరే.

అవిశ్వాసులను వర్ణిస్తూ, వారు బుద్ధివివేకాలను ఉపయోగించని వారని ఈ సూరా పేర్కొంది. వారు మహత్యాలు చూపండని అడుగుతారు. ప్రకృతిలోను, విశ్వంలోను ఉన్న అల్లాహ్ చిహ్నాలను చూసి ఆలోచించరు. మరణించిన వారు మళ్ళీ లేపబడతారన్న నిజాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తారు. ధార్మిక విశ్వాసాన్ని

తిరస్కరిస్తారు. ప్రవక్తలను అవహేళన చేస్తారు. కుట్రలకు కుతంత్రాలకు పాల్పడుతారు. అల్లాహ్‌ను గాక ఇతరులను సంరక్షకులుగా చేసుకుంటారు. అల్లాహ్ పట్ల తమ నైతిక బాధ్యతలను విస్మరిస్తారు. మానవ సంబంధాలను, కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నపరుస్తారు. బీదలు, అనాథల పట్ల తమ బాధ్యతలను గుర్తించడానికి నిరాకరిస్తారు. భూమిపై కల్లోలాన్ని, అవినీతిని వ్యాపింపజేస్తారు. ప్రాపంచిక జీవిత సుఖభోగాల్లో మునిగి ఉంటారు. అల్లాహ్ శాపానికి గురైన వారు, ఓటమికి గురైన వారు, నరకానికి ఆహుతయ్యేవారు వీరే.

ఈ సూరా గ్రంథప్రజల గురించి క్లుప్తంగా ప్రస్తావించింది. అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టరాదని వారికి నొక్కి చెప్పడం జరిగింది. వీరిలో కొందరు దైవవచనాల అవతరణను విశ్వసిస్తారు కాగా కొందరు నిరాకరిస్తారని ఈ సూరా పేర్కొంది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) తన ఉద్యమాన్ని కొనసాగించాలని బోధించింది. ఆయన మానవాళికి మార్గదర్శకుడనీ, హెచ్చరిక చేసేవాడని నొక్కిచెప్పింది.

## ముఖ్యాంశాలు

**మార్పులు :**

ప్రజల నడవడిక మార్పునకు గురైనప్పుడు, పర్యవసానంగా వారి పరిస్థితులు కూడా మారతాయి. ప్రజలు తమ అనైతిక ఆచారాలను, అజ్ఞాన వ్యవహారాలను మార్చుకోనంతవరకు అల్లాహ్ కూడా వారి పరిస్థితులను మార్చడని ఈ సూరా తెలియజేసింది.

**ప్రశాంతత :**

అల్లాహ్ స్మరణ వల్ల హృదయాలకు ప్రశాంతత చేకూరుతుంది. మనిషికి మానసికశాంతి, నెమ్మది అల్లాహ్ స్మరణ వల్ల లభిస్తాయి.

**ప్రాపంచిక జీవితం :**

ప్రాపంచిక జీవనం తాత్కాలికమైనది. పరలోకంలోని శాశ్వత జీవితాన్ని గెలుచుకోవడానికి ఈ ప్రాపంచిక జీవితాన్ని మనిషి ఉపయోగించుకోవాలి.



**14 వ అధ్యాయం**

# ఇబ్రాహీమ్

## పరిచయం

ఇబ్రాహీమ్ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 52 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తౌహీద్ (ఏకదైవారాధన)ను నొక్కి చెప్పింది. తీర్పు దినాన్ని, దైవగ్రంథాలను, దైవప్రవక్తలను విశ్వసించడం తదితర ధార్మిక విశ్వాసాల గురించి బోధించింది. ఈ సూరాలోని ఆయత్ 35లో ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరాకు ఆయన పేరునే పెట్టడం జరిగింది. ప్రవక్తలందరి సందేశం, బోధనలు ఒక్కటేననీ ఈ సూరా వివరించింది. సమస్త ఆరాధనలకు అర్హుడైన ఒకే ఒక్క దేవుని గురించి ప్రజలకు తెలియజేయడానికే వారంతా ప్రయత్నించారు. ప్రజలను అజ్ఞానాంధకారం నుంచి వెలుగు మార్గానికి తీసుకురావడానికి, ఆ విధంగా వారిని కాపాడడానికి కృషి చేశారు. అల్లాహ్ వివిధ జాతుల వద్దకు పంపిన ప్రవక్తలు కూడా సాధారణ మానవులే. ఆయా జాతుల భాషల్లో దేవుని సందేశాన్ని వారికి చేరవేయడానికి ఈ ప్రవక్తలు అవతరించారు. కాని, ఈ ప్రవక్తలను, వారి సందేశాన్ని ఆయా జాతులు నిరాకరించడానికి, తిరస్కరించ డానికి ముఖ్య కారణం వాళ్ళు కూడా తమ వంటి సాధారణ మానవులు కావడమే. ప్రవక్తలందరూ తమ తమ జాతి ప్రజల నుంచి ఒకేవిధమైన వ్యతిరేకతను ఎదుర్కొ న్నారు. నిరంకుశ అధికారులు, దుర్మార్గులు తమ సహచరులతో కలిసి ఆయా ప్రవక్తలపై యుద్ధాలను ప్రకటించారు. ఈ సూరాలో తీర్పుదినాన్ని వర్ణించడం జరిగింది. ఆ రోజు షైతాన్ తాను మానవులను మోసగించానని ఒప్పుకుంటాడు. వాళ్ళు చేసిన పనులకు తనకు బాధ్యత లేదని అంటాడు.

అల్లాహ్‌కు బదులు విగ్రహాలను ఆరాధించే మక్కాలోని అరబ్బు తెగల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. వారి అంతం ఎలా ఉంటుందో కూడా ఈ సూరా తెలిపింది. వారు చివరకు నరకాగ్నికి గురవుతారు. తీర్పుదినాన అవిశ్వాసులకు ఎదురయ్యే బీభత్సకర పరిస్థితుల వర్ణన కూడా ఈ సూరాలో కనబడుతుంది. వారు

గుంపులు, గుంపులుగా సమీకరించబడతారు. వారి ముఖాలు అగ్నికీలలతో ఆవరించబడి ఉంటాయి. వారి దుస్తులు తారుతో పులమబడి ఉంటాయి. వారు అయోమయంతో అటూఇటూ పరుగులు తీస్తుంటారు. వారి కళ్ళు భావరహితంగా చూస్తూ ఉంటాయి. వారి తలలు ముందుకు వంగి ఉంటాయి. వారి హృదయాల్లో శూన్యం ఆవరించుకుని ఉంటుంది.

ఈ సూరాలో మూసా ప్రవక్త(అస), ఇస్రాయిల్ సంతతికి సంబంధించిన కథను క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. ఫిర్‌ఔన్ వంటి నిరంకుశ పాలకుడి దౌర్జన్యాల నుంచి అల్లాహ్ వారిని రక్షించాడు. ఫిర్‌ఔన్ వారి కుమారులను హతమార్చేవాడు. వారి స్త్రీలను విడిచిపెట్టేవాడు. అల్లాహ్ ఇస్రాయిల్ సంతతిని అనుగ్రహించాడు. అల్లాహ్ వారిపై కురిపించిన అనుగ్రహానికి గాను వారు అల్లాహ్‌కు కృతజ్ఞత చూపవలసింది. కాని వారు అలా చేయలేదు. తలబిరుసు వైఖరి అవలంబించారు. ఈ సూరా క్లుప్తంగా అల్లాహ్ శక్తిసామర్థ్యాలను వర్ణించింది. ఆయన భూమ్యాకాశాల సృష్టికర్త, ఫలాలను పండించడానికి ఆయన ఆకాశం నుంచి వర్షం కురిపిస్తాడు. నదులను, ఓడలను మానవులకు అధీనం చేసాడు. మానవుల కోసం సూర్యచంద్రులను రాత్రింబవలను ఆయన నియంత్రిస్తున్నాడని తెలుపుతూ, విశ్వాసులు నమాజు స్థాపించాలని, బహిరంగంగాను, రహస్యంగాను దానధర్మాలు చేయాలని ఈ సూరా ఉద్బోధిస్తుంది. దివ్యఖుర్‌ఆన్ మానవాళి కొరకు దేవుని తరఫున అవతరించిన దివ్య సందేశ మన్న వ్యాఖ్యతో ఈ సూరా ప్రారంభమై అదే వ్యాఖ్యతో ముగుస్తుంది. ఈ సూరా తౌహీద్ (ఏకదైవారాధన)కు సంబంధించిన పునశ్చరణతో, ఒక హెచ్చరికగా ముగుస్తుంది.

### ముఖ్యాంశాలు

**మంచి మాటలు చెడు మాటలు :**

మంచిమాటలు మధుర ఫలాలను ఇచ్చే మంచి చెట్ల వంటివి. ఇవి మంచికి సంకేతాలు. చెడు మాటలు ఎలాంటి ఫలాలను ఇవ్వని వ్యర్థమైన చెట్ల వంటివి. వాటికి నిలకడ ఉండదు.



**అల్లాహ్ అనుగ్రహాలు :**

అల్లాహ్ అనుగ్రహాలు అసంఖ్యాకమైనవి. మనిషి అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. వాటిని ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ఆయన కారుణ్యాన్ని అనుక్షణం జ్ఞాపకం చేసుకుంటూ ఆయన అనుగ్రహాలను మరింతగా పొందాలి.

**తల్లిదండ్రులు :**

తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలకు, వారి పట్ల కృతజ్ఞతకు చిహ్నంగా తల్లిదండ్రుల కోసం ప్రార్థించాలి. వారి కోసం క్షమాభిక్ష అర్థించాలి.

**సహనం :**

సహనం, స్థిరచిత్తాలు విజయానికి తాళం చెవుల వంటివి.

**అల్లాహ్‌ను ప్రార్థించడం :**

కష్టాలు, కడగండ్లు ఎదురైనప్పుడు అల్లాహ్‌కు మొరపెట్టుకోవాలి. అందరి మొరలను ఆలకించేది ఆయనే.

## 15 వ అధ్యాయం

# అల్ హిజ్ర్

# శిలా ప్రదేశం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఈ సూరాలో మొత్తం 99 ఆయతులు ఉన్నాయి. దైవవచనాల అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన వారిని మళ్ళీ లేపడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. అల్లాహ్ ఒక్కడే అన్న నిదర్శనాలను చూపిస్తూ ఈ విశ్వాసాల గురించి తెలుపడం జరిగింది. ఈ సూరాలోని 80వ ఆయతులో రాతి ప్రదేశం గురించి ప్రస్తావన ఉంది. ఈ పేరునే సూరాకు పెట్టడం జరిగింది. మదీనా నుంచి సిరియాకు వెళ్ళేదారిలో ఉన్న అరబ్బు

ప్రదేశం ఇది. ఈ ప్రాంతంలోనే సమూద్ జాతి నివసించేది. సమూద్ జాతి ప్రజలు కొండలు తొలిచి తమ నివాసాలు నిర్మించుకునేవారు. ఈ జాతి వద్దకు సాలిహ్ ప్రవక్త(అస)ను పంపడం జరిగింది. కాని సమూద్ జాతి ఆయన్ను తిరస్కరించింది. ఆయనను అవహేళన చేసింది. కొండలను తొలిచి వారు నిర్మించుకున్న నివాసాలు వారి నిర్మాణ సామర్ధ్యానికి నిదర్శనంగా ఉండేవి. దృఢమైన ఆ నివాసాలు కొండల్లో సురక్షితంగా ఉండేవి. కాని వారి ప్రవక్త సాలిహ్(అస) ద్వారా వారికి చేరవేయబడిన దివ్య సందేశాన్ని, సత్యాన్ని వారు తిరస్కరించడం వల్ల వారిపై శిక్ష విరుచుకుపడింది. ఒక భయంకరమైన భూకంపం, వెనువెంటనే నిప్పులు కక్కిన అగ్నిపర్వత పేలుళ్ళు వారిని తుడిచిపెట్టేశాయి.

ఈ సూరా ఒక హెచ్చరికతో ప్రారంభమవుతుంది. అబద్ధపు ఆశలతో భ్రమల్లో ఉంటూ, హాయిగా తింటూ, జీవితాన్ని అనుభవిస్తూ గడుపుతున్న వారిని భయపెడుతూ ప్రారంభమవుతుంది. గత జాతుల గురించి తెలుపుతూ, తమ ప్రవక్తలు తీసుకొచ్చిన దివ్యసందేశాన్ని తిరస్కరించి, అవహేళన చేసిన జాతుల పర్యవసానాన్ని వివరించింది. ఆ ప్రవక్తలు అల్లాహ్‌కు సంబంధించిన ఇంకా స్పష్టమైన సూచనలు తీసుకువచ్చినా ఆయా గర్విష్టి జాతులు వారిని, వారు తీసుకు వచ్చిన దివ్యసందేశాన్ని తిరస్కరించి ఉండేవని ఈ సూరా తెలిపింది. దేవుని అద్వితీయమైన సృష్టించే సామర్ధ్యానికి, ఆయన శక్తికి నిదర్శనాలుగా ఈ సూరా విశ్వంలోని అనేక దృష్టాంతాలను పేర్కొన్నది. ఈ నిదర్శనాలను చూసి వాటిపై ఆలోచిస్తే ప్రజలు దేవుని అద్వితీయమైన శక్తి సామర్ధ్యాలను అర్ధం చేసుకుంటారని, దైవవచనాల అవతరణను విశ్వసిస్తారని వ్యాఖ్యానించింది. ఆకాశంలోని మహా నక్షత్రసమూహాల గురించి, విశాలంగా పరచిన భూమి గురించి, దానిపై అమర్చిన పర్వతాల గురించి, భూమిని జీవనోపాధికి మార్గంగా రూపొందించడం గురించి, పంటలకు ఉపయోగపడే చల్లటి గాలుల గురించి, ఆకాశం నుంచి కురిసే వర్షం గురించి, జీవన్మరణాల గురించి, మట్టి నుంచి మనిషిని సృష్టించడం గురించి ఈ సూరా ప్రస్తావించింది.

మక్కాలోని అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్(సఅస)ను పిచ్చివాడన్నారు, ఆయన సందేశాన్ని తిరస్కరించారు. ఆయన ప్రవక్త పదవిని ప్రశ్నించారు. అల్లాహ్ స్వయంగా దివ్యఖుర్ఆన్‌ను పరిరక్షిస్తున్నాడని ఈ సూరా స్పష్టమైన ప్రకటన చేసింది. దివ్యఖుర్ఆన్ అన్ని కాలాల్లోను ఎలాంటి మార్పులు చేర్పులకు గురికాకుండా



సురక్షితంగా ఉంటుందని ప్రకటించింది. ఆదమ్(అస) షైతాన్‌ల కథ మార్గదర్శకత్వానికి, మార్గభ్రష్టత్వానికి ఉదాహరణగా గుణపాఠం గరుపుతుంది. ఈ కథను క్లుప్తంగా ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది. అల్లాహ్ ఆదేశాలను షైతాన్ తిరస్కరించాడు. ఆదమ్ (అస) ముందు సాష్టాంగపడడానికి నిరాకరించాడు. అల్లాహ్ శాపానికి గురయ్యాడు. షైతాన్ తాను ప్రజలను మార్గభ్రష్టులు చేస్తానని, దైవవచనాలను నిరాకరించేలా, సత్యాన్ని తిరస్కరించేలా చేస్తానని అన్నాడు.

ఈ సూరాలో అనేకమంది ప్రవక్తల గురించి క్లుప్తమైన ప్రస్తావనలు ఉన్నాయి. ఇబ్రాహీమ్, లూత్, షుఐబ్, సాలిహ్ (వారందరిపై శాంతి కురియుగాక)ల గురించి ప్రస్తావనలు ఉన్నాయి. ఈ ప్రవక్తల జాతి ప్రజలు అహంకారంతో వ్యవహరించారు. తమ ప్రవక్తలను అవహేళన చేసారు. కాని చివరకు ఆయా జాతులు దేవుని ఆగ్రహానికి గురయ్యాయి. ఆయా ప్రవక్తలను, వారి అనుచరులను దేవుడు కాపాడాడు. వారు చివరకు విజయాన్ని పొందారు. ఆయా ప్రవక్తల గురించిన ఈ ప్రస్తావనలు ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు సాంత్వనను ఇచ్చాయి. ఎక్కువగా దైవప్రార్ధన చేయాలని, దృఢంగా నిలబడాలని, స్థిరచిత్తంతో వ్యవహరించాలని, దేవుని ఔన్నత్యాన్ని కొనియాడాలని, ఆయన్ను స్తుతించాలని, ఆయన పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని బోధించడం జరిగింది.

## ముఖ్యాంశాలు

**శక్తి :**

ఒక జాతి ఎంత శక్తి వంతమైనదైనా సరే, ఆ జాతి అహంతో వ్యవహరించి దేవుని సందేశాన్ని నిరాకరిస్తే దైవాగ్రహానికి గురయి నాశనం కాక తప్పదు.

**సత్యం :**

సత్యం చివరకు విజయాన్ని సాధిస్తుంది. అసత్యం ఓడిపోక తప్పదు.

**నిరాశ :**

అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందరాదు. అల్లాహ్ అపార కృపాశీలుడు, అమితంగా క్షమించేవాడు.

**క్షమాగుణం :**

విశ్వాసుల తప్పులను, లోపాలను క్షమాగుణంతో మన్నించాలి.

## 16 వ అధ్యాయం

# అన్ నహ్లా

# తేనెటీగలు

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 128 ఆయతులు ఉన్నాయి. ఇస్లామీయ విశ్వాసాలు - దేవుని ఆధిపత్యం, దైవవచనాల అవతరణ, మృతులను మళ్ళీ లేపడం మొదలైన వాటిని ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలో 68వ ఆయతులో తేనెటీగల ప్రస్తావన ఉంది. ఆ పేరునే దీనికి పెట్టడం జరిగింది. మానవాళికి దేవుని అనుగ్రహాలను ఈ సూరా వివరించింది. తేనెటీగ ఒక తెలివయిన కీటకం. దేవుని ప్రేరణతో అది పనిచేస్తుంది. సృష్టించే అల్లాహ్ సామర్థ్యాన్ని తేనెటీగ చాటిచెబుతుంది. ఇది సృష్టించే స్వచ్ఛమైన తేనె అల్లాహ్ మానవాళికి అనుగ్రహించిన మేళ్ళలో ఒకటి. తేనెలో మానవాళికి స్వస్థత దాగి ఉంది.

అల్లాహ్ సృజనాత్మక శక్తి గురించిన వివరాలు ఈ సూరా మనకు అందిస్తుంది. అల్లాహ్ ఒక్కడే అని అర్థం చేసుకోవడానికి ఈ వివరాలు తోడ్పడుతాయి. ఆయన సర్వ శక్తిసంపన్నుడనీ, ఒకేఒక్కడనీ చాటిచెప్పే వివరాలివి. అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించాడనీ, వీర్యం చుక్క నుంచి మనిషిని సృష్టించాడని, ప్రజల ప్రయోజనం కొరకు పశువులను సృష్టించాడనీ, తాగడానికి, పశువులు మేసే చెట్లుచేమలు పెరగడానికి ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తున్నాడనీ, రాత్రింబవలను నియంత్రిస్తున్నాడనీ, సూర్యచంద్రులను అదుపు చేస్తున్నాడనీ, నక్షత్రాలు, సముద్రాలు, వివిధ రంగుల జంతువులు, చెట్లుచేమలు, కీటకాలు, లోహాలు వగైరా భూమిపై ఉన్న వాటన్నింటిని ఆయన సృష్టించాడని తెలియజేసింది. మనిషి బహిరంగంగా వ్యతిరేకతకు పాల్పడుతున్నప్పటికీ, ఆలోచించే వారికి, తమ బుద్ధివివేకాలను ఉపయోగించేవారికి, అల్లాహ్ సృజనాత్మక శక్తిసామర్థ్యాలను చాటిచెప్పే ఈ వివరాలు స్పష్టమైన నిదర్శనాలని, వారు వీటిని తమ హృదయాల్లో ప్రతిష్టించుకుంటారని, అల్లాహ్ పట్ల కృతజ్ఞతలు



చూపుతారని, అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించడానికి నిరాకరించడం చేయరని వివరించింది. అపార కృపాశీలుడు, అమిత దయామయుడైన అల్లాహ్ మానవాళికి చేసిన మేళ్ళను ఈ వివరాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఈ సూరా విగ్రహారాధక ఆచారాలను, విశ్వాసాలను ఖండిస్తుంది. మక్కాలోని విగ్రహారాధక అరబ్బులను ఉద్దేశించి వారు ఆరాధిస్తున్నవి వారు తమ సొంత చేతులతో తయారు చేసుకున్నవేనని తెలిపింది. నిర్జీవమైన ఈ శిలాప్రతిమలు లేదా కలపతో చేసిన బొమ్మలను ఎలా ఆరాధిస్తున్నారని ప్రశ్నించింది. అవిశ్వాసులు అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టారు. వారు అహంకారంతో వ్యవహరిస్తున్నారు. సత్యం తెలుసుకోవాలని భావించడం లేదు.

అవిశ్వాసుల వైఖరిని ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. వారు ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను అవహేళన చేసేవారు. దైవవచనాలను అగౌరవపరిచేవారు. ప్రాచీన ప్రజల కథలుగా వర్ణించేవారు. మరణించిన వారిని మళ్ళీ బ్రతికించడం జరుగు తుందన్నది వారు విశ్వసించడానికి నిరాకరించారు. అబద్ధాలు చెప్పేవారు. కుట్రలు పన్నేవారు. ప్రాపంచిక జీవితాన్ని అమితంగా ప్రేమించేవారు. వారు మాటవినని జనం. పరలోకంలో అపజయం పాలయ్యేజనం. ఈ సందర్భంగా అజ్ఞాన కాలంలోని అనాచారాలను, ఆడశిశువులను సజీవంగా పాతిపెట్టే దురాచారాలను తీవ్రంగా ఖండించడం జరిగింది.

అల్లాహ్ అనుగ్రహాలను, ఆయన చేసిన మేళ్ళను నిర్లక్ష్యం చేస్తే దేవుని ఆగ్రహం విరుచుకుపడుతుందని గట్టిగా హెచ్చరించడం జరిగింది. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస)ను ఇక్కడ విధేయతకు, కృతజ్ఞతకు నమూనాగా చూపించడం జరిగింది. ప్రజలను ఇస్లాం వైపునకు వివేకంతో, మృదువుగా ఆహ్వానించాలని ఇక్కడ ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు చెప్పడం జరిగింది. స్థిరచిత్తంతో పనిచేయాలని, అవిశ్వాసుల కుట్రలు చూసి నిరాశ చెందరాదని బోధించడం జరిగింది.

ఈ సూరా క్లుప్తంగా ఒక ఇస్లామీయ చట్టసంబంధమైన ఆదేశాన్ని ప్రస్తావించింది. మృతపశువు మాంసాన్ని, రక్తాన్ని, పందిమాంసాన్ని, అల్లాహ్ పేరుకాక ఇతరుల పేర ఇవ్వబడిన ఆహారాన్ని భుజించడం నిషిద్ధమని ప్రకటించింది. అల్లాహ్

ఆదేశం త్వరలో గాని, ఆలస్యంగా గాని రావచ్చని, తీర్పుదినం గురించిన నిర్ణయం కనురెప్పపాటులో జరగవచ్చని, అప్పుడు దుర్మార్గులకు శిక్ష తప్పదని, ఆ రోజు కాస్త ఆలస్యమైతే బాగుండునని వాళ్ళు వాపోతారని వివరించింది. దివ్యఖుర్ఆన్ మానవాళికి శుభవార్త అని, కారుణ్యమనీ, మార్గదర్శకత్వమని ఇక్కడ అభివర్ణించడం జరిగింది.

## ముఖ్యాంశాలు

**అహంకారం :**

అహంకారం వల్ల చెడు జనిస్తుంది. దైవభీతికి, సదాచరణలకు ఇది పొసగనిది.

**ఆడశిశువులు :**

ఆడపిల్లలైనా మగపిల్లలైనా పిల్లలను సమానంగా ప్రేమించాలి. ఆడపిల్లల పట్ల వివక్ష, వారిని అంతమొందించడం చేయకూడని పనులు.

**వాగ్దానం :**

వాగ్దానం పట్ల నిజాయితిగా వ్యవహరించాలి. ఎన్నడూ భంగపరచరాదు.

**న్యాయం :**

న్యాయానికి కట్టుబడాలి.

**బంధువులు :**

బంధువులను దయతో చూడాలి.

**లైంగిక నడవడి :**

లైంగిక దుర్నడత ఖండించదగినది.

**కృతజ్ఞత :**

అపారమైన అల్లాహ్ అనుగ్రహాల పట్ల మనిషి కృతజ్ఞుడై ఉండాలి. పవిత్రుడైన అల్లాహ్‌నే వేడుకోవాలి.



**17 వ అధ్యాయం**

# అల్ ఇస్రా

# రాత్రి యాత్ర

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి సంబంధించినది. ఇందులో మొత్తం 111 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఈమాన్ (ధార్మిక విశ్వాసం), తౌహీద్ (ఏకదైవారాధన), ప్రవక్తల పరంపర, మరణించిన వారిని మళ్ళీ బ్రతికించడం, శిక్షా బహుమానాల గురించి నొక్కి చెప్పింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) చేసిన రాత్రియాత్ర ప్రస్తావనతో ఈ సూరా ప్రారంభమయ్యింది. మక్కాలోని పవిత్రమైన మస్జిదు నుంచి ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను తూర్పున సుదూరాన ఉన్న మస్జిద్ అక్సా (జెరుసలేం)కు రాత్రివేళ తీసుకు వెళ్ళడం జరిగింది. అక్కడి నుంచి ఆయన్ను వరుసగా ఏడు ఆకాశాలపైకి తీసుకు వెళ్ళి అల్లాహ్ చిహ్నాలను చూపించడం జరిగింది. ఈ గగనారోహణయాత్ర ఒక అద్భుతమైన మహత్యం. ఇది అల్లాహ్ అపారశక్తిసామర్థ్యాలను చాటి చెబుతుంది. ప్రవక్త ముహమ్మద్(సఅస)కు ఇవ్వబడిన ప్రత్యేకస్థానాన్ని కూడా తెలియజేస్తోంది.

ఈ సూరా ప్రారంభ వచనం అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతుంది. అల్లాహ్ చట్టాలకు వ్యతిరేకంగా ఇస్రాయిల్ సంతతి ప్రజల తలబిరుసు వైఖరిని వివరిస్తూ, వారు అల్లాహ్‌ను పూర్తిగా విశ్వసించాలని, ఆయన పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని బోధిస్తుంది. ఇస్రాయిల్ సంతతి ప్రజలు ప్రపంచంలో రెండు సార్లు కల్లోలం సృష్టిస్తారని ఇందులో చెప్పడం జరిగింది. వారు తీవ్రమైన హింసా కాండకు, దేవుని ఆగ్రహానికి గురిఅవుతారని చెప్పడం జరిగింది. వారు తమ వైఖరిని మార్చుకోవడానికి మరొక అవకాశం ఇస్తున్నట్లు ఈ సూరా తెలిపింది. మళ్ళీ వారికి సంపదను, సంతానాన్ని, అధికారాన్ని ప్రసాదించడం జరిగింది. ఈ సూరాలో ఆదమ్ (అస), షైతాన్‌ల కథ గురించి క్లుప్తమైన ప్రస్తావన ఉంది. అల్లాహ్ ఆదేశాలపై తిరుగుబాటును ఈ కథ తెలియజేసింది. అల్లాహ్ ఆదేశాలను తిరస్కరిస్తూ షైతాన్ తాను

ఆదమ్(అస) ముందు తలవంచేది లేదని అన్నాడు. మానవులలో చాలా మంది దారితప్పేలా తనను అనుసరించేలా చేస్తానని సవాలు చేసాడు. ఈ సూరాలో దివ్యఖుర్ఆన్‌ను ఒక మార్గదర్శకంగా, ఒక సాంత్వనగా, ఒక కారుణ్యంగా అభివర్ణించడం జరిగింది. దివ్యఖుర్ఆన్‌ను ఒక మహత్యంగా పేర్కొనడం జరిగింది. ఈ దైవగ్రంథం పట్ల సందేహం కలిగిన వారెవరైనా గాని, ఇలాంటిది మరొకటి రాసి చూపించాలని సవాలు చేయడం జరిగింది. యావత్తు మానవులు, జిన్నులు (కంటికి కనిపించని, అగ్నితో సృష్టించబడిన ప్రాణులు) కలిసి ఇలాంటి గ్రంథాన్ని రాయాలని ప్రయత్నించినా రాయలేరని చెప్పడం జరిగింది. అయితే, అవిశ్వాసులు ఇంకా ఈ గ్రంథాన్ని తిరస్కరిస్తున్నారనీ, బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారని, ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను మాంత్రికునిగా చిత్రీకరిస్తున్నారనీ అంటూ ప్రవక్త మూసా (అస)ను కూడా ఆయన జాతి ప్రజలు మాంత్రికునిగా ఆరోపించారని తెలిపింది. అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅస)ను ఏదైనా మహత్యం ప్రదర్శించి ప్రవక్తనని నిరూపించుకోవాలని సవాలు చేసారు. భూమిని చీల్చి నీటిబుగ్గ బయటకు వచ్చేలా చేయమని, లేదా కాలువలు ప్రవహించే అందమైన తోటను సృష్టించాలని లేదా ఆకాశం తునాతునకలై క్రింద పడేలా చేయాలనీ లేదా దేవుడిని, దైవదూతలను వారి ముందు ప్రత్యక్షంగా వచ్చేలా చేయాలని లేదా తన కోసం ఒక బంగారు మహలును సృష్టించి చూపాలని సవాలు చేసారు.

దివ్యఖుర్ఆన్ ప్రతి విషయాన్ని వివరంగా తెలిపినప్పటికీ అవిశ్వాసులు మరణానంతర జీవితం పట్ల అపనమ్మకాన్ని వదులుకోలేదు. వారి హృదయాలపై పరదాలు పడ్డాయి. వారు చెవిటివారయ్యారు. తాము మరణించిన తర్వాత, ఎముకలు కూడా దుమ్ముధూళిలో కలిసిపోయిన తర్వాత తమను మళ్ళీ బ్రతికించి నిలబెట్టడం అసాధ్యమని వాదించసాగారు. ఈ సూరా వారి అనుమానాలను తొలగిస్తూ, వారి సందేహాలను నివారించే రుజువులను వారి ముందు ఉంచింది. మరణానంతరం వాళ్ళు దుమ్ముధూళిలో కలిసిపోయినా లేక మరేవిధంగా మారిపోయినా మరణించిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టడం జరుగుతుందని, ఎందుకంటే, ఒకసారి వారిని సృష్టించిన దేవునికి వారిని మళ్ళీ సృష్టించడం సాధ్యమేనని చెప్పడం జరిగింది. ఈ



సందర్భంగా దేవుని శక్తిసామర్థ్యాల గురించి క్లుప్తంగా తెలియజేసింది. విశ్వవ్యవస్థను పాలిస్తున్న దేవుని అధికారానికి రాత్రింబవలు నిర్దిష్ట సాక్ష్యాధారాలుగా చూపించింది. అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టడాన్ని తీవ్రంగా ఖండించింది. దీనికి పరలోకంలో తీవ్రమైన శిక్ష తప్పదని అవిశ్వాసులను హెచ్చరించడం జరిగింది.

ఈ సూరా మానవుల నడవడి గురించి వివరణాత్మకమైన సూచనలు ఇచ్చింది. ఏకదైవారాధన (తౌహీద్) ఆధారంగా, మంచి సామాజిక నడవడికకు అవసరమైన సూచనలు ఈ సూరాలో ఇవ్వడం జరిగింది. అవి :

1. ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్‌ను వదిలి ఇతరులను ఆరాధించరాదు.
2. తల్లిదండ్రుల పట్ల దయాభావం కలిగి ఉండాలి. వారిని విసుక్కోరాదు. కసురుకోరాదు.
3. బంధువులు, నిరుపేదలు, బాటసారుల హక్కులు నెరవేర్చాలి. వారి పట్ల మృదువుగా మాట్లాడాలి.
4. దుబారాగా ఖర్చు చేయరాదు, పిసినారితనాన్ని కూడా కలిగి ఉండరాదు.
5. పేదరికానికి భయపడి సంతానాన్ని హతమార్చరాదు.
6. చట్టబద్ధంగా తప్ప మరేవిధంగాను ఎవరినీ హతమార్చరాదు.
7. వ్యభిచారం దరిదాపులకు కూడా పోరాదు.
8. అనాథల ఆస్తిపై చేయి వేయరాదు.
9. వాగ్దానాలను నెరవేర్చాలి.
10. సరయిన పాత్రతో కొలవాలి. ఖచ్చితమైన త్రాసుతో తూయాలి. కొలతలు, తూనికల్లో న్యాయాన్ని పాటించాలి.
11. తెలియని విషయం గురించి, చూడని విషయం గురించి తెలిసినట్లు సాక్ష్యం చెప్పరాదు.
12. భూమిపై అహంకారాన్ని ప్రదర్శిస్తూ నడవరాదు.

అల్లాహ్‌కు భాగస్వాములు ఎవరూ లేరని, ఆయన ఎవరినీ తన కుమారునిగా చేసుకోలేదని ఈ సూరా నొక్కి చెప్పింది. అల్లాహ్ ఔన్నత్యాన్ని ఈ సూరా క్లుప్తంగా ప్రస్తావించింది.

## ముఖ్యాంశాలు

**దయతో వ్యవహరించడం :**

దయతో వ్యవహరించడం అన్నది ఒకరికి చేసే ఉపకారంగా భావించరాదు. మంచి చేస్తే, అలా చేసిన వారికే దాని ప్రతిఫలం లభిస్తుంది. దయాభావంతో చేసిన పనికి మీకే ఫలితం లభిస్తుంది. దానిలో ఎవరూ భాగం పంచుకోలేరు.

**మృదువుగా మాట్లాడడం :**

మృదువుగా మాట్లాడాలి. మీ విశ్వాసాలను అంగీకరించని వారితో కూడా మర్యాదగా, మృదువుగా మాట్లాడాలి.

**మార్గదర్శకత్వం :**

రుజుమార్గాన్ని అవలంబించడం అన్నది మన మంచికే, దారి తప్పడం వల్ల నష్టపోయేది మనమే.

**సుఖవిలాసాలు :**

సుఖవిలాసాల్లో మునిగిపోరాదు. ఇలాంటి జీవితం సన్మార్గాన్ని తప్పిస్తుంది. వినాశానికి, అల్లాహ్ ఆగ్రహానికి కారణమవుతుంది.

**మనిషి స్థానం :**

అల్లాహ్ మనిషికి ఉన్నత స్థానాన్ని ప్రసాదించాడు. ఇతర ప్రాణులన్నింటి కన్నా ఔన్నత్యాన్ని ఇచ్చాడు.

**అసత్యం :**

సత్యం ఎల్లప్పుడు విజయాన్ని సాధిస్తుంది. అసత్యం అంతమవుతుంది.

**కృతజ్ఞతాభావం :**

అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి. అహంకారాన్ని ప్రదర్శించరాదు, రుజుమార్గాన్ని విడనాడరాదు.

**ప్రవర్తనా నియమావళి :**

పైన పేర్కొన్న పన్నెండు సూత్రాల నియమావళిలో ఉన్న అల్లాహ్ చట్టాలకు కట్టుబడి జీవించాలి.



**18 వ అధ్యాయం**

# అల్ కహఫ్

# గుహ

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందిన సూరా. ఇందులో 110 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ధార్మిక విశ్వాసానికి సంబంధించిన ప్రధానసూత్రాలను చర్చించింది. అల్లాహ్‌పట్ల, పరలోకం పట్ల, మరణానంతర జీవితం పట్ల విశ్వాసాన్ని పటిష్టం చేయడానికి ఈ చర్చ ఉద్దేశించింది. ప్రారంభ వచనాలు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటిచెప్పాయి. ఈ సూరాలోని 9వ ఆయతులో ఒక గుహలో నిద్రపోయిన కొందరు విశ్వాసుల ప్రస్తావన ఉంది. ఈ కథ ఒక అద్భుతమైన సంఘటనను తెలిపింది. వారి సుదీర్ఘమైన నిద్ర దేవుని మహత్యాలలో ఒకటి. ఈ కథ ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. వారు కొందరు యువకులు. బహుదైవారాధనను తిరస్కరించిన యువకులు. విగ్రహాలను లేక ఇతర దేవుళ్ళను ఆరాధించడాన్ని ఇష్టపడని యువకులు. అందువల్ల దౌర్జన్యాలకు గురయిన ఆ యువకులు తమ ప్రాంతాన్ని వదిలి పారిపోయి వచ్చారు. వారు ఒక గుహలోకి వచ్చి నిద్రపోయారు. అలాగే నిద్రలో దాదాపు 309 సంవత్సరాలు గడిపారు. కాని వారు నిద్రలేచి తాము మహాఅయితే కొన్ని గంటలు నిద్రపోయి ఉంటామని భావించారు. గుహలో నిద్రపోయిన ఆ యువకులు అల్లాహ్‌ను విశ్వసించిన యువకులు. అల్లాహ్‌ను తప్ప మరెవ్వరిని అర్థించని వారు. వారి కథ త్యాగాన్ని, స్థిరచిత్తాన్ని, అల్లాహ్ పట్ల దృఢమైన విశ్వాసాన్ని, సత్యం కోసం పోరాడటాన్ని ప్రతిబింబిస్తుంది. గుహలో వారి సుదీర్ఘనిద్ర మరణాన్ని, మరణానంతరం మళ్ళీ లేపడాన్ని సూచిస్తుంది. మరణం, మరణానంతర జీవితం రెండూ అనివార్యమైనవిగా తెలుపుతుంది.

ఈ సూరాలో మూసా (అస) గురించిన కథ కూడా ప్రస్తావించబడింది. దైవప్రవక్తగా, దేవుని సందేశాన్ని తీసుకువచ్చిన మహనీయునిగా అత్యున్నత స్థానం

కలిగినప్పటికీ మూసాప్రవక్త(అస) జ్ఞానాన్ని ఇంకా సంపాదించాలన్న కుతూహలం మెండుగా కలిగిన వారు, ఆయన మరో వ్యక్తి నుంచి జ్ఞానాన్ని సంపాదించడానికి ఎన్నడూ వెనుకాడలేదు. మూసాప్రవక్త(అస) ఖిజర్ అనే మహనీయుని నుంచి జ్ఞానబోధ స్వీకరించడానికి ఆయనతో పాటు ఉన్నారు. ఆయన చెప్పినట్లు సహనం వహించడానికి ప్రయత్నించారు.

ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన మూడో కథ జుల్ ఖర్‌నైన్‌కు సంబంధించినది. ఆయన న్యాయశీలుడైన గొప్ప పాలకుడు. ఒక పొరుగు దేశం ప్రజలు ఆయనకు మొరపెట్టుకుని, తమపై దాడులు చేస్తున్న అరాచక, అనాగరిక జాతులు యాజూజ్, మాజూజ్‌ల నుంచి రక్షణ కల్పించవలసినదిగా కోరారు. బలహీనమైన పొరుగువారిని కాపాడటానికి ఆ న్యాయశీలుడైన రాజు సంకల్పించాడు. యాజూజ్, మాజూజ్‌ల నుంచి వారిని రక్షించడానికి ఒక దృఢమైన గోడను నిర్మించాడు.

ఈ సూరాలో షైతాన్ గురించి, షైతాన్ తిరుగుబాటు గురించి, ఆదమ్ (అస)కు మోకరిల్లమని అల్లాహ్ ఇచ్చిన ఆదేశాన్ని తిరస్కరిస్తూ షైతాన్ చూపించిన తలబిరుసు వైఖరిని క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది.

ప్రతి సూరాలో మాదిరిగానే ఈ సూరాలోను ప్రస్తావించబడిన కథల ముఖ్యోద్దేశ్యం మంచిపనులు చేయమని ఉద్బోధించడం. గుహలో నిద్రపోయిన వారి కథలోని ముఖ్యాంశం ధార్మిక విశ్వాసాన్ని రక్షించుకోవడానికి ప్రపంచాన్ని వదిలి అజ్ఞాతంలోకి వెళ్ళవలసి రావడం. మూసా (అస) కథలోని ముఖ్యాంశం జ్ఞానబోధ స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండడం. జుల్ ఖర్‌నైన్ గురించిన కథలోని ముఖ్యాంశం బలహీనులను కాపాడడం.

ఈ సూరా ఒక ఆసక్తికరమైన పోలికను కూడా తెలిపింది. ఒక విశ్వాసి అయిన రైతు, మరొక అవిశ్వాసి అయిన రైతు, ఇద్దరికి సంబంధించిన కథ ఇది. అవిశ్వాసి అయిన రైతుకు ఒక అందమైన తోట ఉండేది. అందులో సెలయేర్లు ప్రవహిస్తూ ఉండేవి. ఆ తోట పుష్కలంగా పంటను ఇచ్చేది. అయితే అవిశ్వాసి అయిన ఆ రైతు అహంభావంతో తనకు లభించిన సంపద, తన తోట ఎన్నడూ నాశనం కాదని భావించేవాడు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మంచి



పని కాదని విశ్వాసి అయిన బీదరైతు, అవిశ్వాసి అయిన ధనికరైతును ఎల్లప్పుడూ హెచ్చరిస్తూ ఉండేవాడు. తీర్పుదినాన్ని విశ్వసించాలని చెప్పేవాడు. కాని ఆ ధనికరైతు లక్ష్యపెట్టలేదు. చివరకు శిక్ష అవతరించింది. ఆ ధనిక రైతుకు సంబంధించిన తోట, అతని సంపద నాశనమయ్యాయి.

ఈ సూరాలో అవిశ్వాసులను వర్ణించడం జరిగింది. వారు దేవుని ప్రవక్తలను ఎగతాళి చేస్తారు. దేవుని సందేశాన్ని, దేవుని చిహ్నాలను పరిహసిస్తారు. దేవునికి భాగస్వాములుగా ఇతరులను నిలబెడతారు. సత్యాన్ని తిరస్కరించడానికి వాద వివాదాలు చేస్తారు. వారి హృదయాలు ప్రతిస్పందించవు. వారి చెవులు చెవిటివి. వారి కళ్ళు దేవుని చిహ్నాలను చూడలేవు. వారు అల్లాహ్ చిహ్నాలను, దేవుని వాక్యాలను తిరస్కరిస్తారు. వారికి భయంకరమైన శిక్ష లభిస్తుంది. ఈ సూరా తౌహీద్ (ఏకదైవారాధన) గురించి బలంగా చెబుతూ ముగుస్తుంది.

## ముఖ్యాంశాలు

**మంచిపనులు :**

ప్రాపంచికమైన సిరిసంపదలు శాశ్వతమైనవి కావు. దైవభీతి కలిగి చేసిన మంచిపనులే పరలోకంలో సాఫల్యానికి పనికివస్తాయి.

**అహం :**

షైతాన్ అహంకారానికి చిహ్నమైనవాడు. అహంకారం స్వయం వినాశానికి దారితీస్తుంది.

**నిశ్చింత :**

నిశ్చింతగా, నిర్లక్ష్యంగా ఉండడం అన్నది అహంకారానికి కారణమవుతుంది. సదాచరణలకు ఈ ధోరణి తగినది కాదు.

**సిరిసంపదలు, అధికారాలు :**

సిరిసంపదలు, అధికారం అన్నీ దేవుని నుంచి లభించినవి. ఇవి శాశ్వతమైనవి కావు. ఇవి మనిషికి పరీక్షల వంటివి. వాటిని వివేకంతో వినియోగించాలి. వాటిని

క్షోభ్యేక ముందే నిరుపేదలను, అవసరార్థులను ఆదుకోవడానికి ఉపయోగించాలి. మన సిరిసంపదలను, అధికారాలను రక్షించేవాడు అల్లాహ్ మాత్రమే. సిరిసంపదల పట్ల, అధికారం పట్ల పిచ్చివ్యామోహం పెంచుకోవడం వినాశకర పరిణామాలకు కారణమవుతుంది.

**భాగస్వాములను కల్పించడం :**

అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం, ఆయన ఏకత్వాన్ని నిరాకరించడం దేవుని ఆగ్రహానికి, తీవ్రమైన శిక్షకు కారణమవుతుంది.

**స్వేచ్ఛ:**

అల్లాహ్‌ను విశ్వసించడం లేదా నిరాకరించడం అన్నది మనిషి స్వేచ్ఛకు వదిలి వేయడం జరిగింది. అల్లాహ్‌ను విశ్వసించి మంచి పనులు చేసేవారు, స్వర్గవనాల బహుమానాలను పొందుతారు. అల్లాహ్‌ను విశ్వసించడానికి నిరాకరించిన వారు భయంకర అగ్నికి బలవుతారు.

**జ్ఞానం :**

జ్ఞానవిజ్ఞానాలను సముపార్జించాలి. అందుకోసం సహనాన్ని ప్రదర్శించాలి.

## 19 వ అధ్యాయం

# మర్యం

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 98 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ప్రధానంగా తౌహీద్ (ఏకదైవారాధన)ను నొక్కి చెబుతుంది. మర్యం, ఈసాప్రవక్త (అస)ల కథ ఈ సూరాలో ఉంది. మర్యం, జకరియాల కథ ద్వారా ఈ సూరా మనకు అల్లాహ్ ఏకత్వానికి సంబంధించిన నిదర్శనాలను చూపిస్తోంది. ఆయన శక్తిసామర్థ్యాలను మనకు పరిచయం చేస్తుంది. అల్లాహ్‌కు ఎవరూ



భాగస్వాములు లేరని, ఆయనకు కుమారులు ఎవరూ లేరని ఈ సూరా నొక్కి చెప్పింది. ఇందులో ధార్మిక విశ్వాసానికి సంబంధించిన మరో రెండు సూత్రాలను కూడా నొక్కి చెప్పడం జరిగింది. అవి : మరణానంతరం మళ్ళీ లేపబడడం, పరలోకంలో శిక్షా లేదా బహుమానాలు పొందడం. ఈ సూరాలోని 16వ ఆయత్‌లో ప్రారంభమయ్యే మర్యం కథ వల్ల ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది.

ఈ సూరా అసాధారణమైన జకరియా (ఆయనపై శాంతి కురియుగాక) కథతో ప్రారంభమయ్యింది. ఇంతకన్నా విశిష్టమైన మర్యం (అస) గురించి, ఈసా (అస)జన్మ వృత్తాంతం గురించి చెప్పేముందు నేపథ్యంగా జకరియా కథను తెలుపడం జరిగింది. జకరియా ఒక వృద్ధుడు. ఆయన తనకు ఒక వారసుడు కావాలని అల్లాహ్‌ను వేడుకున్నాడు. ఆయన భార్య గొడ్రాలు. అందువల్ల తన వేడుకోలు ఫలిస్తుందో లేదోనని ఆయన సందేహించారు. అల్లాహ్ ఆయన వేడుకోలును ఆలకించాడు. జకరియా భార్య గర్భం దాల్చి యహ్యా(అస)కు జన్మనిచ్చింది. ఈ కథను ప్రస్తావిస్తూ ఒక ముసలి వ్యక్తికి, గొడ్రాలైన భార్యకు సంతానం కలిగేలా చేయడం అల్లాహ్‌కు చాలా తేలికనీ, ఆయన అసలు ఏదీలేని స్థితిలోనే మనిషిని సృష్టించాడని ఈ సూరా వివరించింది.

ఆ తర్వాత ఈ సూరాలో మర్యంకు సంబంధించిన విశిష్టమైన కథ ఉంది. ఆమె తన జాతి వారికి దూరంగా ఒంటరిగా ఉండేవారు. ఆమెను ఏ పురుషుడు తాకలేదు. ఆమె సౌశీల్యం మచ్చలేనిది. అయితే, మర్యం(అస) గర్భం దాల్చారు. ఆమె గర్భంలో ఈసాప్రవక్త (అస) ఉన్నారు. ప్రసవ నొప్పుల సమయంలో ఆమె చాలా ఆందోళనకు గురయ్యారు. తాను మరణిస్తే బాగుండునని భావించారు. ఆమె ఈసాప్రవక్త (అస)కు జన్మనిచ్చారు. ఈసాప్రవక్త (అస) మానవాళికి దేవుని ఒక చిహ్నంగా జన్మించారు. ఈ విధంగా పురుషస్పర్శ తెలియని కన్యకు ఈసా ప్రవక్త (అస) జన్మించడం గురించి ఈ సూరాలో ప్రస్తావిస్తూ, ఇలా చేయడం అల్లాహ్‌కు చాలా తేలికని సూరా తెలిపింది. కాని, మర్యం(అస) జాతి ఆమెను నమ్మలేదు. ఆమెను వేధింపులకు గురిచేసింది. మర్యం(అస) తన వాదన వినిపించగలరు, కాని విచిత్రంగా అప్పుడే జన్మించిన ఈసాప్రవక్త(అస) స్వయంగా మాట్లాడడం ప్రారంభించారు. తన తల్లిపై వస్తున్న విమర్శలకు జవాబు చెప్పారు. ఈసా ప్రవక్త(అస)

వారికి తన జన్మ గురించి వివరించారు. అల్లాహ్‌ను విశ్వసించని తన జాతి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ తాను అల్లాహ్ దాసుడననీ, తాను ప్రవక్తగా వారి వద్దకు వచ్చానని చెప్పారు. ఈసా ప్రవక్త(అస)ను అల్లాహ్ శుభప్రదమైనవాడిగా చేశాడనీ. తాను బ్రతికిఉన్నంత కాలం నమాజ్, జకాత్ విధులు పాటిస్తూ ఉండాలని ఆదేశించాడని, తన తల్లి పట్ల వినయవిధేయతలు కలవాడిగా చేసాడనీ, తనను అల్లాహ్ అహంకారిగా, దౌర్భాగ్యుడిగా చేయలేదని ఈ సూరా మనకు తెలియజేసింది. ఆయన పుట్టినరోజున, చనిపోయిన రోజున, తిరిగి బ్రతికించి లేపబడే రోజున ఆయనపై శాంతి అవతరిస్తుందని ఈ సూరా తెలుపుతుంది. మెస్సయ్య (ఈసా) ఒక ప్రవక్త మాత్రమేననీ, ఆయనకు శిలువవేయడం జరగలేదని ఈ సూరా గట్టిగా చెప్పింది. అల్లాహ్ ఎలాంటి అవసరాలు లేనివాడన్న విషయాన్ని ఈ సూరా మరోసారి నొక్కి చెప్పింది.

ఈ సూరాలో ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) కథ గురించిన ప్రస్తావన కూడా ఉంది. ఆయనను సత్యసంధుడైన ప్రవక్తగా ఈ సూరా అభివర్ణించింది. బహుదైవారాధన గురించి, ఎవరికీ లాభం కాని నష్టం కాని చేకూర్చలేని విగ్రహాల గురించి ఈ సూరాలో ప్రస్తావనలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ (అస) ఎదుర్కున్న దౌర్జన్యాలు, పీడనల వివరణ ఈ సూరా అందిస్తుంది. ఆయన జాతి ప్రజలు, స్వయంగా ఆయన తండ్రి ఆయనను దౌర్జన్యాలకు గురిచేసారు. కాని ఇబ్రాహీమ్ (అస) తన ఉద్యమాన్ని నిరంతరంగా కొనసాగించారు. తన సందేశప్రచారాన్ని ఆపలేదు. పనికిరాని విగ్రహాలను ఆరాధించవద్దని తన జాతి వారికి బోధించసాగారు. అల్లాహ్‌కు ఇతరులను భాగస్వాములుగా నిలబెట్టడం ఘోరమైన అపరాధమని తెలియజేసారు. దేవుని ఆగ్రహం గురించి వారిని హెచ్చరించారు. ఇబ్రాహీమ్(అస) ఎలాంటి కష్టాలు ఎదురైనా, ఎలాంటి దౌర్జన్యాలు భరించవలసి వచ్చినా వెనుకంజ వేయలేదు. తన తండ్రి స్వయంగా తనను విరోధించినా ఆయన తన తండ్రి కోసం దేవుని ప్రార్థించారు. బహుదైవారాధక అపరాధానికి గాను తండ్రిని క్షమించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఆ విధంగా మర్యం కథలో తల్లి పట్ల ప్రేమాభిమానాల గురించి, ఇబ్రాహీమ్(అస) కథలో తండ్రి పట్ల చూపించవలసిన ప్రేమాభిమానాల గురించి తెలియవస్తోంది. ఈ రెండు కథలు ఈ సూరాలో ప్రస్తావించబడ్డాయి. ఏకదైవారాధనను మరింతగా



నొక్కి చెబుతూ ఈ సూరాలో ఇతర ప్రవక్తల గురించి కూడా క్లుప్తమైన ప్రస్తావనలు వచ్చాయి. నూహ్ (అస), మూసా (అస), హారూన్ (అస), ఇస్మాయీల్ (అస), ఇద్రీస్(అస)ల ప్రస్తావనలు ఈ సూరాలో వచ్చాయి. మరణానంతరం మళ్ళీ లేపబడడం జరుగుతుందన్న విషయాన్ని నిరాకరించే అవిశ్వాసుల గురించి కూడా ఇందులో ప్రస్తావనలు ఉన్నాయి. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరగదని వారు చేసే వాదనను తిప్పికొట్టడం జరిగింది. ఏమీ లేనప్పుడు వారిని సృష్టించడం జరిగినప్పుడు, మరణించిన తర్వాత మళ్ళీ లేపడం చాలా తేలికని చెప్పడం జరిగింది. మనిషికి ఇష్టం వచ్చిన మార్గం అవలంబించే స్వేచ్ఛ ఉందని, కాని సత్యాన్ని నిరాకరించడం వల్ల చివరకు దారుణమైన ఫలితాలు తప్పవని హెచ్చరించింది. వారి కన్నా సిరిసంపదలు, సాధనసామగ్రి ఉన్న గత జాతులు సత్యాన్ని నిరాకరించిన కారణాన నాశనమయ్యాయని గుర్తు చేయడం జరిగింది. విశ్వాసులు పరలోకంలో స్వర్గవనాలను పొందుతారని, అక్కడ వారికి శాంతి సౌభాగ్యాలు లభిస్తాయని వివరించింది. తౌహీద్ (ఏకదైవారాధన) భావనను మళ్ళీ గట్టిగా చెబుతూ దేవునికి కుమారుడు ఎవరూ లేరని సూరా పునరుద్ఘాటించింది.

## ముఖ్యాంశాలు

**పరిమితులు :**

అల్లాహ్ సృజనాత్మక శక్తికి ప్రకృతి శక్తులన్నీ దాసోహమై ఉన్నాయి. ఎలాంటి పరిమితులు, పరిధులు లేనిది అల్లాహ్ శక్తి. అన్ని ప్రాకృతిక పరిమితులకు– అవి భౌతికమైనవి గాని, జీవపరమైనవి గాని అన్ని విధాల పరిమితులకు– అతీతమైనది అల్లాహ్ శక్తి. ఒక గొడ్రాలికి సంతానం కలిగేలా చేయగలడు అల్లాహ్. పురుషస్పర్శ ఎరుగని కన్యకు సంతానం కలిగేలా చేయగలడాయన.

**వేడుకోళ్ళు :**

అల్లాహ్‌పైనే పూర్తి భారం వేయాలి. మనిషి తన అవసరాలకు గాను అల్లాహ్‌ను మాత్రమే వేడుకోవాలి. మనిషి ప్రార్థనలకు తప్పక జవాబు లభిస్తుంది. వేడుకోలు మనిషికి–దేవునికి మధ్య సంబంధానికి మార్గం. దీనికి గాను మధ్యవర్తులు అవసరం లేదు. ప్రతి మనిషి తానే స్వయంగా అల్లాహ్‌తో మొరపెట్టుకోవచ్చు.

**ఔన్నత్యం :**

ఉదయం, సాయంత్రం అన్ని వేళలా దేవుని ఔన్నత్యాన్ని కొనియాడాలి.

**శిలువ :**

ఈసా ప్రవక్త (అస)ను శిలువ వేయడం జరగలేదు. ఆయన దేవుని ప్రవక్త మాత్రమే. దేవుని కుమారుడు కాదు.

**దేవుని వైపునకు పిలువడం :**

ప్రజలను అల్లాహ్ వైపునకు వివేకంతో, యుక్తితో పిలవాలి, మర్యాదగా పిలవాలి. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస)ను ఒక ఉదాహరణగా తీసుకోవాలి.

## 20 వ అధ్యాయం

# తాహా

## పరిచయం

సూరా తాహా మక్కా కాలానికి చెందిన సూరా. ఇందులో 135 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా మూడు విషయాలను ముఖ్యంగా నొక్కి చెప్పింది. అవి : తౌహీద్ (ఏక దైవారాధన), ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం. ఈ సూరా ప్రారంభ పదాలైన తాహా అన్న పదాలతో ఈ సూరాకు పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅస) మక్కాలో అవిశ్వాసుల నుంచి ఎదుర్కున్న కష్టాలు, కుట్రలు, దౌర్జన్యాల నేపథ్యంలో ఆయనకు ఊరటగా ఈ సూరా అవతరించింది. ఒక ప్రవక్తగా ఆయన చేయవలసిన పనులను ఈ సూరా వివరించింది. మానవాళిని హెచ్చరించడం, వారికి దేవుని గుర్తు చేయడం, దేవుని సందేశాన్ని వారికి చేరవేయడం, శుభవార్తలు అందించడం కోసం ఆయన అవతరించారు. దృఢచిత్తంతో, సహనంతో కృషి చేయాలని ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు చెప్పడం జరిగింది. రాత్రింబవలు, సూర్యోదయం సూర్యాస్తమయాల్లో దేవుని ఔన్నత్యాన్ని కొనియాడుతూ ఉండాలని, ఇతరులకు లభించిన వాటి గురించి ఆలోచించరాదని, తన కుటుంబాన్ని దైవప్రార్థనలు చేసేలా ప్రోత్సహించాలని ఈ సూరాలో అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅస)కు ఉపదేశించాడు.



ఈ సూరాలో గత కాలానికి చెందిన ఇద్దరు ప్రవక్తల గురించి ప్రస్తావనలు ఉన్నాయి. మక్కా అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్(సఅస)ను ఆయన ప్రవక్త పదవి నిరూపించుకోవడానికి మహత్యాలు చూపించాలని సవాలు చేసినప్పుడు ప్రవక్తకు ఊరటనిస్తూ, గత కాలాల ప్రవక్తల వృత్తాంతాన్ని వివరించడం జరిగింది. మొదటి వృత్తాంతం మూసా ప్రవక్త (అస), ఫిర్ఔన్‌లకు సంబంధించినది. ఈ కథను మరిన్ని వివరాలతో పునరుల్లేఖించడం జరిగింది. ఫిరౌన్ ఒక దుష్టుడైన పాలకుడు. తానే దేవుడినని ప్రకటించుకున్నవాడు. ఇస్రాయీల్ ప్రజలపై ఫిర్ఔన్ చేసిన దౌర్జన్యాలు, అణచివేతల గురించి ఈ సూరా వివరించింది. ఇస్రాయీల్ ప్రజల సంతానంలో మగపిల్లలను చంపించేవాడు. కాని మూసా(అస) జన్మించినప్పుడు, మూసా(అస) తల్లి ఆయన్ను దాచిపెట్టడానికి ప్రయత్నించారు. కాని ఎక్కువ కాలం దాచిపెట్టడం సాధ్యం కాలేదు. అల్లాహ్ ద్వారా లభించిన ప్రేరణ వల్ల ఆమె పిల్లవాడిని ఒక పెట్టెలో పెట్టి నైలు నదిలో విడిచి పెట్టాలని నిర్ణయించారు. ఆ విధంగా విడిచి పెట్టిన ఆ పెట్టె ఫిర్ఔన్ ఉద్యానవనంలో నుంచి ప్రవహించే ఒక ఏరులోకి వచ్చింది. ఫిర్ఔన్ భార్య ఆ పిల్లవాడిని పెంచుకోవాలని నిర్ణయించింది. ఆ విధంగా ఆయన ఫిర్ఔన్ రాజభవనంలో అల్లాహ్ అనుగ్రహాలతో పెరిగి పెద్దయ్యారు. ఆ తర్వాత మూసా (అస) తల్లి ఆయనకు దాయిగా ఆ భవనంలోకి రాగలిగారు. ఆమె తానెవరన్నది దాచిపెట్టి పిల్లవాడిని సాకడం ప్రారంభించారు. మూసా (అస) పెరిగి పెద్దయ్యారు. విద్యాజ్ఞానాలు నేర్చారు. మంచి నాయకత్వ లక్షణాలు సముపార్జించుకున్నారు. ఫిర్ఔన్ చేతుల్లో ఇస్రాయీల్ ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను ఆయన చూసారు.

ఒక రోజు ఒక ఈజిప్టు వ్యక్తి ఒక ఇస్రాయీల్ వ్యక్తిని చంపబోవడం ఆయన చూసారు. మూసా (అస) ఇస్రాయీల్ వ్యక్తిని కాపాడుతూ ఈజిప్టు వ్యక్తిని బలంగా కొట్టారు. ఆ వ్యక్తి మరణించాడు. ఈ వార్త ఫిర్ఔన్‌కు తెలిసింది. మూసా(అస) ఈజిప్టు నుంచి సినాయ్‌కు పారిపోవలసి వచ్చింది. అక్కడ మద్‌యన్‌లో ఆయన

ఒక వ్యక్తిని కలిసారు. ఆ వ్యక్తి కుమార్తెను వివాహం చేసుకుని, తన మామగారి ఇంటనే పనిచేయసాగారు. ఆ పిదప ఆయనకు ప్రవక్త పదవి లభించింది. ఆయన అల్లాహ్ సందేశహరునిగా దేవుని సందేశాన్ని ప్రజలకు చేరవేసే బాధ్యత స్వీకరించారు. ఈ దశలో అల్లాహ్ మూసాను ఆదేశిస్తూ ఫిర్ఔన్ వద్దకు వెళ్ళి ఫిర్ఔన్‌కు సత్యసందేశం అందించాలని చెప్పాడు. మూసా (అస) ఫిర్ఔన్ వద్దకు వెళ్ళారు. వారిరువురి మధ్య సంవాదం జరిగింది. మూసాను మంత్రగాడని, ఫిర్ఔన్ సింహాసనం కాజేయ డానికి ప్రయత్నిస్తున్న వాడని నిందించడం జరిగింది. మూసాను ఫిర్ఔన్ మంత్రగాళ్ళు సవాలు చేసారు. మూసాను ఓడిస్తే గొప్ప బహుమానాలు ఇస్తానని ఫిర్ఔన్ వారికి ఆశ చూపించాడు. ఈ పోటీకి తేదీ నిర్ణయించడం జరిగింది. పూర్తి దేశప్రజలు ఈ పోటీని చూడడానికి హాజరయ్యారు.

ఫిర్ఔన్ తరఫున బరిలోకి దిగిన మంత్రగాళ్ళు పూర్తి ఏర్పాట్లతో వచ్చారు. వారు ముందుగా తమ మంత్రతంత్రాలు ప్రారంభించారు. వారి మంత్రవిద్యలు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆ పిదప మూసా (అస) తనకు అల్లాహ్ చూపిన మహత్యాలను వారికి చూపించారు. ఈ మహత్యాలు ఆ మంత్రగాళ్ళ మాయాజాలాన్ని ఛేదించాయి. ఫిర్ఔన్ తరఫున బరిలోకి దిగిన మంత్రగాళ్ళు మూసా(అస)ను విశ్వసించారు. సత్యాన్ని గుర్తించి సాష్టాంగపడ్డారు. అల్లాహ్ పట్ల విశ్వాసాన్ని ప్రకటించారు. ఫిర్ఔన్ ఆగ్రహంతో వారి కాళ్ళు చేతులు ఖండిస్తానని బెదిరించాడు. అనుచరులతో సహా ఈజిప్టును వదిలి రాత్రికి రాత్రి ప్రయాణం కావాలని మూసా(అస)కు ఆదేశమయ్యింది. వారిని ఫిర్ఔన్ తన సైన్యంతో వెంబడించాడు. మూసా(అస), ఆయన అనుయాయులు సముద్రాన్ని దాటేలా చేసాడు అల్లాహ్. వారు అడుగు పెట్టినప్పుడు సముద్రం చీలింది. వారిని వెంబడిస్తూ ఫిర్ఔన్ తన సైన్యంతో వచ్చాడు. కాని హఠాత్తుగా సముద్రం వారిని ముంచేసింది. మూసా (అస)ను, ఇస్రాయీల్ జాతి ప్రజలను దేవుడు ఆ విధంగా కాపాడాడు. ఆ తర్వాత కొంత కాలానికి ఇస్రాయీల్ జాతి ప్రజలు మూసా(అస) పట్ల నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. వారు అల్లాహ్ ఆదేశాల పట్ల విధేయత పాటించడం మానుకున్నారు. అల్లాహ్‌కు బదులు ఒక బంగారు దూడను తయారు చేసుకుని దానికి పూజ చేయడం ప్రారంభించారు.



ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన రెండవ కథ ఆదమ్ (అస) గురించినది. ఈ కథను క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. ఈ కథ దేవుని కారుణ్యాన్ని, క్షమాగుణాన్ని ప్రతిబింబిస్తుంది. ఆదమ్ (అస) తన శత్రువైన షైతాన్ మాటలు విని అల్లాహ్ ఆదేశాన్ని అతిక్రమించినప్పటికీ అల్లాహ్ ఆయన పట్ల కారుణ్యాన్ని చూపాడు. ఈ సూరాలో తీర్పుదినం గురించిన వర్ణన వివరంగా ఉంది. జిబ్రయీల్ (అస) పిలుపుతో కోట్లాది ప్రజలు లేచి వస్తారు. అప్పుడు వారందరూ దేవుని ముందు ఉంటారు. అంతా నిశ్శబ్దం అలుముకుంటుంది. ఆ రోజున విశ్వాసులకు వారి సదాచరణలకు బహుమానంగా స్వర్గవనాలు లభిస్తాయి. అవిశ్వాసులకు నరకాగ్ని ప్రాప్తిస్తుంది. సత్యాన్ని నిరాకరించినందుకు, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించినందుకు వారికి నరకశిక్ష పడుతుంది. దివ్యఖుర్ఆన్ మానవాళికి అల్లాహ్ ప్రసాదించిన కానుక అని ఈ సూరా తెలుపుతుంది. దివ్యఖుర్ఆన్ గురించిన ప్రస్తావనలు గతకాలాలకు చెందిన దైవగ్రంథాలు, తౌరాత్, ఇంజీలులోనూ ఉన్నాయని ఈ సూరా తెలియజేసింది.

## ముఖ్యాంశాలు

**సందేశం :**

ప్రజలకు దేవుని సందేశాన్ని వివేకంతో, సానుభూతితో అందించాలి.

**దృఢచిత్తం :**

సహనాన్ని కలిగి ఉండాలి. దృఢచిత్తాన్ని చూపాలి.

**షైతాన్ :**

మానవాళికి ప్రబలశత్రువైన షైతాన్ పట్ల జాగ్రత్తగా ఉండాలి.

**ప్రాధాన్యతలు :**

ప్రాపంచిక సిరిసంపదలు, అధికారాల కోసం నియంతలకు వత్తాసు పలకడం, అసత్యానికి మద్దతు ఇవ్వడం కూడని పనులు, వాటికి బదులు సత్యానికి సాక్షులుగా నిలబడాలి.

## 21 వ అధ్యాయం

# అల్ అంబియా

# దైవప్రవక్తలు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 112 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా కొన్ని కీలకమైన విషయాలను చర్చించింది. ఏక దైవారాధన (తౌహీద్), ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ బ్రతికించబడడం, పరలోకంలో శిక్ష లేదా బహుమానాలు పొందడం వంటి ముఖ్యమైన విశ్వాసాలకు సంబంధించిన కీలకమైన అంశాలను ఈ సూరా చర్చించింది. ఈ సూరాలో చర్చకు వచ్చిన ప్రవక్తల కథల ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. కొందరు ప్రవక్తల కథలను చాలా క్లుప్తంగా ఇందులో ప్రస్తావించడం జరిగింది. ఉదాహరణకు మూసా ప్రవక్త (అస) హారూన్ ప్రవక్త (అస), లూత్ ప్రవక్త (అస), నూహ్ (అస), అయ్యూబ్ (అస), ఇస్మాయీల్ (అస), ఇద్రీస్ (అస), జకరియా (అస), యహ్యా (అస), యూనుస్ (అస), ఈసా (అస)ల కథల గురించి క్లుప్తమైన ప్రస్తావన ఈ సూరాలో వచ్చింది. దేవుని పట్ల తమ జాతి ప్రదర్శిస్తున్న అవిశ్వాసం, వివిధ రూపాల్లో చోటుచేసుకున్న చెడులు, సత్యాన్ని తిరస్కరించే తలబిరుసు వైఖరి, ఏకదైవారాధనను అవిశ్వాసులు బాహాటంగా వ్యతిరేకించడం, విగ్రహారాధనకు పాల్పడడం, స్వలింగ సంపర్కం వంటి చెడులకు వ్యతిరేకంగా ఈ ప్రవక్తలు చేసిన సంఘర్షణ మనకు ఈ కథల ద్వారా తెలుస్తుంది. ఈ ప్రవక్తలందరి సందేశం ఒక్కటే. అల్లాహ్‌ను ఒక్కడినే ఆరాధించాలి. మంచిపనులు చేయాలి. చెడులకు దూరంగా ఉండాలి. ఇదే సందేశాన్ని ప్రవక్తలందరూ తమ తమ జాతులలో ప్రచారం చేసారు. ఈ సూరాలో ఇబ్రాహీమ్ (అస), దావూద్ (అస), సులైమాన్ (అస)ల కథలు కూడా ప్రస్తావించడం జరిగింది. ఈ ప్రవక్తల గురించి ఈ సూరాలో కొద్ది వివరణాత్మక ప్రస్తావనలు మనకు లభిస్తాయి.



ఇబ్రాహీమ్ (అస) కథలో మనకు ఆయన విగ్రహారాధనకు వ్యతిరేకంగా చేసిన సంఘర్షణ తెలుస్తుంది. శిలాప్రతిమలను, చెక్కబొమ్మలను, చిత్రాలను ఆరాధించే బదులు అల్లాహ్‌ను, ఒకేఒక్క దేవుడిని ఆరాధించాలని ఇబ్రాహీమ్(అస) తన జాతివారికి, తన స్వంత తండ్రికి బోధించారు. ఎలాంటి ప్రయోజనము కాని, నష్టం కాని కలిగించలేని విగ్రహాలను ఎందుకు ఆరాధిస్తున్నారని ఆయన వారికి బోధించారు. ఇబ్రాహీమ్ (అస) ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న ఈ విగ్రహాలను ధ్వంసం చేసారు. ఫలితంగా ఆయన నిర్బంధానికి గురయ్యారు. ఆయనకు సజీవదహన శిక్ష విధించబడింది. ఆయనను పట్టుకుని అగ్నిగుండంలోకి విసరివేయడం జరిగింది. కాని అల్లాహ్ కారుణ్యం వల్ల ఆ అగ్ని ఆయన కోసం చల్లబడిపోయింది. ఆయనకు ఎలాంటి హాని కలుగలేదు.

దావూద్ (అస), సులైమాన్ (అస)ల కథలు మనకు న్యాయాన్ని స్థాపించాలని, ప్రజల మధ్య సమానత్వాన్ని కాపాడాలని బోధిస్తున్నాయి. ఈ ప్రవక్తలందరి కథల వల్ల మనకు తెలిసేదేమంటే, అల్లాహ్ సందేశాన్ని వారు మానవాళికి అందజేసారు. ఇహలోకంలో ప్రజలు సంతోషంగా జీవించడానికి, పరలోకంలో భయం కరమైన శిక్షనుంచి తప్పించుకోవడానికి అవసరమైన సందేశాన్ని ప్రజలకు చేరవేసారు.

ఈ సూరాలో తీర్పుదినం నాటి భయానక పరిస్థితి గురించి వర్ణన కూడా ఉంది. ఆ గొప్పదినం గురించి ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సూరా విమర్శించింది. వారు సత్యంతో ఆడుకుంటున్నారని, సత్యాన్ని పరిహసిస్తున్నారని, తిరస్కరిస్తున్నారని, ప్రవక్తలను అపహసిస్తున్నారని, మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈ సూరా హెచ్చరించింది. మరణానంతరం మళ్ళీ లేపబడే ఆ రోజున ఎదురయ్యే తీవ్రమైన పరిస్థితులను, అవిశ్వాసులకు అక్కడ ఎదురయ్యే భయానకమైన శిక్షలను గురించి తీవ్రంగా హెచ్చరించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల అవిశ్వాసుల వైఖరిని, వారు ఆయన్ను కవిత్వం చెబుతున్న వ్యక్తిగా, మంత్రగాడిగా ఆరోపించడాన్ని, దివ్యఖుర్‌ఆన్ ఒక కలల కథనంగా చెప్పడాన్ని కూడా ఈ సూరా ప్రస్తావిస్తూ, ఈ వైఖరి పట్ల తీవ్రమైన హెచ్చరికలు

చేసింది. మనిషికి మరణం తప్పదని, ఈ జీవితం చాలా చిన్నదని, కాబట్టి మంచి పనులు చేయడానికి ప్రజలు పోటీ పడాలని ఈ సూరా బోధించింది.

ఈ సూరాలో మనకు దేవుని శక్తిసామర్థ్యాల గురించి క్లుప్తమైన ప్రస్తావన లభిస్తుంది. విశ్వవ్యవస్థ గురించిన వ్యాఖ్యలు ఉన్నాయి. ఈ ఆకాశాలను, భూమిని వేర్వేరు చేసే వరకు అవి ఒక్కటిగానే ఉండేవని తెలిపింది. ఆకాశాన్ని పైకప్పుగా చేయడం గురించి, రాత్రింబవలు, సూర్యచంద్రుల సృష్టి గురించి, భూమిపై నెలకొల్పబడిన పర్వతాల గురించి, జీవానికి ఆధారంగా నీటిని సృష్టించడం గురించి ఇందులో ప్రస్తావనలు ఉన్నాయి. ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించి ప్రస్తావిస్తూ ఆయనను యావత్తు మానవాళికి కారుణ్యంగా వర్ణించడం జరిగింది. దివ్యఖుర్ఆన్‌ను దైవానుగ్రహంగా, శుభకరమైన సందేశంగా వర్ణించడం జరిగింది.

## ముఖ్యాంశాలు

**ప్రార్థన :**

మనిషికి కావలసిన మార్పును ప్రసాదించే ప్రభావశీలమైన పద్ధతి ప్రార్థన. అల్లాహ్‌ను ప్రార్థించాలి. ఆయన అందరి మొరలు వినేవాడు. ఆయనను ప్రార్థిస్తే మనిషి అవసరాలు తీరుతాయి.

**తొందరపాటు :**

అసహనానికి గురికారాదు. తొందరపాటుతో వ్యవహరించరాదు.

**పరీక్ష :**

ఈ ప్రాపంచిక జీవితం మానవాళికి ఒక పరీక్ష వంటిది. ఈ పరీక్షాఫలితం మనిషికి పరలోకంలో తెలుస్తుంది. మనిషికి మరో అవకాశం దొరకడమన్నది జరగదు. ప్రతి ఒక్కరూ పరీక్షించబడుతున్నారు. ప్రతి ఒక్కరికి మృత్యువు తప్పనిసరి.

**చెడుపనులు :**

చెడులకు పాల్పడే జాతులను, వ్యక్తులను అల్లాహ్ శిక్షిస్తాడు.



**ఆత్మప్రక్షాళనం :**

ప్రార్థన మనిషి ఆత్మను పరిశుద్ధ పరుస్తుంది. విశ్వప్రభువైన అల్లాహ్ ఆరాధన విషయంలో ఎన్నడూ గర్వం ప్రదర్శించరాదు. రాత్రింబవలు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ఉండాలి.

**స్వలింగ సంపర్కం :**

చెడులలో కెల్లా మహాచెడు. అల్లాహ్ ఆగ్రహానికి కారణమయ్యే పాపం. ఈ పాపకృత్యానికి దూరంగా ఉండాలి.

**ఒకే కుటుంబం :**

యావత్తు మానవాళి ఒకే కుటుంబం. అందరికి పితామహుడు ఆదమ్ (అస). అందరి ప్రభువు, దైవం ఒక్కడే. జాతి, వర్ణం, హోదా అహంకారాలకు అతీతంగా అందరూ సహోదర భావాన్ని కలిగి ఉండాలి.

**విజయం :**

సదాచరణలకు కట్టుబడిన వారే భూమిపై విజయాన్ని పొందుతారు.

## 22 వ అధ్యాయం

# అల్ హజ్

# పవిత్ర యాత్ర

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందిన సూరా. ఇందులో 78 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా రెండు అంశాలను నొక్కి చెప్పింది. అవి :

1. హజ్‌యాత్ర, ఈ పవిత్రయాత్ర సందర్భంగా ఖుర్బానీకి తీసుకు వచ్చే జంతువులు, అల్లాహ్ మార్గంలో పోరాటం మొదలైన విషయాలకు సంబంధించిన ఇస్లామీయ శాసనాలు.

2. తౌహీద్ (ఏకదైవారాధన), మరణానంతరం మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాలకు సంబంధించిన ధార్మిక విశ్వాసాల సూత్రాలు. ఈ సూరాలోని 25వ ఆయతులో హజ్ యాత్ర గురించి ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది.

ఈ సూరా ప్రారంభ ఆయత్‌లో తీర్పుదినం నాటి భయానక స్థితిగతుల వర్ణన ఉంది. ఆ రోజున ప్రతి ఒక్కరు భయంతో గజగజలాడుతుంటారు. చివరకు కన్న తల్లి తన పాలు త్రాపే శిశువును కూడా మరిచిపోతుంది. ఆ రోజున గర్భంతో ఉన్న స్త్రీలు గర్భస్రావానికి గురవుతారు. ప్రజలు తాగి మత్తులో ఉన్న వారి మాదిరిగా నడుస్తుంటారు. ఈ వివరాలు తెలుపుతూ, మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి ఈ సూరా హెచ్చరిస్తుంది. ఈ విషయమై సందేహాలున్న వారికి కావలసిన రుజువులు చూపుతుంది. మనిషి మొదట మట్టి నుంచి పుట్టించబడ్డాడని, తర్వాత వీర్యబిందువు ద్వారా పుట్టించబడ్డాడని, ఆ పిదప ఒక రక్తపు గడ్డగా, పిదప ఒక మాంసపు ముద్దగా, కొంతకాలం తల్లిగర్భంలో ఉంచబడి తర్వాత ఒక శిశువుగా బయటకు తీయబడ్డాడని, ఆ పిదప పూర్తి బలసామర్థ్యాల వయస్సుకు చేరుకుంటాడని, పిదప మృత్యువుకు గురవుతాడని వివరిస్తూ, బంజరుగా ఉన్న భూమి వర్షపు చినుకులతో మొలకెత్తడాన్ని, జంటలు జంటలుగా అన్ని విధాల మొక్కలకు జన్మనివ్వడాన్ని ఉదాహరిస్తూ, అదేవిధంగా మరణించిన వారు మళ్ళీ లేపబడతారని చెప్పడం జరిగింది. అల్లాహ్ మరణించిన వారిని మళ్ళీ బ్రతికించే సామర్థ్యం కలిగిన వాడని ఈ సూరా నొక్కి చెప్పింది. సమాధుల్లో ఉన్న వారందరినీ తిరిగి అల్లాహ్ లేపి నిలబెడతాడని ఈ సూరా హెచ్చరించింది.

ఈ సూరాలో తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని వర్ణించడం జరిగింది. అందులో అవిశ్వాసులు అగ్నితో తయారైన దుస్తులు ధరించి ఉంటారు. మరుగుతున్న నీరు వారిపై గుమ్మరించడం జరుగుతుంది. వారిని శిక్షించడానికి లోహపు ముళ్ళ గదలు ఉంటాయి. అయితే సదాచరణలకు కట్టుబడిన విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి. వారికి బంగారంతో, ముత్యాలతో చేసిన ఆభరణాలు లభిస్తాయి. వారు సిల్కు వస్త్రాలు ధరిస్తారు.



సత్యంపై దాడి జరిగినపుడు, ఇస్లామ్ అణచివేతకు గురయినపుడు అల్లాహ్ కోసం పోరాడటం న్యాయబద్ధమని ఈ సూరా విస్పష్టం చేస్తుంది. అల్లాహ్ కోసం పోరాడటమన్నది రక్తపాతం సృష్టించే ఉద్దేశ్యంతో కాదు, చెడును, అణచివేతను ఎదుర్కోవడానికే జరుగుతుందని ఈ సూరా తెలుపుతుంది. అల్లాహ్ ఆగ్రహానికి గురయి నాశనమైన గత జాతుల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. తమ చెడుల కారణంగా, ప్రవక్తలను వ్యతిరేకించిన కారణంగా ఆయా జాతులు వినాశాన్ని చవిచూసాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి ప్రజల తిరస్కారాన్ని ఎదుర్కున్నది ఆయన ఒక్కరే కాదని,గత ప్రవక్తలు కూడా ప్రజల తిరస్కారాన్ని ఎదుర్కున్నారని, నూహ్ ప్రవక్త (అస), సాలిహ్ (అస), షుఐబ్ (అస), ఇబ్రాహీమ్ (అస), లూత్ (అస), మూసా(అస)లను కూడా వారి వారి జాతుల ప్రజలు తిరస్కరించారని చెప్పడం జరిగింది.

అల్లాహ్‌కు బదులు అవిశ్వాసులు ఆరాధిస్తున్న విగ్రహాల నిరర్థకతను గురించి ఈ సూరాలో చెప్పడం జరిగింది. ఈ విగ్రహాలు ప్రపంచంలోని ఈగలాంటి అతిచిన్న ప్రాణిని కూడా సృష్టించలేవని, ఈ విగ్రహాల నుంచి ఒక మామూలు ఈగ దేనినన్నా తీసుకుంటే దానిని కూడా ఇవి అడ్డుకోలేవని, తమ వస్తువును తిరిగి తీసుకోలేవని ఈ సూరా వివరించింది. కాని అల్లాహ్ సర్వశక్తిసంపన్నుడని, ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించగలడనీ, భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం ఆయనకు చెందినదేననీ, భూమిపై ఉన్నదంతా ఆయన మనిషికి ఇచ్చాడనీ, అల్లాహ్ మానవులకు జీవితాన్ని ప్రసాదించాడనీ, ఆయన మృత్యువును ఇస్తాడని గుర్తుచేయడం జరిగింది. అల్లాహ్ కోసం నిరంతర కృషి చేయాలని, నమాజును స్థాపించాలని, దానధర్మాలు చేయాలని, అల్లాహ్ ధర్మానికి దృఢంగా కట్టుబడాలని విశ్వాసులకు చెప్పడం జరిగింది.

## ముఖ్యాంశాలు

### అల్లాహ్ గురించి వివాదాలు :

ఎలాంటి జ్ఞానం లేకుండా అల్లాహ్ గురించి తెలిసినట్లు వాదనకు దిగడం తగని పని.

**స్వార్థ ప్రయోజనాలకు ఆరాధన :**

సుఖ దుఃఖాల్లో అన్ని వేళలా దృఢవిశ్వాసంతో అల్లాహ్‌ను ఆరాధించాలి. ఆయన ఔన్నత్యాన్ని కొనియాడాలి.

**అవిశ్వాసులు :**

అవిశ్వాసులను, కృతఘ్నులను అల్లాహ్ ఇష్టపడడు.

**సాఫల్యం :**

అల్లాహ్ మార్గంలో సహాయకులుగా ఉన్నవారికి అల్లాహ్ సహాయపడతాడు.

**బలహీనత :**

అల్లాహ్ సర్వ శక్తిసంపన్నుడు. ఇతర కృత్రిమ దేవతలు, విగ్రహాలు ఎలాంటి శక్తి లేనివి. ఇవి అసత్యాలు.

**మరలడం :**

సమస్తం అల్లాహ్ వైపునకే మరలవలసి ఉంది. అందువల్ల అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి.

**సదాచరణలు :**

అల్లాహ్ ప్రసన్నత కోసం, ప్రజల మేలు కోసం మంచి పనులు చేయాలి.

## 23 వ అధ్యాయం

# అల్ మూ'మినూన్

# విశ్వాసులు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 118 ఆయతులు ఉన్నాయి. ధార్మిక విశ్వాసానికి సంబంధించిన ముఖ్య సూత్రాలను ఈ సూరాలో నొక్కి చెప్పడం



జరిగింది. తౌహీద్ (ఏకదైవారాధన), ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ లేపబడడం వంటి విశ్వాసాలను ఇందులో ప్రభావవంతంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరా ప్రారంభంలో విశ్వాసుల గురించి, వారి గుణగణాల గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది.

ఈ సూరాలో ప్రస్తావించబడిన విశ్వాసుల గుణగణాలు :

1. వారు తమ నమాజుల్లో అణకువగా ఉంటారు.
2. వ్యర్థ ప్రసంగాలకు దూరంగా ఉంటారు.
3. జకాత్ చెల్లిస్తారు.
4. అక్రమ సంబంధాలకు పాల్పడరు.
5. తమకు అప్పగించబడిన వాటి విషయంలో నిజాయితీగా ఉంటారు.
6. తమ వాగ్దానాలకు కట్టుబడి ఉంటారు.
7. తమ నమాజులను ఖచ్చితంగా పాటిస్తారు.

వారికి అల్లాహ్ ఫిర్‌దౌస్ (అత్యున్నత స్వర్గవనం) వాగ్దానం చేసాడు. ఈ సూరాలో అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, అన్నింటిని సృష్టించే ఆయన అద్భుత శక్తిని, ఆయన ఒకేఒక్కడన్న వాస్తవాన్ని వివరించడం జరిగింది. మనిషి సృష్టిలోని వివిధ దశలు అల్లాహ్ శక్తిసామర్థ్యాలకు ఒక నిదర్శనం. మనిషి మొదట మట్టిలోని సారం నుంచి సృష్టించబడ్డాడు. అంటే మనిషి శరీరం వివిధ సేంద్రియ పదార్థాలతో నిర్మించబడిందని మనం అర్థం చేసుకోవచ్చు. ఆ పిదప మనిషి ఒక వీర్యబిందువు ద్వారా సృష్టించబడ్డాడు. తల్లిగర్భంలో ఉంచబడ్డాడు. వీర్యబిందువు ఒక రక్తపు తునకగా మారింది. పిదప ఒక మాంసపు ముద్దగా మారింది. దానికి ఎముకలు కల్పించడం జరిగింది. ఎముకలపై మాంసం తొడిగించడం జరిగింది. ఆ పిదప భిన్నమైన సృష్టి ఉనికిలోకి వచ్చింది.

దేవుని శక్తిసామర్థ్యాలను చాటి చెప్పే మరో నిదర్శనం సప్తాకాశాల సృష్టి. ఆకాశం నుంచి కురిసే వర్షం, ఆ నీటి ద్వారా మొలకెత్తే చెట్టుచేమలు ఇవన్నీ అల్లాహ్ శక్తిసామర్థ్యాలకు నిదర్శనాలే. రాత్రింబవల భ్రమణానికి సంబంధించిన

ప్రస్తావన కూడా ఈ సూరాలో వచ్చింది. మనిషికి వినే శక్తి, చూసే శక్తి, అనుభూతి చెందే శక్తి ప్రసాదించడం గురించి, జనన మరణాల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించి అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి అర్థం చేసుకునే సమాచారాన్ని ఇచ్చింది. ఈ చిహ్నాల గురించి ఆలోచించాలని, వీటన్నింటిని ఎవరు సృష్టించారన్నది ఆలోచించాలని ఈ సూరా నొక్కి చెప్పింది. మరణానంతరం మళ్ళీ లేపబడడం, మరణానంతర జీవితం గురించి సందేహాలను కూడా ఈ సూరా చర్చించింది. సప్త ఆకాశాలను, రాత్రింబవల భ్రమణాన్ని అదుపు చేస్తున్న వాడు, వీర్యబిందువు నుంచి మనిషిని సృష్టించిన వాడు, మరణించిన వారిని మళ్ళీ లేపే శక్తిసామర్థ్యాలు కలిగిన వాడని వివరించింది.

మృత్యుఘడియ గురించి, శరీరం నుంచి ఆత్మను తీసుకుపోవడం గురించి ఈ సూరాలో అవిశ్వాసులకు హెచ్చరికలు ఉన్నాయి. మరణానంతరం అవిశ్వాసులు తమ తప్పు తెలుసుకుంటారని, అల్లాహ్‌ను విశ్వసించి, తీర్పుదినం కోసం ఏర్పాట్లు చేసుకుని ఉన్నట్లయితే బాగుండునని వాపోతారనీ ఈ సూరా తెలియజేసింది. కాని అప్పటికి చాలా ఆలస్యం అయిపోతుంది. తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని ఈ సూరా మన కళ్ళముందుంచింది. ఆ రోజు మానవాళి రెండు వర్గాలుగా చీలిపోతుంది. అల్లాహ్‌ను విశ్వసించి ఆయన ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్న వారు సాఫల్యం పొందుతారు. వారు స్వర్గ వనాలు పొందుతారు. అల్లాహ్‌ను, తీర్పుదినాన్ని తిరస్కరించినవారు అపజయం పాలయి అగ్నికి గురవుతారు. ఆ అగ్ని వారి ముఖాలను కాల్చి వేస్తుంది. వారి హోదా, వారి సంపద, వారి అధికారాలు ఏవీ వారికి ఏ మాత్రం ఉపయోగపడవు.

ఈ సూరా అవిశ్వాసుల గుణగణాలను వర్ణించింది. వారు పరిధులు అతిక్రమించేవారు, జ్ఞానం లేనివారు, అహంభావులు, అయోమయానికి గురయినవారు, వారు అల్లాహ్‌ను విశ్వసించడానికి నిరాకరించినవారు, దేవుని చిహ్నాలపై ఆలోచించడానికి సిద్ధపడని వారు, సత్యాన్ని అసహ్యించుకుంటారు, రుజు మార్గం నుంచి తప్పుకుంటారు, వారు దేవుడు పంపిన ప్రవక్తలను తిరస్కరిస్తారు, ప్రవక్తలు పిచ్చివారని, మంత్రగాళ్ళని ఆరోపిస్తారు.



మహాప్రవక్త ముహమ్మద్(సఅసం)కు ఊరట నివ్వడానికి ఈ సూరాలో గత ప్రవక్తల కథలను ప్రస్తావించడం జరిగింది. ఆయా ప్రవక్తలు సాధించిన విజయాలు, వారి జాతులు సత్యాన్ని తిరస్కరించడం, అందువల్ల వాటికి ఎదురైన వినాశం గురించి ఇందులో చెప్పడం జరిగింది. ప్రవక్తలందరూ తిరస్కారాన్ని, దౌర్జన్యాలను, వేధింపులను భరించారు. నూహ్(అస) గురించి, ఆయన తన జాతి వారితో చేసిన సంఘర్షణ గురించి ఇందులో క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. అణచివేత, అన్యాయాలకు పాల్పడుతున్న జాతితో హూద్ (అస) చేసిన సంఘర్షణ గురించి క్లుప్తమైన ప్రస్తావన ఉంది. అహంభావి, దుర్మార్గుడైన ఫిర్‌ఔన్‌తో మూసా(అస), ఆయన సోదరుడు హారూన్ (అస)లు చేసిన సంఘర్షణ గురించి చెప్పడం జరిగింది. ఈసా(అస) గురించి చెప్పడం జరిగింది. ఈ కథలన్నింటిలోను చివరకు దేవుని సత్యం విజయం సాధించడాన్ని మనం తెలుసుకుంటాం.

## ముఖ్యాంశాలు

**సహనం :**

మీకు జరిగిన అన్యాయానికి అన్యాయంతో జవాబు ఇవ్వరాదు. హింసకు హింసతో జవాబు ఇవ్వరాదు.(షరిఅత్ పరిధికి లోబడి ప్రతీకారం అనుమతించబడిన సంద ర్భమైతే తప్ప) అన్యాయానికి పాల్పడిన వ్యక్తిని అల్లాహ్ శిక్షకే వదిలివేయాలి.

**లక్ష్యం :**

ప్రతిదీ ఒక లక్ష్యంతో సృష్టించబడింది. ఏదీ లక్ష్యరహితంగా ఊరకే ఆటవిడుపుగా సృష్టించబడలేదు.

**తఖ్వా (దైవభీతి) :**

సదాచరణలు, దైవభీతి, మంచి పనులు చేయడం వల్ల పరలోకంలో సాఫల్యం పొందవచ్చు. పరలోకంలోని శాశ్వత జీవితంలో సాఫల్యం లభిస్తుంది.

**అల్లాహ్ కారుణ్యం :**

దేవుని కారుణ్యానికి, మానవాళి పట్ల దేవుని ప్రేమకు ప్రవక్తల పరంపర నిదర్శనం. ప్రవక్తలు తమ తమ జాతులకు హెచ్చరిక చేసేవారిగా, మంచిని బోధించేవారిగా పంపబడ్డారు.

**అహంభావం :**

అహంభావాన్ని, అతిశయాన్ని, ఆడంబరత్వాన్ని విడనాడాలి. ఇవి వైఫల్యానికి, దుర్మార్గానికి దారితీస్తాయి.

**కృతజ్ఞత :**

దేవుని కారుణ్యం పట్ల మనిషి కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆయన కారుణ్యం అపారమైనది. అందువల్ల దేవుని పట్ల కృతజ్ఞాతాభావంతో మెలగాలి.

## 24 వ సూరా

# అన్ నూర్

# కాంతి

**పరిచయం**

ఇది మదీనాలో అవతరించిన సూరా. దీనిలో 64 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఇస్లామీయ ఆదేశాలను, ఇస్లామీయ నడవడికను నొక్కి చెప్పింది. ఈ బోధనలు వ్యక్తిగతంగాను, సాముదాయికంగాను ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఎంతయినా అవసరమైనవి. ఇందులో మనిషి నడవడిక, వ్యవహారశైలి ఎలా ఉండాలన్నది సుబోధకంగా వివరించడం జరిగింది. కుటుంబం సమాజానికి పునాదిగా పేర్కొనబడింది. ఆరోగ్యకరమైన సమాజానికి అత్యవసరమైన నైతిక ప్రమాణాలను ఈ సూరా మానవాళికి అందించింది. ఈ నైతికప్రమాణాలు సమాజంలోని రుగ్మతలను, చెడులను తొలగించి ఒక ఉత్తమసమాజ స్థాపనకు తోడ్పడే సూత్రాలు. నైతిక పతనాన్ని, విచ్చలవిడి వ్యవహారశైలిని, అరాచకాన్ని ఈ సూత్రాలు నిర్మూలిస్తాయి. ఈ సూత్రాలలో ముఖ్యమైనవి లైంగికపరమైన నేరాలకు పాల్పడేవారికి, అపవాదులు సృష్టించేవారికి సంబంధించినవి. ఇలాంటి వారిని తీవ్రంగా శిక్షించాలని ఈ సూరాలో చెప్పడం జరిగింది. ఈ సూరా ముఖ్యంగా రెండు తీవ్రమైన సమస్యలను ప్రస్తావించింది. అవి :



1. **లైంగిక నేరాల సమస్య :** పెళ్ళికి ముందు లైంగికక్రియల్లో పాల్గొన్న స్త్రీ పురుషులను వంద కొరడాదెబ్బల శిక్ష విధించాలి. ఈ శిక్ష బహిరంగంగా అమలు చేయాలి.

2. **అపవాదులు సృష్టించేవారి సమస్య :** అపవాదులను సృష్టించి వ్యాపింపచేసేవారిని, శీలవతులైన స్త్రీలపై అబద్ధపు లైంగిక సంబంధాలు అంటగట్టి అభాండాలు మోపేవారిని ఎనభై కొరడాదెబ్బలతో తీవ్రంగా శిక్షించాలి.

ఈ తప్పులు చేసిన వారు పశ్చాత్తాపపడి రుజుమార్గానికి రావాలని ఈ సూరాలో ప్రోత్సహించడం జరిగింది. దానితో పాటు పరలోకంలో ఎదురయ్యే భయంకరమైన శిక్ష గురించి తెలిపి హెచ్చరించడం జరిగింది. ఈ సూరా సదాచరణలు, మంచి వ్యవహారశైలికి సంబంధించిన ఇతర విషయాలను, ఉత్తమమైన సామాజిక నైతిక నియమాలను కూడా ప్రస్తావించింది.

1. ఇతరుల ఇళ్ళల్లోకి అనుమతి తీసుకుని ప్రవేశించాలి. గృహ సంబంధమైన మర్యాదలను గౌరవించాలి.
2. స్త్రీపురుషులు తమ చూపులను క్రిందికి వాల్చి ఉంచాలి.
3. స్త్రీపురుషులు తమ లైంగికావయవాలను కాపాడుకోవాలి. అంటే అక్రమ సంబంధాలకు దూరంగా ఉండాలి.
4. స్త్రీపురుషుల మధ్య కలివిడి వాతావరణాన్ని నియంత్రించాలి.
5. స్త్రీల శీలం విషయంలో నొక్కి చెప్పడం జరిగింది. భర్తలు, కుటుంబ సభ్యుల ముందు తప్ప మరెవ్వరి ముందు కూడా అందచందాలు, అలంకరణలు ప్రదర్శించరాదని కట్టడి చేసింది.

6. పురుషుల నడవడి విషయమై కూడా నొక్కి చెప్పడం జరిగింది. పెళ్ళి చేసుకునే స్తోమత లేని పురుషులు ఓర్పు వహించాలని బోధించింది.
7. పురుషులు నిరుపేద స్త్రీలను పెళ్ళాడేలా ప్రోత్సహించింది.
8. వ్యభిచారాన్ని నిషేధించింది.
9. ఇంటి మర్యాదలను నొక్కి చెప్పింది. యుక్తవయస్సుకు చేరుకున్న పిల్లలు తమ తల్లిదండ్రుల గదిలోకి ప్రవేశించే ముందు అనుమతి తీసుకోవాలని, ఎవరైనా పరుల ఇంట్లో అనుమతి తీసుకుని ప్రవేశించాలని బోధించింది.

ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆదేశాలను, బోధనలను అనుసరించాలని, ఆయన మాటలను పాటించాలని చెప్పింది. క్రమబద్ధమైన నమాజు వ్యవస్థను స్థాపించాలని, జకాత్ (విధిగా చెల్లించవలసిన దానం) చెల్లించాలని బోధించింది. దేవుని విశ్వసించి మంచి పనులు చేసేవారికి అల్లాహ్ భూమిపై ప్రాతినిధ్యాన్ని ఇస్తాడని వారికి అధికారం ప్రాప్తించేలా చేస్తాడని తెలిపింది.

ఈ సూరాలో అల్లాహ్ సృజనాత్మక శక్తిసామర్థ్యాల గురించి క్లుప్తమైన వివరణ, అల్లాహ్ ఒకేఒక్కడని నిరూపించే వివరణ కూడా లభిస్తుంది. అల్లాహ్ మేఘాలను నెమ్మదిగా కదిలేలా చేస్తాడు. ఆ పిదప వాటిని ఒకచోట గుమిగూడేలా, వర్షించేలా చేస్తాడు. భారీ మేఘాలను, ఉరుములు పిడుగులతో కూడిన మేఘాలను ఆయన పంపగలడు. ఆయన రాత్రింబవలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చేలా చేస్తాడు. అల్లాహ్ ప్రతి ప్రాణిని నీటి నుంచి సృష్టించాడు. తమ పొట్టలతో పాకే జంతువులను, రెండుకాళ్ళతో నడిచే జంతువులను, నాలుగు కాళ్ళతో నడిచే జంతువులను అన్నింటిని సృష్టించింది ఆయనే.

## ముఖ్యాంశాలు

### అక్రమ లైంగిక సంబంధం :

వ్యభిచారం, అక్రమ సంబంధాలు చాలా చెడ్డపనులు. ఇవి సామాజిక, నైతిక పతనానికి దారితీస్తాయి.



### అభాండాలు :

అమాయకులపై ముఖ్యంగా స్త్రీలపై అభాండాలు మోపడం, వారికి అక్రమ సంబంధాలు అంటగట్టడం దుర్మార్గపు చేష్ట. ఎవరిపై కూడా అబద్ధపు ఆరోపణలు చేయరాదు. అపవాదులను వ్యాపింపచేయరాదు. అబద్ధపు ఆరోపణలు, అభాండాలు సమాజంలో వ్యక్తుల మధ్య వైరానికి, విద్వేషానికి కారణమవుతాయి.

### వివాహం :

సంతానప్రాప్తికి, మంచి సామాజిక విలువలు పెంపొందించడానికి వివాహాన్ని ప్రోత్సహించడం జరిగింది. బీదస్త్రీలను పెళ్ళాడడం వల్ల అల్లాహ్ సంతోషిస్తాడు, సమాజంలో ధనికబీద వ్యత్యాసాలు కూడా కనుమరుగవుతాయి.

### భార్యలు:

భార్యలను గౌరవించాలి. భార్యల గురించి అపవాదులు ప్రచారం చేసే అనుమతి భర్తలకు లేదు.

### లజ్జా బిడియాలు :

స్త్రీపురుషులు తమ చూపులను క్రిందికి వాల్చి ఉంచాలి. తమ లైంగికావయవాలను కాపాడుకోవాలి. అంటే అక్రమ సంబంధాలకు దూరంగా ఉండాలి.

### సచ్ఛీలం :

స్త్రీపురుషులు ముఖ్యంగా స్త్రీలు తమ దుస్తుల విషయంలోను, నడవడి విషయంలోను మానమర్యాదల పరిధిలో ఉండాలి. స్త్రీఅందం బజారు సరుకు కాదు. పరాయి పురుషులు చూసి ఆనందించే ప్రదర్శనా వస్తువు కాదు.

### ఇంటిలో మర్యాదలు :

ఇతరుల నివాసంలోకి వెళ్ళే ముందు వారి అనుమతి తీసుకోవాలి. పిల్లలైనా సరే యుక్తవయస్కులైతే తమ తల్లిదండ్రుల గదిలోకి వెళ్ళే ముందు వారి అనుమతి తీసుకోవాలి. ఆ విధంగా కుటుంబ జీవనంలో క్రమశిక్షణ నెలకొంటుంది.

## 25 వ అధ్యాయం

# అల్ ఫుర్ఖాన్

# గీటురాయి

### పరిచయం

ఇది మక్కా కాలంలో అవతరించిన సూరా. ఇందులో 77 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ధార్మిక విశ్వాసానికి సంబంధించిన సూత్రాలను నొక్కి చెప్పింది. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దివ్యవాణి అవతరణ, మరణానంతరం మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాలు వంటి మౌలిక విశ్వాసాలను ఈ సూరా మనస్సుకు హత్తుకునేలా తెలియజేసింది. ఈ సూరా మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన గీటురాయి అన్న పదం ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అరబీలో ఫుర్ఖాన్ అంటే గీటురాయి అని అర్థం. దివ్యఖుర్ఆన్‌కు ఉన్న పేర్లలో ఫుర్ఖాన్ ఒకటి. ధార్మిక విశ్వాసానికి- అవిశ్వాసానికి, మార్గదర్శకత్వానికి-మార్గ రాహిత్యానికి, సత్యానికి-అసత్యానికి, వెలుగు-చీకట్లకు మధ్య భేదాన్ని తెలిపేది ఫుర్ఖాన్. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) చూపించిన మహత్తరమైన, శాశ్వతమైన మహత్యంగా ఇక్కడ ఖుర్ఆన్‌ను వర్ణించడం జరిగింది. మానవాళికి ఇహలోకంలో సంతోషాన్ని, పరలోకంలో సాఫల్యాన్ని ప్రసాదించే ఈ దైవగ్రంథం దేవుని తరఫున అనుగ్రహంగా ప్రసాదించబడింది.

ఈ సూరా మిథ్యా దేవుళ్ళను విమర్శిస్తూ ప్రారంభమయ్యింది. ఆయా దేవుళ్ళు నిజానికి ఎవరినీ సృష్టించింది లేదు. స్వయానా వాటిని ఆరాధించేవారే ఆ విగ్రహాలను తయారు చేసారు. అవి ఎలాంటి హానీ చేయలేవు. అవి మృత్యువును, జీవితాన్ని, మరణానంతరం మళ్ళీ లేపబడడాన్ని దేనినీ అదుపు చేయలేవు. అవిశ్వాసులు తీర్పుదినాన్ని తిరస్కరించడంలో మునిగి ఉన్నారు. మరణానంతర జీవితాన్ని తిరస్కరించినందుకు గాను వారికోసం పరలోకంలో అగ్నిశిక్ష వేచి ఉందని హెచ్చరించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒక సాధారణ మనిషి.



అందరిలా సాధారణ భోజనం భుజిస్తారు. మార్కెట్లలో నడుస్తారు. కాబట్టి ఆయన ప్రవక్త అన్న విషయాన్ని వారు అనుమానిస్తున్నారు. ఖుర్ఆన్ రాయడానికి ఆయనకు ఇతరులు సహాయపడుతున్నారని అవిశ్వాసులు ఆరోపణలు గుప్పించారు. ఆయన మంత్రగాడని అన్నారు. అంతేకాదు, దివ్యఖుర్ఆన్ ప్రాచీనకాలానికి చెందిన కథ అని కూడా వారు ఆరోపించారు. దివ్యఖుర్ఆన్‌ను విశ్వసించాలంటే ముందు తాము అల్లాహ్‌ను, దైవదూతలను చూడాలని అన్నారు.

ఈ సూరాలో గతకాలాలకు చెందిన ప్రవక్తల కథలను తెలిపి ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఊరట కలిగించడం జరిగింది. మానవాళికి ఈ ప్రవక్తల కథల ద్వారా గుణపాఠాన్ని బోధించడం, హెచ్చరించడం జరిగింది. గతకాలల్లో అవతరించిన, అంటే అల్లాహ్ పంపిన పుస్తకాల కొనసాగింపు దివ్యఖుర్ఆన్ అని నిరూపణపూర్వకంగా తెలుపడం జరిగింది. ప్రవక్త మూసా(అస), ఆయన సోదరుడు హారూన్(అస)ల గురించి క్లుప్తమైన ప్రస్తావన ఈ సూరాలో ఉంది. నూహ్ (అస), హూద్ (అస), సాలిహ్ (అస)ల ప్రస్తావనలు కూడా సంక్షిప్తంగా ఇందులో ఉన్నాయి.

అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయన ఒక్కడికే సాధ్యమైన సృష్టిసామర్థ్యాన్ని నిరూపించే వాక్యాలు ఈ సూరాలో ఉన్నాయి. సూర్యుడిని, ఎండకు పడే నీడను గమనించాలని ఈ సూరా ప్రోత్సహిస్తుంది. నీడ ఎలా పొట్టిగా.... పొడుగ్గా మారుతుందో, రాత్రిని ఒక తెరగా, విశ్రాంతికి అనువుగా ఎలా చేయడం జరిగిందో... వీచే గాలులు, ఆకాశం నుంచి కురిసే వర్షం, తీయని నదిజలాలు, ఉప్పటి సముద్ర జలాలు, నీటి నుంచి మనిషిని సృష్టించడం, ఆకాశంలోని నక్షత్ర సమూహాలు, చంద్రుడు, రాత్రింబవలను పరిశీలించాలని పాఠకులను ప్రోత్సహించడం జరిగింది.

విశ్వాసుల లక్షణాలను వివరిస్తూ ఈ సూరా ముగుస్తుంది. అల్లాహ్‌కు నిజమైన దాసులైన విశ్వాసుల లక్షణాలు :

1. వారు వినయంగా నడుస్తారు.
2. వారిని పలకరిస్తే మృదువుగా మాట్లాడుతారు.
3. వారు రాత్రులు తమ ప్రభువు ఆరాధనల్లో గడుపుతారు. అల్లాహ్‌ను స్మరిస్తుంటారు.

4. నరకశిక్ష నుంచి కాపాడమని దేవుని ప్రార్థిస్తుంటారు.
5. వారు దుబారాగా గాని, పిసినారితనంతో కాని ఖర్చుచేయరు.
6. వారు అల్లాహ్‌ను తప్ప మరే మిథ్యా దేవుణ్ణీ అర్థించరు.
7. వారు తోటి మనిషిని హత్య చేయరు. (న్యాయబద్ధంగా తప్ప)
8. వ్యభిచారం, అక్రమ సంబంధాలకు పాల్పడరు.
9. అబద్ధపు సాక్ష్యాలు చెప్పరు.
10. వ్యర్థ ప్రసంగాలు చేయరు.
11. దేవుని సృష్టిసామర్థ్యానికి సంబంధించిన ప్రస్ఫుటమైన చిహ్నాల ద్వారా వారు హితోపదేశాన్ని, ప్రేరణను పొందుతారు.
12. తమ కంటికి చలువగా ఉండే భార్యలను, పిల్లలను ప్రసాదించమని దేవుని వేడుకుంటారు.
13. దైవభీతిపరులకు ఒక ఉదాహరణగా, ఒక నమూనాగా తమను రూపొందించాలని దేవుని ప్రార్థిస్తుంటారు.
14. సహనాన్ని చూపుతారు.

**ముఖ్యాంశాలు**

**మనోవాంఛలు :**

గ్రుడ్డిగా మనోవాంఛల వెంట పడరాదు. అవి షైతానుకు దగ్గరగా తీసుకుపోతాయి.

**అహంకారం :**

గర్వం, అహంకారాలను వదులుకోవాలి. వినయంతో దైవసాన్నిహిత్యాన్ని పొందాలి.

**నమాజ్ :**

చిత్తశుద్ధితో చేసే నమాజు దేవుని సాన్నిహిత్యాన్ని ప్రసాదిస్తుంది.

**ఖర్చులు :**

దుబారా వ్యయం చేయరాదు, పిసినారితనం చూపరాదు. షైతాను ఈ ధోరణులను ప్రోత్సహిస్తాడు.



**షైతాన్ :**

షైతాన్ మనిషికి శత్రువు. కాబట్టి షైతాన్ను మిత్రునిగా చేసుకోరాదు.

**దేవుని ఆగ్రహం :**

దేవుని చిహ్నాలను విశ్వసించడానికి తిరస్కరించిన జాతులపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతుంది. చివరకు విశ్వాసులు సాఫల్యం పొందుతారు.

**మంచిలక్షణాలు :**

వినయం, వినమ్రతలు పాటించడం, ఇతరులతో మృదువుగా మాట్లాడడం, వ్యభిచారం, అక్రమసంబంధాలకు దూరంగా ఉండడం, అసత్యానికి, మోసానికి మద్దతివ్వకుండడం వంటివి విశ్వాసులు అనుసరించవలసిన మంచి లక్షణాలు. వీటిని పెంపొందించుకోవాలి.

## 26 వ అధ్యాయం

# అష్ షుఅరా

# కవులు

**పరిచయం**

ఇది మక్కాలో అవతరించిన సూరా. ఇందులో 227 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, పరలోకం, మరణానంతరం మళ్ళీ లేపబడడం, దివ్యవాణి అవతరణ, ప్రవక్తల పరంపర గురించి బోధించింది. ఈ సూరాలోని 224 – 226 ఆయతుల్లో కవుల గురించి క్లుప్తమైన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఒక కవి అని ఆరోపించారు. దివ్యఖుర్‌ఆన్ ఒక కవిత్వమని చెప్పసాగారు. కవిత్వానికి, ఖుర్‌ఆన్‌కు మధ్య ఉన్న భేదాన్ని ఈ సూరా స్పష్టం చేసింది. దివ్యఖుర్‌ఆన్ దేవుని చట్టం, మానవజీవన నియమావళి. ఖుర్‌ఆన్ మనిషి జీవితాన్ని నియంత్రిస్తుంది. కాగా కవిత్వం చాలా వరకు వ్యర్థ ప్రసంగం. దివ్యఖుర్‌ఆన్

స్వచ్ఛమైన సత్యాన్ని, మానవాళికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తుంది. కవిత్వం ఊహాగానం, కవుల కల్పన మాత్రమే.

అవిశ్వాసులకు సత్యం ప్రస్ఫుటంగా కనబడుతున్నప్పటికీ వారు తమ తిరస్కారాన్ని, తలబిరుసుతనాన్ని కొనసాగిస్తారని ఈ సూరా తెలుపుతుంది. అకస్మాత్తుగా వచ్చి పడే బాధాకరమైన శిక్ష గురించి అవిశ్వాసులను ఈ సూరా హెచ్చరించింది. దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు అని ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్యఖుర్ఆన్‌లోని సారాంశం గత కాలాల్లో అవతరించిన ప్రాచీన దైవగ్రంథాలలోను ఉందనీ, ఇస్రాయిల్ సంతతి ప్రజలకు ఈ విషయం తెలుసుననీ ఈ సూరా స్పష్టం చేసింది. ప్రవక్తలందరూ హెచ్చరిక చేసేవారిగా వచ్చారని, అల్లాహ్ ఎన్నడూ అన్యాయం చేయడని ఈ సూరా తెలిపింది. ఈ సూరాలో తీర్పుదినానికి సంబంధించిన ఒక దృశ్యాన్ని వర్ణించడం జరిగింది. ఆ రోజు విశ్వాసుల వద్దకు స్వర్గవనాలు వస్తాయి. అవిశ్వాసుల ముందు భయంకరమైన అగ్ని తాండవిస్తుంది. వారిని అందులోకి విసిరివేయడం జరుగుతుంది. అందులో వారు ఒకరితో ఒకరు జగడమాడుతుంటారు.

గత కాలాలకు చెందిన ప్రవక్తల కథలను తెలుపడం ద్వారా ఈ సూరా హితబోధ చేస్తుంది. ప్రవక్త మూసా(అస) కథను ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. విశ్వానికి ప్రభువు ఎవరన్న విషయమై మూసా(అస)కు, ఫిర్ఔన్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. ఫిర్ఔన్ తానే ప్రభువునంటాడు. తననే ఆరాధించాలని లేకపోతే జైలులో మగ్గిపోవాలని మూసా(అస)ను బెదిరించాడు. మూసా(అస) దేవుని సందేశాన్ని ఫిర్ఔన్‌కు తెలిపి, అల్లాహ్‌ను ఆరాధించాలని బోధించారు. అల్లాహ్‌యే విశ్వానికి ప్రభువని అన్నారు. ఫిర్ఔన్ నియమించిన మంత్రగాళ్ళను మూసా(అస) ఓడించారు. ఆ మంత్రగాళ్ళు సత్యాన్ని గ్రహించి అల్లాహ్‌ను విశ్వసించారు. ఫిర్ఔన్ ఆగ్రహంతో మండిపడి వారిని శిక్షిస్తానని బెదిరించాడు. చివరకు మూసా (అస) అనుయాయులను అల్లాహ్ రక్షించాడు. ఫిర్ఔన్ సైన్యాలు నీటమునిగి పోయాయి.

ఇబ్రాహీమ్ (అస) తన తండ్రిని, తన జాతి వారిని అజ్ఞాన ఆచారాలను మాను కొమ్మని, ఒకేదేవుడు అల్లాహ్‌ను ఆరాధించండనీ బోధించారు. విగ్రహాలు



ఎవరి మొరలను వినలేవనీ, అవి మీకు ఎలాంటి లాభాన్ని గాని నష్టాన్ని గాని చేకూర్చలేవని, అందరినీ సృష్టించింది అల్లాహ్ మాత్రమేననీ, ఆయనే మనిషికి అన్నపానాలు ఇస్తున్నాడని, వ్యాధి నుంచి స్వస్థత ప్రసాదిస్తున్నాడనీ, ఆయనే మృత్యువును ఇస్తాడనీ, చివరకు అందరనీ మరణానంతరం మళ్ళీ లేపుతాడని బోధించారు. ప్రవక్త నూహ్ (అస) తన జాతి వారికి హితబోధ చేస్తూ అజ్ఞాన సంప్రదాయాలు మానుకోవాలని, అల్లాహ్‌ను విశ్వసించాలని చెప్పారు. కాని వారు ఆయన్ను ఎగతాళి చేసారు. కేవలం నిరుపేదలు మాత్రమే నిన్ను అనుసరిస్తారని అన్నారు. రాళ్ళతో కొట్టి చంపేస్తామని బెదిరించారు. చివరకు నూహ్ (అస)ను, ఆయన అనుయాయులను అల్లాహ్ రక్షించాడు. అవిశ్వాసులు నాశనాన్ని చవిచూసారు.

హూద్ (అస) తన జాతి వారిని అల్లాహ్‌ను విశ్వసించాలని, దేవుని అనుగ్రహాల పట్ల ఆయనకు కృతజ్ఞులై ఉండాలని బోధించారు. మరణానంతర జీవితాన్ని, తీర్పుదినాన్ని విశ్వసించాలని చెప్పారు. కాని వారు ఆయన సందేశాన్ని తిరస్కరించారు. ఆయనను నిరాకరించారు. చివరకు దేవుని ఆగ్రహానికి గురయి అంతమయ్యారు.

అదేవిధంగా ప్రవక్త సాలిహ్ (అస) తన జాతి వారికి హితబోధ చేస్తూ అల్లాహ్‌ను విశ్వసించాలని చెప్పారు. దేవుని అనుగ్రహాలను వారికి గుర్తుచేసారు. దేవుని ఆగ్రహం గురించి తెలిపారు. న్యాయాన్ని పాటించాలని, అవినీతికి పాల్పడ రాదని బోధించారు. వారు ఆయన మాటలను పెడచెవిన పెట్టారు. ఆయన్ను మంత్రగాడన్నారు. ఆయన సందేశాన్ని తిరస్కరించారు. ఫలితంగా వినాశానికి గురయ్యారు.

ప్రవక్త లూత్ (అస) తన జాతిలో ప్రబలి ఉన్న నైతిక పతనాన్ని నివారించ డానికి ప్రయత్నించారు. అల్లాహ్‌ను విశ్వసించాలని, స్వలింగ సంపర్కం వంటి చెడ్డపని మానుకోవాలని వారికి బోధించారు. వారు ఆయన్ను వెలివేస్తామని బెదిరించారు. చివరకు బాధాకరమైన రాళ్ళ వర్షానికి గురయి నాశనమయ్యారు. లూత్ (అస)ను, ఆయన అనుయాయులను దేవుడు కాపాడాడు.

అదేవిధంగా షుఐబ్ (అస) తన జాతి ప్రజలను అల్లాహ్‌ను విశ్వసించాలని బోధించారు. న్యాయాన్ని స్థాపించాలని, అవినీతిని వదులుకోవాలని మోసాలు మాను

కోవాలని చెప్పారు. వారు ఆయన మాటలు పెడచెవిన పెట్టారు. ఆయన్ను నిర్లక్ష్యం చేసారు. ఆయన హెచ్చరికలను వారు పట్టించుకోలేదు. మంత్రగాడని ఆరోపించారు. చివరకు దేవుని ఆగ్రహానికి గురయి మరణించారు. భయంకర భూకంపం వారిని చుట్టుముట్టింది.

### ముఖ్యాంశాలు

**హితబోధ :**

హితబోధ మొదట కుటుంబ సభ్యులతో ప్రారంభం కావాలి. దగ్గరి బంధువులకు తర్వాత ఇతర ప్రజలకు బోధించాలి. అల్లాహ్‌ను విశ్వసించాలనీ, మంచి పనులు చేయాలని వారికి తెలియజేయాలి.

**దయాగుణం :**

ప్రజలతో దయగా వ్యవహరించాలి.

**నమ్మకం :**

అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి.

**న్యాయం :**

న్యాయంగా వ్యవహరించాలి. ఇతరులను మోసం చేయరాదు.

**స్వలింగ సంపర్కం :**

మహా చెడ్డపని. నైతిక పతనానికి, సమాజ వినాశానికి దారితీస్తుంది.



**27 వ అధ్యాయం**

# అన్ నమ్ల్

# చీమలు

### పరిచయం

ఇది మక్కా కాలంలో అవతరంచిన సూరా. దీనిలో 93 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్ళీ లేపబడడం వంటి మౌలిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 18వ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన చీమల వల్ల దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా దివ్యఖుర్ఆన్‌ను ఒక మార్గదర్శక గ్రంథంగా, మానవాళికి కారుణ్యంగా, హెచ్చరిక చేసే గ్రంథంగా వర్ణించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన సందేశహరుడనీ, ఆయన హెచ్చరిక చేసే వానిగా వచ్చారని తెలిపింది. మరణానంతర జీవితాన్ని, పరలోకాన్ని తిరస్కరించే అవిశ్వాసుల గురించిన ప్రస్తావనలు కూడా ఇందులో ఉన్నాయి.

ఈ సూరాలో మానవాళికి హితబోధ గరపడానికి గాను గతకాలాలకు చెందిన ప్రవక్తల కథలను ప్రస్తావించడం జరిగింది. మూసా (అస) గురించి, ఆయన తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు సినాయ్‌లో ఆయన చూసిన అగ్ని గురించి ఇందులో తెలుపడం జరిగింది. వెలుగుకు, మార్గదర్శనానికి చిహ్నం ఆ అగ్ని. అల్లాహ్ మూసా(అస)తో సంభాషించాడు. ఆయన చేతికర్రను క్రిందికి విసిరేయ మన్నాడు. ఆ కర్ర ఒక పాముగా మారిపోయింది. మూసా(అస) చేతిని తన చొక్కా లోపల పెట్టుకోమన్నాడు. ఆ చెయ్యి మెరిసిపోసాగింది.

ఈ సూరాలో సులైమాన్(అస) కథ కూడా ప్రస్తావించడం జరిగింది. ముఖ్యంగా షీబా (సబా) రాణితో సమావేశం గురించి ప్రస్తావన ఉంది. సులైమాన్ (అస)కు పక్షుల భాష తెలుసు. ఆయన చీమల వంటి కీటకాల భాష కూడా తెలిసిన వారు. షీబా (సబా) రాణికు చెందిన రాజ్యం గురించి సులైమాన్(అస)కు హుద్ హుద్ పక్షి తెలిపింది. ఆమె, ఆమె రాజ్య ప్రజలు సూర్యుని ఆరాధిస్తున్నారని ఆ పక్షి

చెప్పింది. సులైమాన్ (అస) ఆ రాణికి ఒక లేఖ రాసి అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని బోధించారు. షీబా రాణి తన సలహాదారులతో సంప్రదించి సులైమాన్(అస)తో సమావేశం కావాలని నిర్ణయించింది. సమావేశానికి ముందు ఆమె సులైమాన్(అస)కు ఒక కానుక పంపింది. కాని సులైమాన్ (అస) ఆ కానుకను తిప్పి పంపుతూ, అజ్ఞానంతో కూడిన విశ్వాసాలను మానుకోవాలని ఆ రాయబార బృందంతో ఆమెకు కబురు పంపారు. షీబా రాణి ఆయనతో సమావేశం తర్వాత తన విశ్వాసాలను మార్చుకోవడానికి నిర్ణయించి, కేవలం అల్లాహ్ మాత్రమే ఆరాధనకు అర్హుడని విశ్వసించింది.

సాలిహ్ (అస) కథ మనకు ఆయన తన జాతిలో చేసిన సందేశప్రచారం గురించి తెలుపుతుంది. ఆ జాతి ప్రజలను అల్లాహ్‌ను విశ్వసించేలా, అవినీతి చేష్టలు మానుకునేలా చేయడానికి ఆయన చేసిన తీవ్రమైన కృషిని తెలియజేస్తుంది. లూత్ (అస) తన జాతి ప్రజలలోని లైంగిక విశృంఖలత్వాన్ని, నైతిక పతనాన్ని నివారించడానికి, అల్లాహ్‌ను విశ్వసించేలా చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు.

### ముఖ్యాంశాలు

**అధికారం సంపదలు :**

అల్లాహ్‌ను విశ్వప్రభువుగా విశ్వసించనంత వరకు సంపద అధికారాలు నిష్ప్రయోజనకరమైనవి. దేవుని శిక్షను ఇవి తప్పించలేవు.

**కృతజ్ఞత :**

అల్లాహ్ అనుగ్రహించిన లెక్కలేనన్ని అనుగ్రహాలకు గాను ఆయన పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి.

**అల్లాహ్ పట్ల విశ్వాసం :**

తీవ్రమైన కష్టాలలో కూడా అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి.

**మంచిపనులకు బహుమానం :**

అల్లాహ్‌నుంచి బహుమానాలు పొందడానికి గాను మంచిపనులు చేయడానికి పోటీ పడాలి. చెడు పనులకు పాల్పడితే శిక్షపొందవలసి వస్తుంది.



**అవిశ్వాసుల పట్ల ఆందోళన :**

ప్రజలను అల్లాహ్ వైపునకు ఆహ్వానించాలి. వారు తిరస్కరిస్తే, బహిరంగంగా వ్యతిరేకతకు దిగితే, కుట్రలు కుతంత్రాలకు పాల్పడితే ఆందోళన చెందవలసిన పనిలేదు.

## 28 వ అధ్యాయం

# అల్ ఖసస్

# కథలు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 88 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాలు వంటి మౌలిక ధార్మిక విశ్వాసాలను ఈ సూరా నొక్కి చెప్పింది. మూసా(అస) కథకు సంబంధించిన వివరాలు ప్రస్తావించినందువల్ల ఈ సూరాకు ఈ పేరు వచ్చింది. ఇరవయ్యవ సూరాలో కన్నా ఎక్కువగా ఇందులో వివరంగా మూసా(అస) గురించిన ప్రస్తావన ఉంది. ఈ వివరాలు విశ్వాసులకు–అవిశ్వాసులు మధ్య, సత్యానికి–అసత్యానికి మధ్య ఘర్షణను గురించి తెలుపుతున్నాయి. ఫిర్ఔన్‌పై మూసా(అస) సాధించిన విజయం గురించిన వివరాలు ఇందులో ఉన్నాయి. అవిశ్వాసుల పరిస్థితి ఇందులో తెలియజేయడం జరిగింది. విశ్వాసులు పొందే సాఫల్యం, వారికి లభించే బహుమానం గురించి చెప్పడం జరిగింది.

ఈ సూరా ఫిర్ఔన్‌కు సంబంధించిన వివరాలతో ప్రారంభమయ్యింది. ఫిర్ఔన్ దుర్మార్గం, అణచివేతలు, అహంకారం, అవినీతి గురించి వివరించింది. ఇస్రాయీల్ సంతతి ప్రజలను ఏ విధంగా వేధించినదీ, ఎలా అణచివేసినదీ ఇందులో తెలుపడం జరిగింది. వారికి పుట్టిన మగపిల్లలను పుట్టిన వెంటనే ఫిర్ఔన్ హతమార్చేవాడు.

తల్లులను వదిలిపెట్టేవాడు. మూసా (అస) జన్మించినపుడు ఆయన కన్నతల్లి భయపడి, తన కుమారుడిని కాపాడుకోవడానికి, దైవికమైన ప్రేరణతో ఒక తొట్టెలో ఉంచి నైలు నదిలో విడిచిపెట్టింది. ఆ పెట్టె నీటిలో తేలుతూ ఫిర్ఔన్ తోటల్లోని ఒక తోటలో ప్రవహించే సెలయేరులోకి వచ్చింది. ఆ శిశువును ఫిర్ఔన్ భార్య దత్తత తీసుకుంది. ఆ విధంగా మూసా(అస) రాజభవనంలో పెరిగారు. ఆయనను సంరక్షించడానికి ఒక ఆయా కావలసివచ్చినప్పుడు మూసా(అస) కన్నతల్లి తానెవరన్నది దాచిపెట్టి, శిశువుకు పాలుపడతానని చెప్పారు. మూసా(అస) బాగా చదువుకున్న యువకునిగా ఎదిగారు. ఆయనకు వివేకవిచక్షణలు లభించాయి. యువకుడిగా ఉన్నప్పుడు ఆయన ఈజిప్టు వానితో ఘర్షణ పడుతున్న ఇస్రాయీల్ వ్యక్తికి మద్దతు నిచ్చారు. ఆ ఈజిప్టు వ్యక్తిని బలంగా కొట్టారు. ఆ దెబ్బకు ఆ వ్యక్తి మరణించాడు. ఆ వ్యక్తి ఫిర్ఔన్ అనుయాయుల్లో ఒకడు. ఈ వార్త ఫిర్ఔన్‌కు తెలిసింది. మూసా(అస) శిక్షకు భయపడి దేశం వదిలి వెళ్ళిపోవాలని నిర్ణయించారు. ఈ సమయంలో ఆయనకు దేవుని అనుగ్రహం లభించింది. దేవుని సహాయం లభించింది. అలాగే మద్యన్ ప్రజల సహకారం కూడా లభించింది. అకాబా నుంచి ఎర్రసముద్రం వరకు విస్తరించిన ఈ ప్రాంతం ప్రజలు ఆయనకు సహకరించారు. అక్కడ ఆయన ప్రవక్త షుఐబ్ (అస) కుమార్తెను పెళ్ళాడారు. మూసా(అస)ను ఈజిప్టు తిరిగి వెళ్ళి ఫిర్ఔన్‌కు దేవుని సందేశం తెలుపాలని, అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని ఫిర్ఔన్‌కు తెలుపాలని దేవుని ఆదేశమయ్యింది. మూసా(అస) ఫిర్ఔన్‌ను కలుసుకున్నారు. విశ్వప్రభువు ఎవరన్న విషయమై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఫిర్ఔన్ తానే దేవుడినన్నాడు. అహంకారాన్ని వదలలేదు. అణచివేతలు మానలేదు. చివరకు ఫిర్ఔన్ సైన్యం సర్వనాశనమయ్యింది. మూసా(అస), ఆయన అనుయాయులు ఘనవిజయం సాధించారు.

ఈ సూరాలో మనకు మరో ఇద్దరు దుర్మార్గుల గురించిన వివరాలు కూడా లభిస్తాయి. ఒకరు హామాన్. ఇతడు ఫిర్ఔన్ దర్బారులో మంత్రి, ఫిర్ఔన్‌కు ముఖ్య సలహాదారుడు. మరోకరు ఖారూన్. చాలా సంపన్నుడు. అహంభావి. హామాన్ చాలా తెలివైనవాడు. భవననిర్మాణ కళలో నైపుణ్యం ఉన్న వాడు. ఫిర్ఔన్ తనకు ఒక ఎత్తయిన స్తూపం కట్టించి ఇవ్వమన్నాడు. ఆ స్తూపంపై ఎక్కి మూసా(అస)



చెప్పే దేవుడు ఎక్కడ ఉన్నాడో చూస్తానన్నాడు. ఖారూన్ కూడా చాలా దుర్మార్గాలకు పాల్పడ్డాడు. చాలా గర్వాన్ని ప్రదర్శించాడు. అతడి వద్ద అనేక పెట్టెల్లో సంపద పడి ఉండేది. కాని అతడు ఎవ్వరికీ ఎన్నడూ దానధర్మాలు చేయలేదు. ఫిర్ఔన్‌కు విశ్వాసపాత్రుడైన అనుచరునిగా బతికాడు. అతడిపై శిక్ష విరుచుకుపడింది. భూమి అతడిని, అతడి ఆస్తిపాస్తులను మింగేసింది.

దుర్మార్గానికి పాల్పడేవారు, గర్వంగా వ్యవహరించేవారు, అవినీతి పరులు, అల్లాహ్‌ను తిరస్కరించేవారు ఎన్నడూ సాఫల్యం పొందలేరని ఈ సూరా వివరించింది. ప్రజలు దృఢసంకల్పంతో, సహనంతో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాలని ఈ సూరా ప్రబోధించింది. దానధర్మాలు చేయాలని, చెడును మంచితో తొలగించాలని, పుకార్లకు దూరంగా ఉండాలని, తప్పులకు పశ్చాత్తాపం చెందాలని, గౌరవంగా వ్యవహరించాలని బోధించింది. అల్లాహ్ చాలా కరుణామయుడనీ, జాతులు తప్పులకు పాల్పడనంత వరకు ఆయన ఎవ్వరినీ నాశనం చేయలేదని, ఆయన ప్రజల వద్దకు తన సందేశహరులను పంపి వారికి దైవాగ్రహం గురించిన హెచ్చరికలు ముందుగానే చేసాడని వివరిస్తూ ఈ సూరా ఏకదైవారాధన సూత్రాలతో ముగుస్తుంది.

## ముఖ్యాంశాలు

### దౌర్జన్యాలు, అణచివేతలు :

ఇవి అల్లాహ్ పట్ల తిరస్కారానికి, చెడు వైఖరికి నిదర్శనాలు. చెడునడత, దుర్మార్గం, అన్యాయం, అహంభావం, దౌర్జన్యాలు అల్లాహ్ ఆగ్రహాన్ని కొనితెస్తాయి. ఈ చెడుల కారణంగా అనేక జాతులు వినాశానికి గురయ్యాయి.

### సంపద అధికారాలు :

సంపదను, అధికారాన్ని దుర్వినియోగం చేయరాదు. ప్రజల సంక్షేమం కోసం వాటిని ఉపయోగించాలి. సంపద కాని, అధికారం కాని శాశ్వతం కావన్నది అందరూ గుర్తించాలి. గత జాతులను, అపరిమిత శక్తిసామర్థ్యాలు కలిగిన జాతులను, అపార వనరులు కలిగి ఉన్న జాతులను అల్లాహ్ ఈ చెడుల కారణంగా వినాశానికి గురిచేసాడు. సంపద నిజానికి అల్లాహ్‌కు చెందినది కాబట్టి దానిని దానధర్మాలకు

వినియోగించాలని ఈ సూరా ఉద్బోధించింది. ప్రాపంచిక సుఖభోగాలు, విలాసవంతమైన జీవితం అల్లాహ్ ఆగ్రహానికి దారితీస్తాయని ఈ సూరా హెచ్చరించింది.

**అవినీతి :**

అవినీతికి పాల్పడి భూమిపై కల్లోలాన్ని సృష్టించే వారికి ఎలాంటి పరిస్థితుల్లోను సహాయపడరాదు. అల్లాహ్‌ను తిరస్కరించే వారికి సహాయపడడం ధార్మిక విశ్వాసం కలవారికి పొసగని పని.

**మాతృ ప్రేమ :**

తల్లికి తన పిల్లల పట్ల అపరిమిత ప్రేమాభిమానాలు ఉంటాయి. అలాగే పిల్లలు కూడా తమ తల్లి పట్ల అలాంటి ప్రేమాభిమానాలు ప్రదర్శించాలి.

**సహాయం :**

సహాయసహకారాలు అవసరమైన వారికి వారు ఏ జాతి, ఏ కులం, ఏ మతానికి చెందిన వారైనా సహాయసహకారాలు అందించాలి.

**వ్యర్థ ప్రసంగాలు :**

పుకార్లకు దూరంగా ఉండాలి. ఇవి దుష్పరిణామాలకు దారితీస్తాయి.

**మనోవాంఛలు :**

మనోవాంఛలను, స్వంత ఇష్టాయిష్టాలను గుడ్డిగా అనుసరించరాదు. హేతుబద్ధంగా ఆలోచించాలి.

**మిడిసిపడడం :**

నిర్లక్ష్య వైఖరితో జీవించడం, దేవుడిచ్చిన సంపదను సరియైన మార్గంలో ఖర్చు చేయకుండా సంపద పట్ల మిడిసిపడడం మంచిది కాదు. ఇలాంటి ధోరణి సముదాయ వినాశానికి కారణం అవుతుంది.

**కృతజ్ఞత :**

అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. తనకు లభించిన సంపదను చూసుకొని మిడిసిపడరాదు. మిడిసిపడడాన్ని అల్లాహ్ ఇష్టపడడు.



**మరలిపోవడం :**

చివరికి అందరూ అల్లాహ్ వైపునకే మరలిపోవలసి ఉంది. అల్లాహ్ తప్ప మిగిలిన సమస్తం అంతంకాక తప్పదు.

**పరలోకం :**

అల్లాహ్‌ను విశ్వసించి మంచిపనులు చేసినవారికి, అహంకారానికి దూరంగా ఉన్న వారికి, అవినీతిని వ్యాపింపచేయని వారికి దేవుడు పరలోకంలో తగిన బహుమానాలు ఇస్తాడు.

## 29 వ అధ్యాయం

# అల్ అన్‌కబూత్

# సాలీడు

**పరిచయం**

ఇది మక్కాలో అవతరించిన సూరా. ఇందులో 69 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణానంతరం మళ్లీ లేపబడడం, ప్రవక్తలందరినీ విశ్వసించడం, వారు తీసుకు వచ్చిన దైవగ్రంథాలన్నింటిని విశ్వసించడం మొదలైన మౌలిక ధార్మిక విశ్వాసాలను ఇందులో నొక్కి చెప్పడం జరిగింది. ఈ సూరాలో సాలీడు గురించి, దాని సాలెగూటి గురించి ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అవిశ్వాసులకు, సాలీడుకు మధ్య పోలికలు చెప్పడం జరిగింది. సాలీడు ఒక బలహీనమైన ప్రాణి, అది తన బలహీనమైన సాలెగూటిలో రక్షణ పొందాలని చూస్తుంది. కాని ఈ సాలెగూడు దానిని బయటి ప్రమాదాల నుంచి కాపాడలేదు. అదేవిధంగా అవిశ్వాసులు కూడా బలహీనమైన వారు, తాము ఆరాధించే బలహీనమైన, సామర్థ్యం లేని విగ్రహాల ద్వారా రక్షణ పొందాలని చూస్తున్నారు. ఈ కుహానా దేవుళ్ళు, మానవులు కాని, కలపతో లేదా రాళ్ళతో చేయబడిన దేవుళ్ళు కాని అవిశ్వాసులకు రక్షణ

ఇవ్వలేరు. వారి ప్రయోజనాలు కాపాడలేరు. వారికి హాని కూడా కలిగించలేరు. కాగా విశ్వాసులు విశ్వప్రభువు, సర్వ శక్తిసంపన్నుడైన అల్లాహ్‌ను రక్షణ కోరుతారు. అల్లాహ్ వారికి బహుమానాలు ప్రసాదించే శక్తికలిగిన వాడు, అహంభావులకు, దేవునికి భాగస్వాములను కల్పించిన వారికి శిక్షవిధించే సామర్థ్యం కలిగిన వాడు.

విశ్వాసులు తమ జీవితంలో ఎదుర్కొనే పరీక్షల గురించి ఈ సూరా ప్రస్తావించింది. అల్లాహ్ పట్ల దృఢమైన విశ్వాసం అన్నది మాటల్లోనే కాదని, చేతల్లో సహనాన్ని చూపించి, దృఢచిత్తాన్ని ప్రదర్శించి, అవిశ్వాసుల దౌర్జన్యాలు ఎదురైనప్పుడు ఓర్పు వహించి, పూర్తిగా అల్లాహ్‌నే నమ్ముకోవడంలోనే విశ్వాసం ఉందని వివరించింది. ఈ లోకంలో ఎదురయ్యే కష్టనష్టాలు పరలోకంలోని శిక్షవంటివే అన్న భావం విశ్వాసుల మనసుల్లో తలెత్తరాదని బోధించింది.

కష్టాలు, ఇబ్బందులు, వేధింపులు భరించి దైవమార్గంలో సంఘర్షణ చేసిన అనేక మంది గతకాలాలకు చెందిన ప్రవక్తల గురించి ఈ సూరా వివరించింది. నూహ్(అస), ఇబ్రాహీమ్(అస), లూత్(అస), షుఐబ్ (అస)ల కధలను ప్రస్తావించింది. నూహ్ (అస) 950 సంవత్సరాల పాటు తన జాతి వారికి హితబోధ చేసారు. కాని చాలా కొద్ది మంది మాత్రమే అల్లాహ్‌ను విశ్వసించారు. ఇబ్రాహీమ్ (అస) తన జాతి వారిలో ఉన్న బహుదైవారాధనను, విగ్రహారాధనను,అజ్ఞాన ఆచారాలను మానిపించాలని సంఘర్షించారు. లూత్(అస) తన జాతిలో ప్రబలంగా ఉన్న అనైతికతను, స్వలింగ సంపర్క దురలవాటును మాన్పించడానికి తీవ్రంగా కృషి చేసారు. షుఐబ్ (అస) తన జాతి వారి అవినీతిని, దుర్మార్గాన్ని మానిపించడానికి పోరాడారు. కాని ఈ ప్రవక్తల బోధనలను ఆయా జాతుల వారు తిరస్కరించారు. ఈ జాతులు, ఇలాంటి తలబిరుసు వైఖరి కలిగిన వారు, ఫిర్ఔన్, హామాన్, ఖారూన్ లాంటి దుర్మార్గులు చెడులలో కూరుకుపోయారు. అసత్యం, అవిశ్వాసాలలో నిమగ్నులై పోయారు. దైవాగ్రహం వారిని చుట్టుముట్టి వారిని సర్వనాశనం చేసింది.

దివ్యఖుర్ఆన్ అల్లాహ్ తరపున అవతరించిన దైవవాణి అని ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్యఖుర్ఆన్ అల్లాహ్ తరపున ప్రవక్త ముహమ్మద్(సఅసం)పై అవతరించిన దివ్యగ్రంధమని ఉద్ఘోధించింది. మానవాళికి కారుణ్యంగా ఈ దైవగ్రంధం అవతరించిందని, కేవలం అన్యాయపరులు దీనిని తిరస్కరిస్తారని స్పష్టం చేసింది.



తాత్కాలికమైన ఇహలోక జీవితానికి, శాశ్వతమైన పరలోక జీవితానికి మధ్య భేదాలను ఈ సూరా తెలియజేసింది. మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి నిరూపణ పూర్వకంగా తెలియజేసింది.

అల్లాహ్‌కే గల ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని ఈ సూరా క్లుప్తంగా తెలియజేసింది. ఆయనకున్న శక్తిసామర్థ్యాలను స్పష్టం చేసింది. అల్లాహ్ ఈ సృష్టిని ప్రారంభించాడు. ఆయనే దీనిని మళ్ళీ పునరావృతం చేస్తాడు. ఆయన స్వర్గాన్ని, భూమిని ఒక ఉద్దేశ్యంతో సృష్టించాడు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తం ఆయనకు తెలుసు. సూర్యచంద్రులను ఆయన తన ఆదేశాలకు లోబడి నడుచుకునేలా చేసాడు. భూమికి ప్రాణం పోయడానికి ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తాడు.

## ముఖ్యాంశాలు

**పరీక్ష :**

విశ్వాసాన్ని పరీక్షించడం జరుగుతుంది. దృఢమైన ధార్మిక విశ్వాసం ఆచరణాత్మకంగా ఉంటుంది. కేవలం మాటలకే పరిమితం కాదు. విశ్వాసులను అల్లాహ్ ఎల్లప్పుడు పరీక్షిస్తూ ఉంటాడు. కఠినమైన పరిస్థితులు, కష్టనష్టాలు నిజమైన విశ్వాసానికి ఎదురయ్యే పరీక్షలు.

**నిబద్ధత :**

అల్లాహ్ ఆరాధనకే మనిషి నిబద్ధుడు కావాలి.

**నమ్మకం :**

అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి. ఆయన పట్లనే పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి. ఆయనపై తప్ప మరెవ్వరిపై ఆశలు పెట్టుకోరాదు.

**అధికారం, సంపదలు :**

అధికారం, సంపదలు సాలెగూటిలా బలహీనమైనవి. ఇవి మనిషికి శాశ్వత రక్షణ ఇవ్వలేవు. మనిషి సంపద, అధికారాలను నమ్ముకునే బదులు, పూర్తిగా అల్లాహ్‌ను నమ్ముకోవాలి.

**అబద్ధపు సాక్ష్యం :**

అల్లాహ్ గురించి, ఆయన పంపిన హితబోధ, దివ్యగ్రంథం గురించి అబద్ధాలను సృష్టించరాదు.

**పెట్టుబడి :**

అల్లాహ్‌ను విశ్వసించి మంచిపనులు చేస్తే ఈ ఆచరణలు ఒక పెట్టుబడి వంటివి. పరలోకంలో దీనికి ప్రతిఫలం లభిస్తుంది.

**కృతజ్ఞత :**

అల్లాహ్ ప్రసాదించిన అపరిమితమైన అనుగ్రహాలకు కృతజ్ఞత కలిగి ఉండాలి. అల్లాహ్ అనుగ్రహాలను తిరస్కరించరాదు.

**వినాశం :**

అల్లాహ్‌ను తిరస్కరించడం, తలబిరుసుగా వ్యవహరించడం, అణచివేతలు, చెడులు వినాశాన్ని కొనితెస్తాయి.

**ఉత్తమ వాదన :**

గ్రంథప్రజలతో అల్లాహ్ గురించి వివేకంతో, చక్కని పద్ధతిలో వాదించాలి. వివాదాలకు దిగడం వ్యర్థం.

**మృత్యువు :**

మృత్యువు ప్రతి ఒక్కరికి తప్పదు. జీవితం తాత్కాలికమైనది. చావు తప్పనిసరి. అందువల్ల ప్రతి ఒక్కరు పరలోకంలోని శాశ్వత జీవితానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

**పోషణ :**

అల్లాహ్ అందరి పోషకుడు. ఆయనే అన్నపానాలు ఇస్తున్నాడు. కాబట్టి ఆయన్నే పూర్తిగా నమ్ముకోవాలి.



**30 వ అధ్యాయం**

# అర్ రూమ్

# రోమన్ సామ్రాజ్యం

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 60 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, మరణానంతరం మళ్ళీ లేపబడడం, ప్రవక్తలందరినీ విశ్వసించడం, వారిపై అవతరించిన దివ్యగ్రంథాలను అన్నింటిని విశ్వసించడం, శిక్షాబహుమానాలు వంటి మౌలిక విశ్వాసాలను ఈ సూరాలో నొక్కిచెప్పడం జరిగింది. ఈ సూరాలో ప్రస్తావించబడిన భవిష్యవాణి – క్రయిస్తవ బైజాంటైన్ సామ్రాజ్యం, బహుదైవారాధక పర్షియన్ సామ్రాజ్యాన్ని ఓడిస్తుందన్న భవిష్యవాణి – తర్వాత నిజమయ్యింది. ఈ ప్రస్తావన 2–5 ఆయతుల్లో ఉంది. చారిత్రకంగా పర్షియన్ సామ్రాజ్యం అగ్నిని ఆరాధించే ప్రజల సామ్రాజ్యం. పర్షియన్లకు అరబ్బుతెగలతో మైత్రి సంబంధాలు ఉండేవి. కాగా బైజాంటైన్ సామ్రాజ్యం క్రయిస్తవ సామ్రాజ్యం. అంటే గ్రంథప్రజల సామ్రాజ్యం. పర్షియన్ సామ్రాజ్యం ఏడవశతాబ్దం ప్రారంభ సంవత్సరాల్లో బైజాంటైన్ సామ్రాజ్యాన్ని ఓడించింది. ఈ వార్త అరబ్బుతెగల్లో పర్షియన్ సామ్రాజ్యంతో మైత్రి సంబంధాలు కల ఖురైష్ తదితర తెగలకు సంతోషకారణమయ్యింది. కాని బైజాంటైన్ సామ్రాజ్య పరాజయం ముస్లిములకు విచారాన్ని కలిగించింది. ప్రవక్త ఈసా(అస) తీసుకొచ్చిన దైవసందేశానికి కొనసాగింపే ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తీసుకు వచ్చిన దైవసందేశం. అందువల్ల గ్రంథప్రజలకు చెందిన బైజాంటైన్ సామ్రాజ్యం పరాజయం పాలు కావడం, బహుదైవారాధక పర్షియన్ సామ్రాజ్యం విజయం సాధించడం వారికి విచారాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో ఈ సూరా అవతరించింది. ఈ సూరాను అరబ్బు తెగలు అపహాస్యం చేసాయి. ఈ సందర్భంగా బైజాంటైన్ సామ్రాజ్యం విజయం సాధిస్తుందన్న భవిష్యవాణిని వినిపించింది. ఈ భవిష్యవాణి తర్వాత

నిజమయ్యింది. బైజాంటైన్ సామ్రాజ్యం పర్షియన్ సామ్రాజ్యాన్ని ఓడించింది. ఈ సూరాలో ఉన్న మరొక భవిష్యవాణి, ప్రపంచవ్యాప్త ఉపద్రవం గురించినది. ఈ భవిష్యవాణి పర్యావరణ కాలుష్యానికి కూడా వర్తించే భవిష్యవాణి. నేలపై సముద్రాలలో మనిషి సృష్టించిన ఉపద్రవం వ్యాపిస్తోంది.

ఈ సూరా విశ్వాసానికి, అవిశ్వాసానికి మధ్య, సత్యానికి, అసత్యానికి మధ్య, దేవుని దాసులకు– షైతాను దాసులకు మధ్య సంఘర్షణ గురించి చర్చించింది. ఈ సూరా గతకాలాలకు చెందిన జాతుల గురించి కూడా ప్రస్తావించింది. వారికి ఎలాంటి గతి పట్టిందో కూడా వివరించింది. ఈ జాతులు సర్వనాశనానికి గురయ్యాయి. ఈ జాతులు దుర్మార్గానికి, దైవతిరస్కారానికి పాల్పడినందువల్ల, తమ ప్రవక్తలను తిరస్కరించినందువల్ల, వారిని హేళన చేసినందువల్ల దైవాగ్రహానికి గురయి నాశనమయ్యాయి.

ఈ సూరా తీర్పుదినం గురించి కూడా ప్రస్తావించింది. ఆ రోజున ప్రజలు రెండు వర్గాలుగా విభజించబడతారు. సత్యాన్ని తిరస్కరించినవారు, తమ ప్రవక్తలను నిరాకరించిన వారు ఒక వర్గంలోనూ, తమ ప్రవక్తలను విశ్వసించి సత్యాన్ని స్వీకరించిన వారు మరో వర్గంగానూ ఉంటారు. మొదటి వర్గం నరకాగ్నిలో ఆహుతవుతుంది. రెండవ వర్గం స్వర్గవనాలను పొందుతుంది. మరణానంతరం మళ్ళీ లేపబడడం, పరలోక జీవితాల గురించి ఈ సూరా వివరించింది. సృష్టి గురించి మళ్ళీ సృష్టిని పునరావృతం చేయడం గురించి ఇందులో చెప్పడం జరిగింది. అల్లాహ్ మొదటి సృష్టిని గావించాడు. ఆయన ఈ సృష్టిని మరోసారి పునరావృతం చేస్తాడు. అంటే, ఒకసారి సృష్టించడం జరిగిన దాన్ని మళ్ళీ సృష్టించడం చాలా తేలికని ఈ సూరా తెలియజేస్తోంది. అందువల్ల మరణించిన వారిని మళ్ళీ లేపినిలబెట్టడం కష్టమేమీ కాదని, వారిని మొదట సృష్టించిన అల్లాహ్ మళ్ళీ వారిని సృష్టించే శక్తి కలిగిన వాడని స్పష్టం చేసింది.

అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయన సృష్టి సామర్థ్యాన్ని ఈ సూరా వివరించింది. అల్లాహ్ నిర్జీవపదార్థాల నుంచి జీవాన్ని, జీవం నుంచి నిర్జీవాన్ని సృష్టించే శక్తి కలిగిన వాడు. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. ఆయన మనిషికి అదే



జాతికి చెందిన జంటను సృష్టించాడు. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించాడు. ఆయన ప్రజల భాషల్లో, వారి వర్ణాల్లో వైవిధ్యాన్ని సృష్టించాడు. ఆయన రాత్రిని విశ్రాంతి సమయంగానూ, పగటిని ఉపాధిని అన్వేషించే సమయంగానూ చేసాడు. భయాన్ని కలిగించే, ఆశను రేకెత్తించే మెరుపులు ఆయన సృష్టించాడు. ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తాడు. ఆయన ఆకాశాలు, భూమి పటిష్టంగా తయారు చేసాడు. ఆకాశాల్లో, భూమిలో ఉన్న సమస్తం ఆయనకు చెందినదే. ఆయన మేఘాలను నడిపే గాలులు పంపిస్తాడు. ఆయన మృతభూమికి ప్రాణం పోస్తాడు.

ఈ సూరా కొందరు ప్రవక్తలకు ఇవ్వబడిన మహత్యాల గురించి కూడా ప్రస్తా వించింది. ఈ మహత్యాలు ప్రదర్శించినప్పటికీ, చాలా మంది ప్రజలు ఆ ప్రవక్తలను విశ్వసించలేదు. సత్యాన్ని తిరస్కరించారు. అలాగే బహుదైవారాధక తెగలు తమ విశ్వాసాన్ని మార్చుకునేలా మహత్యాలు చేయలేవు . అవిశ్వాసులు చెవిటి, మూగ, గ్రుడ్డి ప్రజలని ఈ సూరా అభివర్ణించింది. వారి ఆధ్యాత్మిక సామర్థ్యం మరణించిందని పేర్కొంది. సూరా చివరి భాగంలో ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి దృఢచిత్తంతో, సహనంతో వ్యవహరించాలని చెప్పడం జరిగింది.

## ముఖ్యాంశాలు

**అగ్రరాజ్యాలు :**

సూపర్‌పవర్లు అనేవి శాశ్వతంగా ఉండవు. వాటి ఉత్థానపతనాలు సహజంగా చోటుచేసుకుంటాయి. నిజానికి అధికారం అన్నది కేవలం అల్లాహ్‌కు మాత్రమే చెందినది.

**విజయం :**

కేవలం అల్లాహ్ మాత్రమే విజయాన్ని ప్రసాదించగలడు. ఆయన విశ్వాసులకు విజయం ప్రసాదిస్తానని వాగ్దానం చేసాడు. ఆయన తన వాగ్దానాన్ని ఎన్నడూ భంగపరచడు.

**గుణపాఠం :**

గతజాతుల కథల నుంచి గుణపాఠాలు గ్రహించాలి. సత్యాన్ని తిరస్కరించినందువల్ల, చెడులకు పాల్పడినందువల్ల ఆయా జాతులు వినాశాన్ని చవిచూసాయి.

**కృతజ్ఞత :**

సుఖదుఃఖాలలో, కష్టనష్టాలలో అన్ని వేళలా అల్లాహ్‌కు కృతజ్ఞులుగా ఉండాలి. అవకాశవాదులు తమకు అవసరమైనప్పుడు దేవునికి మొరపెట్టుకుంటారు. కాని తమ కష్టాలు తొలగగానే దేవుని మరిచిపోతారు.

**నిరాశ :**

అల్లాహ్ కారుణ్యం పట్ల ఎన్నడూ నిరాశ చెందరాదు. అల్లాహ్ ఎన్నడూ ప్రజలకు అన్యాయం చేయడు. ప్రజలు తమకు తామే అన్యాయం చేసుకుంటారు.

**వడ్డీ :**

వడ్డీ అనేది దేవుని చట్టానికి వ్యతిరేకమైనది. దీనిని వదులుకోవాలి.

**పోషణ :**

అల్లాహ్ మాత్రమే పోషకుడు. మన సంపద నిజానికి దేవునికి చెందినది. కాబట్టి మనిషి తన బంధువులను, అవసరార్థులను, బాటసారులను ఆర్థికంగా ఆదుకోవాలి. అన్నింటికన్నా ముందు జకాత్ చెల్లించాలి.

**విశ్వాసం & అవిశ్వాసం :**

తిరస్కరించినవారు తమ తిరస్కారానికి ఫలితం అనుభవించవలసి ఉంటుంది. మంచి పనులు చేసేవారు పరలోకంలో అల్లాహ్ బహుమానాలు పొందుతారు.

## 31 వ అధ్యాయం

# లుఖ్మాన్

### పరిచయం

ఇది మక్కా కాలంలో అవతరించిన సూరా. దీనిలో మొత్తం 34 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన గురించి నొక్కి చెప్పింది. ఈ



సూరాలో ప్రస్తావనకు వచ్చిన జ్ఞాని, దైవభక్తిపరాయణుడు అయిన హజ్రత్ లుఖ్మాన్ వల్ల ఈ సూరాకు ఈ పేరు వచ్చింది. లుఖ్మాన్ తన కుమారుడికి ఇచ్చిన సలహా మనకు నైతిక చట్టాన్ని, వివేకవివేచనలను తెలుపుతుంది. హజ్రత్ లుఖ్మాన్ భావాలు ఒకేఒక్క దేవుడిని సూచిస్తున్నాయి.

దివ్యఖుర్‌ఆన్ వివేకవివేచనల గ్రంథం అని వర్ణిస్తూ ఈ సూరా ప్రారంభం అవుతుంది. మంచిపనులు చేసేవారికి ఈ గ్రంథం మార్గదర్శనమనీ, కారుణ్యమనీ పేర్కొంది. ఈ సందర్భంగా మంచిపనులు చేసేవారి లక్షణాలను అభివర్ణించడం జరిగింది. వారు నమాజును స్థాపిస్తారు. జకాత్ చెల్లిస్తారు. పరలోకాన్ని విశ్వసిస్తారు. వారు సాఫల్యం పొందేవారు. వారు మార్గదర్శకత్వానికి కట్టుబడతారు. వారు స్వర్గవనాలు పొందేవారు. ఈ సందర్భంగా అవిశ్వాసుల వర్ణన కూడా మనకు ఇక్కడ లభిస్తుంది. వారు వ్యర్థ ప్రసంగాలు చేస్తారు. అల్లాహ్‌కు సంబంధించిన విలువైన, ప్రయోజన కరమైన మాటలకు బదులు వ్యర్థమైన మాటల్లో కాలం గడుపుతారు. అల్లాహ్ మార్గం నుంచి ఇతరులను తప్పించడానికి ప్రయత్నిస్తారు. వారు దివ్యఖుర్‌ఆన్ అవతరణను పరిహసిస్తారు. అహంకారంతో వ్యవహరిస్తారు. వారు తీవ్రపరాభవానికి గురవుతారు.

మరణానంతరం లేపబడడం గురించి ఈ సూరా క్లుప్తంగా ప్రస్తావించింది. అల్లాహ్ శక్తిసామర్థ్యాలను వివరించింది. సమస్త మానవాళిని సృష్టించడం, మరణించిన వారందరిని మళ్ళీ బ్రతికించడం, అన్నది నిజానికి ఒక్క వ్యక్తిని సృష్టించడం, మరణించిన తర్వాత మళ్ళీ లేపడమంత తేలికైన పని అని తెలిపింది. అల్లాహ్‌ను గుర్తుంచుకోవాలని, తీర్పుదినానికి భయపడాలని, ప్రాపంచిక జీవిత వ్యామోహంలో కూరుకుపోరాదని, అల్లాహ్ ఔన్నత్యాన్ని తగ్గించే తన స్వంత భావాల్లో మునిగిపోరాదని హితబోధ చేసింది.

అల్లాహ్‌కు ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యం గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ఆయన ఆకాశాలను ఎలాంటి స్తంభాలు లేకుండా నిలబెట్టాడు. ఆయన దృఢమైన పర్వతాలను భూమిపై నిలబెట్టాడు. ఆయన భూమిపై రకరకాల

జంతువులను వ్యాపింపచేసాడు. ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తాడు. ఆకాశాలలోను, భూమిపై ఉన్న సమస్తాన్ని ఆయన మానవాళి ప్రయోజనం కోసం సృష్టించాడు. ఆయన ప్రజలకు లెక్కలేనన్ని అనుగ్రహాలు ప్రసాదించాడు. ఆయన రాత్రిని పగటిలోకి ఐక్యం చేస్తాడు. పగటిని రాత్రిలో ఐక్యం చేస్తాడు. ఆయన సూర్యచంద్రులను అదుపు చేస్తాడు. గర్భాలలో ఉన్నది కూడా ఆయనకు తెలుసు.

## ముఖ్యాంశాలు

**ప్రవర్తనావళి :**

దేవుని చట్టాల్లో భాగమైన ప్రవర్తనావళికి కట్టుబడడం మనిషికి ఎంతయినా అవసరం.

1. ఆరాధనల్లో అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరిని నిలబెట్టరాదు. ఎందుకంటే ఆ విధంగా ఇతరులను, అసత్య దేవుళ్ళను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టడం మహాపరాధం.
2. తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించాలి. వారి పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి.
3. అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగిఉండాలి.
4. తల్లిదండ్రులు బహుదైవారాధన విషయమై బలవంతం చేస్తే వారి మాట విననవసరం లేదు. కాని వారితో మంచిగా మాట్లాడాలి.
5. ఒక చిన్నపాటి మంచిపని చేసినా దేవుడు దానిని గుర్తిస్తాడు. తగిన బహుమానం ప్రసాదిస్తాడు.
6. నమాజును స్థాపించాలి.
7. ఎలాంటి కష్టం ఎదురైనా సహనాన్ని చూపించాలి.
8. ఇతరులను ఎగతాళి చేయరాదు.
9. గర్వంతో నిక్కుతూ నడువరాదు. వినమ్రంగా నడవాలి.
10. మాట్లాడినప్పుడు గొంతు తగ్గించి మాట్లాడాలి.



**భ్రమలు :**

ప్రాపంచిక జీవిత భ్రమల్లో మునిగిపోరాదు. ప్రాపంచిక జీవితం తాత్కాలికమైన వెలుగు జిలుగులతో కూడుకున్నది. పరలోకం శాశ్వతమైనది. పరలోక జీవిత సాఫల్యానికే మనిషి ప్రయత్నించాలి.

**సుఖ దుఃఖాలు :**

అల్లాహ్‌ను స్మరించాలి. ఆయన పట్ల కృతజ్ఞత ప్రదర్శించాలి. సుఖదుఃఖాల్లో అన్ని వేళలా ఆయనకు కృతజ్ఞులై ఉండాలి.

**విధేయత, తిరస్కారాలు :**

అల్లాహ్ ఆరాధనకు అంకితమైతే ఆ వైఖరి స్వయంగా మనిషికే మంచిది. కాని మనిషి అల్లాహ్‌ను తిరస్కరిస్తే తీవ్రమైన శిక్షను ఆహ్వానించడమే అవుతుంది.

**వివాదాలు :**

జ్ఞానం లేనప్పుడు, మార్గదర్శనం లేనప్పుడు, దివ్యఖుర్‌ఆన్ ఆయతుల అవగాహన లేనప్పుడు అల్లాహ్ విషయమై వాదవివాదాలకు దిగరాదు.

**32 వ అధ్యాయం**

# అస్ సజ్‌దహ్

# సాష్టాంగ నమస్కారం

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 30 ఆయతులు ఉన్నాయి. మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి, పరలోక జీవితం గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. అవిశ్వాసులు మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి అనుమానాలు వ్యక్తం చేసారు. పరలోక జీవితాన్ని వాళ్ళు విశ్వసించలేదు. దైవప్రవక్త

ముహమ్మద్(సఅసం)తో ఈ విషయమై వాళ్ళు వివాదానికి దిగేవారు. ఈ ప్రశ్నలతో ఆయన సందేశాన్ని తిరస్కరించడానికి ప్రయత్నించేవారు. ఈ సూరా అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడే ఆయత్‌తో ప్రారంభమవుతుంది. అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయనకే ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని నిరూపించే వాక్యాలతో ప్రజల అనుమానాలను నివారిస్తుంది. సమస్తాన్ని సృష్టించింది అల్లాహ్. ఒకసారి సృష్టించిన ఆయనకు మరోసారి సృష్టించడం చాలా తేలిక. మరణించిన వారిని మళ్ళీ సృష్టించి నిలబెట్టడం ఆయనకు సులభసాధ్యం. ఈ సందర్భంగా దేవుని సృష్టి సామర్థ్యం గురించిన వివరాలను కూడా ఈ సూరా ఇక్కడ పొందుపరిచింది. దివ్యఖుర్ఆన్‌ను సత్యంగా పేర్కొంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదని, ఇదొక హెచ్చరిక అని తెలియజేసింది. ఈ సూరాలోని 15వ ఆయతులో వచ్చిన సాష్టాంగ నమస్కారం ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ ఆయత్‌లో విశ్వాసుల గుణగణాలను వర్ణించడం జరిగింది. విశ్వాసులు దేవుని చిహ్నాలను విశ్వసిస్తారు. దేవుని చిహ్నాల గురించి వారికి గుర్తుచేసినప్పుడు వారు భక్తితో సాష్టాంగపడతారు. తమ ప్రభువైన అల్లాహ్‌ను స్తుతిస్తారు. గతకాలాల్లో అవిశ్వాసానికి పాల్పడిన జాతులకు ఎలాంటి గతి పట్టిందో ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈ సూరా అవిశ్వాసులను హెచ్చరించింది. గతంలో అనేక జాతులు నాశనం చేయబడ్డాయని, ఈ వాస్తవాన్ని అల్లాహ్ చిహ్నాల్లో ఒకటిగా గుర్తించాలని చెప్పడం జరిగింది.

ఈ సూరాలో దేవుని శక్తిసామర్థ్యాలను వివరించడం జరిగింది. అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. భూమ్యాకాశాల మధ్య ఉన్న సమస్తాన్ని సృష్టించాడు. ఈ సృష్టిని ఆయన ఆరురోజుల్లో పూర్తిచేసాడు. ఆయన ఆకాశాలు, భూమిపై జరిగే అన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నాడు. ఆయన కంటికి కనిపించని సమస్త విషయాలు తెలిసిన వాడు. ఈ అగోచరాలు మన ఇంద్రియజ్ఞానంతో గ్రహించడానికి వీలు కానివి. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. ఆయన మనిషికి వినే, చూసే శక్తిని ఇచ్చాడు. ముఖ్యమైన అవయవాలు ప్రసాదించాడు. ఆయన పొడి నేలపై వర్షాన్ని కురిపించి పంటలు పండేలా చేస్తున్నాడు. ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాడు. వారి పశువులకు ఆహారం లభించేలా చేస్తున్నాడు.



ఈ సూరాలో తీర్పుదినం గురించిన క్లుప్తమైన ప్రస్తావన ఉంది. ఈ సందర్భంగా విశ్వాసులకు, అవిశ్వాసులకు మధ్య భేదాన్ని వివరించడం జరిగింది. ఆ రోజున అవిశ్వాసులకు వారి అవిశ్వాసం, చెడులు, అనైతికతల ఫలితంగా లభించే శాశ్వతమైన నరకాగ్ని గురించి తెలియజేయడం జరుగుతుంది. తలలు వాల్చుకుని వారు తమ తప్పులు అంగీకరిస్తారు. తమను మళ్ళీ భూమిపై పంపిస్తే సన్మార్గంపై నడిచి మంచిపనులు చేస్తామని వేడుకుంటారు. కాని వారు నేరస్తులు, పాపులు, తిరస్కారవైఖరి అవలంబించిన వారు. విశ్వాసులు దేవుని చిహ్నాలను విశ్వసించిన వారు. దేవునికి విధేయత చూపినవారు. అహంకారానికి దూరంగా ఉన్నవారు. దేవునికి భయపడిన వారు, ఆయనపై ఆశలు పెట్టుకున్నవారు. జకాత్ చెల్లించినవారు. మంచిపనులు చేసిన వారు. విశ్వాసులకు స్వర్గవనాల శుభవార్త తెలియజేయడం జరుగుతుంది.

## ముఖ్యాంశాలు

**అల్లాహ్‌కు భయపడడం :**

ఎల్లప్పుడు అల్లాహ్‌నే నమ్ముకోవాలి. ఇది విశ్వాసానికి ముఖ్యమైన లక్షణం.

**సహనం :**

సహనం, దృఢచిత్తం ఇవే సాఫల్యానికి మార్గాలు.

**దేవుని చిహ్నాలు :**

దేవునికే ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని విశ్వసించాలి. మరణించిన తర్వాత దేవుడు మళ్ళీ లేపినిలబెడతాడన్న వాస్తవాన్ని విశ్వసించాలి. మన ముందు దేవుని చిహ్నాలు అనేకం ఉన్నాయి. వాటిని తిరస్కరించడం పెద్దతప్పిదం.

## 33 వ అధ్యాయం

# అల్ అహ్జాబ్

# కూటమి

### పరిచయం

ఈ సూరా మదీనా కాలంలో అవతరించిన సూరా. ఇందులో 73 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా అనేక ఇస్లామీయ చట్టాలను తెలిపింది. ముఖ్యంగా కుటుంబానికి సంబంధించిన చట్టాలు ఇందులో వచ్చాయి. ఈ సూరాలోని 20వ ఆయతులో కూటమి గురించిన ప్రస్తావన ఉంది. ఈ ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. క్రీ.శ 626-27లో మక్కా నగరానికి చెందిన అవిశ్వాసులు, యూదులు, కపటవిశ్వాసులు ఒక కూటమిగా ఏర్పడ్డారు. మదీనాలో కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ సమాజాన్ని తుడిచివేయాలని భావించారు. 10,000 మంది సైనికులతో మదీనాను మూడువారాల పాటు చుట్టుముట్టారు. ఈ ముట్టడి సైనికపరమైనదే కాదు, ఆర్థికమైనది కూడా. ఈ ముట్టడి వల్ల ముస్లిములు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ముస్లిములు మదీనా చుట్టూ శత్రువులు ప్రవేశించకుండా ఒక కందకాన్ని తవ్వారు. ఈ కందకం శత్రువులను లోనికి ప్రవేశించకుండా అడ్డుపడింది. ఒక బలమైన గాలి వాన శత్రు శిబిరాలను కకావికలు చేసింది. మూడురోజుల పాటు వీచిన ఈ గాలివానకు శత్రు కూటమి సైన్యాలు పలాయనం చిత్తగించాయి.

ఈ సూరా ప్రారంభంలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి అల్లాహ్‌కు భయపడాలని, అవిశ్వాసులు, కపటవిశ్వాసులకు విధేయత చూపరాదని ఉద్బోధించింది. అల్లాహ్ చట్టాలను అమలు చేయాలని, అల్లాహ్‌ను పూర్తిగా నమ్ముకోవాలని చెప్పింది. వివాహానికి, విడాకులకు సంబంధించిన అజ్ఞానకాలం నాటి ఆచారాలను ఈ సూరాలో రద్దుచేయడం జరిగింది. ఈ సూరాలో దత్తత తీసుకోవడం గురించి, స్త్రీల లజ్జాబిడియాల గురించి కూడా ప్రస్తావనలు ఉన్నాయి. భార్యల వైవాహిక హక్కులను గౌరవించాలని ఈ సూరా బోధించింది. విడాకులు పొందిన స్త్రీకి



మరొక వివాహం చేసుకునే స్వేచ్ఛ ఉంది. దత్తత తీసుకున్న పిల్లవాడు కన్నబిడ్డకు సమానం కాదని (వంశం, రక్తసంబంధాల దృష్ట్యా) తెలిపింది. ఈ సూరాలో స్త్రీల లజ్జాబిడియాల ప్రస్తావన ఉంది. స్త్రీలు సదాచరణలకు కట్టుబడాలని, దేవునికి భయపడాలని, నమాజును స్థాపించాలని, జకాత్ చెల్లించాలని, మాటతీరు మరీ మెతకగా ఆకర్షణీయంగా ఉండరాదని, తగినవిధంగా ఉండాలని, తమ అంద చందాలను బహిర్గతం చేసేలా వస్త్రాలు ధరించరాదని, బయట ఉన్నప్పుడు లజ్జా బిడియాలకు తగిన దుస్తులు ధరించాలని బోధించింది. అల్లాహ్ వారికి క్షమాభిక్షను, గొప్ప బహుమానాన్ని ప్రసాదిస్తాడని హామీ ఇచ్చింది.

ఈ సూరాలో కుటుంబపరమైన మర్యాదల ప్రస్తావన ఉంది. ఈ మర్యాదలను అందరూ గౌరవించాలి. పరుల ఇంటిలోకి వారి అనుమతి లేనిదే ప్రవేశించరాదు. ఎవరైనా భోజనానికి పిలిస్తే, సమయానికి చాలా ముందే అక్కడి వెళ్ళి ఇబ్బంది కలిగించరాదు. భోజనం ముగిసిన తర్వాత వ్యర్థప్రసంగాలతో అక్కడే కాలం వెళ్ళబుచ్చుతూ కూర్చోరాదు. ఈ సూరాలో తీర్పుదినం నాటి భయంకర పరిస్థితుల ప్రస్తావన వచ్చింది. అవిశ్వాసుల కొరకు భయానకమైన అగ్ని సిద్ధంగా ఉందని హెచ్చరించింది.

### ముఖ్యాంశాలు

**దైవభీతి :**

దేవుని సాన్నిహిత్యాన్ని పొందడానికి, ఆయన సహాయాన్ని పొందడానికి ఎల్లప్పుడు దైవభీతితో మెలగాలి.

**అల్లాహ్‌పై విశ్వాసం :**

పూర్తిగా అల్లాహ్‌నే నమ్ముకోవాలి. ఆయనే సమస్తానికి సంరక్షకుడు.

**కృతజ్ఞత :**

అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆయన ప్రసాదించిన అపరిమిత అను గ్రహాలకు ధన్యవాదాలు తెలుపుకోవాలి.

**సహనం :**

కష్టాల్లో సహనంతో, దృఢచిత్తంతో వ్యవహరించాలి.

**కపటవిశ్వాసం:**

కపట విశ్వాసులు ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైనవారు.

**ప్రవక్త:**

ప్రవక్త ముహమ్మద్ (సఅసం) జీవనం మానవాళి అనుసరించదగిన ఉత్తమ ఉదాహరణ.

**లజ్జా బిడియాలు:**

దుస్తుల విషయంలో స్త్రీలు లజ్జాబిడియాలను పాటించడం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఎంతయినా అవసరం.

**అపవాదులు:**

అబద్ధపు ఆరోపణలు, అభాండాలకు దూరంగా ఉండాలి.

## 34 వ అధ్యాయం

# సబా

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 54 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం వంటి మౌలిక విశ్వాసాల గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలో 15-18 ఆయతుల్లో సబారాజ్యం గురించిన కథ ఉంది. ఈ కథ ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. సబాజాతి ప్రజలు సుఖభోగాలతో విలాసవంతంగా జీవించేవారు. అల్లాహ్ పట్ల విశ్వాసం లేని జాతి. బహుదైవారాధక జాతి. సబా పట్టణం ఎమన్‌లో ఉంది. సబా ప్రజలకు చాలా భోగభాగ్యాలు లభించాయి. వారు భవననిర్మాణంలో మంచి ప్రావీణ్యం కలిగిన వారు. వారికి అపరిమితమైన వనరులు ఉండేవి. సారవంతమైన భూభాగాలు,



అనుకూలమైన వాతావరణం వారికి లభించాయి. రెండు మైళ్ళ పొడవు, 120 అడుగుల వెడల్పు కలిగిన ఒక గొప్ప డ్యామును వారు నిర్మించారు. వారు భోగభాగ్యాలతో, అహంభావంతో బ్రతికేవారు. వారి సమాజం ధనికబీద వర్గాలుగా చీలిపోయింది. వారు దుర్మార్గాలకు పాల్పడేవారు. తమ ఆరాధనల్లో దేవునికి భాగస్వాములను కల్పించేవారు. బహుదైవారాధనకు పాల్పడేవారు. చివరకు అల్లాహ్ ఆగ్రహం వారిని చుట్టుముట్టింది. ఒక భారీ వరద వారిని ముంచేసింది. (120క్రీ.శ). ఆ వరద తర్వాత సబారాజ్య పతనం ప్రారంభమయ్యింది. వారి సారవంతమైన నేలలు బంజరు భూములయ్యాయి. వారి పండ్లతోటలు ముళ్ళపొదలుగా మారాయి.

ఈ సూరా అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ప్రారంభమయ్యింది. అవిశ్వాసులు అంటే, ప్రళయాన్ని విశ్వసించని వారు, మరణానంతరం మళ్ళీ లేపబడతామన్న విషయాన్ని, పరలోక జీవితాన్ని తిరస్కరించేవారి ప్రస్తావన ప్రారంభంలోనే వచ్చింది. దేవుడి అపరిమిత శక్తిసామర్థ్యాలను గురించి వివరిస్తూ, చివరకు అగోచరమైన జిన్నులకు కూడా సమస్తాన్ని తెలుసుకునే శక్తి లేదని, కేవలం అల్లాహ్‌కు మాత్రమే అన్నింటిని తెలుసుకునే శక్తి ఉందని తెలియజేసింది. ఈ సూరాలో అజ్ఞాన అరబ్బు తెగలు ఆరాధిస్తున్న విగ్రహాల గురించి ప్రస్తావిస్తూ అవి వాటిని ఆరాధిస్తున్న వారికి ఎలాంటి ప్రయోజనం కలుగజేసే శక్తిలేనివిగా పేర్కొనడం జరిగింది. దావూద్ (అస), సులైమాన్ (అస)లకు అల్లాహ్ ప్రసాదించిన అపరిమితమైన అనుగ్రహాల గురించి తెలియజేయడం జరిగింది. వారికి దేవుడు అసాధారణమైన శక్తులను ప్రసాదించాడు.

ఈ సూరాలో దేవుని ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అందజేస్తున్న సందేశం గురించి ప్రస్తావిస్తూ అవిశ్వాసులు దివ్యఖుర్ఆన్‌ను తిరస్కరించినప్పటికీ, ప్రవక్త ముహమ్మద్(సఅసం) సహనంతో, దృఢచిత్తంతో వ్యతిరేకతలను, అపవాదులను, ఆరోపణలను ఎదుర్కోవాలని బోధించింది. గత కాలాల్లో తమ ప్రవక్తలను తిరస్కరించిన జాతులకు ఎదురైన వినాశాన్ని ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు తెలియజేసి ఆయనకు ఊరట కలిగించడం జరిగింది. సూరా చివరి భాగంలో అవిశ్వాసులను అల్లాహ్‌ను విశ్వసించాలని, దేవునికి భాగస్వాములను కల్పించే మహాపరాధాన్ని మానుకోవాలని బోధించింది.

## ముఖ్యాంశాలు

**కృతజ్ఞత :**

అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞత చూపడం సదాచరణల్లో ముఖ్యమైనది. అల్లాహ్ పట్ల కృతజ్ఞత చూపడం వల్ల కొన్ని తప్పులు కూడా క్షమించబడవచ్చు. కాని అల్లాహ్ పట్ల కృతజ్ఞత లేకపోవడం వల్ల ఆయన ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. ఆయన శిక్షకు బలికావలసి వస్తుంది.

**అధికారం వైభవాలు :**

మనిషికి అధికారం, వైభవాలు శాశ్వతం కావు. మానవుని అధికారాలు, వైభవాలు అంతరించక తప్పదు. ప్రాపంచిక అధికారం, కుటుంబ ప్రతిష్ఠ, వనరులు, సంపద ఇవన్నీ దేవుడు ప్రసాదించినవే. వాటిని మానవాళి సంక్షేమానికి ఉపయోగించాలి. మంచి చేయడానికి ఉపయోగించాలి.

**వివేకం విజ్ఞానాలు :**

ఇవి దేవుని అనుగ్రహాలు. కాబట్టి వాటిని న్యాయం కోసం, మంచి కోసం ఉపయోగించాలి.

**సిఫారసు :**

ధార్మిక విశ్వాసంలోని అతిముఖ్యమైన అంశమేమంటే ఎవరూ సిఫారసు చేయలేరు. ఆయన అనుమతి లేనిదే సిఫారసు చేసే సామర్థ్యం ఎవరికీ లేదు. ప్రతి ఒక్కరు తమ కర్మలకు తామే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

**సత్యం - అసత్యం :**

సత్యం అన్నది చివరకు విజయం సాధిస్తుంది. అసత్యం చివరకు అంతం కాకతప్పదు.

**పోషణ :**

అల్లాహ్ మాత్రమే అందరి పోషకుడు.



## 35 వ అధ్యాయం

# ఫాతిర్

# సృష్టికర్త

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 45 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన గురించి, దైవదూతలు, ప్రవక్తలు, దైవ గ్రంథాలు, తీర్పుదినం తదితర మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో సృష్టికర్త గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు పేరు పెట్టడం జరిగింది. ఈ సూరాలోని మొదటి వాక్యాలు దైవదూతల సృష్టికి సంబంధించినవి. దైవదూతలను భిన్న సంఖ్య కలిగిన రెక్కలతో సృష్టించడం జరిగింది. ఈ రెక్కలతో వారు తమకు ఆదేశించబడిన ప్రదేశానికి చేరుకుంటారు. వారు ప్రయాణించే వేగం, ప్రయాణ పద్ధతి మానవ అవగాహనకు అందనిది. దేవుని శక్తిసామర్థ్యాలను, అల్లాహ్‌కే ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యాన్ని ఈ ఆయతులు స్పష్టం చేస్తున్నాయి. అల్లాహ్ మరణించిన వారిని మళ్ళీ లేపినిలబెడతాడన్న వాస్తవాన్ని రుజువు చేసే వాక్యాలివి. ఆయన భూమ్యాకాశాలను సృష్టించాడు. ఆయన మేఘాలను తీసుకు వచ్చే గాలులను పంపిస్తాడు. ఆయన మనిషిని మట్టినుంచి సృష్టించాడు, తర్వాత వీర్యం బిందువు నుంచి సృష్టించాడు. స్త్రీపురుష జంటలుగా చేసాడు. ప్రతి స్త్రీ గర్భంలో ఏముందో ఆయనకు తెలుసు. (అంటే గర్భంలోని శిశువు ఆడా లేక మగ అన్నదే కాదు, శిశువు ఆయుష్షు, విధివ్రాత వగైరా అన్నీ ఆయనకు తెలుసు). ఆమెకు జన్మించేదెవరో కూడా ఆయనకు తెలుసు. ఆయన రెండు విధాలైన జలాలను సృష్టించాడు. ఒకటి తాగడానికి పనికొచ్చే మంచినీరు, రెండవది తాగడానికి పనికిరాని ఉప్పునీరు. ఆయన రాత్రిని పగటితో కలుపుతాడు, పగటిని రాత్రితో కలుపుతాడు. ఆయన సూర్యచంద్రులను నియంత్రిస్తున్నాడు. ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తున్నాడు. వివిధ

రకాల ఫలాలు ఉత్పత్తి కావడానికి ఈ వర్షం నీరు ఉపయోగపడుతుంది. ఆయన వివిధ రంగుల కొండలను, శిలలను సృష్టించాడు. ఆయన మానవులను, పాకేప్రాణులను, వివిధ వర్ణాల పశువులను సృష్టించాడు. వర్షాన్ని కురిపించి నేలకు ప్రాణం పోయడమన్నది ఒక ప్రతీక. మరణించిన మనిషిని కూడా అదేవిధంగా మళ్ళీ లేపి నిలబెట్టడం జరుగుతుందని చాటి చెప్పే ప్రతీక ఇది. మృతభూమి వర్షం పడడంతో మళ్ళీ జీవం పోసుకుంటుంది. రకరకాల రంగులు, రుచులు, పరిమాణాలు ఉన్న ఫలాలను ఉత్పత్తి చేస్తుంది. వివిధ వర్ణాలు, సువాసనలు ఉన్న పూలను ఉత్పత్తి చేస్తుంది.

ఈ సూరాలో విగ్రహాలను విమర్శించడం జరిగింది. అవి నిష్ప్రయోజనకరమైన వనీ, అవి వినలేవనీ, తమను ఆరాధిస్తున్న అజ్ఞాన ప్రజలకు ఎలాంటి సహాయం చేయలేవని చెప్పడం జరిగింది. ఈ సూరాలో విశ్వాసులకు, అవిశ్వాసులకు మధ్య భేదాన్ని కూడా చెప్పడం జరిగింది. అవిశ్వాసులు గ్రుడ్డివారు, చెవిటివారు, మృత సమానులు, అహంభావులు, కుట్రలు పన్నుతారు, చీకటి వంటి వారు. కాగా, విశ్వాసులు వాస్తవాన్ని చూడగలరు, వినగలరు, సజీవంగా వ్యవహరించగలరు, వారు వెలుగు వంటి వారు. ఈ రెండు వర్గాల ప్రజల (విశ్వాసులు, అవిశ్వాసులు) గమ్యం గురించి కూడా తెలియజేయడం జరిగింది. అల్లాహ్‌ను తిరస్కరించిన వారు శాశ్వత నరకాగ్నికి గురవుతారు. అందులోనే వారు నివసిస్తారు, ఎల్లప్పుడు రోదిస్తుంటారు. విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి. వారు అందమైన ఆభరణాలు ధరిస్తారు. సిల్కు వస్త్రాలు ఉంటాయి. వారికి అక్కడ ఎలాంటి దుఃఖము, కష్టం ఉండదు.

## ముఖ్యాంశాలు

**అల్లాహ్ అనుగ్రహాలు :**

మానవులందరి సృష్టికర్త, పోషకుడైన అల్లాహ్ పట్ల అందరూ కృతజ్ఞులై ఉండాలి.



**అవసరాలు :**

అల్లాహ్ ఏ అవసరం లేనివాడు. ఎవరి అక్కర లేనివాడు. మానవులకే ఆయన అవసరం ఉంది. ఆయన సహాయం పొందవలసిన అవసరం మానవులకే ఉంది.

**అహంకారం :**

ఈ ప్రాపంచిక జీవితం భ్రమలలో మునిగిపోరాదు. అదేవిధంగా అల్లాహ్ గురించి తనకు ఉన్న స్వంత, తప్పు అభిప్రాయలతో వ్యవహరించరాదు. ఈ ప్రాపంచిక జీవితం శాశ్వతమైనది కాదు. అందువల్ల పరలోకంలో స్వర్గవనాలు పొందడానికి తగిన ప్రయత్నాలు చేయాలి. అందుకు కృషి చేయాలి.

**దేవుని కారుణ్యం :**

మనుష్యుల అపరాధాలకు తగిన విధంగా అల్లాహ్ శిక్షిస్తాడు. చాలా మంది ఆయన శిక్ష వల్ల వినాశం అవుతారు. అయితే అల్లాహ్ మనుష్యులకు నిర్ధిష్ట కాలవ్యవధి ఇచ్చాడు. ఆ కాలవ్యవధి తర్వాత వాళ్ళు చేసిన పనులకు న్యాయంగా, దయతో విచారిస్తాడు. తీర్పుదినాన అల్లాహ్ వద్ద సిఫారసు చేసే వారెవ్వరు ఉండరు.

**నష్టం :**

నష్టానికి గురయ్యేది అవిశ్వాసులే. వాళ్ళు అల్లాహ్‌కు ఎలాంటి హాని చేయడం లేదు, స్వయంగా తమకు తామే నష్టాన్ని కొనితెచ్చుకుంటున్నారు.

**వారసత్వం :**

అల్లాహ్ భూమిపై సర్వానికి మనిషిని వారసునిగా చేశాడు. అందువల్ల మానవులు ఏది మంచి ఏది చెడు, ఏది సత్యం, ఏది అసత్యం అన్న విచక్షణతో వ్యవహరించాలి.

## 36 వ అధ్యాయం

# యాసీన్

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 83 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం వంటి మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరా ప్రారంభ పదాన్ని దీనికి పేరుగా పెట్టడం జరిగింది. దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు అని ప్రమాణపూర్వకంగా చెబుతూ ఈ సూరా ప్రారంభమయ్యింది. అల్లాహ్ ప్రతి విషయాన్ని స్పష్టంగా తెలుపుతున్నాడని, హితబోధ అందిస్తున్నాడనీ, ముహమ్మద్ (సఅసం) దేవుని తరఫున వచ్చిన దైవసందేశ హరుడనీ, మానవాళికి ఆయన కారుణ్యం వంటివారని తెలిపింది. దివ్యఖుర్ఆన్‌ను బాహాటంగా వ్యతిరేకిస్తూ, విశ్వాసాన్ని పూర్తిగా తిరస్కరిస్తున్న అవిశ్వాసుల గురించి ప్రస్తావిస్తూ పరలోకంలో తీవ్రమైన శిక్ష వారికోసం వేచి ఉందని తెలిపింది. అల్లాహ్ మరణించిన వారికి మళ్ళీ జీవితం ఇస్తాడనీ, మనిషి చేసిన కర్మలన్నీ నమోదై ఉన్నాయనీ, వాటి లెక్క తీసుకోవడం జరుగుతుందనీ, తీర్పుదినాన ప్రతి ఒక్కరు తాము చేసిన పనికి జవాబు చెప్పుకోవలసి ఉంటుందనీ హెచ్చరించింది. మరణించిన తర్వాత మళ్ళీ జీవితం అన్నది లేనే లేదని వాదించే అవిశ్వాసులు, మరణించిన తర్వాత శరీరం కుళ్ళి కృశించి ఎముకలు కూడా మిగలవు కాబట్టి ఇక మళ్ళీ జీవితం అన్న ప్రశ్నే ఉండదని వాదించే అవిశ్వాసుల వాదనకు జవాబిస్తూ, మనిషిని ఒకసారి సృష్టించిన దేవుడు మళ్ళీ కుళ్ళి కృశించి పోయిన శరీరాన్ని కూడా లేపి నిలబెట్టే సామర్థ్యం కలవాడని, ఆయనకు సృష్టిలోని ప్రతిదీ తెలుసనీ, అల్లాహ్ ఏదైనా చేయాలనుకుంటే, కేవలం 'అయిపో' అని ఆదేశిస్తే చాలు అయిపోతుందని ఈ సూరా తెలియజేసింది. దైవదూత ఇస్రాఫీల్ శంఖం పూరించిన రోజున మరణించిన వారు తమ సమాధుల్లోంచి లేచి విశ్వప్రభువు ముందు హాజరవుతారని తెలియజేసింది. అప్పుడు అవిశ్వాసులకు తాము చేసిన



తప్పు తెలిసి వస్తుందనీ, అల్లాహ్ చేసిన వాగ్దానం నిజమైనదనీ, ఆయన తన ప్రవక్తల ద్వారా పంపిన సందేశం యథార్థమైనదనీ గుర్తిస్తారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టడం సత్యమని గ్రహిస్తారు.

ఈ సూరాలో తీర్పుదినం నాటి భయానక వాతావరణాన్ని కూడా తెలియజేయడం జరిగింది. అవిశ్వాసులు తాము సత్యాన్ని తిరస్కరించడానికి, ప్రవక్తలను విశ్వసించక పోవడానికి కారణం మీరంటే మీరని వాదులాడుకుంటారు. తీర్పుదినాన ఎవరికీ రవ్వంత అన్యాయం జరగదు. ప్రతి మనిషి ప్రపంచంలో ఏం చేసాడో దానికి తగిన ప్రతిఫలం పొందుతాడు. అవిశ్వాసానికి పాల్పడి, సత్యాన్ని తిరస్కరించిన వారికి తీవ్రమైన శిక్ష తప్పదు. వారు అగ్నికి గురవుతారు. వారిని ఈ అగ్ని గురించి అనేక సార్లు హెచ్చరించడం జరిగింది. వారి నోళ్ళకు మాట్లాడే శక్తి ఉండదు. కానీ, వారి కాళ్ళు చేతులు స్వయంగా ఆ వ్యక్తి చేసిన పనులకు సాక్ష్య మిస్తాయి. కాగా విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారు కోరిన సమస్తం లభిస్తుంది.

### ముఖ్యాంశాలు

**అహంకారం :**

అవిశ్వాసులు మూర్ఖంగా చెడులకు, దుర్మార్గానికి పాల్పడుతున్నారు. వారు ఆధ్యాత్మిక బోధనలను వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నారు. అల్లాహ్ సందేశాన్ని తిరస్క రించడానికి పూనుకుంటున్నారు. అహంకారం వారి వినాశానికి కారణమవు తుంది. దైవాగ్రహం వారిపై విరుచుకుపడడానికి దారితీస్తుంది.

**సదాచరణ :**

దైవభీతి వల్ల మనిషికి దేవుని కారుణ్యం ప్రాప్తిస్తుంది.

**షైతాన్ :**

షైతాన్‌కు స్నేహితులుగా మారరాదు. షైతాన్ మానవాళికి బహిరంగ శత్రువు. అనేకమందిని షైతాన్ దారితప్పించాడు.

**సహాయం :**

సహాయం కోసం మనిషి ఎప్పుడు వేడుకున్నా సహాయం చేయగలిగిన వాడు అల్లాహ్ మాత్రమే. అసత్య దేవుళ్ళకు ఆ శక్తి లేదు.

**మరలిపోవడం :**

అందరూ అల్లాహ్‌ను, విశ్వప్రభువును కలుసుకోవలసి ఉంది.

## 37 వ అధ్యాయం

# అస్ సాఫ్ఫాత్

# పంక్తులు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 182 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన వారిని మళ్ళీ లేపి నిలబెట్టడం, శిక్ష బహుమానాలు వంటి మౌలిక ధార్మిక విశ్వాసాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో ఉన్న పంక్తులు తీరిన వారు అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. దేవుడొక్కడే పంక్తులు తీరిన దైవదూతలను గురించి ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. దైవదూతలు హోదా అని ఇక్కడ ప్రమాణపూర్వకంగా నొక్కి చెప్పడం జరిగింది. దైవదూతలు హోదా రీత్యా మానవుల కన్నా ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ, వారు అల్లాహ్ పట్ల విధేయత చూపుతూ వినమ్రంగా అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ఔన్నత్యాన్ని స్తుతిస్తూ, ఆయన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారని చెప్పడం జరిగింది. ఈ సూరాలో కంటికి కనబడని ప్రాణులైన జిన్నుల గురించి కూడా చెప్పడం జరిగింది. (వారిలో కొందరు ముస్లిములు అంటే దేవునికి స్వయం సమర్పణ చేసుకున్న వారు, దైవం పట్ల విధేయత చూపేవారు, ఏకైక దేవుని విశ్వసించేవారు, జిన్నులంటే అగ్నితో సృష్టించబడిన



కంటికి కానరాని జీవులు). కాని కొన్ని సూరాల్లో జిన్నులలో కొందరు తిరస్కారవైఖరి అవలంబిస్తున్న వారని, బహిష్కృతులనీ, శాశ్వత శిక్షకు గురయ్యే వారని చెప్పడం జరిగింది. జిన్నుల గురించి అవిశ్వాసుల అభూతకల్పనలను ఈ వాక్యాలు ఖండించాయి. జిన్నులు అల్లాహ్‌కు సంబంధించిన వారని, ఆయన మాదిరిగానే సమస్తం తెలిసినవారని అవిశ్వాసులు చెప్పే మాటలను ఈ వాక్యాలు స్పష్టంగా ఖండించాయి. అవిశ్వాసులు చెప్పే ఈ మాటలేవి అల్లాహ్‌కు వర్తించేవి కాదని విశదంగా చెప్పడం జరిగింది.

అవిశ్వాసులు దివ్యఖుర్‌ఆన్‌ను, మరణానంతర జీవితాన్ని తిరస్కరించడం గురించి ప్రస్తావన కూడా ఇందులో వచ్చింది. వారు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఎగతాళి చేయడం గురించి కూడా ప్రస్తావించడం జరిగింది. వారు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను పిచ్చికవిగా అభివర్ణించడాన్ని కూడా ఈ సూరాలో ప్రస్తావిస్తూ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి వారు వెలిబుచ్చిన సందేహాలకు జవాబు చెప్పడం జరిగింది. మానవులను ప్రారంభంలో జిగురుమట్టితో సృష్టించిన విషయాన్ని వారికి గుర్తుచేయడం జరిగింది. తీర్పుదినాన వారు తమ తప్పులను గుర్తిస్తారు. తమ దుర్మార్గాన్ని తెలుసుకుంటారు. చివరకు భయంకరమైన శిక్షకు గురవుతారు. వారు ప్రాపంచిక జీవితంలో చేసుకున్న చర్యలకు తగిన ప్రతిఫలాన్ని అక్కడ పొందుతారు. వారికి జుగుప్సాకరమైన ఆహారం అక్కడ ఇవ్వబడుతుంది. సలసల మరిగే నీటితో దాహం తీర్చుకోవలసి వస్తుంది.

విశ్వాసులకు దైవానుగ్రహంతో నిండిన స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారు గౌరవప్రతిష్ఠలు పొందుతారు. వారికి అన్ని రకాల ఫలాలు తినడానికి లభిస్తాయి. రుచికరమైన పానీయాలు, సౌకర్యవంతమైన ఆసనాలు, శీలవతులైన భార్యలు లభిస్తారు.

ఈ సూరాలో క్లుప్తంగా గతకాలాలకు చెందిన ప్రవక్తల కథలను ప్రస్తావించడం జరిగింది. దృఢచిత్తం, దైవవిధేయత, అల్లాహ్ కోసం త్యాగాలు చేసే వైఖరి, కష్టాలను సహించే ఓరిమి గురించిన హితబోధ చేయడానికి ఈ ప్రవక్తల కథలను తెలియ జేయడం జరిగింది. ఏకదైవారాధన సత్యాన్ని ప్రచారం చేయడానికి వారు

అనుభవించిన కష్టాలు, వారి సంఘర్షణ గురించి ప్రస్తావించడం జరిగింది. దుర్మార్గు లకు, చెడులకు వ్యతిరేకంగా వారు జరిపిన పోరాటాన్ని ఈ సూరా తెలిపింది. నూహ్ (అస), ఇబ్రాహీమ్ (అస), మూసా (అస) ఆయన సోదరుడు హారూన్ (అస), ఎలిజా (అస), లూత్ (అస), యూనుస్ (అస)ల కథలు ఇందులో ప్రస్తావనకు వచ్చాయి.

## ముఖ్యాంశాలు

**తిరస్కారం :**

సత్యాన్ని తిరస్కరించడం వల్ల పరలోకంలో బాధాకరమైన తీవ్ర శిక్షకు గురికావలసి వస్తుంది.

**సహాయం :**

విశ్వసించి మంచిపనులు చేసేవారికి అల్లాహ్ సహాయపడతాడు. భయానకమైన కష్టం నుంచి కాపాడుతాడు. వారు సాఫల్యం పొందుతారు.

**కుట్రలు :**

విశ్వసించి మంచిపనులు చేసేవారికి వ్యతిరేకంగా అవిశ్వాసులు పన్నే కుట్రలను అల్లాహ్ భగ్నం చేస్తాడు. వారికి తీవ్ర పరాభవం తప్పదు.

**సహనం :**

సాఫల్యం పొందడానికి సహనం చూపడం అవసరం.

**తల్లిదండ్రుల పట్ల విధేయత :**

తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి ఉండాలి. వారు అల్లాహ్‌పట్ల, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల అవిశ్వాసం చూపాలని బలవంతం చేస్తే తప్పు.



**38 వ అధ్యాయం**

# సాద్

**(అరబీ వర్ణమాలలోని ఒక అక్షరం)**

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 88 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం వంటి మౌలిక విశ్వాసాల గురించి నొక్కి చెప్పింది. ఈ సూరా మొదటి ఆయతులోని 'సాద్' అనే అక్షరాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. ఈ పొడి అక్షరానికి సంబంధించిన అర్థం అల్లాహ్‌కే తెలుసు. అయితే ఈ పొడి అక్షరాన్ని వాడడాన్ని గురించి ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు భిన్న విధాలుగా వ్యాఖ్యానించారు. అవిశ్వాసులు ఒకేఒక్క దేవుడిని విశ్వసించేలా నచ్చచెప్పడానికి, వారు ఆరాధించే కుహనా దేవుళ్ళను విడిచి పెట్టేలా చేయడానికి, దివ్యఖుర్‌ఆన్ దేవుని వచనమనీ, దేవుని తరఫున అవతరించిన హితబోధ అని వారు తెలుసుకునేలా చేయడానికి, ముహమ్మద్ (సఅసం) దేవుని ప్రవక్త అనీ వారు గ్రహించేలా చేయడానికి ఈ సూరా ప్రయత్నిస్తూ, ఏకదైవారాధనా సూత్రాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది.

అవిశ్వాసులు బాహాటంగా దివ్యఖుర్‌ఆన్ పట్ల తమ వ్యతిరేకతను ప్రకటించారు. వారు సత్యాన్ని తిరస్కరించారు. ఈ సందర్భంగా గతకాలాల ప్రవక్తలు చూపించిన సహనాన్ని, దృఢచిత్తాన్ని క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. ఆయా కాలాల్లోనూ, ఆయా జాతుల ప్రజలు తమ ప్రవక్తలను తిరస్కరించారు, సత్యాన్ని నిరాకరించారు. ఈ సూరాలో క్లుప్తంగా నూహ్(అస), హూద్(అస), సాలిహ్(అస), లూత్(అస), ఇబ్రాహీమ్(అస), ఇషాక్ (అస), యాకూబ్ (అస)ల గురించిన ప్రస్తావనలు ఉన్నాయి. దావూద్(అస), సులైమాన్(అస), అయ్యూబ్(అస)ల గురించి కూడా సంక్షిప్త ప్రస్తావనలు ఇందులో ఉన్నాయి. ఈ ప్రవక్తలు వివేకం, అధికారం ఉన్న వారు అయినప్పటికీ వారి దైవభీతి వారి శక్తిసామర్థ్యాల కన్నా ఎక్కువగా

ఉండేది. ఈ సూరాలో ఇషాక్ (అస), అయ్యూబ్ (అస)లను వివేకం, అధికారాలు ఉన్న వ్యక్తులుగా పేర్కొనడం జరిగింది.

ఈ సూరాలో దేవుని ఏకత్వం గురించి నొక్కి చెప్పడం జరిగింది. ఆయనే సమస్తాన్ని సృష్టించాడు, అందరి పోషకుడు ఆయనే. విశ్వప్రభువు అయిన ఆయన్నే ఆరాధించాలని ఈ సూరా గట్టిగా ప్రబోధించింది. మానవాళి పట్ల షైతాన్ శత్రుత్వం గురించి ఈ సూరాలో గుర్తుచేయడం జరిగింది. షైతాన్ నిరంతరం ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తుంటాడు. రుజుమార్గం వదిలి దారితప్పేలా చేయాలని చూస్తుంటాడు. అల్లాహ్ పట్ల అవిశ్వాసం ప్రదర్శించేలా ప్రోత్సహిస్తుంటాడు. మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) కేవలం హెచ్చరిక చేసేవారు మాత్రమేననీ ఈ సూరా తెలియజేసింది. స్వర్గవనాలలోని సంతోషం గురించి, నరకాగ్ని కీలల బీభత్సం గురించి ఇందులో ప్రస్తావించడం జరిగింది. ఏకదైవారాధనకు కట్టుబడి మంచిపనులు చేసిన వారికి శాశ్వతమైన స్వర్గవనాలు లభిస్తాయని ఇందులో చెప్పడం జరిగింది. స్వర్గం దైవానుగ్రహం వల్ల లభించే సుందరప్రదేశం. అన్ని విధాల ఫలాలు, అన్ని రకాల పానీయాలు పుష్కలంగా లభించే ప్రదేశం. శీలవతులైన భార్యలు, విశ్రమించ డానికి సౌకర్యవంతమైన ఆసనాలు వారికి అక్కడ లభిస్తాయి. కాని అహంభావులైన అవిశ్వాసులకు నరకాగ్ని లభిస్తుంది. అది అత్యంత చెడ్డనివాసం. అక్కడ వారు దగ్ధమవుతూ ఉంటారు. ఆ నరకాగ్నే వారికి పడక అవుతుంది. వారు సలసలమరిగే నీటిని తాగుతారు. వారికి దుఃఖం తప్ప మరేది ఉండదు. తమ స్థితికి కారణం నువ్వంటే నువ్వని ఒండొరులను తూల నాడుతుంటారు.

**ముఖ్యాంశాలు**

**దృఢచిత్తం :**

సహనం, దృఢచిత్తంతో సాఫల్యాన్ని సాధించవచ్చు.

**న్యాయం :**

ప్రజలమధ్య న్యాయం చేయాలి. ఒక పక్షం ఆరోపణలను విని తొందరపడ రాదు. ఇరుపక్షాల కథనాన్ని ఓర్పుతో వినాలి. తన సొంత అభిప్రాయాలు, తన స్వార్థప్రయోజనాలు, తన అహంకారాన్ని అనుసరిస్తే న్యాయం జరగదు.



**లక్ష్యం :**

భూమ్యాకాశాలను ఒక లక్ష్యంతో సృష్టించడం జరిగింది. వాటి సృష్టి మనకు నైతిక బాధ్యతను గుర్తుచేస్తుంది. దేవుడు ఒక్కడే అని గుర్తించడం, ఆయన సృష్టిసామర్థ్యాన్ని గుర్తించడం మన నైతిక బాధ్యత.

**గర్వం :**

అహంకారానికి, చెడులకు షైతాన్ చిహ్నం. అందువల్ల షైతాన్‌ను మిత్రునిగా చేసుకోరాదు. అల్లాహ్‌ను మార్గదర్శకత్వం కొరకు వేడుకోవాలి. సంకుచిత అహంకారాలను వదులుకోవాలి.

**ఆలోచన :**

దివ్యఖుర్ఆన్‌లోని ప్రతిఒక్క ఆయత్ (అంటే దేవుని వాక్యం, దేవుని చిహ్నం, దేవుని సూచన) గురించి లోతుగా ఆలోచించాలి. దివ్యఖుర్ఆన్ దైవాను గ్రహం తొణికిసలాడే దివ్యగ్రంథం.

**39 వ అధ్యాయం**

# అజ్ జుమర్

# బృందాలు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 75 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 71, 73 ఆయతులో ప్రస్తావనకు వచ్చిన బృందాలు అన్న పదం ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అల్లాహ్ దైవత్వంలో ఇతరులను భాగస్వాములుగా చేసే తీవ్రమైన చెడును ఈ సూరాలో గట్టిగా ఖండించడం జరిగింది.

కేవలం ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించడాన్ని ప్రోత్సహించడం జరిగింది. ఈ సూరాలో దేవుని ఏకత్వం, ఆయన ఔన్నత్యం ప్రముఖంగా ప్రస్తావిస్తూ మానవ బలహీనతల గురించి వివరించడం జరిగింది. కష్టాల్లో ఉన్నప్పుడు మానవులు సహాయం కోసం మొరపెట్టుకుంటారు. కాని దేవుని అనుగ్రహం వారిపై వర్షించిన తర్వాత అదంతా తమ గొప్పదనంగా భావిస్తారు. తమ తెలివితేటలతో, తమ పథకరచనతో అదంతా సాధించామని గర్విస్తారు. దేవుని అనుగ్రహాలు నిజానికి పరీక్షలని చాలా మంది గుర్తించరు. వారి చెడుచేష్టల ఫలితాలు వారు అనుభవించక తప్పదని తెలుసుకోరు.

దేవుడు అత్యున్నతుడనీ, ఆయనకు సంతానం లేదని, భాగస్వాములు లేరని, సరిసమానులు లేరని, సహాయకులు లేరని ఈ సూరా నొక్కి చెప్పింది. ఒకేఒక్క అల్లాహ్ ఆరాధనకు మాత్రమే అంకితం కావాలని ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు నొక్కి చెప్పడం జరిగింది. ఈ సూరాలో అవిశ్వాసుల అజ్ఞానకాలం నాటి ఆచారాలను ప్రస్తావించడం జరిగింది. వారి దురాచారాలను, మూఢ నమ్మకాలను ప్రస్తావిస్తూ, విగ్రహాలను, వారి ఇష్టదైవాలను ఆరాధించడం ద్వారా ఏకైక దేవుని సాన్నిహిత్యం పొందగలమని వారు భావించడాన్ని, తమ ఇష్టదైవాలు ఏకైక దేవునికి సిఫారసు చేస్తాయని తలచడాన్ని ఖండించింది. సిఫారసు చేయడం అన్నది కేవలం అల్లాహ్‌కు మాత్రమే సాధ్యమని స్పష్టం చేసింది. దేవుడు ఒక్కడే అని నిదర్శనాలు చూపించింది. అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. ఆయన పగటిపై రాత్రిని కప్పుతాడు, రాత్రిపై పగటిని కప్పుతాడు. ఆయన సూర్యచంద్రులను నియంత్రిస్తాడు. ఈ రెండు నిర్ధారిత సమయం వరకు తమ కక్ష్యల్లో ప్రయాణిస్తూ ఉంటాయి. ఆయన మానవాళిని ఒకే ఒక్క వ్యక్తి నుంచి సృష్టించాడు. ఆయన ఎనిమిది రకాల ఆడమగ పశువులను సృష్టించాడు. ఆయన మనలను తల్లిగర్భంలో దశల వారీగా సృష్టించాడు. ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని పంపిస్తున్నాడు. ఆ నీరు భూమిపై ఊటలు, సెలయేళ్ళుగా ప్రవహిస్తుంది. ఆ నీటితో వివిధ వర్ణాల పంటలు పండేలా చేస్తున్నాడు. ఆయన కంటికి కనబడే వాటి గురించి, కంటికి కనబడని వాటి గురించి సమస్తం తెలిసిన వాడు. ఆయన అన్నింటిని సృష్టించిన వాడు, అన్నింటిపై ఆధిపత్యం ఉన్నవాడు.



ఈ సూరాలో మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని కూడా ప్రస్తావిస్తూ, తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని వర్ణించడం జరిగింది. ఒక శంఖం పూరించ బడుతుంది. ఆకాశాల్లో, భూమిపై ఉన్నవారంతా ఒక్కసారిగా నిర్ఘాంతపోతారు. ప్రపంచంలో ఎవరు ఏం చేసారో దానికి తగిన ప్రతిఫలం ఆరోజు లభిస్తుంది. ఆ రోజున మానవులు రెండు వర్గాలుగా విభజించబడ తారు. ఒక వర్గం రక్షణ పొందుతుంది. మరో వర్గం శిక్షకు గురవుతుంది. మొదటి వర్గం విశ్వాసులది. వారు దైవభీతితో వ్యవహరించారు. వారు బృందాలు, బృందాలుగా గౌరవమర్యాదలతో స్వర్గవనాల వైపునకు తీసుకువెళ్ళబడతారు. అక్కడ శాశ్వతమైన దైవానుగ్రహం వారికి లభిస్తుంది. స్వర్గవనాల ద్వారాలు వారికోసం తెరుచుకుంటాయి. అక్కడి ద్వారపాలకులు వారికి స్వాగతం పలుకుతారు. రెండవ వర్గం అవిశ్వాసులది. వారు సత్యాన్ని తిరస్కరించారు. దుర్మార్గాన్ని అవలంబించారు. వారిని హీనంగా నరకాగ్ని వైపునకు గుంపులు గుంపులుగా తోలుకుపోవడం జరుగుతుంది. వారి చెడ్డనివాసం కోసం నరకద్వారాలు తెరుచుకోబడతాయి. వారి మూర్ఖపు అవిశ్వాసానికి, దుర్మార్గానికి ప్రతిఫలం ఇది.

## ముఖ్యాంశాలు

**భక్తి:**

ఆరాధనలకు, నిష్కల్మషమైన భక్తిప్రపత్తులకు కేవలం అల్లాహ్ మాత్రమే అర్హుడు.

**ప్రకృతి:**

మనం ప్రకృతిలోను, విశ్వంలోను ఉన్న దృష్టాంతాలను పరిశీలించాలి. ఎందుకంటే అర్థం చేసుకునే వారికి అందులో దేవుని సందేశాలు, చిహ్నాలు కనబడతాయి.

**కృతఘ్నత:**

అల్లాహ్‌ను తిరస్కరించేవారు, ఆయనకు మనుష్యుల అవసరం లేదన్నది గుర్తించాలి. మనిషి కృతఘ్నత వల్ల అల్లాహ్‌కు ఎలాంటి నష్టమూ లేదు. అయితే

మనిషి కృతజ్ఞత చూపితే దేవుడు సంతోషిస్తాడు. దైవానుగ్రహం, దేవుని కరుణాకటాక్షాలు మనిషికి లభిస్తాయి.

**అపజయం పాలయినవారు :**

తీర్పు దినాన శాశ్వత దైవానుగ్రహాలు లభించే స్వర్గవనాలు పొందలేని వారే అపజయం పాలయినవారు. అల్లాహ్‌ను, దైవవాణిని విశ్వసిస్తున్నవారు సాఫల్యం పొందుతారు కాని, రుజుమార్గాన్ని వదిలితే ఆ నష్టాన్ని స్వయంగా వారే భరించవలసి వస్తుంది.

**అవిశ్వాసం :**

దైవవాణిని, సత్యాన్ని తిరస్కరించడం, అల్లాహ్ గురించి అబద్ధాలు చెప్పడం చివరకు పరాభవాలను కొనితెస్తుంది. నరకాగ్నికి పాత్రులయ్యేలా చేస్తుంది.

**మరలిపోవడం :**

మృత్యువు తప్పనిసరి. ప్రతి ఒక్కరూ చివరకు దేవుని వద్దకు మరలిపోవలసిందే.

**సిఫారసు :**

అసత్య దేవుళ్ళు తదితరులు సిఫారసు చేయడం అన్నది జరగదు. సిఫారసు చేసే అధికారం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. (ఆయన అనుమతి లేనిదే ఎవరూ సిఫారసు చేయలేరు.)

**పోషణ :**

అల్లాహ్ మాత్రమే అందరినీ పోషించేవాడు.

**నిరాశ :**

అల్లాహ్‌నే నమ్ముకోవాలి. ఆయన కారుణ్యం పట్ల నిరాశ చెందరాదు. ఆయన అన్ని తప్పులను క్షమించేవాడు.

**ఏర్పాట్లు :**

తీర్పుదినం కోసం ఏర్పాట్లు చేసుకోవాలి. లెక్కల ఘడియ కోసం తయారుగా ఉండాలి. అల్లాహ్‌ను, ఆయన అవతరింపచేసిన దివ్యగ్రంథాన్ని విశ్వసించి మంచి పనులు చేయాలి.



**40 వ అధ్యాయం**

# అల్ మూ'మిన్

# విశ్వాసి

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 85 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి నొక్కి చెప్పింది. ఈ సూరా దేవుడు అవతరింపచేస్తున్న దివ్యవాణి గురించిన ప్రస్తావనతో ప్రారంభమయ్యింది. అల్లాహ్ తప్పులను క్షమించే క్షమాశీలిగా అభివర్ణించింది. ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. కఠినంగా శిక్షిస్తాడు. అపార దయామయుడు. ఆయన తప్ప మరో దైవం లేడు. కేవలం అవిశ్వాసులు మాత్రమే దేవుని చిహ్నాల గురించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తారు. వారు స్పష్టంగా కనబడుతున్న ఈ చిహ్నాలను వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నారు. దేవుని చిహ్నాలు మనలను చుట్టుముట్టి ఉన్నాయి. ఇవి అన్నీ దేవుని ఏకత్వాన్ని చాటిచెబుతున్నాయి. ఆయన శక్తిసామర్థ్యాలను ప్రకటిస్తున్నాయి. గతకాలానికి చెందిన జాతులు కూడా సత్యాన్ని తిరస్కరించాయి. దేవుని చిహ్నాలకు వ్యతిరేకంగా వాదించాయి. ఈ సూరాలో అనేకమంది గతకాలాలకు చెందిన ప్రవక్తలను గురించి ప్రస్తావించడం జరిగింది. వారి ప్రజలు ఆయా ప్రవక్తలను తిరస్కరించారు. ఎగతాళి చేసారు. వారికి వ్యతిరేకంగా కుట్రలు పన్నారు. వారిని మంత్రగాళ్ళుగా పిలిచారు. వారితో పిడివాదాలకు దిగారు. సత్యాన్ని తిరస్కరించడానికి అబద్ధపు వాదనలు చేసారు. నూహ్(అస), హూద్ (అస), యూసుఫ్(అస), సాలిహ్ (అస)ల గురించి ఈ సూరాలో క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. మూసా(అస) గురించి వివరంగా ప్రస్తావన వచ్చింది. ఫిర్ఔన్‌కు వ్యతిరేకంగా మూసా(అస) పోరాటం గురించి వివరించింది. ఫిర్ఔన్ మూసా(అస) సందేశాన్ని వ్యతిరేకించాడు. ఆయన్ను చంపడానికి కుట్రలు పన్నాడు. అహంకారంతో ఫిర్ఔన్, మూసా(అస)ను ఎగతాళి చేయడానికి తన దర్బారులో

ఉన్న హామాన్‌తో ఒక పెద్ద స్తూపం నిర్మించమని చెప్పాడు. ఆ స్తూపాన్నెక్కి మూసా చెప్పే దేవుడిని చూసొస్తానని అపహాస్యం చేసాడు.

గత కాలాల్లో సత్యాన్ని తిరస్కరించిన వారికి చివరికి ఏమయ్యిందో ఈ సూరా తెలియజేసింది. దేవుని కఠిన శిక్షనుంచి వారినెవ్వరూ కాపాడలేకపోయారు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి సహనం చూపాలని, దృఢచిత్తంతో వ్యవహ రించాలని, గతకాలాల ప్రవక్తల నుంచి పాఠాలు గ్రహించాలని బోధించడం జరిగింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం సంభవించడం అనివార్యమని ఈ సూరా నొక్కి చెప్పింది. తీర్పుదినానికి సంబంధించిన ఒక దృశ్యాన్ని ఇందులో వర్ణించడం జరిగింది. ఆ రోజున ప్రతి ఒక్కరికి వారి కర్మల ప్రతిఫలం లభిస్తుంది. ఆనాటి బీభత్స పరిస్థితి వల్ల అందరికీ గుండెగొంతులోకి వచ్చేస్తుంది. దుర్మార్గులకు ఆరోజు మిత్రులెవరూ ఉండరు, సిఫారసు చేసేవారు ఎవ్వరూ ఉండరు. ఆ రోజున అల్లాహ్ న్యాయంగా, కర్మల ప్రకారం తీర్పు చెబుతాడు. అవిశ్వాసులు నరకాగ్నిలో ఒకరితో ఒకరు ఘర్షణ పడతారు. తమ స్థితికి కారణం నువ్వంటే నువ్వని వాదులాడుకుంటారు. అక్కడి కాపలాదారులను వేడుకొంటూ తమ శిక్ష ఒక్కరోజైనా తగ్గేలా అల్లాహ్‌కు విజ్ఞప్తి చేయమని రోదిస్తారు. వారి మెడలకు గుదిబండలు కట్టి సంకెళ్ళతో బంధించడం జరుగుతుంది. వారు అగ్నికి ఇంధన మవుతారు.

ఈ సూరాలో దేవుని శక్తిసామర్థ్యాలకు నిదర్శనాలు చూపించడం జరిగింది. అల్లాహ్ రాత్రిని విశ్రాంతికోసం, పగలును ఉపాధికోసం సృష్టించాడు. ఆయనే సమస్తాన్ని సృష్టించినవాడు. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించాడు. ఆయన భూమిని మనకోసం నివాసస్థలంగానూ, ఆకాశాన్ని పైకప్పుగానూ చేసాడు. ఆయన మనకు అందమైన ఆకారం ఇచ్చాడు. మనకు పోషణ కల్పించాడు. ఆయన మనలను మట్టినుంచి సృష్టించాడు. ఆ పిదప మనలను వీర్యబిందువు నుంచి పుట్టించాడు. ఆ పిదప ఒక నెత్తుటి ముద్దగా, చివరకు ఒక శిశువుగా రూపొందించాడు. ఆ పిదప మనిషి పూర్తి శక్తిసామర్థ్యాలున్న యువకునిగా ఎదుగుతాడు. పిదప ముసలితనంలోకి ప్రవేశిస్తాడు. చివరకు మరణిస్తాడు. అల్లాహ్ జీవితాన్ని, మరణాన్ని ఇస్తాడు. ఆయన మనకోసం పశువులను సృష్టించాడు. కొన్ని ఆహారం కోసం, కొన్ని వాహనాలుగా



ఉపయోగపడతాయి. దేవుని ఔన్నత్యాన్ని కొనియాడే దేవదూతల గురించి ఈ సూరాలో ప్రస్తావించ బడింది. దేవదూతలు అల్లాహ్‌ను స్మరిస్తూ, స్తుతిస్తూ, విశ్వాసుల కోసం క్షమాభిక్షను అర్థిస్తూ ఉంటారు. నరకాగ్ని బాధ నుంచి విశ్వాసులను కాపాడమని, వారికి స్వర్గవనాలు ప్రసాదించమని, వారిని వారి తప్పుల నుంచి రక్షించమని దేవదూతలు దేవుని ప్రార్థిస్తుంటారు.

## ముఖ్యాంశాలు

**దేవుని న్యాయం, కారుణ్యం :**

చెడ్డపని చేసిన వ్యక్తికి ఆ పనికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. విశ్వసించిన స్త్రీపురుషులు స్వర్గవనాల్లోకి ప్రవేశిస్తారు.

**వేడుకోలు :**

అల్లాహ్‌ను మాత్రమే వేడుకోవాలి. ఆయన తప్పక వింటాడు. మన వేడుకోళ్ళకు సమాధానం ఇస్తాడు. ఆయన్ను మాత్రమే ఆరాధించే విషయంలో గర్వంతో వ్యవహరించరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు.

**ప్రాపంచిక జీవితం :**

ప్రాపంచిక జీవితం తాత్కాలికమైనది. పరలోక జీవితం శాశ్వతమైనది. ప్రాపంచిక సుఖభోగాలు శాశ్వతం కావు.

**నైతిక పాఠాలు :**

సత్యాన్ని తిరస్కరించి, తమ ప్రవక్తలను విశ్వసించడానికి నిరాకరించిన గతకాలాలకు చెందిన ప్రజల పర్యవసానాలను గుర్తుంచుకోవాలి. నైతిక పాఠాలు స్వీకరించాలి.

41 వ అధ్యాయం

# హా మీమ్ అస్‌సజ్దా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 54 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. దివ్యఖుర్‌ఆన్‌ను అల్లాహ్ పంపించాడని, ఆయన సర్వం తెలిసిన వాడని, మహావివేకవంతుడు, మహాజ్ఞాని, సకలస్తోత్రాలకు అర్హుడనీ, దివ్యఖుర్‌ఆన్ మహోన్నతమైన గ్రంధమనీ, మానవాళికి శుభవార్తను తెలుపుతుందని, హితబోధను అందజేస్తుందనీ, ఎలాంటి అబద్ధాలు దీనిని తాకలేవని తెలియజేసింది. కాని, అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒక సాధారణ మనిషి మాత్రమే కాబట్టి ఆయన్ను తిరస్కరిస్తూనే ఉంటారని చెప్పింది..

గత కాలాల్లో అవిశ్వాసానికి, చెడులకు వ్యతిరేకంగా పోరాడిన ప్రవక్తల పోరాటాలను గుర్తు చేసుకోవలసినదిగా ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు బోధించడం జరిగింది. ఆయనకు అందజేయబడుతున్న దివ్య సందేశమే గతకాలాల్లో ప్రవక్తలకు కూడా అందించడం జరిగిందనీ, ప్రవక్తలందరి సందేశం ఒక్కటేననీ, అది : అల్లాహ్‌ను విశ్వసించడం, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టకుండా ఉండటం, తప్పులకు పశ్చాత్తాపపడుతూ మంచిపనులు చేయడం. ప్రవక్త హూద్(అస), ప్రవక్త సాలిహ్(అస)లను ఆద్, సమూద్ జాతుల వద్దకు పంపించడం జరిగింది. కాని ఆయా జాతులు ఈ ప్రవక్తలను ఎగతాళి చేసాయి. వారి సందేశాన్ని తిరస్కరించాయి. ఫలితంగా ఆద్ జాతి భయంకరమైన తుఫాను గాలికి, సమూద్ జాతి భీకరమైన భూకంపానికి గురయి నాశనమయ్యాయి.

ఈ సూరాలో తీర్పుదినం నాటి దృశ్యాన్ని వర్ణించడం కూడా జరిగింది. ఆ రోజు దేవుని శత్రువులను చుట్టుముట్టి అగ్నివైపునకు తీసుకుపోవడం జరుగుతుంది. వారు నరకాన్ని సమీపించినప్పుడు వారి కళ్ళు, చెవులు, వారి చర్మం వారికి వ్యతిరేకంగా



సాక్ష్యమిస్తాయి. అగ్ని వారి శాశ్వత నివాసమవుతుంది. అయితే విశ్వసించి మంచిపనులు చేసిన వారి ఎదుట దైవదూతలు ప్రత్యక్షమవుతారు. వారికి శుభ వార్తనిస్తారు. శాశ్వత స్వర్గవనాలు వారికి లభిస్తాయని తెలుపుతారు. దేవుని నిరుపమానమైన సృష్టిలో ఆయన శక్తిసామర్థ్యాలు, ఆయన ఔన్నత్యం ప్రకటిత మవుతుందని ఈ సూరా తెలియజేసింది. మానవులు చంద్రుని గాని, సూర్యునిగాని ఆరాధించరాదని, ఎందుకంటే వీటన్నింటిని సృష్టించిన దేవుడు ఒక్కడేననీ, ఇవన్నీ ఆయన శక్తిసామర్థ్యాలకు చిహ్నాలనీ, ప్రకృతిలో దేవుని శక్తిసామర్థ్యాల చిహ్నాలు అనేకం ఉన్నాయనీ బోధిస్తుంది. అల్లాహ్ భూమిని రెండురోజులలో సృష్టించాడు. భూమిపై దృఢంగా పర్వతాలను ఏర్పాటు చేసాడు. ప్రాణికోటి అవసరం మేరకు లెక్క ప్రకారం ఆహారపదార్థాలు ఏర్పాటు చేసాడు. ఆ పిదప ఆయన పొగగా ఉన్న ఆకాశం వైపు దృష్టి నిలిపాడు. ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను సృష్టించాడు. ఆయన ప్రతి ఆకాశాన్ని క్రమబద్ధం చేసాడు. భూమికి దగ్గరగా ఉన్న ఆకాశాన్ని దీపాలతో అలంకరించాడు. అల్లాహ్ మృతభూమికి, బంజరుగా పడి ఉన్న మృత భూమికి వర్షం ద్వారా జీవం పోస్తున్నాడు. నీటిని ఆయన ఆకాశం నుంచి పంపుతున్నాడు. ఆయనకు అన్ని వస్తువులపై అధికారం ఉంది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని తిరస్కరిస్తున్న వారికి సరళమైన, సూటిదయిన జవాబు ఈ సూరాలో ఇవ్వడం జరిగింది. అల్లాహ్ మృతభూమికి జీవం పోయగలిగినప్పుడు, మరణించిన వారికి కూడా ఆయన మళ్ళీ జీవం పోయగలడు. అల్లాహ్‌కు అన్నింటి జ్ఞానం ఉందన్న విషయాన్ని కూడా ఇక్కడ నొక్కి చెప్పడం జరిగింది. ఆయనకు అన్నీ తెలుసు. భూమి నుంచి ఉత్పత్తయ్యే ప్రతి ఒక్క ఫలం గురించి ఆయనకు తెలుసు. ప్రతి స్త్రీ గర్భం గురించి తెలుసు. ఆమెకు పుట్టబోయే శిశువు గురించి తెలుసు.

## ముఖ్యాంశాలు

### ముఖ్యసూత్రం :

మంచి చెడు ఒకటి కాలేవు. చెడుకు మంచితో జవాబు ఇవ్వాలి. వైరాన్ని మానుకోవాలి. మీకు మరొక వ్యక్తికి మధ్య వైరం ఉంటే, ఆ వ్యక్తిని మీ దగ్గరి స్నేహితునిగా, సన్నిహితునిగా చూడడం నేర్చుకోవాలి.

**సలహా :**

తోటి వారిని దేవుని వైపునకు, మంచి వైపునకు పిలువడం మంచి సలహా అవుతుంది.

**సాక్ష్యం :**

మీ అవయవాలు, మీ పంచేంద్రియాలను దుర్వినియోగపరిస్తే, అవే మీకు వ్యతిరేకంగా మీరు చేసిన తప్పులకు సాక్ష్యం చెబుతాయి.

**అల్లాహ్ శరణు కోరడం :**

షైతాను ప్రభావం వల్ల గుడ్డి కోపానికి గురయితే లేదా అపవాదు వేయడం, వివాదానికి దిగడం వగైరా పనులకు పాల్పడితే తక్షణం అల్లాహ్ శరణు కోరాలి.

**అల్లాహ్ న్యాయం, కారుణ్యం :**

మంచి పనులు చేస్తే మీ మంచిపనులకు మీరే ప్రయోజనం పొందుతారు. చెడు పనులు చేస్తే మీ పనులకు మీరే నష్టం పొందుతారు. అల్లాహ్ తన దాసులైన మానవుల పట్ల ఎన్నడూ అన్యాయం చేయడు. ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కారానికి ఒడిగట్టి, దుర్మార్గానికి పాల్పడిన వారిని అల్లాహ్ తగిన విధంగా శిక్షిస్తాడు (వారు పశ్చాత్తాపపడకపోతే, లేక అల్లాహ్ వారిని కరుణించి క్షమించకపోతే).

**ప్రత్యర్థులు:**

అల్లాహ్‌కు పోటీగా ప్రత్యర్థులను నిలబెట్టరాదు. ఆయన విశ్వప్రభువు. ప్రతి వస్తువును, ప్రతి వ్యక్తిని సృష్టించింది ఆయనే.

**బలహీనత :**

జీవితానికి సంబంధించి మంచి వస్తువులను అడగడంలో మానవులు ఎన్నడూ అలసిపోరు. ఏదైనా కష్టం వచ్చిపడితే వారు ఆశలన్నీ వదిలేసి నిరాశకు గురయి పోతారు. కాని దైవానుగ్రహం వర్షిస్తే, వారు కృతఘ్నులై అహంకారంతో వ్యవహరిస్తారు.



**42 వ అధ్యాయం**

## అష్ షూరా

# సంప్రదింపులు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 53 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, దైవదూతల పట్ల విశ్వాసం, ప్రవక్తల పట్ల విశ్వాసం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాలు, దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర గురించి నొక్కి చెప్పింది. ఈ సూరాలోని 38వ ఆయత్‌లో వచ్చిన సంప్రదింపుల గురించిన ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా దివ్యఖుర్ఆన్ ముఖ్య లక్షణాలను వివరించింది. ఈ దివ్యగ్రంధాన్ని అల్లాహ్ అవతరింపచేసాడు. మానవాళికి కారుణ్యంగా, మార్గదర్శ కంగా, హెచ్చరికగా దీనిని అవతరింపచేసాడు. దివ్యఖుర్ఆన్ మనిషికి రుజుమార్గాన్ని చూపిస్తుంది. అన్నికాలాల్లోను, అన్ని జాతుల వారికి ఇదే ధర్మాన్ని పంపించడం జరిగిందని ఈ సూరా తెలియజేసింది. ప్రవక్తలందరికీ ఇదే సందేశం ఇచ్చి పంపించడం జరిగింది. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలనీ, ఆయనకు భాగ స్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదని బోధించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి దృఢ చిత్తంతో, స్థిరంగా నిలబడాలనీ, సత్యానికి కట్టుబడాలని, లోకుల మనోవాంఛలను అనుసరించరాదని, ప్రజలను సత్యం వైపునకు ఆహ్వా నించాలని బోధించడం జరిగింది. విశ్వాసులకు తీర్పుదినం నాటి గడ్డుపరిస్థితి గురించి స్పృహ ఉందని, లెక్కల ఘడియ గురించి వారు భయపడుతున్నారనీ, ఆ రోజు కోసం ఏర్పాట్లు చేసుకోవడానికి శ్రమిస్తున్నారనీ, పరలోకంలో బాధాకరమైన శిక్షను తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారనీ వ్యాఖ్యానిస్తూ, అవిశ్వాసులు మాత్రం తీర్పుదినాన్ని నిరాకరిస్తున్నారనీ, అత్యంత ముఖ్యమైన ఆ వాస్తవాన్ని ఎగతాళి చేస్తున్నారని నిరసించింది. తీర్పుదినాన్ని అపహసిస్తూ – అది నిజంగా వస్తుందా, అయితే రానివ్వు – అంటూ వ్యాఖ్యానించడాన్ని ఈ సూరా ప్రస్తావించింది.

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆదేశాలను శిరసావహించాలని, ఆయనకు విధేయత చూపాలని, ఆయన సందేశాన్ని స్వీకరించాలని ఈ సూరా ప్రోత్సహించింది. తీర్పుదినం నాటి భయానక పరిణామాలకు భయపడాలని హెచ్చరించింది. ప్రకృతి యావత్తు అల్లాహ్ శక్తిసామర్థ్యాలను చాటిచెబుతోంది. ఆయన ఒక్కడే అని స్పష్టంగా తెలియజేస్తోంది. అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. ప్రజలు అన్ని ఆశలు వదులుకున్న తర్వాత కూడా ఆయన ఆకాశం నుంచి వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఆయన జంతువులను సృష్టించి అవి ఎల్లెడలా విస్తరించేలా చేసాడు. సముద్రాలలో తేలియాడే కొండల మాదిరి నౌకలు, వాటిని నడిపే గాలులు అన్ని ఆయన అనుగ్రహమే. ఆకాశాలు, భూమి అన్ని ఆయన నియంత్రణలో ఉన్నాయి. ఆయన తన అభీష్టం ప్రకారం తల్లిదండ్రులకు కేవలం కుమారులను, లేదా కేవలం కుమార్తెలను లేదా కుమారులు, కుమార్తెలను ప్రసాదిస్తాడు. ఆయన తలచిన వారికి సంతానం లేకుండా చేస్తాడు.

## ముఖ్యాంశాలు

**మహాపరాధం :**

అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మహాపరాధం. క్షమార్హం కాని పాపం.

**సలహా సంప్రదింపులు :**

పరస్పర సలహా సంప్రదింపులనేవి వ్యవహారాలు సజావుగా నడుపడానికి ఎంతయినా అవసరమైనవి.

**ప్రతీకారం :**

మీపై అణచివేతలకు పాల్పడిన వారిపై విజయం సాధిస్తే ప్రతీకారానికి పూనుకోరాదు. క్షమాశీలం ప్రదర్శించాలి. సహనాన్ని చూపాలి. ఇతరుల పట్ల అనుచితంగా వ్యవహరించరాదు.

**బంధువులు :**

బంధువుల పట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించాలి.



**దురదృష్టం :**

దురదృష్టం అన్నది చేజేతులా చేసుకున్న తప్పుల వల్ల ఎదురవుతుంది. మనుష్యులు చేసే తప్పులకు అల్లాహ్ బాధ్యుడు కాదు.

**ప్రాపంచిక జీవితం :**

ఈ ప్రాపంచిక జీవితంలోని సుఖభోగాలు తాత్కాలికమైనవి. పరలోకంలోని సంతోషాలు శాశ్వతమైనవి.

**న్యాయం :**

మతం, వర్ణం, హోదా వంటి వివక్షలకు అతీతంగా ప్రజల మధ్య న్యాయం చేయాలి.

**సహనం, క్షమాశీలం :**

కష్టాల్లో సహనం వహించడం, క్షమాగుణాన్ని ప్రదర్శించడం అన్నది సాహసోపేతమైన వైఖరి, వ్యవహారాలను చక్కదిద్దే దృఢసంకల్పానికి ఈ వైఖరి నిదర్శనం.

**43 వ అధ్యాయం**

# అజ్ జుఖ్‌రుఫ్

# బంగారు ఆభరణాలు

## పరిచయం

ఇది మక్కా కాలానికి చెందిన సూరా. ఇందులో 89 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఇందులోని 35వ ఆయతులో బంగారు ఆభరణాల గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రాపంచిక జీవితం తాత్కాలికమైనదని, మున్నాళ్ళ ముచ్చటని, ఇక్కడి

బంగారు ఆభరణాలు శాశ్వతమైనవి కాదని బోధించింది. ప్రాపంచిక జీవితం మంచివారికి, చెడ్డవారికి అందరికీ దక్కుతుందనీ, కాని పరలోక జీవితంలో సంతోషాలు కేవలం మంచివారికి మాత్రమే దక్కుతాయని, అవి శాశ్వతమైనవనీ తెలియజేసింది. దివ్యఖుర్ఆన్ ఒక స్పష్టమైన గ్రంథంగా అభివర్ణిస్తూ ఈ సూరా ప్రారంభమయ్యింది. ఈ గ్రంథం పూర్తిగా వివేకంతో నిండి ఉందని, అయినప్పటికీ అవిశ్వాసులు దీనిని తిరస్కరిస్తున్నారనీ, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒక సాధరణ మానవమాత్రుడైనందున ఆయన్ను దైవసందేశహరునిగా విశ్వసించడానికి నిరాకరిస్తున్నారనీ విమర్శించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి ఆయన రుజుమార్గంపై ఉన్నారనీ, ఆయన తనకు అందజేయబడుతున్న సందేశానికి స్థిరంగా కట్టుబడాలనీ బోధిస్తూ, గతకాలాల ప్రవక్తలు ఏవిధంగా సత్యధర్మ ప్రచారానికి సంఘర్షించవలసి వచ్చిందో వివరించింది. వారిని కూడా ఆయా జాతుల ప్రజలు తిరస్కరించి, వారిపై దౌర్జన్యాలు చేసారని తెలియజేసింది.

దైవదూతలు అల్లాహ్‌కు కుమార్తెలని అవిశ్వాసులు చెప్పే మూఢనమ్మకాన్ని ఈ సూరా తీవ్రంగా ఖండించింది. ఈ సూరాలో ప్రవక్తలు ఇబ్రాహీమ్(అస), మూసా(అస), ఈసా(అస)ల గురించి ప్రస్తావించడం ద్వారా వారు కూడా సాధారణ మానవ మాత్రులేనని సూచించింది. ఆయా ప్రవక్తలను అల్లాహ్ తన సందేశాన్ని ఆయా జాతులకు చేరవేయడానికి తన ప్రవక్తలుగా ఎన్నుకున్నాడు. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం, బహుదైవారాధనకు పాల్పడడం మానుకోవాలని ఆ ప్రవక్తలు తమ జాతులకు బోధించారు. కాని ఈ ప్రవక్తలలో చాలామందిని ఆయా జాతుల ప్రజలు ఎగతాళి చేసారు. వారిని తిరస్కరించారు.

తీర్పుదినం రోజున విశ్వాసులకు, అవిశ్వాసలకు మధ్య రెండు ప్రధాన భేదాలను ఈ సూరాలో తెలియజేయడం జరిగింది. అవిశ్వాసులు తమను తాము అన్యాయం చేసుకున్నవారుగా అభివర్ణించడం జరిగింది. వారు సత్యాన్ని ద్వేషించారు. నిరాశలో కూరుకుపోయారు. అవిశ్వాసానికి గురైన దుర్మార్గులు నరకంలో శాశ్వతంగా ఉంటారు. నరకశిక్ష వారికి ఏమాత్రం తగ్గించబడదు. కాగా విశ్వసించి మంచిపనులు చేసినవారు



తమ భార్యలతో సహా స్వర్గవనాల్లో ప్రవేశిస్తారు. వారక్కడ ఆనందంగా తమ విశ్వాసం కారణంగా, తమ మంచిపనుల వల్ల శాశ్వతంగా ఉంటారు.

అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి ఈ సూరాలో వివరించడం జరిగింది. సమస్తాన్ని సృష్టించింది అల్లాహ్‌యే. ఆయన అనుమతి లేనిదే ఎవరూ సిఫారసు చేయలేరు. ప్రకృతిలో అల్లాహ్ ఒక్కడే అని చాటి చెప్పే చిహ్నాలు అనేకం ఉన్నాయి. ఆయనకే ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యాన్ని స్పష్టం చేసే అనేక చిహ్నాలు మనకు ప్రకృతిలో కనబ డతాయి. అల్లాహ్ ఆకాశాలను, భూమిని సృష్టించాడు. ఆయన భూమిని మనకోసం ఒక ఊయలగా చేసాడు. ఆకాశం నుంచి మనకోసం వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఆ వర్షంతో మృతభూమికి జీవం పోస్తాడు. ఆయన అన్నింటిని జంటలుగా సృష్టించాడు. ఆయన మనం ప్రయాణించడానికి నౌకలను, పశువులను సృష్టించాడు.

ప్రజలు ఆరాధనల్లో చేస్తున్న ఘోరమైన తప్పిదాన్ని ఈ సూరా ఎత్తిచూపింది. ప్రజలు తమ తాతముత్తాతల విశ్వాసాలను గుడ్డిగా అనుసరిస్తున్నారని, ఆ విధంగా తాము అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే ఘోరమైన తప్పిదం చేస్తున్న విషయాన్ని కనీసం గుర్తించడం లేదని ఈ సూరా విమర్శించింది.

## ముఖ్యాంశాలు

**ప్రాపంచిక జీవితం :**

ప్రాపంచిక జీవితం పైపై మెరుగులతో కూడుకున్నది. ఇక్కడి ఆకర్షణలు, అలంకరణలు శాశ్వతమైనవి కాదు. పరలోకంలోని శాశ్వతమైన జీవితం కోసం ఏర్పాట్లు చేసుకోవాలి.

**బహుదైవారాధన :**

అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మహాపరాధం. మనం ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. ఒక్క అల్లాహ్‌కు మాత్రమే విధేయత చూపాలి.

**దైవాగ్రహం :**

సత్యాన్ని తిరస్కరించేవారిపై దైవాగ్రహం విరుచుకుపడుతుంది.

**దైవనామస్మరణ:**

దైవస్మరణ ఎల్లప్పుడు చేయాలి. లేనట్లయితే షైతాన్ మీపై తన పట్టు బిగిస్తాడు.

**షైతాన్:**

షైతాన్ మానవాళికి బహిరంగ శత్రువు. షైతాన్‌కు దూరంగా ఉండాలి. షైతాన్‌ను మిత్రునిగా చేసుకోరాదు.

## 44 వ అధ్యాయం

# అద్ దుఖాన్

# పొగ

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 59 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలోని 10వ ఆయతులో ప్రస్తావించబడిన పొగ అన్న పేరునే దీనికి పెట్టడం జరిగింది. దివ్య ఖుర్‌ఆన్ ఒక స్పష్టమైన గ్రంథంగా అభివర్ణిస్తూ ఈ సూరా ప్రారంభమయ్యింది. దివ్యఖుర్‌ఆన్ శుభప్రదమైన, ఘనమైన రాత్రి (రమజాను మాసంలో) అవతరింప చేయడం జరిగిందని, అల్లాహ్ తరపున అవతరించిన కారుణ్యమనీ, మానవాళిని చెడుపట్ల హెచ్చరిస్తుందని తెలియజేసింది. ఈ సూరాలో అల్లాహ్ గురించి వివరణ కూడా లభిస్తుంది. ఆయన ఒక్కడు. ఆయనే నిజమైన దేవుడు, ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఆకాశాలకు, భూమికి, వాటి మధ్య ఉన్న సమస్తానికి ఆయనే ప్రభువు. మన పూర్వీకులకు కూడా ఆయనే ప్రభువు. ఆయన జీవితాన్ని, మృత్యువును ప్రసాదిస్తాడు. ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు. అవిశ్వాసులు అల్లాహ్ గురించి, ఆయన శక్తిసామర్థ్యాల గురించి



అనుమానంలో పడి ఉన్నారు. వారు తీర్పుదినం హఠాత్తుగా వారిని పట్టుకునే వరకు తమ అనుమానాలతో ఒక ఆటగా గడుపుతారు. తీర్పుదినం నాటి చిహ్నాల్లో ఒకటి ఆరోజు ఆకాశంలో ఒక పొగ ప్రజలను కమ్ముకుంటుంది. అది ప్రళయఘడియకు ఒక చిహ్నం. ఇక అప్పుడు అవిశ్వాసులకు పశ్చాత్తాపపడే అవకాశం ఉండదు. తమ శిక్షను తప్పించమని వారు అప్పుడు మొరపెట్టుకున్నా ప్రయోజనం ఉండదు. ఈ సూరాలో గతజాతులకు పట్టిన గతి గురించి కూడా అవిశ్వాసులకు తెలియజేయడం జరిగింది. అల్లాహ్ పట్ల తిరస్కారం, సత్యాన్ని తిరస్కరించడం వల్ల వారు తుడిచిపెట్టుకుపోయారు. ఫిర్‌ఔన్ గురించి కూడా ఇందులో క్లుప్తమైన ప్రస్తావన ఉంది. ఫిర్‌ఔన్ అహంభావంతో దుర్మార్గాలకు పాల్పడ్డాడు. అణచివేతలకు పాల్పడ్డాడు. ఫిర్‌ఔన్, అతడి అనుచరులు చివరకు తుడిచిపెట్టుకుపోయారు. వారి భవనాలు, తోటలు, సెలయేళ్ళు, పొలాలు, వారి సంపద అంతటిని వదిలి వారు నాశన మయ్యారు. మూసా(అస), ఆయన అనుచరులు కాపాడబడ్డారు. ఇస్రాయిల్ సంతతి ప్రజలకు దైవానుగ్రహం లభించింది. కాని తర్వాత వారు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు. అల్లాహ్ అనుగ్రహాలను మరిచిపోయారు. తాము చేసుకున్న ఒప్పందానికి కట్టుబడలేదు. వారికి కూడా యెమన్‌లో నివసించిన ఒక ప్రాచీన జాతి గురించి చెప్పడం జరిగింది. అల్లాహ్‌కు బదులుగా ఖగోళాలను (గ్రహాలను, నక్షత్రాలను) ఆరాధించిన ఆ జాతిని కూడా నాశనం చేయడం జరిగింది.

మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి అనుమానాల్లో కొట్టుమిట్టాడు తున్న వారికి వాస్తవాలను గుర్తుచేయడానికి గాను తీర్పుదినం గురించి, మరణించిన తర్వాత లేపబడడం గురించి పునరుద్ఘాటించడం జరిగింది. విశ్వాసులకు, అవిశ్వాసు లకు మధ్య భేదాన్ని ఈ సూరా చూపించింది. తీర్పుదినం రోజున దుర్మార్గులకు వారు దేని గురించి అనుమానాలు వ్యక్తం చేసారో ఆ అగ్నివైపునకు తీసుకెళ్ళడం జరుగుతుంది. అందులోకి నెట్టడం జరుగుతుంది. వారి తలలపై సలసలమరిగే నీటిని గుమ్మరించడం జరుగుతుంది. వారికి తాగడానికి మరిగే నీరు, తినడానికి జుగుప్సాకరమైన ఆహారం లభిస్తుంది. దేవుని నమ్ముకున్న వారు చివరకు సాఫల్యం పొందుతారు. వారు సురక్షితమైన, శాంతిప్రదమైన, అందమైన తోటలు, సెలయేళ్ళు ఉన్న ప్రదేశంలో ఉంటారు. వారు సిల్కువస్త్రాలను ధరిస్తారు. తమ సహచరులతో, అన్ని విధాల ఫలాలను పొందుతుంటారు.

## ముఖ్యాంశాలు

**సృష్టి:**

ఆకాశాలను, భూమిని సృష్టించడం అన్నది ఒక వివేకవంతమైన, అర్థవంతమైన లక్ష్యంతో జరిగింది. మానవులు మంచిపనులు చేయడానికి, అల్లాహ్ పట్ల భయపడుతూ మెలగడానికి, ఆయనకు విధేయత చూపడానికి ఇవన్నీ సృష్టించబడ్డాయి. సృష్టి కేవలం ఉబుసుపోక జరిగినదయితే, భూమిపై జీవితం అర్థరహితం అవుతుంది. కాని, సృష్టి అలా జరగలేదు. జీవితానికి ఒక అర్థవంతమైన లక్ష్యం ఉంది.

**ఆటకాదు :**

దేవునికి విధేయత చూపాలి. పరలోకానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోవడానికి శ్రద్ధ తీసుకోవాలి. అల్లాహ్ విషయంలో అహంభావంతో వ్యవహరించరాదు.

**అణచివేతకు గురయినవారు :**

అణచివేతకు గురయినవారికి అల్లాహ్ సహాయం చేస్తాడు. వారిని ఆ పరిస్థితి నుంచి కాపాడుతాడు.

## 45 వ అధ్యాయం

# అల్ జాసియహ్

# కూలబడడం

## పరిచయం

ఇది మక్కా కాలానికి చెందిన సూరా. ఇందులో మొత్తం 37 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఇందులో ముఖ్యంగా చెప్పడం జరిగింది. ఈ సూరాలోని 28వ ఆయతులో కూలబడడం గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా



దీనికి ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరాలో తీర్పుదినం నాటి భయానక పరిస్థితుల గురించిన ప్రస్తావన ఉంది. ఆ రోజున మానవులు, భయంతో మోకాళ్ళపై కూలబడి ఉంటారు. ప్రతి ఒక్కరు తాము చేసుకున్న కర్మలకు లెక్క చెప్పుకోవలసి వస్తుంది.

ఈ సూరా మొదటి భాగంలో మూర్ఖంగా దుర్మార్గానికి పాల్పడే వారి ప్రస్తావన ఉంది. వారు అల్లాహ్ చిహ్నాలను మొండిగా తిరస్కరిస్తారు. వాటిని నవ్వులాటగా భావిస్తారు. వారికి అవమానకరమైన శిక్ష ఉంది. ఈ సూరాలో అల్లాహ్ మానవులకు ప్రసాదించిన అనుగ్రహాల ప్రస్తావన ఉంది. సముద్రాలు మానవుల ప్రయోజనం కొరకు ఉద్దేశించబడ్డాయి. ఆకాశాలలోను, భూమిపై ఉన్న సమస్తం మానవుల ప్రయోజనానికే ఉద్దేశించబడింది.

ఇస్రాయిల్ సంతతి ప్రజలకు ప్రసాదించబడిన అనుగ్రహాల గురించి కూడా ఇందులో చెప్పడం జరిగింది. వారికి దైవమార్గదర్శకత్వం ప్రసాదించబడింది. వారికి గ్రంథం, వివేకం, ప్రవక్త పదవి, జీవితానికి సంబంధించిన ఉత్తమమైనవి, ఆ కాలంలోని సమస్త జాతుల కన్నా ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. కాని వారు పరస్పరం ఈర్ష్యాసూయలకు గురయ్యారు, భిన్నాభిప్రాయాలకు, విభేదాలకు గురయ్యారు. చివరికి దేవుని పట్ల తిరుగుబాటుకు పాల్పడ్డారు. వారు దైవగ్రంథాన్ని తిరస్కరించారు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దైవసందేశహరుడని విశ్వసించడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి దైవవాణిని అనుసరించాలని, వారి మనోవాంఛలను అనుసరించరాదనీ, ఆయన గురించి వారు చెబుతున్న మాటలను పట్టించుకోరాదని బోధించడం జరిగింది.

తీర్పుదినాన్ని, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని అనుమానిస్తున్న అవిశ్వాసుల గురించి ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది. అల్లాహ్‌ను విశ్వసించిన వారికి, అహంకారంతో దుర్మార్గానికి పాల్పడుతున్న వారికి మధ్య ఉన్న భేదాన్ని ఈ సూరా స్పష్టం చేసింది. మార్గదర్శకత్వం పొందిన విశ్వాసి మంచిపనులు చేస్తాడు. ఒక్క అల్లాహ్‌కు మాత్రమే దాస్యం చేస్తాడు, ఆయన్ను మాత్రమే ఆరాధిస్తాడు. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరుగుతుందని విశ్వసిస్తాడు. కాని అవిశ్వాసి

మార్గం తప్పిన వాడు, అహంభావి, అల్లాహ్ చిహ్నాలను ఎగతాళి చేస్తాడు. ప్రవక్తలను పరిహసిస్తాడు, చెడుపనులకు పాల్పడుతాడు. తన మనోకాంక్షలను మాత్రమే ఆరాధిస్తాడు. ఇలాంటి వ్యక్తి వినికిడి శక్తిని, అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కోల్పోయిన వ్యక్తి. ఇలాంటి వ్యక్తి దృష్టిపై ముసుగు పడి ఉంది.

### ముఖ్యాంశాలు

**దైవిక న్యాయం :**

ప్రతి వ్యక్తికి తాను చేసిన కర్మలకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.

**సాఫల్యం :**

మంచిని చేస్తే, న్యాయాన్ని చేస్తే అది అలా చేసిన వారికే ప్రయోజనకర మవుతుంది. అలాగే చెడుకు పాల్పడితే ఎవరికీ నష్టం కలుగదు, చెడుకు పాల్పడిన వారికే ఆ నష్టం వాటిల్లుతుంది.

**సృష్టి:**

ఆకాశాలను, భూమిని సృష్టించడం అన్నది ఒక వివేకవంతమైన, అర్థవంతమైన లక్ష్యంతో జరిగింది. మానవులు మంచిపనులు చేయడానికి, అల్లాహ్ పట్ల భయప డుతూ మెలగడానికి, ఆయనకు విధేయత చూపడానికి ఇవన్నీ సృష్టించబడ్డాయి. సృష్టి కేవలం ఆటవిడుపుగా జరిగినదయితే, భూమిపై జీవితం అర్థరహితం అవుతుంది. జీవితానికి ఒక అర్థవంతమైన లక్ష్యం ఉంది.

**మైత్రి:**

దుర్మార్గులు ఒకరికొకరు మిత్రులు, ఒకరికొకరు రక్షకులు. అల్లాహ్ పట్ల భక్తి కలిగిన వారికి అల్లాహ్ రక్షకుడు..



**46 వ అధ్యాయం**

## అల్ అహ్ఖాఫ్

# ఇసుక మేటల దారి

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 35 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా ప్రధానంగా నొక్కి చెప్పింది. ఇందులోని 21వ ఆయతులో ఇసుకమేటల దారి గురించిన ప్రస్తావన ఉంది. దక్షిణ అరేబియాలోని ఆద్‌జాతి నివసించిన ప్రాంతంలో ఈ ప్రదేశం ఉంది. ఆద్ జాతి ప్రజలు చాలా బలమైన వారు. వారు చాలా పొడవుగా బలిష్టంగా ఉండేవారు. అద్భుతమైన భవనాలు నిర్మించేవారు. వారికి ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండేవి. సారవంతమైన నేలలు ఉండేవి. గొప్ప నీటిపారుదల వ్యవస్థ ఉండేది. ఆ విధంగా వారు ఆధిపత్యాన్ని పొందారు. సంపన్న జాతిగా మారారు. కాని వారి సంపద వారిని సత్యానికి దూరం చేసింది. అణచివేత వారి నిత్యకృత్యమయ్యింది. వారి వద్ద ప్రవక్తగా పంపబడిన హూద్(అస) వారిని హెచ్చరించారు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మహాపరాధమని చెప్పారు. సత్యాన్ని తిరస్కరించడం, అణచివేతకు పాల్పడడం మంచిది కాదని బోధించారు. కాని వారు ఆయన మాటలను పెడచెవిన పెట్టారు. ఫలితంగా వారు నాశనానికి గురయ్యారు. ఒక తీవ్రమైన ఇసుకతుఫాను వారిని ముంచేసింది. వారి ఇళ్ళ శిధిలాలు మాత్రమే మిగిలాయి. ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించే వారికి దైవవాణిని నిరాకరించే వారికి ఇది ఒక గుణపాఠంగా మిగిలిపోయింది.

ఈ సూరాలో విగ్రహారాధనను విమర్శించడం జరిగింది. విగ్రహాలు దేనినీ సృష్టించే శక్తిని కలిగిలేవని, అవి ఎలాంటి ప్రయోజనాన్ని కలిగించే శక్తిని కాని, నష్టాన్ని కలిగించే శక్తిని కాని కలిగిలేవని స్పష్టం చేసింది. నిజానికి వాటిని ఆరాధిస్తున్న వారే వాటిని తయారు చేసారని విశదం చేసింది. ప్రకృతిలో అల్లాహ్ సృష్టి సామర్థ్యాన్ని తెలియజేసే చిహ్నాలు, ఆయన ఒకే ఒక్కడని చాటిచెప్పే చిహ్నాలు అసంఖ్యాకంగా

ఉన్నాయి. మానవులను సృష్టించడం, ఆకాశాలను, భూమిని సృష్టించడం అన్నది ఒక వివేకవంతమైన, అర్థవంతమైన లక్ష్యంతో జరిగింది. కాని అవిశ్వాసులు దైవవాణి అవతరణను అనుమానిస్తున్నారు. ప్రవక్త ముహమ్మద్(సఅసం) దివ్యఖుర్ఆన్‌ను కల్పించి చెబుతున్నారని భావిస్తున్నారు. ఇదంతా ఒక మంత్రజాలమని అనుకుంటు న్నారు. ఈ విషయాలను ప్రస్తావిస్తూ, అల్లాహ్ శక్తిసామర్థ్యాలను విశదీకరిస్తూ, ఆయన మరణించిన వారికి మళ్ళీ జీవితాన్ని ఇచ్చే శక్తికలవాడని చాటిచెప్పింది.

ఈ సూరాలో కంటికి కనిపించని ప్రాణులయిన జిన్నుల ప్రస్తావన ఉంది. వారు దివ్యఖుర్ఆన్ పారాయణాన్ని భక్తిపూర్వకంగా విన్నారు. దివ్యఖుర్ఆన్‌లో ఉన్న సత్యాన్ని తెలుసుకుని ప్రభావితులయ్యారు. దానిని విశ్వసించారు. ఆ పిదప వారు తమ ప్రజల వద్దకు వెళ్ళి వారికి ఆ శుభవార్త చెప్పారు. చివరకు జిన్నులు కూడా ఈ దివ్యగ్రంథాన్ని విని ప్రభావితులయ్యారనీ, దానిని సత్యంగా స్వీకరించారని, కాని మానవులైన వారు చెడుపనులలో కూరుకుపోయి దీన్ని తిరస్కరిస్తున్నారని అవిశ్వా సులకు చెప్పడానికి ఈ ప్రస్తావన చేయడం జరిగింది. ఇలాంటి వారి పట్ల సహనంతో వ్యవహరించాలని, సత్యాన్ని తిరస్కరిస్తున్న వారి పట్ల తొందరపడరాదని ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు బోధించడం జరిగింది.

ఈ సూరాలో తల్లిదండ్రుల పట్ల దయతో, ప్రేమతో వ్యవహరించే విశ్వాసి గురించి, తల్లిదండ్రుల పట్ల కఠినంగా, నిర్దయగా వ్యవహరించే అవిశ్వాసి గురించి వేర్వేరుగా ప్రస్తావించి వారి మధ్య భేదాన్ని తెలియజేయడం జరిగింది. గర్భధారణ సందర్భంగా, ప్రసవం సందర్భంగా తల్లి పడే వేదనను ఇక్కడ గుర్తుచేయడం జరిగింది. శిశువుకు పాలుపట్టే గరిష్ఠ కాలం 24 నెలలని ఇక్కడ తల్లులకు చెప్పడం కూడా జరిగింది.

**ముఖ్యాంశాలు :**

**వినాశం :**

సత్యాన్ని తిరస్కరించడం, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం, దౌర్జన్యాలు దేవుని ఆగ్రహాన్ని కొనితెస్తాయి.



**దేవుని ఔన్నత్యం :**

ప్రజలు సత్యాన్ని తిరస్కరించినంత మాత్రాన అల్లహ్ ఔన్నత్యంపై ఎలాంటి ప్రభావం పడదు.

**తల్లిదండ్రులు :**

తల్లిదండ్రుల పట్ల దయతో, ప్రేమాభిమానాలతో వ్యవహరించాలి. వారికి మంచి కలగాలని ప్రార్థించాలి.

**సహనం :**

లక్ష్యం సాధించడానికి కష్టాల్లో కూడా సహనం వహించాలి.

## 47 వ అధ్యాయం

# ముహమ్మద్

## పరిచయం

ఇది మదీనా కాలానికి చెందిన సూరా. ఇందులో మొత్తం 38 ఆయతులు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన బలహీనమైన ముస్లింరాజ్యంలో పౌరులకు బలమైన నైతిక, సామాజిక ఆచారాలు నేర్పడం ఈ సూరాలో ప్రధానంగా కనబడుతుంది. ఈ సూరాలోని 2వ ఆయత్‌లో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రస్తావన వచ్చింది. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ సఅసం) దేవుని చిట్టచివరి ప్రవక్త అనీ, ఆయన సత్యాన్ని తీసుకు వచ్చారని, ఆయన సందేశం మానవాళిని రుజుమార్గంపై నడుపుతుందని ఈ సూరా స్పష్టం చేసింది.

విశ్వాసాన్ని, స్వేచ్ఛను కాపాడుకోవడానికి, అల్లాహ్ మార్గంలో పోరాడడం, త్యాగాలు చేయడం, దానధర్మాలు చేయడం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. అల్లాహ్ ధర్మం కోసం అసత్యానికి ఒడిగట్టిన వారితో పోరాడాలని ఈ సూరా చెప్పింది. విశ్వాసులకు దేవుని సహాయం, విజయం లభిస్తాయని ఈ సూర హామీ ఇచ్చింది. పరలోకంలో విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయన్న హామీ కూడా

ఈ సూరాలో ఇవ్వడం జరిగింది. ఆ స్వర్గవనాల్లో సెలయేర్లు ఉంటాయి. ఆ జలాలు ఎన్నడూ కలుషితం కావు. పాల నదులు ఉంటాయి. వాటి రుచి ఎన్నడూ మారదు. తేనె నదులు, మద్యం నదులు ప్రవహిస్తుంటాయి. అక్కడ అన్ని రకాల ఫలాలు లభిస్తాయి. దేవుని క్షమాభిక్ష ప్రాప్తమవుతుంది.

ఇందులో విశ్వాసులకు, అవిశ్వాసులకు సంబంధించిన భేదాన్ని కూడా ఉదాహరణ పూర్వకంగా చెప్పడం జరిగింది. విశ్వాసులు స్వర్గవనాలను, దేవుని కారుణ్యాన్ని పొందడానికి అల్లాహ్‌ను ఆరాధిస్తారు. కాని అవిశ్వాసులు తమ మనోకాంక్షలను మాత్రమే ఆరాధిస్తారు. చివరకు నరకాగ్నికి చేరుకుంటారు. వారు ప్రపంచంలోనే తమ జీవితాన్ని అనుభవిస్తారు. జంతువుల మాదిరిగా తింటారు.

సత్యాన్ని తిరస్కరించి నాశనమైన గత జాతులకు పట్టిన గతిని కూడా అవిశ్వాసులకు గుర్తుచేయడం జరిగింది. అంతేకాదు, ఈ సూరలో కపటవిశ్వాసం కలిగిన వారి గురించిన ప్రస్తావన కూడా వచ్చింది. కపట విశ్వాసులు అన్యమనస్కంగా ఇస్లాంను అనుసరిస్తారు. ఎల్లప్పుడు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ ఉంటారు. వారు ముస్లిములుగా నటిస్తూ ఉంటారు. ఇస్లామ్‌ను నాశనం చేయడానికి కుట్రలు పన్నుతూ ఉంటారు. వారి హృదయాల్లో చెడు తిష్టవేసుకుని ఉంది. వారి మాట, వారి నడవడి వారిని భ్రష్టు పట్టిస్తుంటాయి.

## ముఖ్యాంశాలు

**ప్రాపంచిక జీవితం :**

ఈ ప్రాపంచిక జీవితం కేవలం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. ఇక్కడ మనిషి చెడుకు దూరంగా ఉండాలి. దైవవిధేయుడిగా ఉండాలి. పరలోకంలో శాశ్వత విజయం పొందడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

**సహాయం :**

అల్లాహ్ ధర్మం కోసం త్యాగాలు చేయాలి. సహాయం అందించాలి.

**రక్షణ:**

విశ్వాసులకు రక్షకుడు అల్లాహ్‌యే. కాని అవిశ్వాసులకు రక్షకుడెవరూ లేదు.



**48 వ అధ్యాయం**

# అల్ ఫత్‌హ్

# విజయం

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 29 ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ మార్గంలో పోరాడడం, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు సహాయపడడం గురించి, కపటవిశ్వాసుల గురించి ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరా మొదటి ఆయతులో విజయం గురించిన ప్రస్తావన వచ్చింది. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది.

ఈ సూరాలో మక్కా అవిశ్వాసులకు, ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు మధ్య కుదిరిన చారిత్రక హుదైబియా ఒప్పందం గురించిన ప్రస్తావన ఉంది. ఈ ఒప్పందం హిజ్రీశకం ఆరవ సంవత్సరంలో కుదిరింది. ఈ ఒప్పందం ముస్లిములకు ఒక ముఖ్యమైన రాజకీయ విజయాన్నిచ్చింది. కొత్తగా ఏర్పడిన ముస్లిం రాజ్యానికి గుర్తింపును ఇచ్చింది. విజయం అన్నది కేవలం అల్లాహ్ మాత్రమే ఇస్తాడని ఈ సూరా నొక్కి చెప్పింది. పోరాడుతున్న విశ్వాసుల హృదయాలలో ఆయన ప్రశాంతతను, స్థయిర్యాన్ని కలిగించాడు. వారు స్థిరంగా నిలబడేలా, పోరాటం కొనసాగించేలా ప్రోత్సహించాడు. పోరాడుతున్న అవిశ్వాసుల హృదయాల్లో భీతిని కలిగించినది. కూడా ఆయనే.

ఈ సూరాలో కపటవిశ్వాసుల గురించి కూడా ప్రస్తావన వచ్చింది. వారు ముందుకు రాకుండా వెనకే ఉండిపోయారు. యుద్ధానికి రాకపోవడానికి నానావిధ సాకులు చెప్పసాగారు. వారు డోలాయమానమైన విశ్వాసం కలిగినవారుగా, ప్రాపంచిక ప్రయోజనాలను, యుద్ధసొత్తును మాత్రమే ఆశిస్తున్నవారిగా, కీడులో కూరుకుపోయిన వారిగా, చెడు ఆలోచనల్లో నిమగ్నమైన వారిగా అభివర్ణించడం జరిగింది.

ప్రవక్త ముహమ్మద్(సఅసం) అనుచరులను పరస్పరం మృదువైఖరి కలిగిన వారిగా, అవిశ్వాసుల పట్ల కఠినమైన వారిగా, అల్లాహ్ సంతోషాన్ని, ఆయన అనుగ్రహాన్ని కోరుతూ ప్రార్థనల్లో సాష్టాంగపడే వారిగా, ముఖాలపై సాష్టాంగపడిన చిహ్నాలు కలిగిన వారిగా అభివర్ణించింది. విశ్వాసులకు దేవుని క్షమాభిక్ష, అత్యుత్తమ బహుమానం వాగ్దానం చేయబడింది. ఈ సూరాలో స్త్రీపురుష కపటవిశ్వాసుల గురించి, బహుదైవారాధకుల గురించి వ్యాఖ్యనించడం జరిగింది. వారు అల్లాహ్ గురించి చెడ్డగా భావిస్తున్నారు. వారు అల్లాహ్ ఆగ్రహాన్ని చవిచూస్తారని చెప్పడం జరిగింది. వారు శాపగ్రస్తులు, వారి కోసం నరకాగ్నిని సిద్ధం చేయడం జరిగిందని వ్యాఖ్యానించింది.

**ముఖ్యాంశాలు :**

**ప్రాపంచిక ప్రయోజనాలు :**

అల్లాహ్ మార్గంలో పోరాడడమన్నది కఠినప్రయత్నంతో కూడుకున్న పని. ఇది యుద్ధసొత్తు కోసం పోరాడటం వంటిది కాదు. వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి చేయవలసిన పని కాదు.

**ప్రవక్త :**

ప్రవక్త ముహమ్మద్ (సఅసం) సత్యానికి సాక్ష్యమిచ్చేవారుగా అవతరించడం జరిగింది. శుభవార్తను వినిపించే వారుగా, హెచ్చరిక చేసే వారుగా ఆయన వచ్చారు. అల్లాహ్ ఆయనకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి పంపాడు.

**కపట విశ్వాసం :**

అల్లాహ్ గురించి చెడు భావాలు కపటవిశ్వాసాన్ని పుట్టిస్తాయి. ఇది తీవ్రమైన వ్యక్తిగతమైన, సాముదాయికమైన చెడు. అల్లాహ్ పట్ల పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి. పూర్తిగా ఆయన్నే నమ్ముకోవాలి.



**49 వ అధ్యాయం**

# అల్ హుజురాత్

# ఇళ్ళు

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 18 ఆయతులు ఉన్నాయి. సామాజిక సంబంధాల గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలోని 4వ ఆయతులో ఇళ్ళ గురించిన ప్రస్తావన వచ్చింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం) కుటుంబం ఉపయోగించే ఇళ్ళకు సంబంధించిన ప్రస్తావన ఇది. దీనినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. కొందరు ఇస్లామ్ స్వీకరించడానికి ఒక బృందంగా వచ్చినప్పుడు వారు ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇంటి ముందు నిలబడి బిగ్గరగా పిలిచేవారు. ఈ విధంగా చేయడం ఆయన పట్ల అమర్యాదకరమైన వైఖరి మాత్రమే కాదు, సభ్యతా మర్యాదలకు విరుద్ధమైనది.

ఈ సూరాలో సభ్యత, మర్యాద, నడవడి గురించి బోధించడం జరిగింది. ఒకరి పట్ల ఒకరు ఎలాంటి మర్యాదలు పాటించాలి? ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల ఎలాంటి మర్యాదలు పాటించాలన్నది ఇందులో స్పష్టం చేయడం జరిగింది. ముస్లిముల మధ్య సోదరభావాన్ని ఈ సూరా పెంపొందించింది.

**ముఖ్యాంశాలు**

**సభ్యతా మర్యాదలను క్రింది అలవాట్ల ద్వారా పెంచుకోవచ్చు :**

1. అల్లాహ్, దేవుని ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ల ఆదేశాలను శిరసా వహించాలి. ప్రవక్త (సఅసం)తో సంప్రదించకుండా నిర్ణయం తీసుకునే అధికారం ఎవరికీ లేదు. అంటే ప్రవక్త (సఅసం) సంప్రదాయాలు (సున్నతులు) ఆయన అనుచరుల ఆచరణలను, ధర్మపరాయణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.
2. ప్రవక్త (సఅసం) సమక్షంలో గొంతు పెంచి మాట్లాడరాదు. అంటే, నాయకుని ముందు, ధర్మజ్ఞానం కలిగిన పెద్దల ముందు గొంతు పెంచి మాట్లాడరాదు.

3. పుకార్లను నమ్మరాదు. వాటిని లోతుగా పరిశీలించాలి.
4. ఇతరులను ఎగతాళి చేయరాదు. ఇతరుల భావాలు గాయపడేలా వ్యవహరించరాదు.
5. అనుమానాలను, కూపీ లాగడాలను మానుకోవాలి.
6. జాతిపరంగా ఎవరూ గొప్పకాదు, దైవభీతి విషయంలోనే ఆధిక్యత ఉంటుంది. జాతి విచక్షణకు అతీతంగా వివిధ జాతులు ఒక్కటై ఒకరి గురించి ఒకరు తెలుసుకోవాలి.
7. వివాదాలను పరిష్కరించుకోవాలి.
8. విశ్వాసాన్ని రుజువు చేసుకోవడానికి మంచిపనులు చేయాలి. విశ్వాసం అంటే నోటి మాట కాదు.
9. విశ్వాసభాగ్యాన్ని ప్రసాదించిన అల్లాహ్‌కు కృతజ్ఞులై ఉండాలి.
10. అల్లాహ్ మార్గంలో ధనప్రాణాలొడ్డి కృషిచేయాలి.

**50 వ అధ్యాయం**

# ఖాఫ్

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 45 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఈ సూరా నొక్కి చెప్పింది. ఈ సూరా ప్రారంభంలో వచ్చిన 'ఖాఫ్' అనబడే పొడి అక్షరాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ పొడి అక్షరానికి అసలు అర్థం అల్లాహ్‌కే బాగా తెలుసు, కాని కొందరు వ్యాఖ్యాతలు ఈ పొడి అక్షరం అర్థం గురించి వివరణలు ఇచ్చారు. అవిశ్వాసులు తీర్పుదినాన్ని, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని తిరస్కరించడాన్ని ముఖ్యంగా ఈ సూరా ప్రస్తావించింది. అవిశ్వాసులు తాము మరణించిన తర్వాత తమ దేహాలు దుమ్ము, ధూళిలో కలిసి



పోయిన తర్వాత మళ్ళీ తమను బతికించడం అన్నది ఎలా సాధ్యమని వాదించేవారు. ఈ వాదనకు ఈ సూరాలో జవాబు ఇస్తూ, ఒకసారి సృష్టించిన అల్లాహ్ అలసిపోలేదని, ఆయన జీవితాన్ని మరణాన్ని ప్రసాదిస్తాడనీ, ఆయన మృతభూమికి జీవం పోస్తాడనీ, ఆయన మనిషిని, భూమ్యాకాశాలను, వాటిమధ్య ఉన్న సమస్తాన్ని ఆరురోజులలో సృష్టించాడనీ తెలియజేసింది.

ఈ సూరా అవిశ్వాసులకు మృత్యువుకు సంబంధించిన బాధాకరమైన పరిస్థితిని, ప్రళయఘడియ వచ్చినప్పుడు శంఖం పూరించబడే పరిస్థితిని, మరణించిన వారు మళ్ళీ లేపబడే విషయాన్ని, తీర్పుదినం నాటి దృశ్యాలను స్పష్టంగా తెలియజేసింది. ప్రతి వ్యక్తి వెంట ఒక దైవదూత సాక్షిగా ఉంటాడు. అవిశ్వాసులను నరకాగ్నిలోకి నెట్టడం జరుగుతుంది. వారు సత్యాన్ని అనుమానించారు, అహంకారంతో వ్యవహరించారు, మూర్ఖంగా అల్లాహ్‌ను తిరస్కరించారు. వారు మంచిని నిషేధించుకున్నారు. సన్మార్గులకు వారికి వాగ్దానం చేయబడిన స్వర్గవనాలు లభిస్తాయి. వారు అల్లాహ్‌కు భయపడేవారు. వారు భక్తితో అల్లాహ్ వైపునకు మరలేవారు. నిజాయితీగా పశ్చాత్తాపపడేవారు. ఈ సూరాలో గతకాలాల్లో సత్యాన్ని తిరస్కరించిన జాతులకు పట్టిన గతిని గుర్తుచేయడం జరిగింది. నూహ్ (అస) జాతి, సమూద్ తెగలు, ఆద్ జాతి, ఫిర్ఔన్ జాతి, లూత్ (అస)జాతి – ఈ జాతులు సంపద, అధికారాలు కలిగిఉన్నప్పటికీ నాశనానికి గురయ్యాయి. ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి సహనంతో వ్యవహరించాలని, సన్మార్గానికి కట్టుబడాలని బోధించడం జరిగింది.

## ముఖ్యాంశాలు

**న్యాయం :**

అల్లాహ్ మానవులందరి పట్ల న్యాయంగా వ్యవహరిస్తాడు.

**సహనం :**

లక్ష్యాన్ని సాధించడానికి సహనంతో, స్థిరచిత్తంతో వ్యవహరించాలి.

**నిర్లక్ష్యం :**

తీర్పుదినం గురించి నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు. పరలోకంలో సాఫల్యం కోసం, స్వర్గవనాల్లో శాశ్వతమైన దైవానుగ్రహాన్ని పొందడం కోసం, బాధాకరమైన శిక్షను తప్పించుకోవడం కోసం ఇక్కడే ఏర్పాట్లు చేసుకోవాలి.

**దివ్యఖుర్‌ఆన్ :**

దివ్యఖుర్‌ఆన్‌ను హితబోధగా స్వీకరించాలి. దాని సహాయంతో ప్రజలకు హితబోధ గరపాలి. వారిని హెచ్చరించాలి.

## 51 వ అధ్యాయం

# అజ్ జారియాత్

# గాలి దుమారం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 60 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, శిక్షాబహుమానాల గురించి ప్రస్తావించింది. ఈ సూరాలో దుమ్ముధూళి రేణువులను ఎగురవేసి దూరప్రాంతాలకు కొనిపోయే గాలి దుమారం గురించిన, వర్షపు మేఘాలను కొని వచ్చే గాలి దుమారం గురించి ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ గాలి వర్షాన్ని తీసుకొచ్చి మృతభూమికి జీవం పోసి పంటలు పండేలా చేస్తే అది మంచి ఫలితాన్ని ఇచ్చే గాలి. కాని వినాశాన్ని తీసుకొచ్చి, దేవుని శక్తిసామర్థ్యాలను చాటిచెప్పేదయితే చెడు ఫలితాన్ని ఇస్తుంది.

సముద్రాలలో, నదులలో ప్రయాణించే నౌకల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. అల్లాహ్ వాటిని మానవుల ప్రయోజనం కొరకు సృష్టించాడు. అల్లాహ్ ఆదేశాలను అమలు పరిచే దైవదూతల గురించి కూడా ఈ సూరా తెలిపింది.



అనేక గోళాలు కలిగి ఉన్న ఆకాశాన్ని గురించి ప్రస్తావించింది. ఇవన్నీ దేవుని ఏకత్వాన్ని తెలిపే చిహ్నాలు. అల్లాహ్ సమస్త అధికారాలు కలిగిన ప్రభువు. ఆయన ఈ విశ్వాన్ని పాలిస్తున్నాడు. ప్రజలకు వారి పోషణ ఇస్తున్నాడు. ఆయనే జీవితాన్ని మృత్యువును ప్రసాదిస్తున్నాడు. ఆయనే ఆకాశాలకు, భూమికి ప్రభువు. భూమిలోను, మనలోను దేవుని ఏకత్వానికి సంబంధించిన సాక్ష్యాధారాలు అనేకం ఉన్నాయి. విశ్వనిర్మాణంలోను, ప్రతిదీ జంటలుగా సృష్టించడంలోను దేవుని ఏకత్వానికి నిదర్శనాలు దాగి ఉన్నాయి.

ఇబ్రాహీమ్ (అస) కథ దేవుని శక్తిసామర్థ్యాలకు మరో నిదర్శనాన్ని ఇస్తుంది. ఇబ్రాహీమ్(అస) చాలా ముసలివారయ్యారు. ఆయన భార్య కూడా వయోవృద్ధురాలు. ఆమెకు పిల్లలు కలిగే వయస్సు ఎప్పుడో దాటిపోయింది. వారికి సంతానం కలుగ బోతోందని దైవదూతలు వారికి చెప్పారు. వారది విని ఆశ్చర్యపోయారు. కాని ఆ వార్త నిజమయ్యింది. ఇషాక్(అస) వారికి జన్మించారు. విశ్వాసాన్ని తిరస్కరిస్తున్న వారికి ఈ వాస్తవాలను గుర్తుచేయడం జరిగింది. సత్యాన్ని తిరస్కరించినందువల్ల వారికి ఎదురయ్యే పరిణామాల గురించి వారిని హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా గతకాలాలకు చెందిన కొన్ని జాతుల గురించి, వారికి పట్టిన గతి గురించి తెలియజేయడం కూడా జరిగింది. ఆద్, సమూద్, లూత్(అస) జాతులు, ఫిర్‌ఔన్ జాతి గురించి తెలియజేయడం జరిగింది. మొండిగా అవిశ్వాసం అవలంబి స్తున్న వారి నుంచి వైదొలగాలని ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు బోధించడమైంది. వారి తప్పులకు ఆయనను బాధ్యునిగా చేయడం జరగదని స్పష్టం చేసింది. అవిశ్వాసులకు దేవుని ఔన్నత్యాన్ని గుర్తు చేయాలని, వారికి దైవవాణి వల్ల ఒనగూడే ప్రయోజనాల గురించి తెలుపాలని చెప్పింది.

విశ్వాసులకు, అవిశ్వాసులకు సంబంధించిన భేదాలను కూడా ఇక్కడ చెప్పడం జరిగింది. అల్లాహ్‌కు భయపడేవారు మంచిపనులు చేస్తారు. రాత్రులలో, ప్రాతః సమయంలో సుదీర్ఘంగా ప్రార్థనల్లో గడుపుతారు. నిరుపేదలకు సహాయం చేస్తారు. అందువల్ల వారికి స్వర్గవనాలు, సెలయేరులు ఉన్న ప్రదేశం బహుమతిగా లభిస్తుంది.

అవిశ్వాసులు అహంభావంతో వ్యవహరిస్తారు. తీర్పుదినాన్ని తిరస్కరిస్తారు. వారు భ్రమలకు గురయ్యారు. వారికి బాధాకరమైన శిక్షతప్పదు.

**ముఖ్యాంశాలు**

**శిక్ష:**

అహంకారంతో వ్యవహరిస్తూ, సత్యాన్ని తిరస్కరించడం శిక్షను ఆహ్వానించడమే అవుతుంది. గతకాలాల్లో సత్యాన్ని తిరస్కరించిన జాతుల కథలను గుర్తుంచుకోవాలి.

**దేవుని చిహ్నాలు :**

దేవుని చిహ్నాలను అన్వేషించి, పరిశీలించాలి. ఈ చిహ్నాలు మన చుట్టుప్రక్కలా, మనలోపల అసంఖ్యాకంగా ఉన్నాయి.

**నష్టం :**

గతకాలాల్లో తమ ప్రవక్తలను తిరస్కరించిన జాతులకు పట్టిన దుర్గతి గుణపాఠం గరపుతోంది. అలా చేయడం వల్ల తీవ్రమైన వినాశానికి గురికావలసి వస్తుంది. సత్యాన్ని తిరస్కరిస్తే నష్టం తప్పదు.

**అవసరం :**

అల్లాహ్‌కు మనుష్యుల అవసరం లేదు. ఆయనకు అసలు ఎలాంటి అవసరమూ లేదు. మనుష్యులకే అల్లాహ్ అవసరం ఉంది.

**సృష్టి:**

మానవాళిని ఒక వివేకవంతమైన, అర్థవంతమైన లక్ష్యంతో పుట్టించడం జరిగింది. అల్లాహ్‌ను ఆరాధించడానికి మాత్రమే సృష్టించడం జరిగింది. కేవలం జంతువుల మాదిరిగా తినడానికి, నిద్రపోవడానికి కాదు.



**52 వ అధ్యాయం**

## అత్ తూర్

# తూర్ పర్వతం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 49 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షాబహుమానాల గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరా ప్రారంభవచనంలో సినాయ్ పర్వతం లేదా తూర్ పర్వతం గురించిన ప్రస్తావన వచ్చింది. తూర్ పర్వతంపై ప్రవక్త మూసా(అస)కు దైవవాణి అందించడం జరిగింది. దీని ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై చేస్తుండిన ఆరోపణలను కూడా ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరగదని అవిశ్వాసులు భావించడాన్ని ప్రస్తావిస్తూ, మరణానంతర జీవితం భ్రమ కాదని, ఒక వాస్తవమనీ నొక్కి చెప్పడం జరిగింది. అనివార్యంగా, తప్పనిసరిగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరుగుతుందనీ హెచ్చరించింది. తీర్పుదినాన ఆకాశం ముక్కలవుతుంది. పర్వతాలు పెకలించబడి గాల్లో ఎగురుతాయి. సత్యాన్ని తిరస్కరించిన వారిని ఆ రోజున నరకాగ్ని వైపునకు నెట్టడం జరుగుతుంది. వారు సత్యాన్ని నిరాకరించారు. వారు దుర్మార్గానికి తగిన ప్రతిఫలాన్ని పొందారు. దైవభీతితో వ్యవహరించిన వారికి నిత్యం దైవానుగ్రహాలు వర్షించే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారికి సౌకర్యవంతమైన ఆసనాలు, పానీయాలు, ఆహారపదార్థాలు, అందమైన భార్యలు ఉంటారు. వారి మంచిపనులకు లభించిన ప్రతిఫలం అది.

దివ్యఖుర్‌ఆన్ వంటి గ్రంథాన్ని తయారు చేసి చూపించాలని ఈ సూరా అవిశ్వాసులను సవాలు చేసింది. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు ఎవరూ లేరని, ఆయన ఆకాశాలకు, భూమికి సృష్టికర్త అనీ, ఆయనకు అనంతమైన జ్ఞానం,

అపరిమితమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయనీ, ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరని, ఉనికిలో ఉన్న సమస్తానికి సంబంధించిన గోప్యంగా ఉన్న విషయాలన్నీ ఆయనకు తెలుసుననీ ఈ సూరా స్పష్టంగా చెప్పింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి, సహనంతో వ్యవహరించాలని, అల్లాహ్ ఔన్నత్యాన్ని రాత్రింబవలు కొనియాడాలనీ బోధించింది.

**ముఖ్యాంశాలు**

**సహనం :**

సహనంతో విశ్వాసానికి కట్టుబడి వ్యవహరించాలి.

**బహుమానం :**

మనిషి సన్మార్గానికి కట్టుబడితే బాధాకరమైన శిక్షను తప్పించుకోగలుగుతాడు.

**ప్రార్థన :**

మనిషి తన అవసరాలకు గాను నేరుగా అల్లాహ్‌నే మొరపెట్టుకోవాలి. ఆయన అపార కృపాశీలుడు, అత్యంత దయామయుడు.

## 53 వ అధ్యాయం

# అన్ నజ్మ్

# నక్షత్రం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 62 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి బోధించింది. ఈ సూరా మొదటి ఆయతులో నక్షత్రం గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈపేరు పెట్టడం జరిగింది. దైవవాణి అవతరణను,



ప్రవక్తల పరంపరను అవిశ్వాసులు నిరాకరించేవారు. కాని అవి వాస్తవాలని ఈ సూరా ధృవీకరించింది. దివ్యఖుర్ఆన్‌ను అల్లాహ్ అవతరింపచేసాడనీ, దైవవాణి అవతరణ భ్రమ కాదని, ఒక వాస్తవమనీ, దైవదూత జిబ్రయీల్ (అస) ద్వారా దైవవాణిని పంపడం జరిగిందనీ ఇందులో గట్టిగా చెప్పడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రత్యక్షంగా దైవదూత జిబ్రయీల్(అస)ను రెండుసార్లు చూసారని ఈ సూరా వల్ల తెలుస్తోంది. దైవదూత ప్రథమంగా దైవవాణిని తీసుకొచ్చినపుడు మొదటిసారి, మేరాజ్ (గగనయాత్ర) సందర్భంగా రెండవసారి ఆయన జిబ్రయీల్(అస)ను చూసారు.

ఈ సూరా అవిశ్వాసులను వారి వ్యవహారశైలి మార్చుకోవాలని హెచ్చరించింది. అల్లాహ్‌ను విశ్వసించాలని, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది భ్రమ ఎంతమాత్రం కాదని, అది ఒక వాస్తవమనీ, తప్పనిసరిగా జరుగుతుందని గట్టిగా చెప్పింది. ఈ సూరాలో అవిశ్వాసుల అసత్య దేవుళ్ళను, విగ్రహాలను, వారి మూఢ నమ్మకాలను, వారి అసత్య విశ్వాసాలను ఖండించడం జరిగింది. దైవదూతలు స్త్రీలని అవిశ్వాసులకు ఒక మూఢనమ్మకం ఉండేది. దైవదూతలు, విగ్రహాలు అల్లాహ్‌తో సిఫారసు చేయగలవని, అల్లాహ్ తన నిర్ణయాలను మార్చుకునేలా చేయగలవనీ మూఢంగా నమ్మేవారు. ఈ నమ్మకాలు కేవలం కల్పనలు మాత్రమేననీ, ఈ నమ్మకాలకు ఎలాంటి ఆధారాలు లేవని ఈ సూరా నిక్కచ్చిగా చెప్పింది.

అల్లాహ్‌కే ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యాన్ని విశదీకరించడం ద్వారా దేవుని ఏకత్వాన్ని ఈ సూరాలో నిదర్శనాలతో సహా రుజువుచేయడం జరిగింది. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. మాతృగర్భంలో పిండరూపంలో ఉన్న వారి గురించి కూడా ఆయనకు అన్నీ తెలుసు. ఆయన జీవితాన్ని ఇస్తాడు, చావును ఇస్తాడు. మనకు ఆనందాన్ని, దుఃఖాన్ని ఇచ్చేది ఆయనే. ఆయన ఒక్క వీర్యం బిందువు నుంచి స్త్రీపురుషులను సృష్టించాడు. మరణించిన తర్వాత మళ్ళీ లేపడం ద్వారా ఆయన మళ్ళీ రెండవసారి పుట్టిస్తాడు. ఆయనే విశ్వానికి సృష్టికర్త, విశ్వపోషకుడు. ఆయనే సంపదలను, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తాడని బోధించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి ఇస్లాం సందేశాన్ని కాదంటున్న వారిని పట్టించుకోవద్దని, వారు కేవలం ప్రాపంచిక జీవితం పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉన్నారని బోధించడమైనది.

**ముఖ్యాంశాలు**

**స్తుతించడం :**

అల్లాహ్ అపార కృపాశీలుడు. అందువల్ల ఆయన్నే స్తుతించాలి. ఆయన ముందు సాష్టాంగపడాలి. ఈ విషయంలో గర్వాన్ని చూపరాదు.

**బాధ్యత:**

ప్రతివారు తమ కర్మలకు తామే బాధ్యత వహించవలసి ఉంటుంది. మనిషి తాను చేసిన దానికి తగిన ప్రతిఫలం పొందుతాడు.

**కాలం:**

కాలాన్ని వ్యర్థంగా గడుపరాదు. బాధ్యతతో వ్యవహరించాలి. అల్లాహ్‌ను ఆరాధించాలి. పరలోకంలో శాశ్వత జీవితానికి ఏర్పాట్లు చేసుకోవాలి.

**మరలడం :**

ప్రతి ఒక్కరు పరలోకంలో అల్లాహ్ ముందు హాజరు కాకతప్పదు. అన్ని వ్యవహారాలు ఆయన వైపునకే మరలి పోవలసి ఉంది.

## 54 వ అధ్యాయం

# అల్ ఖమర్

# చంద్రుడు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 55 ఆయతులు ఉన్నాయి. ప్రళయఘడియ రావడం గురించి, హెచ్చరికలను తిరస్కరించడం గురించి, మనోకాంక్షలను అనుసరించడం గురించి ఈ సూరా ముఖ్యంగా నొక్కి చెప్పింది. ఈ సూరా మొదటి ఆయతులో చంద్రుని గురించి ప్రస్తావన ఉంది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)



ప్రవక్త పదవికి నిదర్శనంగా చంద్రుడు రెండుముక్కలుగా చీలిపోయాడు. అవిశ్వాసులు తమ కళ్లారా ఈ నిదర్శనం చూసుకోవాలని ఈ మహత్యాన్ని ప్రదర్శించడం జరిగింది. చంద్రుడు చీలిపోవడాన్ని ప్రవక్త ముహమ్మద్ (సఅసం), ఆయన అనుచరులు మాత్రమే కాదు అవిశ్వాసులు కూడా చూసారు. ఈ మహత్యం ద్వారా వాస్తవాన్ని నిరూపించి నప్పటికీ, అవిశ్వాసులు సత్యాన్ని తిరస్కరించడం, దైవవాణిని నిరాకరించడం కొనసాగించారు. చంద్రుడు చీలిపోవడమన్నది నిజానికి ఒక ప్రస్ఫుటమైన హెచ్చరిక, ప్రళయఘడియ సమీపిస్తున్నదనీ, మరణించిన వారిని మళ్ళీ లేపడం అనివార్యమని చాటిచెప్పే హెచ్చరిక ఇది. ఈ సందర్భంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది. శంఖం ఊదబడినప్పుడు, ఆ పిలుపునకు మానవులందరూ జవాబిస్తారు. తమ తమ సమాధుల నుంచి చెల్లాచెదరైన మిడతల దండులా, బిత్తరచూపులతో, అయోమయంగా పరుగెత్తుతూ వస్తారు. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి. భయంతో కళ్ళెత్తలేకుండా ఉంటారు. ఈ సూరాలో దుర్మార్గులు, దుష్టులైన వారి గురించి ప్రస్తావన కూడా వచ్చింది. అహంకారంతో సత్యాన్ని తిరస్కరించిన వారి గురించి చెప్పడం జరిగింది. లూత్ (అస) జాతి ప్రజలు, ఆద్, సమూద్ జాతుల ప్రజలు, నూహ్(అస) జాతి ప్రజలు, ఫిర్ఔన్ అతడి అనుచరులు – వీరందరూ సత్యాన్ని తిరస్కరించారు. హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. తమ అవిశ్వాసాన్ని, దుర్మార్గాన్ని కొనసాగించారు. ఫలితంగా అందరూ నాశనమయ్యారు.

దివ్యఖుర్ఆన్‌ను ప్రజలు అర్థం చేసుకోవడానికి, ఆచరించడానికి సులభతరంగా చేయడం జరిగిందని, దీనిని అనుసరించేవారు, హితబోధ గ్రహించేవారు ఎవరున్నారని ఈ సూరా ప్రశ్నించింది. తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని ప్రస్తావిస్తూ అవిశ్వాసులు దుర్మార్గంలో కూరుకుపోయారని పేర్కొన్నది. వారిని బోర్లా నరకాగ్నివైపునకు లాక్కెళ్ళడం జరుగుతుంది. దైవభీతి పరులు స్వర్గవనాల శాశ్వత ఆనందాన్ని పొందుతారు.

**ముఖ్యాంశాలు**

**హితబోధ :**

హెచ్చరికలను స్వీకరించాలి. సత్యాన్ని విశ్వసించాలి. లేకపోతే గతకాలాలకు చెందిన జాతుల మాదిరిగా వినాశానికి గురికాక తప్పదు.

**దివ్యఖుర్ఆన్ :**

అర్థం చేసుకోవడానికి, ఆచరించడానికి సులభమైన దివ్యఖుర్ఆన్ సందేశాన్ని శ్రద్ధగా వినాలి.

**సృష్టి:**

యాధృచ్ఛికంగా దేనిని సృష్టించడం జరగలేదు. ప్రతిదీ తగిన విధంగా సృష్టించడింది. ప్రతిదీ అల్లాహ్ చట్టానికి లోబడి, ఆయన పథకం ప్రకారం ఉంది.

**రికార్డు :**

మనం చేసే ప్రతిపని, చిన్నదైనా, పెద్దదైనా ప్రతిదీ నమోదై ఉంది. మనిషి తాను చేసిన కర్మలకు తగిన ప్రతిఫలాన్ని పొందుతాడు.

**55 వ అధ్యాయం**

# అర్ రహ్మాన్
# కృపాశీలుడు

**పరిచయం**

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 78 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా దైవవాణి అవతరణ, మానవులకు అల్లాహ్ ప్రసాదించిన అపరిమిత అనుగ్రహాలు, అల్లాహ్‌కే ప్రత్యేకమైన విశిష్టమైన సృష్టి సామర్థ్యం, తీర్పుదినాల గురించి వివరించింది. ఈ సూరా మొదటి ఆయతులో "అపార కృపాశీలుడు" అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరాలో దేవుని అపరిమిత శక్తిసామర్థ్యాలను, ఆయన సృష్టిసామర్థ్యాన్ని చెప్పడం జరిగింది. ఆయన వివేకవివేచనలకు, జ్ఞానసంపదకు నిదర్శనంగా ఇవి ప్రస్తావించబడ్డాయి. ఆయన సూర్యచంద్రులను సృష్టించాడు. అవి తమ కక్ష్యలలో ఖచ్చితంగా తిరుగాడుతున్నాయి. చెట్టుచేమలు దేవుని ఆరాధనలో తలలు వంచు



తున్నాయి. ఆయన ఆకాశాన్ని ఎత్తుగా చేసాడు. ఆయన భూమిని పరిచాడు. తాను సృష్టించిన ప్రాణుల కోసం వివిధ రకాలైన ఫలాలు, ధాన్యాలు ఉత్పత్తి చేస్తున్నాడు. ఆయన మనిషిని ఎండిన పెంకు లాంటి మట్టినుంచి సృష్టించాడు. జిన్నులను పొగలేని అగ్ని నుంచి సృష్టించాడు. ఆయన నదులలోని మంచినీటిని, సముద్రాలలోని ఉప్పునీటిని వేరు చేస్తున్నాడు. ఆయన ముత్యాలను, పగడాలను సృష్టించాడు. సముద్రాలలో నౌకలు ప్రయాణించేలా చేస్తున్నాడు. ఈ వాస్తవాలను ప్రస్తావిస్తూ ఆ సూరాలో తీర్పుదినాన ఆకాశం తునాతునకలై బాగా కాగిన ఎర్రని తైలంగా మారిపోతుందని హెచ్చరించడం జరిగింది.

సన్మార్గులకు శాశ్వత నివాస స్థలంగా లభించే స్వర్గవనం గురించి వర్ణన ఇక్కడ ఇవ్వడం జరిగింది. అక్కడ అన్ని విధాల వృక్షాలు, ఫలాలు ఉంటాయి. రెండు సెలయేర్లు ఉంటాయి. వారి కొరకు ఈడూ జోడూ కలిగిన అందమైన భార్యలు ఉంటారు. తివాచీలు ఉంటాయి. సౌకర్యవంతమైన ఆసనాలు ఉంటాయి.

**ముఖ్యాంశాలు**

**మృత్యువు :**

అల్లాహ్ తప్ప అందరూ మరణించవలసిందే. ఆయన నిత్యుడు. ఎల్లప్పుడు సజీవంగా ఉండేవాడు.

**కృతజ్ఞత :**

అల్లాహ్ మనకు ప్రసాదించిన అసంఖ్యాక అనుగ్రహాలకు గాను ఎల్లప్పుడు ఆయనకు కృతజ్ఞులై ఉండాలి.

**న్యాయం :**

న్యాయాన్ని స్థాపించాలి. ప్రజలతో న్యాయంగా వ్యవహరించాలి.

### 56 వ అధ్యాయం

## అల్ వాఖిఅహ్

# సంఘటన

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 96 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి, ఆరోజున లభించే శిక్షాబహుమానాల గురించి వివరించింది. మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన "సంఘటన" అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది భ్రమ కాదని, ప్రళయం తప్పనిసరిగా జరిగే సంఘటన అని నొక్కి చెప్పడం జరిగింది. ఆ రోజున భూమి తీవ్రంగా కుదిపివేయ బడుతుంది. పర్వతాలు తునాతునకలవుతాయి. మానవులు మూడు వర్గాలుగా విభజించబడతారు.

1. అల్లాహ్ సామీప్యం పొందిన వారు. విశ్వాసంలోను, మంచిపనులలోను అందరికన్నా ముందున్నవారు.
2. సాధారణ సన్మార్గులు - దయతో వ్యవహరించిన వారు, సన్మార్గాన నడిచినవారు.
3. అగ్నికి ఆహుతయ్యేవారు.

ఈ సూరాలో అవిశ్వాసులు తీర్పుదినం గురించి వెలిబుచ్చుతున్న అనుమానా లను ప్రస్తావించడం జరిగింది. మరణించే వ్యక్తి ప్రాణాలు అతడి గొంతులోకి వచ్చినప్పుడు కలిగే బాధను కూడా ఇందులో గుర్తుచేయడం జరిగింది. ప్రశ్నలను సంధిస్తూ, ఈ సూరాలో అల్లాహ్ శక్తిసంపన్నతను, సృష్టించే విశిష్ట సామర్థ్యాన్ని వివరించడం జరిగింది. ప్రతివ్యక్తిని, ప్రతివస్తువును సృష్టించింది అల్లాహ్‌యే. పురుషవీర్యాన్ని, స్త్రీ అండాన్ని సృష్టించింది ఆయనే. పంటలను సృష్టించింది ఆయనే. నీటిని, అగ్నిని సృష్టించింది ఆయనే.



### ముఖ్యాంశాలు

**కృతజ్ఞత :**

అల్లాహ్ మనకు ప్రసాదించిన అసంఖ్యాక అనుగ్రహాలకు గాను ఎల్లప్పుడు ఆయనకు కృతజ్ఞులై ఉండాలి.

**స్తోత్రం :**

అపరిమితమైన అల్లాహ్ ఔన్నత్యాన్ని స్తుతిస్తూ ఉండాలి.

### 57 వ అధ్యాయం

## అల్ హదీద్

# ఇనుము

### పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 28 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, అల్లాహ్‌మార్గంలో ఖర్చుచేయడం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఇందులోని 25వ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన 'ఇనుము' అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఇనుము శాంతి కాలంలో నిర్మాణ కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. యుద్ధకాలంలో ఆయుధాల తయారీకి ఉపయోగపడుతుంది. అలాంటి ఇనుమును సృష్టించి ఇచ్చింది దేవుడేనని ఈ సూరా తెలిపింది. అల్లాహ్‌ను హృదయపూర్వకంగా, ఎలాంటి సందేహానికి తావు లేకుండా విశ్వసించాలని బోధించింది. అల్లాహ్ సర్వజ్ఞానసంపన్నుడు, అపరిమిత శక్తి సామర్థ్యాలు కలిగినవాడు, సృష్టించే విశిష్ట శక్తి ఉన్నవాడని ఈ సూరా నిదర్శనాలతో సహా వివరించింది. అల్లాహ్ మహావివేకవంతుడు, అత్యంత శక్తిసంపన్నుడు. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించాడు, వాటిని అదుపు చేస్తున్నాడు. ఆకాశం నుంచి దిగేది ఏదో, ఆకాశానికి ఎక్కేది ఏదో అన్నీ ఆయనకు తెలుసు. ఆయన రాత్రిని పగటిలో ఐక్యం చేస్తాడు, పగలును రాత్రిలో ఐక్యం చేస్తాడు. ఆయన అందరి రహస్యాలు తెలిసినవాడు. మనం ఎక్కడున్నా ఆయన మనతోపాటు ఉంటాడు. భూమ్యా కాశాలలోని సర్వస్వం ఆయనదే, ఆయనే వాటికి వారసుడు. ఈ సూరాలో ప్రవక్త ఈసా(అస)ను (అంటే ప్రవక్త ఏసుక్రీస్తు), ఆయనకు ఇవ్వబడిన ఇంజీల్

గ్రంధాన్ని ప్రస్తావించడం జరిగింది. (ఇంజీల్ గ్రంధం ప్రవక్త ఏసుక్రీస్తుకు ఇవ్వబడిన (బైబిలు) గ్రంధం. కాని ఇప్పుడు ఆ గ్రంధం చాలా వరకు మార్పులు చేర్పులకు గురయ్యింది.) ఈసా(అస)ను అనుసరించిన శిష్యుల హృదయాల్లో కారుణ్యాన్ని, దయను సృష్టించడం జరిగిందని ఈ సూరా వివరించింది. కాని వారు తమకు తామే సన్యాసత్వాన్ని పాటించడం ప్రారంభించారని, ఆ తర్వాత దానికి కట్టుబడలేకపోయారని తెలిపింది. సన్మార్గులకు లభించే మంచి ప్రతిఫలం గురించి, కాపట్యాన్ని అవలంబించిన వారికి లభించే అవమానాల గురించి కూడా ప్రస్తావించడం జరిగింది.

### ముఖ్యాంశాలు

**వ్యయం :**

అల్లాహ్ మార్గంలో ధారాళంగా ఖర్చు చేయాలి. మీరు ఖర్చు చేసిన దానికి అనేక రెట్లు తిరిగి మీకు లభిస్తుంది. సౌభాగ్యం అన్నది పూర్తిగా అల్లాహ్ చేతుల్లో ఉందని, అల్లాహ్ అపరిమితంగా అనుగ్రహించేవాడని గుర్తుంచుకోవాలి. పిసినారి తనంతో వ్యవహరించరాదు. పిసినారితనాన్ని ప్రోత్సహించరాదు.

**ప్రాపంచిక జీవితం :**

ఈ ప్రపంచంలోని జీవితం ఒక భ్రమ. తాత్కాలికమైన ఆనందం. ఒక ప్రదర్శన మాత్రమే. ఇక్కడ సంపద కోసం, సంతానం కోసం పోటీ పడడం పొరబాటు. మనం అల్లాహ్‌తో క్షమాభిక్ష పొందడానికి పోటీ పడాలి, పరలోక సాఫల్యానికి పోటీ పడాలి.

**దేవుని కారుణ్యం :**

దైవభీతి కలిగి ఉండడం ద్వారా, సదాచరణల ద్వారా, అల్లాహ్‌తో క్షమాభిక్షను కోరుతుండడం ద్వారా మనం దేవుని కారుణ్యాన్ని పొందగలం.

**న్యాయం :**

ప్రజల మధ్య న్యాయాన్ని స్థాపించాలి. న్యాయంగా వ్యవహరించాలి.



**58 వ అధ్యాయం**

# అల్ ముజాదలహ్

# వాదించే మహిళ

### పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 22 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ఇస్లామీయ చట్టసంబంధమైన విషయాలను, నడవడికకు సంబంధించిన విషయాలను ముఖ్యంగా బోధించింది. ఖౌలా బింతె సాలబా అనే మహిళ గృహ సంబంధమైన సమస్యతో ప్రవక్త ముహమ్మద్(సఅసం) వద్దకు వచ్చింది. అప్పటి అజ్ఞాన అరబ్బు సమాజంలో ఉన్న ఒకవిధమైన అనుచిత విడాకుల పద్ధతి విషయమై ఆమె వాదిస్తూ తనకు న్యాయం చేయమని కోరింది. ఆ పద్ధతి ప్రకారం భర్త విడాకులివ్వకుండానే భార్యను దూరం చేసేవాడు. ఆ భార్య ఎలాంటి హక్కులు లేకుండా కేవలం ఇంటిపనులు చేస్తూ పడిఉండవలసి వచ్చేది. ఆ దురాచారాన్ని ఈ సూరాలో తీవ్రంగా ఖండించడం జరిగింది.

ఈ సూరాలో ముస్లిములు పాటించవలసిన కొన్ని నియమాలను, విలువలను తెలుపడం జరిగింది. ఈ సూరాలో మరికొన్ని విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. అల్లాహ్‌కు, అల్లాహ్‌ప్రవక్త (సఅసం)కు విరోధులైన వారితో రహస్య సమాలోచనలు జరపడాన్ని ఈ సూరా ప్రస్తావించింది. కపటవిశ్వాసుల గురించి వారు యూదులతో కూటమి కట్టడం గురించి, ముస్లిం సముదాయానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని తమ మిత్రులకు అందించడం గురించి ఈ సూరాలో ప్రస్తావించడం జరిగింది. నమాజు స్థాపించాలని, జకాత్ చెల్లించాలని, అల్లాహ్ పట్ల, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పట్ల విధేయత చూపాలని ముస్లిములకు బోధించడం జరిగింది.

### ముఖ్యాంశాలు

**మహిళల హక్కులు :**

స్త్రీల హక్కులను గౌరవించాలి. ఆయేషా(రజి) ఇంట, నెమ్మదిగా, రహస్యంగా ప్రవక్త(సఅసం)తో మొరపెట్టుకున్న స్త్రీ మొరలను కూడా అల్లాహ్ విన్నాడు. సహాయ మందించాడని గుర్తించాలి.

**రహస్య సమాలోచనలు :**

షైతాన్ ప్రేరణతో జరిగే చెడ్డపనులు. ఇవి అనైతికమైనవి. సమాజం ఛిన్నాభిన్నం కావడానికి దారితీస్తాయి.

**కూటమి కట్టడం :**

అల్లాహ్‌కు, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు విరోధులైన వారితో కూటమి కట్టరాదు.

**సమావేశాలు :**

సమావేశాలు, సభల్లో ఇతరులకు కూడా చోటు కల్పించడం ద్వారా వారిని గౌరవించాలి. ఈ విధంగా ముస్లిం సమాజంలో సమైక్యత పెరుగుతుంది.

**పరాభవం :**

అల్లాహ్‌ను, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను వ్యతిరేకించరాదు. అలా చేయడం పరాభవాలకు గురయ్యేలా చేస్తుంది.

**ప్రమాణాలు :**

తప్పులను ఒప్పుకోవాలి. అబద్ధపు ప్రమాణాలు చేయరాదు. ఆ విధంగా తప్పులను కప్పిపుచ్చుకోరాదు. అబద్ధపు ప్రమాణాలు చేయడం వల్ల ప్రజల మనస్సులో అనుమానాలు నాటడం జరుగుతుంది.

**సాఫల్యం పొందిన వారు, అపజయం పాలైన వారు :**

చెడుకు పాల్పడిన దుర్మార్గులు చివరకు అపజయం పాలవుతారు. మంచి పనులు చేసిన దైవభక్తిపరాయణులు సాఫల్యం పొందుతారు. అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త (సఅసం) తప్పని సరిగా విజయం పొందుతారు.



**59 వ అధ్యాయం**

# అల్ హష్ర్

# సమూహం

**పరిచయం**

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 24 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, యుద్ధసొత్తు పంపిణీ గురించి ఈ సూరా బోధించింది. ఈ సూరాలోని రెండవ ఆయతులో వచ్చిన సమూహం అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మదీనాలో కొత్తగా ఏర్పడిన ముస్లిం సమాజాన్ని ప్రమాదంలో పడేయ్యడానికి అక్కడి బనూ నజీర్ అనబడే యూద తెగ కుట్రపన్నింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)తో చేసుకున్న ఒప్పందాన్ని వారు ఉల్లంఘించారు. అవిశ్వాసులతో, కపటవిశ్వాసులతో కూటమి కట్టారు. క్రీ.శ.625లో ఇది జరిగింది. వారందరినీ ప్రవక్త ముహమ్మద్(సఅసం) మదీనా నుంచి బహిష్కరించారు. వారి వస్తుసామగ్రిని, ఆయుధాలు తప్ప మిగిలిన సమస్తాన్ని తీసుకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చారు. వారి ఆస్తిపాస్తులు, పొలాలను బీదముస్లిములకు పంచడం జరిగింది.

ఈ సూరా అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ప్రారంభమయ్యింది. ఆయన అపార శక్తిసంపన్నుడు, మహా వివేకవంతుడు. ఈ సూరాలో వినమ్రత, సదాచరణల ప్రాముఖ్యాన్ని గుర్తుచేయడం జరిగింది. ఎందుకంటే విశ్వంలోని సమస్తం అల్లాహ్ ఔన్నత్యాన్ని మాత్రమే కొనియాడుతోంది. యూదులకు మిత్రులుగా వ్యవహరిస్తున్న కపటవిశ్వాసుల గురించి ఈ సూరా ప్రస్తావించింది. యూదులు చివరకు కష్టంలో చిక్కుకున్నప్పుడు ఈ కపటవిశ్వాసులు వారికి ఎలా సహాయం చేయలేకపోయారో కూడా తెలిపింది. మదీనా వలస వచ్చిన విశ్వాసుల త్యాగనిరతి, నిజమైన విశ్వాసాల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ప్రారంభంలో ముస్లిములు మక్కా నగరాన్ని వదిలి మదీనాకు వలస రావలసి వచ్చింది. మదీనాలో వారికి సహాయపడిన స్థానికుల గురించి వారు ఏ విధంగా వలస వచ్చిన వారికి ఆశ్రయం, ఆర్థిక సహాయం అందించినది ఈ సూరాలో తెలియజేయడం జరిగింది. మంచిపనులు

చేయాలని, అల్లాహ్ తప్ప మరెవ్వరు ఆరాధ్యుడు లేడని, అల్లాహ్ గుణగణాలను అర్ధం చేసుకోవాలని బోధించింది. అల్లాహ్ గోచర, అగోచర విషయాలన్నీ తెలిసిన వాడు. ఆయన అపార కృపాశీలుడు, పరమ దయామయుడు. ఆయనే ప్రభువు. ఆయనే పవిత్రుడు. లోపరహితుడు. విశ్వాసరక్షకుడు, మహాశక్తిసంపన్నుడు, మహోన్న తుడు, సృష్టికర్త, ఆకారాన్ని ఇచ్చింది ఆయనే, మహాజ్ఞాని, సర్వాధికారాలు ఆయనకే స్వంతం.

**ముఖ్యాంశాలు**

**విజయం :**

ఈ సూరాలో చెప్పబడిన ఆధ్యాత్మిక విషయాలను నేర్చుకోవాలి. ముస్లిములు సదాచరణలకు కట్టుబడి అల్లాహ్ పట్ల అచంచలమైన విశ్వాసం కలిగి ఉంటే వారు తమ వ్యతిరేక శక్తులను ఓడించగలరు. నిజమైన ఏకదైవారాధనా విశ్వాసంతో మంచిపనులు చేస్తే సంఖ్యాపరంగా, సాధనసంపత్తి పరంగా, వనరుల పరంగా ఎంత బలహీనంగా ఉన్నా గాని విజయాలు ప్రాప్తమవుతాయి.

**కాపట్యం :**

చాలా చెడ్డది. దీనికి దూరంగా ఉండాలి.

**మంచిపనులు :**

అల్లాహ్‌కు భయపడాలి. మంచిపనులకు కట్టుబడాలి. ఎల్లప్పుడు ఆయనను స్మరిస్తూ ఉండాలి. మనప్రభువును మరిచిపోవడం అనైతికం. పరలోకం కోసం ఏర్పాట్లు చేసుకోవాలి.

**ప్రాధాన్యత :**

ఇతరుల అవసరాలకు మన అవసరాల కన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

**ద్రోహం :**

చాలా చెడ్డపని. ద్రోహానికి పాల్పడిన వారే చివరకు దాని వల్ల నష్టపోవలసి వస్తుంది.



**60 వ అధ్యాయం**

# అల్ ముమ్‌తహినహ్

# పరీక్షించబడిన మహిళ

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 13 ఆయతులు ఉన్నాయి. అవిశ్వాసులతో సామాజిక సంబంధాలు, ఇస్లాం స్వీకరిస్తున్న మహిళలు తదితర విషయాలను ఈ సూరా ప్రధానంగా ప్రస్తావించింది. ఇందులోని 10వ ఆయతులో పరీక్షించబడిన మహిళ అన్న ప్రస్తావన వచ్చింది. దానినే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా ముఖ్యంగా రెండు విషయాలను వివరించింది. అవి:

1. అవిశ్వాసులకు సంబంధించి రెండు వర్గాల మధ్య తారతమ్యాన్ని స్పష్టం చేయడం జరిగింది.

(1). విశ్వాసుల పట్ల విద్వేషం కలిగి ఉన్న వారు, ముస్లిములనువారి విశ్వాసం కారణంగా వేధింపులకు, దౌర్జన్యాలకు గురిచేసినవారు. ఇలాంటి అవిశ్వాసులతో సామాజిక సంబంధాలను త్రెంచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రాహీమ్ (అస) ఆయన అనుచరుల కధను ప్రస్తావించడం జరిగింది. ఇబ్రాహీమ్(అస) తనను, తన అనుచరులను వేధించిన అవిశ్వాసులతో ఎలా వ్యవహరించినది వివరించడం జరిగింది.

(2). ముస్లిముల పట్ల ద్వేషం, వైరం లేని అవిశ్వాసులు. ముస్లిములకు ఎలాంటి హానీ తలపెట్టనివారు. ఇలాంటి వారి గౌరవమర్యాదలతో వ్యవహరించాలని, న్యాయంగా వ్యవహరించాలని, వారి పట్ల కారుణ్యంతో మెలగాలని చెప్పడం జరిగింది.

1. ఇస్లామ్ స్వీకరిస్తున్న మహిళలకు సంబంధించి, తన కుటుంబాన్ని, తన భర్తను వదిలి ఇస్లామ్ స్వీకరించడానికి వచ్చిన మహిళను ఆహ్వానించాలని, కాని ఆమెను పరీక్షించాలని చెప్పడం జరిగింది. ఆమెకు వివాహమై ఉంటే, ఆమె భర్తతో ఆమె వివాహసంబంధం ఇస్లామ్‌లోకి వచ్చిన తర్వాత తెగిపోతుంది. ఆమె ఒక ముస్లింతో పునర్వివాహం చేసుకునే హక్కు కలిగి ఉంటుంది. ఆమె మాజీ భర్త ఆమె కోసం

చేసిన ఖర్చులను అతనికి తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఆమె క్రింది ప్రమాణం చేయవలసి ఉంటుంది:

(1). అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే పని చేయనని.
(2). దొంగతనం చేయనని
(3). అక్రమసంబంధాలకు పాల్పడననీ
(4). తన సంతానాన్ని హతమార్చనని
(5). అపనిందలు వ్యాపింపచేయననీ
(6). ప్రవక్త(సఅసం)కు విధేయత చూపుతానని.

**ముఖ్యాంశాలు**

**మైత్రి :**

అల్లాహ్‌తో వైరం వహించినవారు స్నేహానికి అర్హులు కారు. మీ ధర్మాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్న అవిశ్వాసులతో సామాజిక సంబంధాలు సాధ్యం కావు.

**సంబంధాలు :**

సత్యాన్ని కప్పిపుచ్చితే, చెడులకు పాల్పడితే మీ స్నేహితులు, కుటుంబసభ్యులు, బంధువులు ఎవరూ కూడా తీర్పుదినం రోజున మీకు సహాయం చేయలేరు. వారు మిమ్మల్ని బాధాకరమైన శిక్ష నుంచి కాపాడలేరు. మంచిపనులు చేయడం, అల్లాహ్‌కు భయపడడం ద్వారానే పరలోకంలో ప్రయోజనం పొందగలం.

**న్యాయం :**

ప్రజలతో న్యాయంగా వ్యవహరించాలి. న్యాయంగా వ్యవహరించేవారిని అల్లాహ్ ఇష్టపడతాడు.

**సహాయం :**

ఇస్లామ్ స్వీకరించిన మహిళలకు సహాయం అందించాలి. వారి బాగోగులు చూడాలి. అలాంటి స్త్రీలను వివాహమాడడం ద్వారా వారికి మద్దతు ఇవ్వాలి.



**61 వ అధ్యాయం**

# అస్ సఫ్

# సైనిక శ్రేణి

**పరిచయం**

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 14 ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ మార్గంలో త్యాగనిరతి, ధనప్రాణాలతో త్యాగానికి సిద్ధపడడం, క్రమశిక్షణ, సమైక్యత, యుద్ధరంగంలో ధైర్యసాహసాల గురించి ఈ సూరా ప్రధానంగా ప్రస్తావించింది. ఇందులోని 4వ ఆయతులో వచ్చిన సైనికశ్రేణి అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ మార్గంలో పోరాడాలని, చెక్కుచెదరని పంక్తులుగా, దృఢసంకల్పంతో నిలబడి పోరాడాలని, తమ విశ్వాసాన్ని ఆచరణలో చూపించాలని బోధించింది. ప్రవక్త మూసా(అస), ఈసా(అస)ల కథలను ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఊరట ఇవ్వడానికి ప్రస్తావించడం జరిగింది. మూసా(అస) జాతి ప్రజలు, అంటే ఇస్రాయీల్ సంతతి ప్రజలు ఆయనకు బాధ కలిగేలా, ఆగ్రహం కలిగేలా వ్యవహరించారు. వారికి ఆయన దేవుని సందేశహరుడని తెలిసినా కూడా అలా వ్యవహరించారు. ఈసా(అస)కు కూడా ఇస్రాయీల్ సంతతి ప్రజలు బాధ కలిగించారు. ఆయన దైవప్రవక్త అన్న విషయం కూడా వారికి తెలుసు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దేవుడు పంపించిన దైవప్రవక్త, అల్లాహ్ ఆయనకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి యావత్తు మానవాళి కొరకు పంపించాడని ఈ సూరా నొక్కి చెప్పింది. అవిశ్వాసులకు ఇష్టం లేకపోయినా గాని అల్లాహ్ తన ధర్మాన్ని పరిపూర్ణం చేస్తాడనీ, వ్యాపింపచేస్తాడని చెప్పడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**సమైక్యత :**

అల్లాహ్ కోసం ఒక సమైక్యమైన సైన్యంగా పోరాడాలి. యుద్ధరంగంలోను సామూహిక నమాజులను కొనసాగించాలి.

**అబద్ధాలు :**

అల్లాహ్ విషయంలో అబద్ధాలను కల్పించరాదు.

**అంకితం కావడం :**

అల్లాహ్ ధర్మానికి సహాయపడేవారికి, అల్లాహ్‌కు అంకితమైన వారికి అల్లాహ్ సహాయపడుతాడు.

**మాటలు కాదు చేతలు :**

మన ధార్మికవిశ్వాసాన్ని మంచిపనుల ద్వారా మన ఆచరణల ద్వారా ప్రదర్శించాలి.

## 62 వ అధ్యాయం

# అల్ జుముఅహ్

# శుక్రవారం

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 11 ఆయతులు ఉన్నాయి. శుక్రవారం నాటి సామూహిక ప్రార్థనలను, వాటి వల్ల ఒనగూడే ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక ప్రయోజనాలను ఇందులో తెలియజేయడం జరిగింది. తొమ్మిదవ ఆయత్‌లో వచ్చిన శుక్రవారం అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ సమస్త మానవాళి కొరకు దైవప్రవక్తగా ముహమ్మద్(సఅసం)ను పంపించాడని, మానవాళికి దివ్యఖుర్ఆన్ బోధించడానికి, వివేకవివేచనాలు నేర్పడానికి, అల్లాహ్‌కు భాగస్వాములు కల్పించే చెడు నుంచి వారిని ప్రక్షాళనం చేయడానికి ఆయన్ను పంపించాడని ఈ సూరా తెలియజేసింది. ఇస్లామ్ అల్లాహ్ తరపున మానవాళికి లభించిన దైవానుగ్రహం. ముస్లిములు దివ్యఖుర్ఆన్ బోధనలకు దృఢంగా కట్టుబడాలని ఈ సూరా బోధించింది. యూదుల మాదిరిగా, దివ్య సందేశాన్ని పొంది కూడా దాన్ని విడిచిపెట్టి, సత్యానికి విముఖులయ్యే వైఖరి చూప రాదని చెప్పడం జరిగింది. శుక్రవారం నాటి సాముదాయిక ఆరాధనకు సంబంధించిన నియమాలను ఈ సూరా తెలియజేసింది. ఉమ్మడిగా, బహిరంగంగా అందరూ



సమైక్యంగా చేసే ఈ ఆరాధన ముస్లిముల సమైక్యతకు చిహ్నం. నమాజు సమయం కాగానే :

1. చేస్తున్న పనిని వదిలేసి శుక్రవారం నమాజుకై ఇవ్వబడిన పిలుపునకు జవాబు ఇవ్వాలి.
2. నమాజు పూర్తికాగానే అక్కడి నుంచి తిరిగి తమ తమ పనులకు వెళ్ళిపోవాలి.
3. అల్లాహ్‌ను తరచూ స్మరిస్తూ ఉండడం ద్వారా విజయాలు సాధించాలి.

## ముఖ్యాంశాలు

**ప్రాపంచిక ప్రయోజనాలు :**

అల్లాహ్‌ను స్మరించడం, సాముదాయిక ప్రార్థనలో పాల్గొనడం అన్నవి ప్రాపంచిక ప్రయోజనాల కన్నా, వ్యాపార కార్యకలాపాల కన్నా చాలా ముఖ్యమైనవి. రోజువారి కార్యకలాపాల కారణంగా శుక్రవారం నమాజుకు దూరం కారాదు.

**మృత్యువు :**

మృత్యువు ప్రతి ఒక్కరికి తప్పదు. అందువల్ల పరలోకం కోసం ప్రతిఒక్కరూ ఏర్పాట్లు చేసుకోవాలి.

**సందేశం :**

సత్యానికి, దివ్యఖుర్ఆన్‌లోని దైవికమైన సందేశానికి దృఢంగా కట్టుబడాలి. మన హృదయాలు సత్యానికి దూరం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

63 వ అధ్యాయం

# అల్ మునాఫిఖూన్

# కపట విశ్వాసులు

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 11 ఆయతులు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా కపటవిశ్వాసుల గురించి చెప్పడం జరిగింది. మొదటి ఆయత్‌లో కపటవిశ్వాసుల గురించి వచ్చిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. సమాజంలో కపటవిశ్వాసుల వల్ల తలెత్తే ప్రమాదాలను, వారి దుర్మార్గాన్ని ఈ సూరా వివరించింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పట్ల వారి చెడుప్రవర్తన, అమర్యాద కరమైన వైఖరులను ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. కపట విశ్వాసులు అబద్ధపు ప్రమాణాలు చేస్తారనీ, తమ దుర్మార్గాన్ని, తమ ఉద్దేశ్యాలను దాచడానికి తీయతీయని మాటలు చెబుతారనీ, తమకు అవకాశం దొరకగానే విశ్వాసులకు హాని కలిగించ డానికి, వారిని పారద్రోలడానికి చూస్తున్నారనీ తెలియజేసింది. వారి ఆకారం, రూపురేఖలు హుందాగా ఉన్నా, వారు ప్రవక్త (సఅసం) చెప్పే మాటలను శ్రద్ధగా వింటున్నట్లు కనిపించినా, ప్రవక్త (సఅసం) చెప్పే విషయాలను సమ్మతించినా అదంతా కేవలం మోసమేనని చెప్పడం జరిగింది. వారు తమ వైఖరిని విడిచిపెట్టారనీ, విశ్వాసులు దానధర్మాలు చేయకుండా, ఇతరులకు సహాయపడకుండా నిరోధి స్తుంటారనీ, మదీనాకు వలస వచ్చిన ముస్లిములను పారద్రోలడానికి ప్రయత్ని స్తున్నారనీ, వారు నమ్మదగ్గవారు కాదనీ, అహంభావులనీ, అబద్ధాలు చెబుతారనీ, వారి ఆత్మసాక్షి ఎల్లప్పుడు వారిని నిలదీస్తుంటుందనీ ఈ సూరా తెలిపింది. వారి కుట్రలకు బలి కారాదని హెచ్చరించింది. ముస్లిములు కూడా తమ విషయంలో ఈ వైఖరి చోటుచేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పింది. ముస్లిములు దానధర్మాలకు ఖర్చు చేయాలని, తమ వ్యాపారాలు, కుటుంబం వంటి కారణాలు అల్లాహ్ స్మరణను, అల్లాహ్ దాస్యాన్ని నివారించే పరిస్థితి తెచ్చుకోరాదని, కపట విశ్వాసుల మాదిరిగా విశ్వాసాన్ని దెబ్బతీసే పరిస్థితి తెచ్చుకోరాదని ప్రబోధిస్తూ,



కపట విశ్వాసులు ప్రాపంచిక ప్రయోజనాల మాయలో మునిగిపోయారని, అల్లాహ్ స్మరణ పట్ల నిర్లక్ష్యానికి గురయ్యారని వ్యాఖ్యానించింది.

## ముఖ్యాంశాలు

**కపట విశ్వాసం :**

బహిరంగ శత్రువుల కన్నా కపట విశ్వాసులు చాలా ప్రమాదకరమైనవారు. కాబట్టి వారికి దూరంగా ఉండాలి.

**దానధర్మాలు :**

అల్లాహ్ ప్రసన్నతను పొందడానికి దానధర్మాలు చేయాలి..

**అంకితం కావడం :**

ప్రాపంచిక ప్రయోజనాలు మనలను సత్యానికి, అల్లాహ్ స్మరణకు దూరం చేయరాదు.

64 వ అధ్యాయం

# అత్ తగాబున్

# లాభ నష్టాలు

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 18 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, ప్రళయం, తీర్పుదినం ముఖ్యంగా ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ సూరా 9వ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన లాభ నష్టాలు అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది.

అల్లాహ్ మానవులను సృష్టించి వారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. సత్యాన్ని స్వీకరించడం లేదా తిరస్కరించడం వారి యిష్టాయిష్టాలకు వదిలివేసాడు. కొందరు దైవభీతిని అనుసరించారు. సత్యాన్ని స్వీకరించారు. అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉన్నారు. కాగా ఇతరులు సత్యాన్ని తిరస్కరించారు. అల్లాహ్ పట్ల కృతఘ్నులైపోయారు.

మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరుగుతుందనీ, మానవులను సృష్టించి వారికి నిర్దిష్టమైన ఆకారం ఇచ్చిన అల్లాహ్‌కు, భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్‌కు, మనం దాచిన విషయాలు, మనం ప్రకటించే విషయాలు అన్నీ తెలిసిన అల్లాహ్‌కు మరణించిన వారిని మళ్ళీ లేపడం తేలికనీ ఈ సూరా విస్పష్టంగా తెలిపింది. అల్లాహ్‌కు భయపడాలని, ఆయనకు విధేయత చూపాలని, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు విధేయత చూపాలని, మంచి పనులు చేయాలని, దాన ధర్మాలకు ఖర్చు చేయాలని ఈ సూరా ప్రబోధించింది. ప్రాపంచిక సంపద, సంతానం మనిషికి పరీక్షలనీ, ప్రలోభాలని తెలుపుతూ, కుటుంబం, వ్యాపారాలు అల్లాహ్ స్మరణను మరిచిపోయే స్థాయిలో అనుబంధాలు పెంచుకోరాదని హెచ్చ రించింది. ఆ విధంగా వారు తమ విశ్వాసానికి, తమ విలువలకు ద్రోహం చేసిన వారవుతారని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా గతకాలాలకు చెందిన ప్రజలు, సత్యాన్ని తిరస్క రించిన వారు ఎలాంటి వినాశానికి గురయ్యారో, ఎలాంటి శిక్ష వారిని చుట్టుముట్టిందో గుర్తు చేయడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**నమ్మకం :**

అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి. ఎందుకంటే ఆయన తప్ప మరోదేవుడు లేడు.

**దారితప్పడం :**

ప్రాపంచిక సంపద, సంతానాలు మనిషిని విశ్వాసానికి దూరం చేయరాదు. అల్లాహ్ స్మరణకు, అల్లాహ్ ప్రీతిని పొందే పనులకు అడ్డుకారాదు. .

**వ్యయం :**

దానధర్మాలకు ఖర్చు చేయాలి. అల్లాహ్‌కు అంకితమైతే మన సిరిసంపదలు అనేక రెట్లు పెరుగుతాయి, అల్లాహ్ క్షమాభిక్ష పొందడానికి అర్హులుగా చేస్తాయి. స్వర్గవనాలు పొందే వీలు కల్పిస్తాయి.

**మరలడం :**

చివరికి అందరూ అల్లాహ్ వైపునకే మరలి పోవలసి ఉంది. తీర్పు దినాన మానవులు అందరూ విశ్వప్రభువైన అల్లాహ్ ముందు హాజరవుతారు.



**65 వ అధ్యాయం**

# అత్ తలాఖ్

# విడాకులు

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 12 ఆయతులు ఉన్నాయి. ఇది ముఖ్యంగా విడాకుల గురించి ప్రస్తావించిన అధ్యాయం. మొదటి ఆయత్‌లో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా కుటుంబ బంధాల ప్రాముఖ్యాన్ని చాటి చెప్పింది. వివాహ మర్యాదను కాపాడాలని, తొందరపడి విడాకుల నిర్ణయానికి రాకూడదని బోధిస్తూ, ఆ విధంగా హక్కులకు భంగం కలిగే పరిస్థితిని నివారించింది. లైంగిక సంబంధాల నియమ నిబంధనలను, కుటుంబ జీవనం, సాంఘిక జీవనాలకు సంబంధించిన నియమ నిబంధనలను ఈ సూరా నిర్దేశించింది. ఇస్లామ్ అనుమతించిన వాటన్నింటిలోను అల్లాహ్‌కు అత్యంత అయిష్టమైన చర్య విడాకులు. కాని అందుకు అనుమతి ఇవ్వబడింది. గృహ సంబంధమైన ఇలాంటి వ్యవహారాల్లో దేవునిపట్ల భక్తితో, దేవుని పట్ల భయంతో వ్యవహరించాలని, తమ నిర్ణయాన్ని ఒకటికి రెండుసార్లు పునరాలోచించుకోవాలని విశ్వాసులను ఈ విషయమై హెచ్చరించడం జరిగింది. భార్యకు విడాకులిచ్చే హక్కు భర్తకు ఉంది. కాని విడాకులన్నవి సరియైన పద్ధతిలో, సరియైన సమయంలో ఇస్లామీయ చట్టం ప్రకారం జరగాలి. ఎలా అంటే :

1. భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు విడాకులు ఇవ్వరాదు.
2. నిర్దిష్ట సమయం గడిచేవరకు ఆమెను ఇంటినుంచి బలవంతంగా బయటకు పంపరాదు. నిర్దిష్ట సమయం (ఇద్దత్) మూడువిధాలుగా ఉంటుంది:
   (1). యవ్వనంలో ఉన్న భార్య అయితే మూడు రుతుకాలాల సమయం.
   (2). రుతుస్రావం ఆగిపోయిన మహిళకయితే మూడు నెలల సమయం.
   (3). గర్భవతి అయితే ప్రసవం జరిగే వరకు.
3. ఈ నిర్దిష్ట కాలంలోనూ, గర్భంతో ఉన్న కాలంలోను భర్త తన భార్యపోషణకు ఖర్చు చేయాలి.

4. శిశువు జన్మించిన తర్వాత భర్త తాను విడాకులిచ్చిన భార్య కొరకు వేరుగా నివాస వసతి ఏర్పాటు చేయాలి.

5. విడాకులిచ్చిన భార్య శిశువుకు పాలుపట్టడానికి అంగీకరిస్తే, అందుకు భర్త తగిన పారితోషికం చెల్లించాలి.

6. పాలుపట్టే విషయంలో వారిద్దరి మధ్య ఎలాంటి అంగీకారం కుదరనట్లయితే, వేరే మహిళతో పాలుపట్టించే ఏర్పాటు చేయాలి.

ఈ సందర్భంగా ఈ సూరాలో గతకాలాలకు చెందిన జాతుల గురించి, అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్తల ఆదేశాలను పెడచెవిన పెట్టిన జాతులకు పట్టిన దుర్గతి గురించి తెలుపుతూ హెచ్చరించడం జరిగింది. విశ్వాసులకు ఈ కథలు పాఠాన్ని గరపుతాయి. అల్లాహ్ ఆదేశాలను, చట్టాలను పాటించాలనీ, మంచిపనులు చేయాలని, న్యాయంగా నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా విడాకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని బోధిస్తున్నాయి. ఈ సందర్భంగా అల్లాహ్ శక్తిసామర్థ్యాలను వివరించడం జరిగింది. ఆయన సప్తాకాశాలను, భూమిని సృష్టించినవాడు. ఆయనకు అన్నింటిపై ఆధిపత్యం ఉందని దీని వల్ల తెలుస్తోంది. అన్ని విషయాలకు సంబంధించిన జ్ఞానం ఆయనకు ఉందని స్పష్టమవుతోంది.

### ముఖ్యాంశాలు

**వివాహం :**

పరస్పర గౌరవాదరాలతో, సదాచరణలతో వైవాహిక బంధం మర్యాదను, పవిత్రతను కాపాడాలి.

**దైవభీతి :**

అల్లాహ్ ఆదేశాలను శిరసావహించి, ఆయన్నే నమ్ముకుంటే మీ దుఃఖాలను ఆయనే తీరుస్తాడు. కష్టాల్లో మీకు సహాయం లభిస్తుంది.

**పరస్పర గౌరవాదరాలు :**

విడాకులైన భార్యాభర్తలు పరస్పర గౌరవాదరాలతో, సహాయసహకారాలతో వ్యవహరించాలి.



**66 వ అధ్యాయం**

# అత్ తహ్రీమ్

# నిషేధం

### పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 12 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ప్రవక్త ముహమ్మద్(సఅసం) కుటుంబ జీవనం గురించి, ఆయన భార్యల వివాదాల గురించి తెలియజేసింది. ఈ సమస్యలకు సూచించబడిన పరిష్కారాన్ని విశ్వాసులు ఒక పాఠంగా, సంతోషకరమైన కుటుంబ జీవనానికి ఆదర్శంగా స్వీకరించాలని చెప్పడం జరిగింది. ఈ సూరా మొదటి ఆయత్‌లో వచ్చిన పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరాలో రెండు ముఖ్యమైన విషయాలను ప్రస్తావించడం జరిగింది. మొదటి విషయం, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన భార్యలను దూరంగా ఉంచారు. అందుకు కారణం వారిలో కొందరు ఈర్ష్యా అసూయలకు గురికావడం వల్ల ఆయన అలా చేయవలసి వచ్చింది.

రెండవ విషయం ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన భార్యలలో ఒకరికి ఒక రహస్యాన్ని తెలియజేసారు. ఆమె ఆ విషయాన్ని మరో భార్యకు చెప్పారు. ఈ విషయం తెలిసి ప్రవక్త (సఅసం) చాలా నిరాశకు గురయ్యారు. ఈ ప్రవర్తన విశ్వాసఘాతుకంగా భావించారు. ఆయన ఎంతగా వేదనకు గురయ్యారంటే వారికి విడాకులు ఇస్తానని హెచ్చరించారు కూడా. ఈ సూరాలో ప్రవక్త(సఅసం) భార్యలను ఉద్దేశించి, వారి వివాదాల విషయమై కఠినంగా హెచ్చరికలు చేయబడ్డాయి.

ఈ సూరాలో భార్యలకు సంబంధించి రెండు విభిన్నమైన ఉదాహరణలను ఇవ్వడం జరిగింది. లూత్(అస), నూహ్(అస) వంటి విశ్వాసులను పెళ్ళాడిన అవిశ్వాస భార్యలకు సంబంధించినది మొదటి ఉదాహరణ. రెండవ ఉదాహరణలో అవిశ్వాసిని పెళ్ళాడిన విశ్వాసి అయిన భార్య గురించి చెప్పడం జరిగింది. ఇందులో ఫిర్ఔన్ భార్య గురించి తెలియజేయడం జరిగింది. అలాగే అవివాహిత కన్య అయిన మర్యం గురించి కూడా ప్రస్తావించబడింది. ఈ ఉదాహరణల ద్వారా తెలుసుకోవలసిన పాఠాలు ఏమంటే, తీర్పుదినాన కుటుంబ సంబంధాలు ఏ విధంగాను ఉపయోగపడవు. ఆ రోజున ఉపయోగపడేది మంచిపనులే. భార్య అయినా, భర్త అయినా

ఎవరు చేసుకున్న మంచిపనులు వారికే ఉపయోగపడతాయి. బాధాకరమైన శిక్ష నుంచి మనిషిని కాపాడేది సదాచరణ మాత్రమే.

**ముఖ్యాంశాలు**

**రహస్యం :**

ఏదైనా వ్యక్తిగత విషయాన్ని మీకు చెప్పడం జరిగితే, ఆ విషయాన్ని ఇతరులకు చెప్పరాదు. మీపై ఉంచిన నమ్మకాన్ని భంగపరచరాదు.

**పశ్చాత్తాపం :**

మీ తప్పులకు గాను అల్లాహ్‌తో నిజాయితీగా పశ్చాత్తాపం ప్రకటించాలి.

**ఏర్పాట్లు :**

సన్మార్గాన నడవాలి. శాశ్వత స్వర్గవనాలు పొందడానికి, బాధాకరమైన శిక్ష నుంచి తప్పించుకోవడానికి పరలోకం కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

**అవగాహన :**

భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన తప్పనిసరిగా ఏర్పడాలి. వారి మధ్య వివాదాలు తొలగిపోవాలి.

## 67 వ అధ్యాయం

# అల్ ముల్క్

# రాజ్యాధికారం

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 30 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, దేవుని రాజ్యాధికారం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినాల గురించి ఈ సూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన రాజ్యాధికారం అన్న పదాన్నే



ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ ఆకాశాలకు, భూమికి ప్రభువు. ప్రకృతిలోను, విశ్వంలోను ఉన్న క్రమబద్ధత ఈ వాస్తవాన్ని నిరూపిస్తుందని ఈ సూరా వివరించింది. సమస్తాన్ని అల్లాహ్‌యే నియంత్రిస్తున్నాడని తెలియజేసింది. ఆయనకు అన్నింటిపై అధికారం ఉంది. ఆయన జీవితాన్ని, మృత్యువును సృష్టించాడు. ఆయన అపార కృపాశీలుడు, విశ్వ సామ్రాజ్యాధిపత్యం కలిగినవాడు, అన్నీ తెలిసిన వాడు, పోషకుడు, ఆయన ఒక్కడే, తీర్పుదినం గురించిన జ్ఞానం ఆయనకు మాత్రమే ఉంది.

గతకాలాలకు చెందిన జాతులకు పట్టిన దుర్గతి గురించి ఈ సూరాలో తెలియజేయడం జరిగింది. ఆయా జాతులు తమ ప్రవక్తల పట్ల అవిశ్వాసాన్ని చూపాయి, వారిని ఎగతాళి చేసాయి, తిరస్కరించాయి. చివరకు అవమానకరమైన శిక్షను చవిచూసాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మానవాళికి హెచ్చరిక చేసేవారు మాత్రమేనని ఈ సూరా స్పష్టం చేసింది. ఈ సూరాలో దేవుని శక్తిసామర్థ్యాల గురించిన వివరాలు అందజేయడం జరిగింది. ఆయన ఏడు ఆకాశాలను ఖచ్చితమైన సమతుల్యంతో తయారు చేసాడు. భూమికి దగ్గరగా ఉన్న ఆకాశాన్ని ఆయన నక్షత్రాలతో అలంకరించాడు. ఆయన భూమిని నివాసయోగ్యంగా చేసాడు. ఆయన ప్రజలకు హెచ్చరికగా తీవ్రమైన తుఫానులు పంపగలడు. ఈ సూరాలో విశ్వాసులకు, అవిశ్వాసులకు లభించే బహుమానం, శిక్షల గురించిన దృశ్యాలను కూడా వర్ణించడం జరిగింది. అవిశ్వాసుల కొరకు నరకశిక్ష సిద్ధం చేయబడింది. తమ ప్రభువుకు భయపడుతూ బ్రతికిన వారికి క్షమాభిక్ష, బహుమానాలు సిద్ధంగా ఉన్నాయి.

**ముఖ్యాంశాలు**

**సదాచరణలు :**

సదాచరణలను సాధ్యమైనంతగా చేయడానికే మనిషిని సృష్టించడం జరిగింది. విశ్వప్రభువుకు, దాసులైన మనుష్యులకు మధ్య సంబంధానికి తగినరీతిలో సదాచరణలు ఉండాలి.

**పాఠాలు :**

గతకాలాలకు చెందిన జాతులు, తమ ప్రవక్తలను తిరస్కరించిన, వ్యతిరేకించిన జాతులకు పట్టిన దుర్గతి నుంచి గుణపాఠాలు గ్రహించాలి.

**విశ్వాసం :**

అల్లాహ్ శక్తి సామర్థ్యాల పట్ల, ఆయన మరణించిన వారిని మళ్ళీ లేపి నిలబెడతాడన్న వాస్తవం పట్ల దృఢమైన నమ్మకం కలిగి ఉండాలి.

## 68 వ అధ్యాయం

# అల్ ఖలమ్

# కలం

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 52 ఆయతులు ఉన్నాయి. ప్రవక్తల పరంపర, రుజుమార్గం పొందినవారికి, మార్గభ్రష్టులైన వారికి మధ్య వ్యత్యాసం, తీర్పుదినాల గురించి ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరా పేరు మొదటి ఆయత్‌లో వచ్చింది. ఈ సూరాలో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఉత్తమ గుణగణాల గురించి, అత్యున్నత నైతికప్రమాణాల గురించి స్పష్టమైన పదాలతో తెలియజేయడం జరిగింది. అవిశ్వాసులు చేస్తున్న అబద్ధపు ఆరోపణలకు – ఆయనకు పిచ్చిపట్టిందని, ఆయన చెప్పేవి అబద్ధాలనీ, దివ్యఖుర్ఆన్ ప్రాచీనకాలానికి చెందిన కథలనీ చెబుతున్న మాటలకు ఈ విధంగా తగిన జవాబు ఇవ్వడం జరిగింది.

అసత్యంపై సత్యం తప్పక విజయం సాధిస్తుందని ఈ సూరా నిర్ద్వంద్వంగా ప్రకటించింది. సత్యాన్ని తిరస్కరించేవారు ఏ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను మానసికంగా వేధించారో, ఏ విధంగా దౌర్జన్యాలకు పాల్పడ్డారో ఈ సూరాలో వివరిస్తూ, అవిశ్వాసులను అజ్ఞానులుగా, సత్యతిరస్కారులుగా, అపవాదులు వేస్తూ తిరిగేవారిగా, సత్యాన్ని అడ్డుకునేవారిగా, దౌర్జన్యపరులుగా అభివర్ణించింది.

విశ్వాసులను అభివర్ణిస్తూ, రుజుమార్గం పొందినవారిగా, జ్ఞానానికి మూలమైన కలం సూచించే వస్తువులన్నింటి అవగాహన వున్న వారిగా పేర్కొంది. ఈ సూరాలో తీర్పుదినం నాటి దృశ్యాన్ని అభివర్ణించడం జరిగింది. ఆ రోజున నైచ్యం, అవమానం



వారిని చుట్టుముడతాయి. వారి చూపులు క్రిందికి వాలిపోతాయి. దివ్యఖుర్ఆన్ మానవాళి అందరి కోసం దేవుని తరపున అవతరించిన సందేశమని ఈ సూరా స్పష్టంగా ప్రకటించింది.

## ముఖ్యాంశాలు

**నడవడి :**

ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఉత్తమ నడవడికను ఆదర్శంగా తీసుకోవాలి. ఉన్నతమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా మనిషి అలవాట్లు, వ్యవహారశైలి ఉండాలి.

**సహనం :**

కష్టాలకు, దుఃఖాలకు, బాధలకు, విమర్శలకు, అపవాదులకు కృంగిపోరాదు. దృఢచిత్తంతో నిలబడాలి. ప్రజలకు మార్గదర్శకత్వం ఇవ్వడానికి, పరలోకంలో బాధాకరమైన శిక్ష నుంచి వారిని తప్పించడానికి సత్యాన్ని వారికి బోధించడం కొనసాగించాలి.

**స్మరణ :**

అల్లాహ్‌ను అన్నివేళలా స్మరిస్తూ ఉండాలి. ఆయన కారుణ్యాన్ని, ఆయన బహుమానాలను పొందడానికి ఆయనతో క్షమాభిక్షను అర్థిస్తూ ఉండాలి.

**సందేశం :**

దివ్యఖుర్ఆన్ సమస్త మానవాళి కొరకు పంపబడిన దివ్యసందేశం. అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహం.

69 వ అధ్యాయం

## అల్ హాఖ్ఖహ్

# ఖచ్చితమైన వాస్తవం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 52 ఆయతులు ఉన్నాయి. తీర్పుదినం గురించి, దైవవాణి అవతరణ గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరా మొదటి ఆయతులో ఖచ్చితమైన వాస్తవం అన్న ప్రస్తావన ఆధారంగా ఈ పేరు పెట్టడం జరిగింది. తీర్పుదినం తప్పనిసరిగా వస్తుందని ఈ సూరా ఉద్ఘోధించింది. గతకాలాలకు చెందిన సత్యతిరస్కార జాతులు, ఆద్‌జాతి, సమూద్ జాతి, ఫిరౌన్ ప్రజలు వంటి సత్యాన్ని నిరాకరించిన జాతులు, తమ ప్రవక్తలను వ్యతిరేకించిన జాతులు ఎలాంటి దుర్గతికి గురయ్యాయో వివరించడం ద్వారా హితబోధను, గుణపాఠాన్ని అందిస్తోంది. సత్యాన్ని తిరస్కరించిన ఆ జాతులు దేవుని ఆగ్రహానికి గురయి నాశనమయ్యాయి.

తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఇందులో వర్ణించడం జరిగింది. ఆ రోజున శంఖం పూరించబడుతుంది. భూమి, పర్వతాలు నుగ్గునుగ్గుకావించబడతాయి. ఆకాశం తునాతునకలవుతుంది. దైవదూతలు ప్రత్యక్షమవుతారు. దేవుని సింహాసనాన్ని ఎనిమిది మంది దైవదూతలు మోస్తుంటారు. ప్రతివ్యక్తి కర్మల చిట్టా తెరువడం జరుగుతుంది. మంచిపనులు చేసిన పుణ్యాత్ములకు వారి కుడిచేతిలో వారి కర్మల చిట్టా ఇవ్వబడుతుంది. వారు ఆనందంగా శాశ్వత స్వర్గవనాల్లోకి ప్రవేశిస్తారు. కాగా సత్యతిరస్కారులకు వారి కర్మల చిట్టా ఎడమచేతిలో ఇవ్వబడుతుంది. వారు నరకనివాసులవుతారు.

ప్రవక్త ముహమ్మద్(సఅసం) కవి కాదని, ఆయన జోతిష్కుడు కూడా కాదని, దివ్యఖుర్‌ఆన్ స్వచ్ఛమైన సత్యమని, విశ్వప్రభువు మానవాళి కొరకు పంపిన సత్యమనీ, అల్లాహ్‌కు భయపడేవారికి ఇది స్మరణ గ్రంథమనీ ఈ సూరా విస్పష్టంగా ప్రకటించింది. విశ్వాసులు తమ ఆలోచనలలోను, మాటలలోను, ఆచరణల్లోను దేవుని ఔన్నత్యాన్ని ప్రస్తుతించాలని బోధించింది.



### ముఖ్యాంశాలు

**అన్యాయం :**

అన్యాయం, అణచివేతలు విపత్తులను కొనితెస్తాయి. సమూద్ జాతి ప్రజలకు ఏమయ్యిందో గుర్తుంచుకోవాలి.

**కృతఘ్నత :**

మనకు లభించిన సిరిసంపదలకు గాను అల్లాహ్‌కు కృతజ్ఞులై ఉండాలి. ఆద్ జాతి ప్రజలకు ఏమయ్యిందో గుర్తుంచుకోవాలి.

**అహంకారం :**

అల్లాహ్‌నే ఆరాధించాలి. ఆయనకే విధేయత చూపాలి. అహంభావానికి దూరంగా ఉండాలి. ఫిర్‌ఔన్‌కు ఏమయ్యిందో గుర్తుంచుకోవాలి.

**సంపద :**

ప్రాపంచిక జీవితంలోని అనిశ్చితాలు – కుటుంబం, సంపద, హోదా ఇవేవీ శాశ్వతం కావు. పరలోకంలో ఏవీ ఉపయోగపడవు.

**దివ్యఖుర్‌ఆన్ :**

దైవభీతి కలిగిన వారికి ఇది దేవుని సందేశం. ఈ సందేశాన్ని నిరాకరిస్తున్న వారికి ఇది ఒక హెచ్చరిక.

70 వ అధ్యాయం

## అల్ మఆరిజ్

# పైకి ఎక్కే మెట్లు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 44 ఆయతులు ఉన్నాయి. ప్రళయం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినాల గురించి ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరాకు పెట్టిన పేరు ఇందులోని 3వ ఆయతులో

వచ్చింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఈ సూరా అభివర్ణించింది. తుదితీర్పు జరుగుతుందనీ, లెక్కతీసుకునే రోజు భ్రమ ఎంతమాత్రం కాదనీ, సత్యతిరస్కారులను నాశనం చేసే సామర్థ్యం అల్లాహ్‌కు ఉందనీ, వారి కన్నా ఉత్తమమైన ప్రజలను వారి స్థానంలో తీసుకొచ్చే శక్తి అల్లాహ్‌కు ఉందని ఈ సూరా ప్రకటించింది. కాలానికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఈ సూరా తెలియజేసింది. తీర్పుదినం చాలా దూరంగా ఉన్నట్లు మనకు కనబడినా, అల్లాహ్ దృష్టిలో ఆ రోజు చాలా దగ్గరగా ఉంది.

ఈ సూరాలో మనిషి ప్రవృతి గురించిన వర్ణన కూడా ఉంది. మనిషి సహనం లేనివాడు, కష్టాలు వచ్చినప్పుడు బెంబేలు పడిపోతాడు. తన సంపదను దాచి పెట్టుకుంటాడు, దాని నుంచి ఇతరులకు సహాయం చేయడు. అయితే దైవభీతి కలిగిన వారు ఎల్లప్పుడు తమ నమాజులను ఆచరించడం పట్ల స్థిరంగా ఉంటారనీ, అవసరార్థులకు ఆర్థికంగా సహాయం చేస్తారని, తీర్పుదినాన్ని విశ్వసిస్తారని, అల్లాహ్ విధించే శిక్షకు భయపడుతూ ఉంటారనీ, తమ మర్మావయవాలను కాపాడుకుంటారనీ, (అంటే అక్రమ సంబంధాలకు దూరంగా ఉంటారు), తమకు అప్పగించిన అమానతులను (ఒకరిపై నమ్మకంతో భద్రపరచడానికి ఇచ్చినదేదయినా – వస్తువు కాని, సంపద కాని, మాట కాని ) వాటిని కాపాడుతారని, తమ వాగ్దానాలను నిలబెట్టుకుంటారని, తమ ప్రమాణంపై నిలబడుతారని, వారు శాశ్వత స్వర్గవనాలను గెలుచుకుంటారని చెప్పడం జరిగింది.

ఈ సూరా అవిశ్వాసులను విమర్శిస్తూ, వారి అనుమానాలు నిష్ప్రయోజనకరమైనవనీ, ఎందుకంటే మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది అనివార్యమనీ తెలిపింది. మరణించిన వారిని మళ్ళీ లేపే రోజున చనిపోయిన వారందరూ లేచి నిలబడుతారు. సత్యాన్ని తిరస్కరించినవారు, అవిశ్వాసులు తమ సమాధుల నుంచి పరుగు పరుగున కంగారు కంగారుగా వస్తారు. వారు పరాభవానికి, నైచ్యానికి గురయి ఉంటారు. వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి.

**ముఖ్యాంశాలు**

**సహనం :**

కష్టాలను, బాధలను సహనంతో భరించాలి.



**వ్యర్థ ప్రసంగాలు :**

వ్యర్థ ప్రసంగాలకు పాల్పడరాదు. కాలాన్ని వ్యర్థం చేస్తూ, ఊహోపఊహలు చేస్తూ, ఒక ఆటగా జీవితాన్ని గడుపరాదు. పరలోకం కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవడానికి శ్రద్ధగా మంచిపనులలో నిమగ్నం కావాలి.

**సచ్ఛీలం :**

లైంగిక విశృంఖలత్వానికి దూరంగా ఉండాలి. తమ జీవితభాగస్వామి పట్ల విశ్వాసంగా ఉండాలి.

**వాగ్దానం :**

వాగ్దానాలను నిలబెట్టుకోవాలి. నమ్మి అప్పగించిన వాటి పట్ల నిజాయితిగా ఉండాలి. మీరు సాక్ష్యం చెప్పేదయితే ఆ సాక్ష్యానికి కట్టుబడాలి.

## 71 వ అధ్యాయం

# నూహ్

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 28 ఆయతులు ఉన్నాయి. సత్యతిరస్కారులను నాశనం చేసే శక్తిసామర్థ్యాలు అల్లాహ్‌కు ఉన్నాయని ఈ సూరా హెచ్చరించింది. మొదటి ఆయత్‌లో నూహ్ అన్న ప్రస్తావన వచ్చింది. ఈ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ప్రవక్త నూహ్(అస) కథతో ప్రారంభమయ్యింది. ఆయన తన జాతి ప్రజలకు హెచ్చరిక చేయడానికి అల్లాహ్ తరఫున పంపబడ్డారు. బాధాకరమైన శిక్ష గురించి హెచ్చరించడానికి, అల్లాహ్ పట్ల భయభక్తులతో జీవితం గడపమని బోధించడానికి ఆయన వచ్చారు. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, ఆయనను మాత్రమే క్షమాభిక్ష అర్థించాలని ఆయన బోధించారు. నూహ్ (అస) తన ప్రయత్నాలలో అనుసరించిన పద్ధతుల గురించి ఆయన సంఘర్షణ గురించి ఇందులో వివరించడం జరిగింది. నూహ్

(అస) రాత్రింబవలు తన జాతి ప్రజలకు హితబోధ చేసారు. వారితో వ్యక్తిగతంగాను, సాముదాయికంగానూ మాట్లాడారు. అల్లాహ్‌ను విశ్వసించాలని, బహుదైవారాధన మానుకోవాలని బోధించారు. అల్లాహ్ క్షమాశీలం గురించి వారికి తెలియజేసారు. వారు నిజాయితిగా పశ్చాత్తాపపడితే లభించే అల్లాహ్ అనుగ్రహాల గురించి వారికి తెలిపారు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడాన్ని మానుకోవాలని వారికి బోధించారు. అల్లాహ్ శక్తిసామర్థ్యాల గురించి వారికి వివరించారు.

నూహ్(అస) ఎదుర్కొన్న వేధింపుల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ప్రజలు ఆయనకు దూరంగా పారిపోయారు. ఆయన చెప్పే మాటలు వినకుండా ఉండడానికి తమ చెవుల్లో వేళ్ళు పెట్టుకునేవారు. ఆయన కంట బడకుండా ఉండడానికి ముసుగులు వేసుకునేవారు. అధికారం, సంపద ఉన్న వారిని మాత్రమే వారు అనుసరించేవారు. నూహ్(అస)ను, ఆయన అనుచరులను వదిలించుకోవడానికి వారు కుట్రలు పన్నారు. వారు తమ దుర్మార్గాలను, అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే మహాపరాధాన్ని చేస్తూ పోయారు. వారి సత్యతిరస్కారానికి, వారి చెడులకు పర్యవసానంగా వారిని మహా వరదలో ముంచేయడం జరిగింది. పరలోకంలో వారు నరకంలో నెట్టబడుతారు.

## ముఖ్యాంశాలు

### తల్లిదండ్రులు & విశ్వాసులు :

తల్లిదండ్రులకు, విశ్వాసులందరికి దైవకారుణ్యం లభించాలని ప్రార్థించాలి. వారికి మంచి జరగాలని కోరుకోవాలి.

### నమ్మకం :

అసత్యాన్ని నమ్ముకోరాదు. ఇది నిష్ప్రయోజనకరమైనది, అవసరమైనప్పుడు దాని వల్ల ఎలాంటి సహాయం లభించదు.



**72 వ అధ్యాయం**

# అల్ జిన్న్

# జిన్నులు (అగోచర ప్రాణులు)

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 28 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర గురించి ఈ సూరా ముఖ్యంగా వివరించింది. మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన జిన్నులు అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దివ్యఖుర్ఆన్ ప్రాముఖ్యానికి జిన్నులు కూడా ప్రభావిత మయ్యాయని తెలియజేయడం ద్వారా ఖుర్ఆన్ ఔన్నత్యాన్ని విశదీకరించడం జరిగింది. జిన్నులు రెండు రకాలని, కొందరు మంచివారని, కొందరు చెడ్డవారని తెలిపింది. కొందరు జిన్నులు దైవవాణిని విన్న తర్వాత దానిని విశ్వసించారు. ఈ సూరా ఏకదైవారాధన ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పింది. అల్లాహ్‌కు భాగస్వాములను చేర్చడం మహాపరాధమనీ, దానికి దూరంగా ఉండాలని బోధించింది. అల్లాహ్‌కు కుమారులు ఎవరూ లేరని, ఆయనకు భాగస్వాములు కూడా లేరని, ఆయనకు అగోచరాలు (కంటికి కనబడనివి) అన్నీ తెలుసనీ, అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను తిరస్కరించిన వారు నరకాగ్నికి ఆహుతి అవుతారని హెచ్చరించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను అల్లాహ్ ఎన్నుకుని తన సందేశాన్ని మానవాళికి చేరవేయ డానికి పంపాడని, మానవులు ఆయనకు విధేయత చూపాలని, అల్లాహ్‌కు భాగ స్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదని బోధించింది.

## ముఖ్యాంశాలు

### విశ్వాసం :

అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త (సఅసం)ల మార్గదర్శకత్వాన్ని, సత్యాన్ని అవలంబించినవారు ఎన్నటికి భయానికి, నష్టానికి, అన్యాయానికి గురికారు. అల్లాహ్ ఎల్లప్పుడు వారి పక్షాన ఉంటాడు.

**విధేయత :**

అల్లాహ్‌కు విధేయత చూపి ప్రయోజనకరమైన జీవితాన్ని గడపాలి. శాశ్వత స్వర్గవనాలకు అర్హత పొందాలి. దుర్మార్గానికి పాల్పడితే చివరకు నరకానికి ఇంధనం కావలసి వస్తుంది.

**శరణు :**

కష్టాలు, బాధల్లో అల్లాహ్‌ను శరణు వేడుకోవాలి. మస్జిదులు కేవలం అల్లాహ్ ఆరాధనకే ప్రత్యేకించబడ్డాయి. అల్లాహ్‌తో పాటు మరొకరిని వేడుకోవడం లేదా అల్లాహ్‌ను వదిలి మరొకరికి మొరపెట్టుకోవడం విశ్వాసికి నిషిద్ధం.

**నైతిక ప్రమాణాలు :**

సత్యానికి సంబంధించిన విలువల కోసం నిలబడాలి. సత్యం అన్నది స్వతహాగానే దానికదే నిరూపితమయ్యే శక్తి కలిగి ఉంటుందన్నది నిజమే అయినా, ప్రజల్లో గుర్తింపు లభించదు.

## 73 వ అధ్యాయం

# అల్ ముజ్జమ్మిల్

# దుప్పటి కప్పుకున్నవాడు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 20 ఆయతులు ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గడిపిన ఆధ్యాత్మిక జీవితం గురించి ఈ సూరా ముఖ్యంగా వివరించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదబంధం మొదటి ఆయతులో వచ్చింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను దుప్పటికప్పుకున్న వాడు అని పిలువడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితం గురించి, ఆయన సహచరుల ఆధ్యాత్మిక జీవితం గురించి వారి దైవభీతి గురించి ఈ సూరా ప్రస్తావించింది. వారు రాత్రిలో మూడింట రెండువంతులు,



లేదా రాత్రిలో సగభాగం లేదా మూడింటా ఒక భాగం నమాజులో, దైవస్మరణలో, దివ్యఖుర్‌ఆన్ పారాయణంలో గడిపేవారు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి సహనంతో స్థిరంగా నిలబడాలని, జనం కల్పించే మాటలను పట్టించుకోరాదని, వారిని వారి మానాన వదిలెయ్యాలని బోధించడం జరిగింది.

విశ్వాసులు దివ్యఖుర్‌ఆన్‌ను వారు చదువగలిగినంత వరకు చదువుతూ ఉండాలని, నమాజు చేస్తూ ఉండాలని, దానధర్మాలు చేస్తూ ఉండాలని బోధించడం జరిగింది. ప్రవక్త (సఅసం) సాక్షిగా వ్యవహరిస్తారని, దివ్యఖుర్‌ఆన్ ఒక హితబోధ అని ఇందులో అభివర్ణించడం జరిగింది. తీర్పుదినాన భూమి, పర్వతాలు కుదిపి వేయబడతాయని, పర్వతాలు ఇసుక గుట్టల మాదిరిగా తునాతునకలైపోతాయని హెచ్చరించడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**భక్తి :**

విశ్వాసులకు రాత్రులలో నమాజు చేయడం ఆధ్యాత్మికంగా ఎంతయినా అవసరం.

**దివ్యఖుర్‌ఆన్ :**

దివ్యఖుర్‌ఆన్ చదువగలిగినంత మేరకు చదివి, దాని అర్థం గురించి ఆలోచించాలి.

## 74 వ అధ్యాయం

# అల్ ముద్దస్సిర్

# దుప్పటి కప్పుకున్నవాడు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 56 ఆయతులు ఉన్నాయి. ప్రవక్త (సఅసం) సందేశ ప్రచారోద్యమాన్ని, తీర్పుదినాన్ని, అవిశ్వాసులకు ఎదురయ్యే పర్యవసానాన్ని ఇందులో ముఖ్యంగా తెలుపడం జరిగింది. దుప్పటి కప్పుకున్నవాడు

అన్న వ్యక్తీకరణ మొదటి ఆయతులో ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించినది. ఈ సూరాకు ఇదే పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) సందేశ ప్రచారోద్యమం గురించి ఈ సూరా వివరించింది. సత్యసందేశాన్ని బోధించాలని, ప్రకటించాలని, ప్రజలను బహిరంగంగా ఈ విషయమై హెచ్చరించాలని ప్రవక్త (సఅసం)కు బోధించడం జరిగింది. సహనంతో స్థిరంగా నిలబడాలని ఆయనకు చెప్పడం జరిగింది.

దివ్యఖుర్ఆన్ ఒక హితబోధగా, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) మానవాళికి హెచ్చరిక చేసే సందేశహరునిగా ఈ సూరా అభివర్ణించింది. పరలోకంలో నరకాగ్ని గురించి, అక్కడి బాధాకరమైన శిక్ష గురించి వివరించడం జరిగింది. తీర్పుదినం చాలా కఠినమైనదిగా, చాలా ఘోరమైనదిగా తెలుపుతూ, ఆ రోజున శంఖం పూరించబడుతుందని, ఆకాశం తెరుచుకోబడుతుందనీ, ఆ రోజు అవిశ్వాసులకు చాలా కఠినంగా ఉంటుందనీ, తమ సంపద, సంతానాలు చూసుకుని విర్రవీగిన వారు, సుఖభోగాల జీవితాన్ని అనుభవించినవారు, తీర్పుదినాన్ని తిరస్కరించి, అల్లాహ్‌కు విముఖులైన వారికి ఆ రోజు చాలా నిరుత్సాహకరంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది. వారందరిని అగ్నిలోకి విసరివేయడం జరుగుతుందనీ తెలుపుతూ, ఈ భయంకరమైన రోజు రావడానికి ముందు వారు అల్లాహ్‌ను తిరస్కరించారనీ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం జరగదని విర్రవీగారనీ, నిరుపేదలకు అన్నం పెట్టలేదని, దుర్మార్గానికి కట్టుబడ్డారని వ్యాఖ్యానించింది.

**ముఖ్యాంశాలు**

**ప్రచారం:**

దైవసందేశాన్ని బహిరంగంగా అందరికీ ప్రచారం చేయాలి. పరలోకం గురించి అక్కడి బాధాకరమైన శిక్ష గురించి గుర్తు చేయాలి.

**అనుగ్రహాలు :**

వనరులు, సంపద, సంతానం, సౌకర్యవంతమైన జీవితం అన్నీ అల్లాహ్ ప్రసాదించినవే. ఆయనకే మనం కృతజ్ఞులమై ఉండాలి.



**సిఫారసు :**

తీర్పుదినాన మధ్యవర్తులెవరూ ఉండరు. అల్లాహ్ అనుమతించిన వారు తప్ప. అల్లాహ్ అనుమతి లేకుండా ఎవరూ సిఫారసు చేయలేరు. (ఈ సిఫారసులు సదాచరణలు చేసిన వారికి మాత్రమే లభిస్తాయి. నమాజులు చేయని వారి పక్షాన, దానధర్మాలు చేయని వారి పక్షాన అల్లాహ్‌తో సిఫారసు చేసే ధైర్యం ఎవరికీ ఉండదు.) దేవుని కారుణ్యం, మంచిపనులు మాత్రమే ఉపయోగపడతాయి. పరలోకంలో బాధాకరమైన శిక్ష నుంచి అవే మనలను కాపాడగలుగుతాయి.

**75 వ అధ్యాయం**

# అల్ ఖియామహ్

# ప్రళయం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 40 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ప్రళయం గురించి, ఆ రోజున మరణించిన వారు మళ్ళీ లేపబడడం గురించి, తీర్పుదినం గురించి, శిక్షాబహుమానాల గురించి బోధించింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది ఒక భ్రమ ఎంతమాత్రం కాదని, అనివార్యంగా చోటుచేసుకునే సంఘటన అనీ ఈ సూరా హెచ్చరించింది. ప్రళయం రోజు భయాందోళనలతో అందరూ కళ్ళు తేలవేస్తారు. చంద్రుడు కాంతివిహీనుడై పోతాడు. సూర్యచంద్రులు తమ కాంతిని కోల్పోతారు. తీర్పుదినాన ప్రతి ఒక్కరికి వారి కర్మల గురించి తెలియజేయడం జరుగుతుంది. ప్రతి ఒక్కరి నాలుక, కాళ్ళుచేతులు అవి చేసిన పనులకు సాక్ష్యం చెబుతాయి. మనిషిని ఒక వీర్యపు బిందువుతో పుట్టించిన అల్లాహ్ చనిపోయిన తర్వాత మళ్ళీ లేపి నిలబెట్టే శక్తిసామర్థ్యాలు ఉన్నవాడు.

**ముఖ్యాంశాలు**

**స్వేచ్ఛ:**

సృష్టి వెనుక హేతుబద్ధమైన, అర్థవంతమైన ఉద్దేశ్యం ఉంది. జీవితంలో

ఎలాంటి లక్ష్యం లేకుండా మనిషిని సృష్టించడం జరుగలేదు. కనుక మనిషి తన కర్మలకు తాను బాధ్యత వహించవలసి ఉంటుంది.

**మృత్యువు :**

మృత్యువు అన్నది శాశ్వతమైన జీవితానికి ప్రారంభం. ఆ పరలోక జీవితం ఆనందకరమైనది కావచ్చు, లేదా బాధాకరమైనది కావచ్చు. అది మన విశ్వాసం లేదా అవిశ్వాసాలపై, ప్రాపంచిక జీవితంలో మనం చేసిన పనులపై ఆధారపడి ఉంటుంది.

**ప్రాపంచిక జీవితం :**

ఈ ప్రాపంచిక జీవితం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి. పరలోకంలోని శాశ్వతమైన జీవితానికి ప్రతిఒక్కరూ ఏర్పాట్లు చేసుకోవాలి. మంచిపనులు చేయాలి.

## 76 వ అధ్యాయం

# అల్ ఇన్‌సాన్

# మానవుడు

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 31 ఆయతులు ఉన్నాయి. విశ్వసించి మంచిపనులు చేసిన వారికి లభించే సుఖసంతోషాల గురించి ఇందులో చెప్పడం జరిగింది. ఈ సూరాకు పెట్టబడిన పేరు మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. అల్లాహ్ మనలను సృష్టించి, మనకు రుజుమార్గాన్ని చూపించాడు. అల్లాహ్ పట్ల కృతజ్ఞతగా వ్యవహరించడం లేదా కృతఘ్నుత చూపడం అన్నది మన ఇష్టానికి వదిలేయడం జరిగింది. ఈ సూరాలో విశ్వసించి మంచిపనులు చేసేవారి గుణగణాలను వర్ణించడం జరిగింది. వారు తమ ఆధ్యాత్మిక, సామాజిక బాధ్యతలను నిర్వర్తిస్తారు. తీర్పుదినానికి భయపడుతారు. నిరుపేదలకు అనాథలకు



సహాయ పడుతారు. కాగా, సత్యతిరస్కారుల కోసం సంకెళ్ళు, గుదిబండలు, భగభగలాడే అగ్ని సిద్ధం చేయబడ్డాయి. పుణ్యాత్ములకు అల్లాహ్ అనుగ్రహాలు అపరిమితమైనవి. వారికి స్వర్గంలోని సెలయేటి నీరు కలిసిన మద్యపాత్రలు అందుబాటులో ఉంటాయి. వారు చక్కని పట్టు వస్త్రాలు ధరిస్తారు. వారు బంగారు జలతారు వస్త్రాలు ధరిస్తారు. వారికి సౌకర్యవంతమైన ఆసనాలు ఉంటాయి. అక్కడ తీవ్రమైన వేడిగాని, తీవ్రమైన చలి గాని ఉండవు. అక్కడ వారికి వివిధ రకాల ఫలాలు లభిస్తాయి. అవి వారికి అందుబాటులో క్రిందికి వేలాడుతూ ఉంటాయి. వెండిపాత్రలు, స్ఫటికంతో చేసిన గ్లాసులు వారి ముందు ఉంటాయి. వారక్కడ సొంటి కలిసిన మధు పాత్రలు అందుకుంటారు (ఆ మద్యం ఎలాంటి మత్తు కలిగించదు– ఖుర్ఆన్:47:15). వారి సేవ కోసం నిత్యబాలలు అటూఇటూ పరుగిడుతూ ఉంటారు.

## ముఖ్యాంశాలు

**సహాయం :**

అల్లాహ్ కోసం అవసరార్థులకు సహాయం చేయాలి. ప్రజల నుంచి ప్రతిఫలం పొందాలని ఎన్నడూ ఆశించరాదు.

**బహుమానం :**

ప్రపంచంలో మంచిపనులు చేసి పరలోకంలో అల్లాహ్ బహుమానాలు పొందాలి.

**ప్రాపంచిక జీవితం :**

తాత్కాలికమైన ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహం పెంచుకోరాదు.

**భక్తి :**

విశ్వప్రభువు పట్ల విధేయతతో ఆయన్ను ఆరాధించాలి. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఆయన ఔన్నత్యాన్ని కొనియాడాలి.

**77 వ అధ్యాయం**

# అల్ ముర్సలాత్

# ముందుకు పంపబడినవి

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 50 ఆయతులు ఉన్నాయి. ఈ సూరాలో ముఖ్యంగా ప్రళయం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినాల గురించి ప్రస్తావించడం జరిగింది. ఈ సూరాకు పెట్టబడిన పేరు మొదటి ఆయతులో వచ్చింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది తప్పనిసరిగా జరిగే సంఘటన అని ఈ సూరా నొక్కి చెప్పింది. ఆ రోజున నక్షత్రాలు మసకబారిపోతాయి. ఆకాశం తునా తునకలవుతుంది. పర్వతాలు దుమ్ముమాదిరిగా ఎగురుతాయి. ఆ రోజున ప్రవక్తలందరినీ పిలిచి వారు అల్లాహ్ సందేశాన్ని మానవాళికి అందించడం జరిగిందా లేదా అన్న విషయమై వాంగ్మూలం ఇవ్వమని కోరడం జరుగుతుంది.

ఈ సూరాలో అల్లాహ్ శక్తిసామర్థ్యాల ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. ఆ విధంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపడం ఆయనకు చాలా తేలికని నిరూపించడం జరిగింది. సత్యతిరస్కారుల వాదన అసత్యంగా రుజువవుతుందని చెప్పడం జరిగింది. తీర్పుదినాన్ని చాలా కఠినమైన రోజుగా, దుస్థితి దాపురించే రోజుగా అభివర్ణించడం జరిగింది. ఆ రోజున భారీ నిప్పురవ్వలు ఎగురుతుంటాయి. ఆ రోజున సత్యతిరస్కారులు మాట్లాడే స్థితిలో ఉండరు. వారికి ఎలాంటి సాకులు చెప్పే అనుమతి కూడా ఉండదు. దైవభీతి కలిగినవారు చల్లని నీడలో, సెలయేర్లతో, వివిధ రకాల ఫలాలతో సంతోషాన్ని పొందుతారు.

## ముఖ్యాంశాలు

**స్తుతించడం:** మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని, లెక్కల ఘడియను పూర్తిగా విశ్వసించాలి.

**మంచిపనులు:**

మంచిపనులు చేసినవారికి శాశ్వత స్వర్గవనాలు లభిస్తాయి. దుర్మార్గులకు శాశ్వత అగ్ని శిక్ష లభిస్తుంది.



**78 వ అధ్యాయం**

# అన్ నబా

# గొప్పవార్త

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 40 ఆయతులు ఉన్నాయి. ప్రళయాన్ని, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని, తీర్పుదినాన్ని, శిక్షా బహుమానాలను ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఈ సూరాలోని రెండవ ఆయతులో ప్రస్తావించబడిన గొప్పవార్త అన్న పేరునే దీనికి పెట్టడం జరిగింది.

అవిశ్వాసులు ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్న విషయమై ప్రవక్త ముహమ్మద్ (సఅసం)తో వాదించేవారు. వారు మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడాన్ని తిరస్కరించేవారు, ఎగతాళి చేసేవారు. ఈ సూరా అవిశ్వాసులకు వారు వినడానికి ఇష్టపడని గొప్పవార్తను తెలియజేసింది. ఆ వార్త... మనిషి చేసిన పనులకు బాధ్యత వహించవలసి ఉంటుంది, జవాబు చెప్పుకోవలసి ఉంటుందన్న వార్త. తీర్పుదినం తప్పనిసరిగా వస్తుందని ఈ సూరా నొక్కి చెప్పింది. సత్యతిరస్కారుల వాదనను తిప్పికొట్టడానికి ఈ సూరాలో అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ప్రకృతిలో కనిపించే దృష్టాంతాలను వివరించింది. అల్లాహ్ భూమిని పరచి మనిషికి నివాసయోగ్యంగా చేసాడు. భూమి తొణకకుండా దానిపై పర్వతాలను నిలబెట్టాడు. ఆయన మనలను జంటలుగా సృష్టించాడు. నిద్రను విశ్రాంతికోసం సృష్టించాడు. ఆయన మనపై ఏడు ఆకాశాలను నిలబెట్టాడు. ఆకాశంలో దీపంగా సూర్యుడిని ఉంచాడు. మేఘాల నుంచి వర్షాన్ని కురిపిస్తున్నాడు.

తీర్పుదినం స్వచ్ఛమైన సత్యం. మంచిచెడులను వేరు చేసే రోజు. ప్రతి ఒక్కరు తప్పక చవిచూడవలసిన రోజు. ఈ విషయాలు తెలుపుతూ నరకాగ్నిని వర్ణించడం కూడా జరిగింది. సత్యాన్ని తిరస్కరించిన వారికి, తీర్పుదినాన్ని కాదన్న వారికి నరకాగ్ని ఒక మాటు వంటిదని చెప్పడం జరిగింది. నరకంలో వారికి నల్లని, జుగుప్సాకరమైన, సలసలకాగే ద్రవం ఇవ్వబడుతుంది. అక్కడ చల్లని నీడ కాని, చల్లని పానీయం కాని దొరకదు. మరోవైపు స్వర్గవనాలను వర్ణిస్తూ మనోహరమైన

ఉద్యానవనంగా పేర్కొనడం జరిగింది. అక్కడి వారికి సమవయస్కులైన కన్యలు, ప్రశాంతత లభిస్తాయి.

**ముఖ్యాంశాలు**

**బహుమానం :**

ఈ జీవితంలో మనం చేసిన పనులను బట్టే పరలోకంలో మనకు బహుమానం లభిస్తుంది. మనం మన కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

**వేరుచేయడం :**

మంచిని చెడునుంచి వేరుచేసే రోజు తప్పక వస్తుంది. ఆ రోజు కోసం మనం సిద్ధంగా ఉండాలి. అల్లాహ్ అనుగ్రహాలు పొందడానికి ఏర్పాట్లు చేసుకోవాలి.

**దైవభీతి :**

అల్లాహ్‌పై విశ్వాసంతో, ఆయన పట్ల భీతిభావంతో మంచిపనులు చేయడం ద్వారా శాశ్వతమైన స్వర్గవనాలను పొందవచ్చు.

**79 వ అధ్యాయం**

## అన్ నాజిఆత్

# ఆత్మలను వెలికి లాగేవారు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 46 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షా బహుమానాల గురించి బోధించింది. ఈ సూరాలోని మొదటి ఆయతులో దైవదూతల గురించి ప్రస్తావన వచ్చింది. అవిశ్వాసులకు మృత్యువు సమీపించినప్పుడు అవిశ్వాసుల ప్రాణాలను గుంజి బాధాకరంగా బయటకు లాగుతారు. కాగా విశ్వాసుల ప్రాణాలను మృదువుగా బయటకు తీస్తారని ఇందులో చెప్పబడింది. ఈ ప్రస్తావన ఆధారంగానే



ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం అన్నది అనివార్యమనీ, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఈ సూరా నొక్కి చెప్పింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితుల గురించి ఈ సూరా వర్ణించింది. ఆ రోజున ప్రకంపనాల కుదుపులకు గుండెలు దడదడ లాడుతాయి. చూపులు క్రిందికి వాలిపోతాయి. ఈ సందర్భంగా ఫిర్ఔన్ కథను, ఫిర్ఔన్ అనుచరుల వినాశాన్ని గురించి తెలిపి హెచ్చరిక చేయడం జరిగింది. అల్లాహ్‌కు గల ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యం గురించి వివరించడం జరిగింది. అల్లాహ్ మనపైన ఆకాశాలను నిర్మించాడు. ఆయన భూమిని సృష్టించి దానిలో నీరు, ఆహారాలు కల్పించాడు. ఆయన పర్వతాలను సృష్టించాడు అని వివరిస్తూ విశ్వాసులకు లభించే శాశ్వత స్వర్గవనాల గురించి, అవిశ్వాసులకు లభించే అగ్ని శిక్ష గురించి తెలిపింది.

**ముఖ్యాంశాలు**

**వ్యామోహం :**

మున్నాళ్ళ ముచ్చట వంటి ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహం పెంచుకో రాదు. శాశ్వత స్వర్గవనాలు పొందడానికి అల్లాహ్‌ను స్మరిస్తూ, పరలోకానికి ఏర్పాట్లు చేసుకోవాలి.

**అహంభావం :**

అహంభావం చెడులకు, తీర్పుదినాన్ని తిరస్కరించడానికి దారితీస్తుంది. చివరకు ఈ జీవితంలోను, పరలోకంలోను అల్లాహ్ శిక్షకు పాత్రులయ్యేలా చేస్తుంది.

**80 వ అధ్యాయం**

## అబస

# నుదురు చిట్లించాడు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 42 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా మర్యాదల గురించి, ప్రళయం గురించి, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి, తీర్పుదినం గురించి ముఖ్యంగా బోధించింది. మొదటి

ఆయతులో వచ్చిన నుదురు చిట్లించాడు అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దివ్యఖుర్‌ఆన్ జ్ఞానం పొందడానికి ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన ఒక నిరుపేద గుడ్డి వాని కథతో ఈ సూరా ప్రారంభమవుతుంది. ఆ గుడ్డి వ్యక్తి ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చినప్పుడు ప్రవక్త (సఅసం) కొందరు ఖురైష్ అవిశ్వాసు లకు దివ్యఖుర్‌ఆన్ బోధిస్తున్నారు. వాళ్ళు పలుకుబడి కలిగిన ప్రముఖులు. ఆ సమయంలో వచ్చిన గుడ్డివాని చూసి ప్రవక్త(సఅసం) కాస్త చికాగ్గా నుదురు చిట్లించారు. ఈ సందర్భంగా అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు చేసిన బోధన ఈ సూరాలో ఉంది.

మనిషి సాధారణంగా మొండిగా వ్యవహరిస్తాడని, ఒక వీర్యబిందువు నుంచి తాను ఉద్భవించిన వాస్తవాన్ని మరిచిపోయి సత్యాన్ని తిరస్కరిస్తాడని ఈ సూరా వ్యాఖ్యానించింది. తీర్పుదినం నాటి చెవులు చిల్లులు పడే శంఖారావం గురించి, ఆనాడు ఎదురయ్యే భయానక పరిస్థితుల గురించి, ఆ నాడు ప్రజల స్థితిగతుల గురించి ఈ సూరాలో వివరించడం జరిగింది. ఆ నాడు ఎవరికీ తమ గురించి తప్ప ఇతరుల గురించి ఆలోచన రానేరాదు. భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్ళు, అన్నాతమ్ముళ్ళు ఎవ్వరూ ఎవరి గురించి ఆలోచించే స్థితిలో ఉండరు.

**ముఖ్యాంశాలు**

**దివ్యఖుర్‌ఆన్ :**

ప్రపంచంలోని సమస్త మానవాళికి బీదలకు, ధనికులకు అందరికోసం పంపబడిన విశ్వజనీనమైన సందేశం దివ్యఖుర్‌ఆన్.

**నిమ్నోన్నతులు :**

సాంఘిక నిమ్నోన్నతులకు అతీతమైనది దేవుని పట్ల విశ్వాసం. సంపన్నుడైన వ్యక్తి కన్నా ఒక నిరుపేద ఎక్కువ దైవభీతి కలిగి ఉండవచ్చు.



**81 వ అధ్యాయం**

# అత్ తక్వీర్

# చుట్టబడినది

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 29 ఆయతులు ఉన్నాయి. దైవవాణి అవతరణ, ప్రవక్తల పరంపరం, తీర్పుదినం నాటి భయానక పరిస్థితుల గురించి ఈ సూరా ముఖ్యంగా వివరించింది. మొదటి ఆయతులో చుట్టబడినది అన్న ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. తీర్పుదినం నాడు చోటు చేసుకునే తీవ్రమైన రోదసీ మార్పుల గురించి ఇందులో చెప్పడం జరిగింది. ఆ రోజు సూర్యుడు చుట్టబడతాడు. నక్షత్రాలు కాంతిని కోల్పోతాయి. పర్వతాలు స్థానభ్రంశం చెందుతాయి. ఆ నాటి బీభత్సం కారణంగా ప్రజలు తమ విలువైన సంపదను కూడా పట్టించుకోకుండా వదిలేస్తారు. అడవి జంతువులు ఒకచోట సమీకరించబడతాయి. సముద్రాలు మరుగుతాయి. ఆత్మలను వాటి శరీరాలతో తిరిగి కలుపడం జరుగుతుంది. ఆ రోజు సజీవంగా సమాధి కావించబడిన ఆడపిల్ల నేనే పాపం చేసాను? నన్నెందుకు హత్య చేసారని ప్రశ్నిస్తుంది. ఆకాశానికి ఉన్న తెరలు తొలగించబడతాయి. స్వర్గవనాలు దగ్గరకు తీసుకురాబడతాయి. మానవుల కర్మల చిట్టాలు తెరువబడతాయి. ఆరోజున ప్రతి ఒక్కరికి తాను చేసిన మంచి లేదా చెడు తెలిసి వస్తుంది. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) అత్యంత గౌరవనీయుడైన దైవ సందేశహరుడనీ, ఆయన పిచ్చివాడు కాదని, ఆయన దేవుని సందేశాన్ని మానవాళికి చేరవేస్తారని, అల్లాహ్ ఆయనకు తెలియజేసినది తప్ప ఆయనకు మరేవిధమైన అగోచరాల జ్ఞానం లేదని ఈ సూరా విశదీకరించింది. దివ్యఖుర్‌ఆన్ దేవుని వాక్కు అని, ఇది యావత్తు మానవాళికి హెచ్చరిక అని ఈ సూరా స్పష్టంగా చెప్పింది.

**ముఖ్యాంశాలు**

**సంకల్పం :**

అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని అనుసరించాలని మనం సంకల్పిస్తే సదాచరణల తలుపులు మనందరి కోసం తెరచి ఉన్నాయి.

**రోదసీ (అంతరిక్షంలో) మార్పులు :**

తీర్పు దినం నాటి భయానక పరిస్థితుల గురించి తెలిసిన తర్వాత మనిషి ఆ నాడు అగ్ని నుంచి రక్షణ పొందడానికి, స్వర్గవనాలు బహుమానంగా పొందడానికి తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

**82 వ అధ్యాయం**

## అల్ ఇన్‌ఫితార్

# బ్రద్దలు కావడం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది ఇందులో మొత్తం 19 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షాబహుమానాల గురించి బోధించింది. తీర్పుదినాన చోటుచేసుకునే తీవ్రమైన రోదసీ (అంతరిక్షంలోని) మార్పులను గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ఆ రోజున సమాధులు తెరువబడతాయి. ఆకాశం బద్దలవుతుంది. నక్షత్రాలు చెల్లాచెదరవుతాయి. ప్రతి ఒక్కరికి తాను చేసిన మంచి లేదా చెడుల గురించి తెలిసి వస్తుంది. ఆ రోజు వేరుపరిచే రోజు. ఆరోజు మంచిపనులు చేసిన వారు ఆనందాన్ని అనుభవిస్తారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడతామన్న వాస్తవాన్ని తిరస్కరించిన సత్యతిరస్కారులు అగ్నికి గురవుతారు.

**ముఖ్యాంశాలు**

**బహుమానం :**

మనం చేసే పనులకు తగిన ప్రతిఫలం ఆ రోజున లభిస్తుంది. మంచిపనులే అసలయిన ఆస్తిపాస్తులు.

**బాధ్యత :**

ప్రతి ఒక్కరూ తాము చేసిన పనులకు బాధ్యత వహించవలసి ఉంటుంది. ఇతరుల మంచిపనులను అప్పు తీసుకునే అవకాశం లేదు. ఇతరులు మీ నుంచి మీ మంచిపనులను అప్పు తీసుకునే అవకాశం కూడా ఉండదు.



**83 వ అధ్యాయం**

## అల్ ముతఫ్ఫిఫీన్

# మోసం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 36 ఆయతులు ఉన్నాయి. వర్తక వ్యాపారాల్లో మోసాలకు సంబంధించి ఈ సూరా ముఖ్యంగా చర్చించింది. మొదటి ఆయతులో కొలతలు, తూకాల్లో మోసానికి సంబంధించిన ప్రస్తావనలు వచ్చాయి. వాటి ఆధారంగానే ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరాలో అవినీతి పరులను తీవ్రంగా ఖండించడం జరిగింది. ఇతరులను మోసం చేసేవారిని హెచ్చరించింది. పరలోకంలో వారికి తీవ్రమైన, బాధాకరమైన శిక్ష తప్పదని వ్యాఖ్యనించింది. సత్యతిరస్కారులను ఈ సూరా క్లుప్తంగా వర్ణించింది. వారు చెడ్డవారు, దుర్మార్గులు, హద్దులు అతిక్రమించేవారు, తీర్పుదినాన్ని తిరస్కరించేవారు, దివ్యఖుర్‌ఆన్‌ను ప్రాచీనకాలం కథలుగా అభివర్ణించేవారు, ఇలాంటి వారు భగభగ మండే అగ్నిలోకి ప్రవేశిస్తారు. కాగా విశ్వసించి మంచిపనులు చేసినవారు శాశ్వత ఆనందాన్ని పొందుతారు.

**ముఖ్యాంశాలు**

**మోసం :**

అవినీతి కార్యకలాపాలు, కొలతలు, తూకాల్లో మోసాలు తీవ్రంగా ఖండించ దగినవి. ఇవి దుష్టకార్యకలాపాలు.

**84 వ అధ్యాయం**

## అల్ ఇన్‌షిఖాఖ్

# తెరువబడడం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది ఇందులో 25 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి బోధించింది. మొదటి ఆయతులోనే

దీనికి పేరుగా పెట్టబడిన పదాలు వచ్చాయి. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను క్లుప్తంగా అభివర్ణిస్తూ ఈ సూరా ప్రారంభమవుతుంది. రోదసి(అంతరిక్షం)లో చోటుచేసుకునే ప్రళయభీకర పరిస్థితుల గురించి ఈ సూరా వివరించింది. ఆ రోజున ఆకాశం తెరువబడుతుంది. భూమి చదునుగా చేయబడుతుంది. పర్వతాలు చెల్లాచెదరవుతాయి. అందరిని అల్లాహ్ ముందు హాజరుపరచడం జరుగుతుంది. ఈ సూరాలో అవిశ్వాసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ పరలోకంలో ఎదురయ్యే తీవ్రమైన శిక్ష గురించి హెచ్చరించడం జరిగింది. సన్మార్గంపై స్థిరంగా ఉన్న వారికి శాశ్వత స్వర్గవనాలు లభిస్తాయని ఈ సూరా పునరుద్ఘాటించింది.

**ముఖ్యాంశాలు**

**హాజరు కావడం :**

తీర్పుదినాన ప్రతి ఒక్కరు దేవుని ముందు హాజరుపరచబడతారు.

**85 వ సూరా**

## అల్ బురూజ్

# మహా బురుజులు

**(విశ్వాంతరాళాల్లో ఉండే గ్రహ నక్షత్ర సముదాయాలు)**

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది ఇందులో మొత్తం 22 ఆయతులు ఉన్నాయి. అల్లాహ్‌పై విశ్వాసం కోసం తన్ను తాను త్యాగం చేసుకునే వైఖరిని ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. ఇందులోని మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చిన మహాబురుజులు అన్న పేరునే దీనికి పెట్టడం జరిగింది. సత్యాన్ని విశ్వసించిన వారిపై వేధింపులు, దౌర్జన్యాలను గురించి ఈ సూరా ప్రస్తావించింది. ఒకే దేవుడైన అల్లాహ్‌ను విశ్వసించిన వారిని దుర్మార్గులు నానా విధాలుగా హింసించేవారు. ఒక గుంటలో అగ్నిని మండించి అందులో విసిరేసి ఆనందించేవారు. ఏకైక దేవుడిని విశ్వసించిన వారు ఆత్మాహుతికి సిద్ధపడ్డారు కాని తమ విశ్వాసాన్ని ఇసుమంత



కూడా సడలనీయలేదు. ఈ సంఘటనలను ప్రస్తావిస్తూ, దౌర్జన్యాలు చేస్తున్న వారికి పరలోకంలో ఎదురయ్యే బాధాకరమైన శిక్ష గురించి హెచ్చరించడం జరిగింది. సమయం గడిచిపోక ముందే వారు పశ్చాత్తాపం చెందాలని అల్లాహ్ వారికి బోధించాడు. ఈ సందర్భంగా ఫిరౌన్ ప్రజల కథను, వారికి పట్టిన దుర్గతిని ప్రస్తావించి, దుర్మార్గులను, సత్యతిరస్కారులను అల్లాహ్ కఠినంగా శిక్షిస్తాడని గుర్తుచేయడం జరిగింది. దివ్యఖుర్ఆన్ మహోన్నతమైనదనీ, శాశ్వతమైనదనీ, మార్పులు చేర్పులకు అతీతమైనదనీ స్పష్టం చేయడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**దౌర్జన్యాలు :**

వేధింపులు, దౌర్జన్యాలు ఎదురైనప్పుడు విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి, సత్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన త్యాగనిరతి కలిగి ఉండాలి.

**క్షమాపణ:**

దుర్మార్గానికి పాల్పడిన వారు నిజాయితీతో పశ్చాత్తాపపడాలి. అల్లాహ్ ఎంతో క్షమాశీలం కలిగిన వాడు.

**86 వ అధ్యాయం**

## అత్ తారిఖ్

# ప్రభాత నక్షత్రం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 17 ఆయతులు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా ప్రస్తావించిన విషయాలు – ప్రళయం, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, దైవవాణి అవతరించడం. మొదటి ఆయతులో వచ్చిన ప్రభాత నక్షత్రం అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మనిషిని ఏ విధంగా వీర్యద్రవం నుంచి సృష్టించింది తెలుపుతూ అల్లాహ్ మరణించిన ప్రతిఒక్కరిని తీర్పుదినం రోజున మళ్ళీ లేపినిలబెట్టగలడని, ఆ రోజున యావత్తు

మానవాళి తుది తీర్పు కోసం దేవుని ముందు హాజరవుతుందని చెప్పడం జరిగింది. ఆ రోజున ప్రతిఒక్కరి మంచి లేదా చెడు పనులు బట్టబయలవుతాయి. దివ్యఖుర్ఆన్ దేవుడు పంపిన సత్యమనీ, ఇది మంచిని చెడు నుంచి వేరు చేస్తుందనీ, ఇవి వ్యర్థమైన ప్రసంగాలు కావని నొక్కి చెప్పింది.

**ముఖ్యాంశాలు**

**రాజీపడడం :**

చెడు విషయంలో రాజీపడరాదు. స్థిరచిత్తంతో, సహనంతో వ్యవహరించాలి.

**కుట్రలు :**

సత్యతిరస్కారులు సత్యానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారు. కాని వారి చెడుకుతంత్రాలను అల్లాహ్ విఫలం చేస్తాడు.

**87 వ అధ్యాయం**

## అల్ ఆలా

# మహోన్నతుడు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 19 ఆయతులు ఉన్నాయి. ఇది ముఖ్యంగా ఏకదైవారాధన గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన మహోన్నతుడు అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. దేవుని ఏకత్వం, ఆయనకున్న విశిష్టమైన సృష్టిసామర్థ్యాలను ఈ సూరా ప్రధానంగా వివరించింది. ప్రజలు హితబోధను అనుసరించాలని, అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయన కారుణ్యాన్ని, ఆయన అనుగ్రహాలను, ఆయన ఆగ్రహాన్ని, శిక్షాబహుమానాలను ఇతరులకు గుర్తుచేయాలని ఈ సూరా బోధించింది. మానవులు ఇహలోక జీవితం పట్ల వ్యామోహం పెంచుకున్నారని, కాని నిజానికి మనిషికి పరలోక జీవితమే లక్ష్యం



కావాలని, పరలోక జీవితం ఇంతకన్నా ఉన్నతమైనది, శాశ్వతమైనదని ఈ సూరా ప్రబోధించింది.

**ముఖ్యాంశాలు**

**హితబోధ :**

ప్రజలకు అల్లాహ్ గురించి, పరలోకం గురించి గుర్తుచేయాలి. ఆ విధంగా వారిని అగ్ని నుంచి కాపాడటానికి ప్రయత్నించాలి. అల్లాహ్‌కు భయపడే వారికి కూడా హితబోధ ఎంతయినా అవసరం.

**ప్రాపంచిక జీవితం :**

తాత్కాలికమైన ప్రాపంచిక జీవితానికి ప్రాధాన్యం ఇవ్వరాదు. శాశ్వతమైన పరలోక జీవితానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

**88 వ అధ్యాయం**

## అల్ గాషియహ్

# ముంచుకొచ్చే ముప్పు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 26 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, తీర్పుదినాల గురించి ప్రస్తావించింది. ఈ సూరా మొదటి ఆయతులో వచ్చిన పదాలనే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరాలో తీర్పుదినం గురించి వివరాలు ఇవ్వబడ్డాయి. ఆ నాటి భయానక పరిస్థితులలో ప్రజలు దిక్కుతోచని రీతిలో ఉంటారు. ఈ సూరాలో దుర్మార్గునికి, సన్మార్గునికి మధ్య భేదాన్ని గురించి సోదాహరణగా వివరించడం జరిగింది. అవిశ్వాసులు భగభగలాడే అగ్నిలోకి ప్రవేశిస్తారు. తీవ్రమైన పరాభవానికి గురవుతారు. వారి ముఖాలు కిందికి వేలాడుతుంటాయి. వారికి సలసల కాగే నీరు తాగడానికి

ఇవ్వబడుతుంది. ఎండిన ముళ్ళగడ్డి తినడానికి ఇవ్వబడుతుంది. దాని వల్ల బలమూ లభించదూ, ఆకలీ తీరదు. కాగా విశ్వాసులు శాశ్వత స్వర్గవనాలు పొంది ఆనందిస్తారు.

ఈ సూరాలో అల్లాహ్‌కు గల విశిష్టమైన సృష్టి సామర్థ్యాన్ని వివరించడం జరిగింది. సత్యానికి దూరంగా పోయినవారు, అల్లాహ్‌ను తిరస్కరించినవారు అద్భుతమైన ఒంటెలను, ఆకాశాన్ని, పర్వతాలను, భూమిని ఆయన ఎలా సృష్టించినదీ చూడాలని ఉద్బోధించింది.

**ముఖ్యాంశాలు**

**హితబోధ :**

ప్రజలకు హితబోధను అందించాలి. బాధాకరమైనశిక్ష గురించి వారికి చెప్పాలి. అయితే సత్యాన్ని స్వీకరించడం లేదా తిరస్కరించడం అన్నది వారి ఇష్టం. ఆ స్వేచ్ఛ వారికి ఉంది.

**మరలడం :**

ప్రతి ఒక్కరు అల్లాహ్ వద్దకు మరలిపోవలసి ఉంది. ప్రతి ఒక్కరూ తాము చేసిన పనులకు జవాబు చెప్పుకోవలసి ఉంది.

## 89 వ అధ్యాయం

# అల్ ఫజ్ర్

# ఉషోదయం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 30 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. తీర్పుదినం రోజు భయానక పరిస్థితులను ఈ సూరా వర్ణించింది. ఆ రోజున భూమి పూర్తిగా



చదును చేయబడుతుంది. పంక్తులు తీరిన దైవదూతలతో అల్లాహ్ ప్రత్యక్షమవుతాడు. నరకం తీసుకురాబడుతుంది. గుణపాఠం గ్రహించడానికి గాను ఈ సూరాలో గతకాలాలకు చెందిన మూడు జాతుల ప్రస్తావన వచ్చింది. ఆద్‌జాతి, సమూద్ జాతి, ఫిర్ఔన్ ప్రజల గురించి వివరిస్తూ, వారు సత్యాన్ని తిరస్కరించినందుకు గాను, అల్లాహ్‌ను కాదన్నందుకు గాను తీవ్రంగా శిక్షించబడిన వైనాన్ని తెలియజేసింది. ఈ సూరాలో అనేక నైతిక ప్రమాణాలను కూడా బోధించడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**అవినీతి :**

దుర్మార్గం, అత్యాచారాలు చాలా పెద్ద చెడులు. ఈ చెడులను వదులుకోవాలి.

**పరీక్ష :**

సంపద, సౌభాగ్యాలు, సుఖాలు, కష్టాల ద్వారా మానవులను పరీక్షించడం జరుగుతుంది. సిరిసంపదలు ప్రాప్తిస్తే అల్లాహ్ అనుగ్రహాలు మనకే సొంతమని మిడిసిపడడం, దారిద్ర్యం దాపురిస్తే అల్లాహ్ చిన్నచూపు చూసాడని, అవమానించాడని భావించడం పొరబాటు. కలిమి లేములు రెండూ అల్లాహ్ తరఫున పరీక్షలే. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మనం అల్లాహ్‌ను నమ్ముకుని, ఆయన్ను స్మరిస్తూ మంచిపనులు చేస్తూ ఉండాలి.

**అనాథలు :**

అనాథల పట్ల దయతో వ్యవహరించాలి. అవసరార్థులను అదుకునేలా ఇతరులను కూడా ప్రోత్సహించాలి.

**సంపద :**

సంపద పట్ల విపరీతమైన వ్యామోహం పెంచుకోరాదు. వ్యామోహం సన్మార్గానికి, దైవవిధేయతకు దూరం చేస్తుంది.

## 90 వ అధ్యాయం

# అల్ బలద్

# నగరం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 20 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి, శిక్షాబహుమానాల గురించి వివరించింది. మొదటి ఆయతులో వచ్చిన పదం ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. మానవులు సహనంతో కష్టనష్టాలను భరిస్తూ మంచిపనులు కొనసాగించాలని బోధించింది. అహంభావులైన అవిశ్వాసులు తమ సంపద, అధికారాలు శాశ్వతమన్న తప్పు అభిప్రాయానికి గురయిఉన్నారు. తమ సంపద, అధికారాలు తమను అన్నివిధాల కష్టాల నుంచి కాపాడుతాయన్న భ్రమలో ఉన్నారు. తమ ఇష్టం వచ్చినట్లు చేసే స్వేచ్ఛ తమకు ఉందని, తమ పనులకు ఎవరికీ జవాబు చెప్పుకోనవసరం లేదని కూడా వారు భావిస్తున్నారు. అల్లాహ్ గమనిస్తున్నాడన్న విషయాన్ని వారు మరిచిపోయారు. తీర్పుదినాన తమ కర్మలకు అల్లాహ్ ముందు జవాబు ఇవ్వవలసి వస్తుందన్న వాస్తవాన్ని వాళ్ళు నిర్లక్ష్యం చేసారు. తీర్పుదినాన అహంభావులైన ఈ సత్యతిరస్కారులు బాధాకరమైన శిక్షను చవిచూస్తారు. సన్మార్గగాములకు శాశ్వత సుఖాలు లభిస్తాయి. ఈ సూరాలో కూడా అనేక నైతిక ప్రమాణాలను బోధించడం జరిగింది.

### ముఖ్యాంశాలు

**పరీక్ష:**

హోదా, సంపద, అధికారాలను అల్లాహ్ మానవులకు ప్రసాదించాడు. వాటి ద్వారా వారిని పరీక్షిస్తున్నాడు. అల్లాహ్ అనుగ్రహాలకు గాను మానవులు అల్లాహ్‌కు కృతజ్ఞులై ఉండాలి. మనం మన కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉందని తెలుసుకోవాలి. సంపద, హోదా, అధికారాలు పరలోకంలో ఎందుకూ కొరగావు.



మనం సన్మార్గానికి కట్టుబడకపోతే ఇవి మనలను బాధాకరమైన శిక్ష నుంచి కాపాడలేవు.

**సంఘర్షణ :**

మనం సహనంతో, ఓరిమితో మన కృషిని కొనసాగించాలి. కష్టనష్టాలను పూర్తిగా అల్లాహ్‌పై భారం వేసి ఎదుర్కోవాలి. అల్లాహ్‌తో మాత్రమే శరణు వేడుకోవాలి.

**సహాయం :**

మనం అనాథ బంధువులకు, అవసరార్థులకు, బంధనాలలో చిక్కుకున్న వారికి సహాయపడాలి.

**స్వేచ్ఛ:**

సంపద, హోదా, వర్గం, వంటి సంకెళ్ల నుంచి మనం స్వేచ్ఛ పొందాలి.

## 91 వ అధ్యాయం

# అష్ షమ్స్

# సూర్యుడు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 15 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఆధ్యాత్మికత గురించి, అనైతిక వ్యవహారశైలి, అనైతికత వల్ల వాటిల్లే వినాశాల గురించి వివరించింది. ఇందులోని మొదటి అయతులో ఈ సూరా పేరుకు సంబంధించిన పదం ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరా మానవుల అధ్యాత్మిక విధులను గుర్తు చేసింది. అల్లాహ్‌కు ప్రత్యేకమైన సృష్టి సామర్థ్యాన్ని వర్ణిస్తూ, సూర్యచంద్రుల ప్రకాశం, భూమి, అద్భుతమైన రోదసీ (అంతరిక్ష) వ్యవస్థల సృష్టి గురించి తెలియజేసింది. మానవులందరికీ ఇష్టమొచ్చిన మార్గాన్ని అవలంబించే స్వేచ్ఛ ఉందని, మంచిగా గాని, చెడుగా గాని వ్యవహరించే స్వేచ్ఛ ఉందని, ఏ మార్గాన నడువాలన్నది మనమే నిర్ణయించుకోవాలని తెలియజేస్తూ, అనైతికంగా

వ్యవహరించి, అల్లాహ్ ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే ఫలితంగా దైవాగ్రహానికి గురి కావలసి వస్తుందని ఈ సూరా తెలియజేసింది.

**ముఖ్యాంశాలు**

**స్వేచ్ఛ:**

ప్రతి మనిషికి దైవభీతి మార్గాన్ని లేదా అనైతిక మార్గాన్ని తన ఇష్టం వచ్చిన మార్గాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. ఆధ్యాత్మిక ఎత్తులకు ఎదగడం లేదా అనైతిక లోతుల్లోకి జారిపడడం అన్నది మన ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంది. ఏ మార్గాన నడువాలన్న స్వేచ్ఛ మనిషికి పూర్తిగా ఉంది.

**సాఫల్యం :**

ఇహలోకంలోను, పరలోకంలోను సాఫల్యం పొందడమన్నది మన ఆత్మప్రక్షాళనపై ఆధారపడి ఉంది. అంటే, అల్లాహ్‌ను విశ్వసించి, మంచిపనులు చేయడంపై ఆధారపడి ఉంది.

## 92 వ అధ్యాయం

# అల్ లైల్

# రాత్రి

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 21 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా అల్లాహ్ మార్గంలో కృషిచేయడం గురించి, ఇహ లోకంలో మన సంఘర్షణ గురించి తెలియజేసింది. మొదటి ఆయతులో వచ్చిన రాత్రి అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ఇహలోక జీవితం ఒక సంఘర్షణ అని, ఇహపరలోకాల్లో సాఫల్యం లేదా వైఫల్యం అన్నది ఈ సంఘర్షణపై ఆధారపడి ఉందని, మనం అల్లాహ్‌ను విశ్వసించి మంచి పనులు చేస్తే, అల్లాహ్ పట్ల భయభీతులు కలిగి ఉండి, దానధర్మాలు చేస్తే, సత్యాన్ని



విశ్వసిస్తే సాఫల్యం పొందగలమనీ, అల్లాహ్ మనకు శాశ్వత స్వర్గవనాలు ప్రసాదిస్తాడని తెలిపింది. కాని మనిషి దుర్మార్గానికి కట్టుబడి, అల్లాహ్‌కు దూరమైతే, స్వార్థంతో, దురాశతో వ్యవహరిస్తే, సత్యాన్ని తిరస్కరిస్తే దారుణంగా విఫలమవుతాడు. అల్లాహ్ ఆదేశాలను తిరస్కరించిన వారికి భగభగమండే అగ్నిశిక్ష సిద్ధంగా ఉందని హెచ్చరించడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**సంపద :**

ప్రపంచంలోని సంపద పరలోకంలో ఎందుకూ పనికిరాదు. అందువల్ల సంపదను బీదలకు సహాయం చేయడానికి, అల్లాహ్ మార్గంలో ఖర్చుచేయడానికి విని యోగించాలి.

**దైవప్రీతి :**

మంచిపనులు చేస్తూ, దానధర్మాల్లో ఖర్చుపెట్టాలి. ఆ విధంగా అల్లాహ్ ప్రసన్నతను పొందాలి.

## 93 వ అధ్యాయం

# అజ్ జుహా

# పగటి ప్రకాశం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 11 ఆయతులు ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలు ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. ప్రవక్త (సఅసం)కు ఊరటనిస్తూ, అల్లాహ్ ఆయన్ను వదిలిపెట్టలేదని చెప్పడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) అనాధబాలునిగా ఉన్నప్పుడు ఆయనకు సహాయం చేసింది అల్లాహ్‌యేనని, మార్గం

తెలియని స్థితిలో ఉన్నప్పుడు మార్గం చూపింది అల్లాహ్‌యేనని, బీదరికంలో ఉన్నప్పుడు సంపద ప్రసాదించింది. అల్లాహ్‌యేనని గుర్తుచేయడం జరిగింది. రాబోయే కాలం గతకాలం కన్నా నిశ్చయంగా మేలైనదిగా ఉంటుందని చెప్పడం జరిగింది. అనాథల పట్ల దయతో వ్యవహరించాలని, యాచకులను కసురుకోరాదని, అల్లాహ్ ప్రసాదించిన వరాల అందరికీ తెలియజేయాలని చెప్పడం జరిగింది.

### ముఖ్యాంశాలు

**పరలోకం :**

మనం పరలోకాన్ని ఎల్లప్పుడు దృష్టిలో ఉంచుకోవాలి. మనకు అదే చివరి లక్ష్యం కావాలి.

**నైతిక ప్రమాణాలు :**

అనాథల పట్ల దయతో వ్యవహరించాలి. యాచకుల పట్ల సానుభూతి చూపాలి. కష్టాల్లో ఉన్న వారి పట్ల కారుణ్యం చూపాలి. కష్టాలు ఎదురైనప్పుడు నిందించడానికి బదులు దేవుని అనుగ్రహాలను ప్రస్తుతించాలి.

## 94 వ అధ్యాయం

# అలమ్ నష్రహ్

# హృదయాన్ని తెరువడం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 8 ఆయతులు ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్(సఅసం)పై అల్లాహ్ అనుగ్రహాలను ఈ సూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూరా మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. అల్లాహ్ ప్రవక్త



ముహమ్మద్(సఅసం) హృదయాన్ని కారుణ్యంతో నింపాడు. ప్రజలందరినీ ఆహ్వానించే హృదయవైశాల్యం ప్రసాదించాడు. కష్టనష్టాలను తొలగించి, ఆయన హోదా గౌరవాలను ఇనుమడింపచేసాడు. కాబట్టి, అధైర్యపడకుండా, క్రుంగిపోకుండా, అల్లాహ్ ప్రసన్నత పొందడానికి తీరిక లభించినపుడు ఆరాధనలో నిమగ్నమై పోవాలని ఆయనకు బోధించడం జరిగింది.

### ముఖ్యాంశాలు

**కష్టాలు :**

మన కష్టాలకు, నష్టాలకు అల్లాహ్ ఏదో ఒక పరిష్కారాన్ని చూపిస్తాడన్న నమ్మకం ఉంచాలి. అల్లాహ్ పై విశ్వాసంతో, సహనంతో వ్యవహరిస్తే మన కష్టాలు తొలగి పరిస్థితులు చక్కబడతాయి.

## 95 వ అధ్యాయం

# అత్తీన్

# అంజూరం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 8 ఆయతులు ఉన్నాయి. సృష్టిరాసులన్నింటిలోను మానవునికి అత్యున్నత స్థానాన్ని ఇవ్వడం జరిగిందన్న విషయాన్ని ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన అంజూరం అన్న పదాన్ని ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. మనిషిని చక్కని రూపులో సృష్టించడం జరిగిందని, ఉత్తమమైన శారీరక,మానసిక శక్తులు ప్రసాదించడం జరిగిందని, ఇవన్నీ అల్లాహ్ అనుగ్రహాలని తెలియజేసింది. అందువల్ల మనిషి అల్లాహ్‌కు కృతజ్ఞుడై ఉండాలని బోధించింది. అల్లాహ్‌కు దూరమైతే మనిషి తన హోదాను కోల్పోతాడని, అవమానాల పాలయి పతనమవుతాడని, పరలోకం అనివార్యమని హెచ్చరించింది.

**ముఖ్యాంశాలు**

**సృష్టి:**

అల్లాహ్ సృష్టి విశిష్టమైనది. అందులో మానవుని సృష్టి జీవరాసులన్నింటిలో ఉత్తమమైనది.

**ప్రతిఫలం:**

సత్యతిరస్కారులు అవమానాల పాలు అవుతారు. దైవభీతి కలిగిన వారు ఉన్నత స్థానాలను పొందుతారు.

## 96 వ అధ్యాయం

# అల్ అలఖ్

# రక్తపు ముద్ద

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 19 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా దైవవాణి అవతరణ గురించి బోధించింది. ఇందులోని రెండవ ఆయతులో ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం ప్రస్తావనకు వచ్చింది. దైవవాణి అవతరణను ఈ సూరా వివరించింది. అల్లాహ్ మానవులకు ప్రసాదించిన బుద్ధిజ్ఞానాల అనుగ్రహాల గురించి కూడా ఇందులో ప్రస్తావించడం జరిగింది. సన్మార్గాన్ని అవలంబించడం, మంచిపనులు చేయడం ఎంత ముఖ్యమో ఈ సూరాలో స్పష్టంగా తెలియజేయడం జరిగింది. అల్లాహ్‌కు దగ్గరై ఆయనకు విధేయంగా అరాధించవలసిన అవసరాన్ని వివరించింది. అల్లాహ్ కొందరికి సమృద్ధిని ప్రసాదించాడని, కాని వారు తిరుగుబాటు వైఖరిని అవలంబించి, అల్లాహ్‌కు దూరమయ్యారని విమర్శించింది.



**ముఖ్యాంశాలు**

**నిష్ప్రయోజనమైనవి:**

సంపద, అధికారం, హోదాలు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలు. కాని ఇవి శాశ్వతమైనవి కావు, నిష్ప్రయోజనకరమైనవి. సంపద, అధికారం, హోదాలు ప్రాపంచిక జీవితంలో ఉపయోగపడవచ్చు కాని మరణానంతరం వాటన్నింటిని ఇక్కడే వదిలి వెళ్ళవలసి ఉంటుంది.

**అతిక్రమణ:**

ఇది ఒక చెడు. సంపద, అధికారం, హోదాలు లభిస్తే ఇతరుల హక్కులను అతిక్రమించరాదు.

**హితబోధ:**

అల్లాహ్‌ను ఆరాధించాలి. విధేయత చూపాలి. ఆయన్ను కొనియాడాలి. ఆయన సామీప్యాన్ని పొందడానికి ప్రయత్నించాలి.

## 97 వ అధ్యాయం

# అల్ ఖద్ర్

# ఔన్నత్యం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. ముఖ్యంగా దైవవాణి అవతరణ గురించి ఇందులో చెప్పడం జరిగింది. అత్యున్నతమైన రాత్రి అన్న ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. దివ్యఖుర్‌ఆన్ అవతరించిన రాత్రి ఎంత ఘనమైనదో ఇందులో చెప్పడం జరిగింది. ఆ ఘనమైన రాత్రి అల్లాహ్‌ను ఆరాధిస్తే వెయ్యి మాసాలపాటు చేసిన ఆరాధనకు సమానమవుతుంది. అంటే 83 సంవత్సరాల 4 నెలల ఆరాధనకు సమానమవుతుంది.

ఆ ఘనమైన రాత్రి దైవదూతలు, జిబ్రయీల్(అస) దేవుని అనుమతితో దైవాదేశాలు తీసుకుని అవతరిస్తారు.

**ముఖ్యాంశాలు**

**ఆరాధనం :**

ఘనమైన రాత్రి అల్లాహ్‌ను అత్యధికంగా ఆరాధించాలి. ఆయన క్షమాభిక్షను వేడుకోవాలి.

(ఈ ఘనమైన రాత్రి రమజాను మాసం ఆఖరు పదిరాత్రుల్లో ఒక రాత్రి లేదా ఆఖరి పదిరాత్రుల్లోని బేసిరాత్రుల్లో ఒక రాత్రి కావచ్చు, కాబట్టి ఈ రాత్రుల్లో ఈ ఘనమైన రేయిని అన్వేషించాలి).

## 98 వ అధ్యాయం

## అల్ బయ్యినహ్

# స్పష్టమైన నిదర్శనం

**పరిచయం**

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 8 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన స్పష్టమైన నిదర్శనం అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. గ్రంథప్రజలు, విగ్రహారాధకులు సత్యాన్ని తిరస్కరించడాన్ని ఈ సూరాలో ఖండించడం జరిగింది. వారు స్పష్టంగా కనబడుతున్న సత్యాన్ని అహంభావంతో తిరస్కరించడమే కాదు, దేవుని ఏకత్వాన్ని నిరాకరించడం కొనసాగిస్తున్నారు. నిజానికి గ్రంథప్రజలు (యూదులు, క్రయిస్తవులు) అందరికన్నా ముందుగా ఈ దైవవాణిని ఆహ్వానించి స్వీకరించి ఉండాల్సిందని, ఎందుకంటే వారి ఆకాశగ్రంథాలు ఈ విషయమై వారికి బోధించాయని ఈ సూరా తెలియజేసింది. కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, నమాజు స్థాపించాలని, జకాత్



చెల్లించాలని బోధించడం జరిగింది. నరకాగ్ని గురించి హెచ్చరించడంతో పాటు సన్మార్గులకు లభించే స్వర్గవనాల గురించి కూడా ప్రస్తావించడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**సత్యధర్మం :**

అల్లాహ్ ఒకే ఒక్కడని విశ్వసించడం, ఆయనకు భాగస్వాములను కల్పించే అపరాధానికి దూరంగా ఉండడం, అబద్ధపు విశ్వాసాలు, విలువలు మానుకోవడం, కేవలం అల్లాహ్ ఒక్కడినే ఆరాధిస్తూ, జకాత్ (విధి దానం) చెల్లించడం.

## 99 వ అధ్యాయం

## అజ్ జిల్‌జాల్

# భూకంపం

**పరిచయం**

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 8 ఆయతులు ఉన్నాయి. తీర్పుదినం గురించి ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలో ప్రస్తావనకు వచ్చిన భూకంపం అన్న పదాన్ని దీనికి పేరుగా పెట్టడం జరిగింది. తీర్పుదినం నాటి భయానక స్థితిని, ఆనాటి ప్రకంపనాలను ఈ సూరా వర్ణించింది. ఆ రోజు భూమి తీవ్రంగా కుదిపివేయబడుతుంది. భూగర్భంలో ఉన్న సమస్తాన్ని వెళ్ళగ్రక్కుతుంది. అంటే మృతులను బయటకు వెళ్ళగ్రక్కుతుంది. ప్రజలు ఆ రోజు తమ కర్మలను చూసుకునేందుకు భిన్న పరిస్థితుల్లో తమ ప్రభువు వైపునకు మరలుతారు. శిక్షా లేదా బహుమానాలు పొందుతారు.

**ముఖ్యాంశాలు**

**కర్మలు :**

ప్రతి వ్యక్తి స్త్రీ గాని పురుషుడు గాని తాను చేసిన కర్మలను చూసుకోవలసి వస్తుంది. మంచిపనులు లేదా చెడ్డపనులు అన్నింటిని అక్కడ చూసుకోవలసి వస్తుంది.

ఎంత చిన్న పనయినా పరిగణనలోకి వస్తుంది. న్యాయంగా ఆ కర్మలను లెక్కించడం జరుగుతుంది.

### 100 వ అధ్యాయం

## అల్ ఆదియాత్

# పరుగెత్తే గుర్రాలు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 11 ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ పట్ల మనిషి కృతఘ్నుతను, ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహాన్ని ఈ సూరా ప్రస్తావించింది. ఈ సూరాకు పెట్టిన పేరు మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరా యుద్ధ రంగంలో విశ్వాసులు ఉపయోగించే గుర్రాలకు సంబంధించిన వర్ణనతో ప్రారంభమయ్యింది. ప్రజలు తమ సంపద పట్ల, ప్రాపంచిక భోగభాగ్యాల పట్ల ఎలా వ్యామోహం పెంచుకుంటారో వివరించింది. అల్లాహ్ పట్ల ఎలా కృతఘ్నులు అవుతారో తెలిపింది. తీర్పుదినాన ప్రతి ఒక్కరి కర్మల చిట్టా అతని ముందు ఉంటుందని, ప్రతి ఒక్కరి రహస్యాలు బట్టబయలవుతాయని తెలియజేసింది.

### ముఖ్యాంశాలు

**సంపద :**

నిష్ప్రయోజనమైన సంపద, ప్రాపంచిక ప్రయోజనాల పట్ల వ్యామోహం పెంచు కోరాదు. అల్లాహ్ పట్ల కృతజ్ఞత చూపాలి.



### 101 వ అధ్యాయం

## అల్ ఖారిఅహ్

# మహోపద్రవం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 11 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి వివరించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఇందులో వివరించడం జరిగింది. ఆ రోజున తీవ్రమైన ప్రకంపనాలు సంభవిస్తాయి. పర్వతాలు దూదిపింజల్లా ఎగురుతాయి. మానవులు దిక్కుతోచని స్థితిలో నిస్సహాయంగా చెల్లాచెదరయిన దీపపు పురుగుల్లా కనబడతారు. చేసిన కర్మలకు తగిన విధంగా శిక్షా లేదా బహుమానాలు ఆ రోజున లభిస్తాయి.

### ముఖ్యాంశాలు

**కర్మలు :**

సన్మార్గానికి కట్టుబడి మంచిపనులు చేయాలి. ఆ విధంగా శాశ్వత దైవానుగ్రహాలు లభించే స్వర్గవనాన్ని పొందాలి. చెడుపనులకు, దుర్మార్గానికి పాల్పడితే శాశ్వతమైన అగ్నికి ఆహుతి కావలసి ఉంటుంది.

### 102 వ అధ్యాయం

## అత్ తకాసుర్

# ప్రోగుచేయడం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 8 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా సంపద పట్ల వ్యామోహం గురించి వివరించింది.

మానవులు విపరీతంగా ప్రాపంచిక సుఖభోగాల వ్యామోహం కలిగి ఉంటారు. ఎల్లప్పుడు తమ సంపదను ఇంకా పెంచుకోవాలని చూస్తుంటారు. తమ హోదాను, అధికారాన్ని పెంచుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ప్రాపంచిక ప్రయోజనాలను సాధించడంలో పూర్తిగా నిమగ్నమైపోయి పరలోకాన్ని విస్మరిస్తారు. నిజానికి పరలోకం మనిషి భవిష్యత్తు. మృత్యువు ఆసన్నమైనప్పుడు, సమాధిలో వాస్తవాన్ని గుర్తిస్తారు. తీర్పుదినాన వారు తమ కళ్ళారా నరకాన్ని చూసుకుంటారు. అల్లాహ్‌కు దూరమైనందుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధాకరమైన శిక్షను అనుభవిస్తారు.

**ముఖ్యాంశాలు**

**సంపద :**

సంపద, అధికారం, హోదాల వ్యామోహంలో మునిగిపోరాదు. ఎందుకంటే ఇవి శాశ్వతమైనవి కావు. పరలోకంలో నరకాగ్ని నుంచి ఇవి కాపాడలేవు.

**103 వ అధ్యాయం**

# అల్ అస్ర్

# కాలం

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా సన్మార్గం గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్‌ను విశ్వసించిన వారు, మంచిపనులు చేసిన వారు, పరస్పరం హితబోధ చేసుకున్న వారు తప్ప మిగిలిన వారందరూ తీర్పుదినాన నష్టానికి గురవుతారని ఈ సూరా తెలియజేసింది. ఈ సూరా సన్మార్గానికి సంబంధించిన ప్రధానమైన సూత్రాలను ప్రతిపాదించింది. అవి: అల్లాహ్‌ను విశ్వసించడం, మంచిపనులు చేయడం, సత్యం, సహనాల విషయమై ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం.



**ముఖ్యాంశాలు**

**జీవితం :**

జీవితాన్ని వ్యర్థం చేసుకోరాదు. శాశ్వత స్వర్గవనాలు పొందడానికి గాను సన్మార్గాన్ని అవలంబించి, అల్లాహ్‌ను విశ్వసించాలి. కష్టాల్లోను స్థిరంగా సత్యంపై నిలబడాలి.

**104 వ అధ్యాయం**

# అల్ హుమజహ్

# నిందలు వేసేవాడు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 9 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా అపనిందలు వేయడాన్ని, సంపద పట్ల విపరీతమైన వ్యామోహాన్ని చర్చించింది. మొదటి ఆయతులో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అపనిందలు ప్రచారం చేయడం, ఇతరుల గురించి చెడుగా మాట్లాడడం వంటి రుగ్మతలను ఇందులో తీవ్రంగా ఖండించడం జరిగింది. అలాగే సంపదను ప్రోగుచేయడంలో మునిగిపోయి, దానధర్మాలకు ఖర్చుచేయని వారిని తీవ్రంగా హెచ్చరించింది. ఈ రెండు రకాల ప్రజలు నరకాగ్ని శిక్ష పొందుతారని తెలిపింది.

**ముఖ్యాంశాలు**

**చెడులు :**

అపనిందలు వేయడం, ఎత్తిపొడుపులు, వీపువెనుక చెడుగా మాట్లాడడం వంటి చేష్టలకు దూరంగా ఉండాలి.

**సంపద :**

సంపదను ప్రోగుచేయడంలో మునిగిపోవడం వల్ల అనైతికత పెరుగుతుంది. అల్లాహ్ స్మరణ పట్ల నిర్లక్ష్యానికి దారితీస్తుంది. సంపద మనిషికి శాశ్వత జీవితాన్ని ప్రసాదించలేదు. పరలోకంలో బాధాకరమైన శిక్ష నుంచి కాపాడనూ లేదు.

## 105 వ అధ్యాయం

# అల్ ఫీల్

# ఏనుగు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. సత్యతిరస్కారులకు పట్టిన దుర్గతిని ముఖ్యంగా ఈ సూరా ప్రస్తావించింది. మొదటి ఆయతులో ఏనుగు గురించిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పుట్టుకకు రెండు నెలలు ముందు జరిగిన ఒక చారిత్రక సంఘటనను ఈ సూరా ప్రస్తావించింది. అబిసీనియాకు చెందిన అబ్రహా రాజు మక్కాపై దండయాత్రకు వచ్చాడు. ఏనుగుల మహాసైన్యంతో దాడికి వచ్చాడు. కాని అల్లాహ్ ఆ దుర్మార్గపు దాడిని నిరోధించాడు. ఆ సైన్యంపైకి పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారిపై గట్టి కంకరరాళ్ళను విసిరాయి. వాటి ధాటికి ఆ సైన్యం నాశనమయ్యింది.

### ముఖ్యాంశాలు

**పథకం :**

మనిషి పథకాలు ఫలించవు. కేవలం అల్లాహ్ పథకాలు మాత్రమే విజయం సాధిస్తాయి. సత్యం ఎల్లప్పుడు విజయం సాధిస్తుంది.



## 106 వ అధ్యాయం

# ఖురైష్

# ఖురైషులు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి. ఖురైష్ ప్రజలకు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఇందులో ప్రస్తావించడం జరిగింది. ఖురైష్ అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఖురైషు తెగ ప్రవక్త ముహమ్మద్(సఅసం) స్వంత తెగ. అరేబియాలో అత్యంత ఉన్నతమైన తెగ. కాబా ధర్మకర్తృత్వ బాధ్యతను నిర్వర్తిస్తున్న తెగ. అల్లాహ్ ఈ తెగకు హోదా, సంపద, భద్రతలు ప్రసాదించాడు. వారు అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించాలని, కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, దైవప్రవక్త(సఅసం)కు, అవతరిస్తున్న దైవవాణికి మద్దతు ఇవ్వాలని బోధించడం జరిగింది.

### ముఖ్యాంశాలు

**పోషణ & భద్రత :**

శాంతియుతమైన, భద్రత కలిగిన ప్రదేశంలో ఆహారపదార్థాలు పుష్కలంగా లభించడం అల్లాహ్ అనుగ్రహం. ఇలాంటి అనుగ్రహాన్ని పొందిన ప్రజలు అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆయనను ఒక్కడినే ఆరాధించడం ద్వారా తమ కృతజ్ఞతను ప్రదర్శించాలి.

## 107 వ అధ్యాయం

# అల్ మాఊన్

# సాధారణ వస్తువులు

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 7 ఆయతులు ఉన్నాయి. అవిశ్వాసులు, కపట విశ్వాసుల గురించి ఈ సూరా ముఖ్యంగా ప్రస్తావించింది.

ఈ సూరా మొదటి ఆయతులో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. రెండు రకాల ప్రజలను ఈ సూరాలో తీవ్రంగా విమర్శించడం జరిగింది.

1. తీర్పుదినాన్ని నిరాకరిస్తున్న అవిశ్వాసులు. వారు అనాథలను కఠినంగా కసరికొడతారు. నిరుపేదలకు సహాయం చేయడాన్ని వారు ప్రోత్సహించరు.

2. కపట విశ్వాసులైన ముస్లిములు – నమాజులకు ఆలస్యం చేస్తారు. వేళకు నమాజు చేయరు. అందరూ చూడాలని మంచిపనులు చేస్తారు. చిన్న చిన్న విషయాలలో కూడా తమ తోటి వారికి సహాయం చేయడానికి ముందుకు రారు.

**ముఖ్యాంశాలు**

**సహాయం :**

అనాథలకు, నిరుపేదలకు సహాయం చేయడం చాలా ముఖ్యం. అల్లాహ్ ప్రీతి పొందడానికి హృదయపూర్వకంగా నిరుపేదలకు, అనాథలకు సహాయం చేయాలి. అంతేకాని ప్రజలకు చూపే సంకల్పంతో కాదు.

**108 వ అధ్యాయం**

## అల్ కౌసర్

# సమృద్ధి

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఈ సూరాలో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు ప్రసాదించబడిన అసంఖ్యాక అనుగ్రహాలను ప్రస్తావిస్తూ, అల్లాహ్‌ను కొనియాడాలని, ఆయనకు కృతజ్ఞత



చూపాలని బోధించడం జరిగింది. అవిశ్వాసుల వైరం, వారి గర్వం ప్రవక్త(సఅసం)ను ఏమాత్రం నష్టపరచలేవని హామీ ఇవ్వడం జరిగింది.

**ముఖ్యాంశాలు**

**కృతజ్ఞత :**

అల్లాహ్ మనకు అసంఖ్యాక అనుగ్రహాలు ప్రసాదించాడు. అందుకు బదులుగా మనం అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఆయన మన పట్ల చూపిన కారుణ్య కటాక్షాలకు గాను భక్తితో ఆయన్నే ఆరాధించాలి.

**109 వ అధ్యాయం**

## అల్ కాఫిరూన్

# అవిశ్వాసులు

**పరిచయం**

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 6 ఆయతులు ఉన్నాయి. అవిశ్వాసాన్ని, అవిశ్వాసులను తిరస్కరించడం ఈ సూరా ప్రధాన ఉద్దేశ్యం. మొదటి ఆయతులో అవిశ్వాసుల గురించిన ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఏకదైవారాధన పట్ల ఎన్నడూ రాజీపడరాదు. అల్లాహ్‌ను తప్ప మరెవ్వరి నయినా గాని, లేదా మరి దేన్నయినా గాని ఆరాధించడాన్ని ఈ సూరా తిరస్కరించింది.

**ముఖ్యాంశాలు**

**రాజీపడడం :**

అల్లాహ్ పట్ల విశ్వాసం విషయంలో ఎన్నడూ అవిశ్వాసుల అబద్ధాలతో రాజీ పడరాదు.

## 110 వ అధ్యాయం

# అన్ నస్ర్

# సహాయం

### పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 3 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా విశ్వాసులకు హామీ ఇవ్వబడిన దేవుని సహాయం గురించి ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన సహాయం అన్న ప్రస్తావన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రజలు తండోపతండాలుగా సత్యధర్మాన్ని స్వీకరిస్తారని ఈ సూరా తెలిపింది. అల్లాహ్ ఔన్నత్యాన్ని స్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతూ, ఆయన సన్నిధిలో పొరబాట్లకు క్షమాపణ కోరుకుంటూ విధేయంగా ఉండాలని ఈ సూరా ఉద్బోధించింది.

### ముఖ్యాంశాలు

**విజయం :**

విజయమన్నది దేవుని సహాయంతో సిద్ధిస్తుంది. ఆయన్ను నిజాయితిగా స్తుతించాలి. ఆయన వైపునకే మనమంతా మరలి పోవలసి ఉంది. ఆయననే శరణు కోరుకోవలసి ఉంది.

## 111 వ అధ్యాయం

# అల్ లహబ్

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్(సఅసం) పట్ల అవిశ్వాసుల తీవ్రవిద్వేషాన్ని ప్రస్తావించింది. మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా ప్రవక్త (సఅసం) పెదనాన్న గురించి ప్రస్తావించింది. అతడి అహంకారాన్ని, సంపద చూసుకుని గర్వించడాన్ని, అబూలహబ్ భార్య ప్రవక్త



ముహమ్మద్(సఅసం) పట్ల ప్రదర్శించిన తీవ్రమైన ద్వేషాన్ని తెలియజేసింది. అబూలహబ్, అతడి భార్య ఇద్దరికీ పరలోకంలో తీవ్రమైన శిక్ష తప్పదని తెలిపింది.

### ముఖ్యాంశాలు

**సంపద :**

సంపద, హోదా, అధికారాలు చూసుకుని గర్వించరాదు. ఎందుకంటే ఇవి పరలోకంలో బాధాకరమైన శిక్ష నుంచి కాపాడలేవు. సన్మార్గాన్ని అవలంబించి, సత్యాన్ని స్వీకరిస్తేనే రక్షణ లభిస్తుంది.

## 112 వ అధ్యాయం

# అల్ ఇఖ్లాస్

# నిజాయితీ

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 4 ఆయతులు ఉన్నాయి. ముఖ్యంగా ఏకదైవారాధన గురించి ఈ సూరా బోధించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం ఇందులో ఎక్కడా ప్రస్తావనకు రాలేదు, కాని ఈ సూరా భావానికి సూచనగా ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ఏకదైవారాధనను వివరిస్తూ, అల్లాహ్ గుణగణాలను తెలియజేసింది. ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలని నొక్కి చెప్పింది. అల్లాహ్ ఎలాంటి అవసరమూ లేనివాడు, ఆయనకు కుమారులు ఎవరూ లేరు. ఆయనకు తండ్రి, తల్లి, భాగస్వాములు ఎవరూ లేరు. అందరూ, అన్ని వస్తువులు ఆయనపైననే ఆధారపడి ఉన్నాయి.

### ముఖ్యాంశాలు

**దేవుని ఏకత్వం :**

ధార్మిక విశ్వాసాన్ని స్వచ్ఛంగా ఉండేలా కాపాడుకోవాలి. అల్లాహ్‌నే విశ్వసించాలి. ఆయన ఒకేఒక్కడు. నిత్యుడు. ఆయనకు కుమారుడు కాని, భాగస్వామి కాని ఎవరూ లేరు.

## 113 వ అధ్యాయం

# అల్ ఫలఖ్

# ఉషోదయం

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. ప్రతి దుష్టశక్తి నుంచి అల్లాహ్ శరణు కోరడాన్ని ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దుష్టప్రాణుల, దుష్టపథకాల, ప్రజల ఈర్ష్యాసూయల నుంచి దేవుని శరణు కోరాల్సని ఈ సూరా బోధించింది.

### ముఖ్యాంశాలు

**శరణు :**

బయటి చెడుల నుంచి, ఇతరుల కుట్రల నుంచి అల్లాహ్ శరణు కోరడం ద్వారా రక్షణ పొందాలి. ఆయన ఒక్కడు మాత్రమే రక్షణ కల్పించగలడు.

**నమ్మకం :** అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి.

**అసూయ :**

ఇతరుల పట్ల అసూయ మానుకోవాలి. ఎందుకంటే అది చాలా చెడ్డపని.

## 114 వ అధ్యాయం

# అన్ నాస్

# మానవాళి

### పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 6 ఆయతులు ఉన్నాయి. షైతాన్ నుంచి అల్లాహ్ శరణు కోరుకోవాలని ఈ సూరా ముఖ్యంగా



బోధించింది. ఈ సూరాలోని మొదటి ఆయతు మొదలు అనేక ఆయతుల్లో ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం ప్రస్తావనకు వచ్చింది. షైతాన్ దుర్మార్గం నుంచి అల్లాహ్ శరణు కోరుకోవాలని ఈ సూరా ప్రబోధించింది. షైతాన్ మానవాళికి ప్రధానశత్రువు. అల్లాహ్ యావత్తు మానవాళికి ప్రభువనీ, ఆయనే అందరి చక్రవర్తి, అందరి ఆరాధ్యదైవమనీ తెలిపింది. షైతాన్ మన హృదయాలలో భ్రమలు కలిగిస్తాడనీ, ఆ విధంగా మన విశ్వాసాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తాడనీ, మంచిచెడుల విచక్షణ కోల్పోయేలా చేస్తాడని వివరించింది.

### ముఖ్యాంశాలు

**శరణు :**

మానవాళికి బహిరంగ శత్రువైన షైతాన్ నుంచి అల్లాహ్ శరణు కోరాలి. ఎందుకంటే, ఆయన మాత్రమే రక్షణ కల్పించే శక్తి కలిగిన వాడు.

**నమ్మకం :**

అల్లాహ్‌నే పూర్తిగా నమ్ముకోవాలి.

**కుశంకలు :**

షైతాన్ మన హృదయాల్లో కుశంకలు రేపి, మాటిమాటికి దుష్ట భావాలను పుట్టించి సత్యాన్ని చూడకుండా చేసి, తనను అనుసరించేలా చేయడానికి ప్రయత్నిస్తాడు.

(శుభ సమాప్తం)

# మా ప్రచురణలు

1. మన ప్రవక్తలు (1వ భాగం)
2. మన ప్రవక్తలు (2వ భాగం)
3. మన ప్రవక్తలు (3వ భాగం)
4. మన ప్రవక్తలు (4వ భాగం)
5. హజ్ యాత్రా విధానం
6. ఇస్లామీయ ఆరాధనలు
7. దివ్యఖుర్ఆన్ సారాంశం
8. హదీసు కిరణాలు (మొదటి భాగం)

## రాబోవు పుస్తకాలు

1. హదీసు కిరణాలు (2వ భాగం)
2. మిష్కాత్ షరీఫ్